# యోగి వేమన విశ్వవిద్యాలయం

కడప, ఆంధ్రప్రదేశ్ - 516 005.

## భావవీణ ప్రత్యేక సంచిక

**Journal of Literary, Culture & Language Studies**

**Vol. 17 - Issue. 1 - Spl. Edition - January 2020 - ISSN No. : 2456-4702**


# రాయలసీమ ఆధునిక తెలుగు సాహిత్యం - గ్రామీణ సంస్కృతి

## జాతీయ సదస్సు

**29 - 30 జనవరి 2020**



**నిర్వహణ :**

## తెలుగు విభాగం

**యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప, ఆంధ్రప్రదేశ్ - 516 005.**

మాతెలుగు తల్లికి మల్లెపూదండ – మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Literary, Culture & Language Study**

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue No. 1 - Spl. Edition - January 2020 - ISSN No. : 2456-4702**

**EDITORIAL BOARD**

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies
   Universityof Heidelberg, Germany.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGAL ADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | రాయలసీమ కథానిక - వ్యవసాయ, విద్యారంగాలపై కరువు ప్రభావం | - ఆచార్య టి. రామప్రసాద రెడ్డి | 4 |
| 2. | రాయలసీమ కథా సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ | - డా॥. పాలెం రమాదేవి | 11 |
| 3. | 21వ శతాబ్దంలో రాయలసీమ కవిత్వం-వ్యవసాయ సంస్కృతి | - డా॥. ఎన్. ఈశ్వర రెడ్డి | 16 |
| 4. | శప్తభూమి నవల - అనంతపురం ప్రజల నమ్మకాలు | - పప్పుల శైలజ | 21 |
| 5. | అనంతపురం జిల్లా - బంజారా సాహిత్యం - సంస్కృతి | - మూడ్ రాజు | 24 |
| 6. | భూచక్రం నవల : రాయలసీమ నూతన ఆర్థిక జీవన విధానం | - డా॥. వెంకటరామయ్య గంపా | 29 |
| 7. | డా॥ కేశవరెడ్డి నవలల్లో గ్రామీణ సంస్కృతి చిత్రణ | - డా॥. జి. పార్వతి | 35 |
| 8. | రాయలసీమ - బంజారా సంస్కృతి | - ఆవుల అనిత | 40 |
| 9. | రాయలసీమ సాహిత్యంలో గ్రామీణ సంస్కృతి | - యం. అనురాధ లక్ష్మి | 43 |
| 10. | రాయలసీమ ప్రాంత ప్రజల జీనజీవన చిత్రణ | - డా॥. బూసి వెంకటస్వామి & డా॥. బశెట్టి ఉపేంద్ర | 46 |
| 11. | వివాహ వేడుకలలో జరుపుకునే సంస్కృతి - సంప్రదాయములు | - డా॥. వి. శ్రీదేవి & - డా॥. యం.వెంకటలక్ష్మమ్మ | 49 |
| 12. | ఒక్క వాన చాలు - రైతు, వలస కూలీ బతుకులు | - డా॥. పొన్నంరెడ్డి కుమారి నీరజ | 53 |
| 13. | సుగాలీ పండుగలు - ఆచరణ పద్ధతులు | - మార్తల పవన్ కుమార్ రెడ్డి | 60 |
| 14. | రాయలసీమ కథల్లో బహుజన జీవితం | - కట్టా సుబ్బారావు | 64 |
| 15. | కొత్త దుప్పటి కథాసంపుటిలోని గ్రామీణ వాతావరణం | - డా॥. (శ్రీమతి) ఎం. ప్రఫుల్లా | 66 |
| 16. | వైసివి రెడ్డి కథలు - పరిశీలన | - యస్. గంగాధర రెడ్డి | 69 |
| 17. | రాయలసీమ కథాసాహిత్యం-మనిషి పశువుల సంబంధాలు | - యం. శోభారాణి | 73 |
| 18. | సింగమనేని నారాయణ కథలు-సామాజిక సమస్యల చిత్రణ | - వేలూరు భారతి | 77 |
| 19. | రా.రా. కథలు-మానవ సంబంధాలు | - టి. హజరతయ్య | 80 |
| 20. | 'కడప' కథ - ముఠా కక్షలు | - డా॥. కె. యన్. సుందరేశ్వరరావు | 84 |
| 21. | రాయలసీమ గ్రామీణ సంస్కృతి - విశ్వాసాలు | - డా॥. సి.హిమాచలం | 88 |
| 22. | రాయలసీమ రైతు కావ్యం - వ్యవసాయ జీవితం | - డా॥. జి. రవికుమార్ | 92 |
| 23. | రాయలసీమ కన్నీటి మాట-విద్వాన్ విశ్వం పెన్నేటి పాట | - డా॥. పి. విజయకుమార్ | 96 |
| 24. | రామకృష్ణారెడ్డి కథల్లో మాండలికాల ప్రయోగం | - కొక్కు నరేష్ | 99 |
| 25. | మెకంజి కైఫియత్తులు - విశేషాంశాలు | - డా॥. పి. రమాదేవి | 102 |
| 26. | రాయలసీమ కథ - గ్రామీణ శ్రామిక స్త్రీల స్థితి | - తమ్మిశెట్టి వెంకటనారాయణ | 112 |
| 27. | రాచపాళెం కవిత్వం - రైతు - రాజకీయం | - డా॥. సింగర వాణి | 117 |
| 28. | సీమ కథా సాహిత్యంలో రైతు జీవితం | - జి. యమునరాణి | 122 |

# రాయలసీమ కథానిక – వ్యవసాయ, విద్యారంగాలపై కరువు ప్రభావం

- **ఆచార్య టి. రామప్రసాద రెడ్డి,** తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాయలసీమ నుండి వ్యవసాయ జీవితం మీద అనేక కథలు వచ్చాయి. ఈ కథల్లో రాయలసీమలోని నిత్య కరువు, అనావృష్టి, అతివృష్టి, గిట్టుబాటు ధర లేకపోవడం, కరెంట కష్టాలు, నీటిపారుదుల సమస్య, బోర్లు ఎండి పోవడం, బావుల్లో నీటి మట్టం తగ్గిపోవడం రైతుల ఆత్మహత్య ప్రయత్నాలు, ఆత్మహత్యలు, వడ్డీ వ్యాపారుల వేదింపులు, బ్యాంకు అధికారుల ఒత్తిళ్ళు, దళారుల దోపిడి, వ్యవసాయ కూలీల సమస్యలు, వలసలు, పాలకుల నిర్లక్ష్యం ఇలా అనేక సమస్యలతో కూడిన రైతులు, రైతుకూలీల బతుకుల్ని రచయితలు తమ కథల ద్వారా ఒకే మూసధోరణిలో కాకుండా వస్తువైవిధ్యంతో చిత్రించారు. వ్యవసాయ రంగంలో ఉన్న ఈ దయనీయ స్థితి మారాలన్న ఉద్దేశ్యంతో రచయితలు ఈ అంశాలను వస్తువులుగా స్వీకరించినట్లు భావించవచ్చు. రైతు తన వృత్తిని వదలిపెట్టి ఇతరరంగాల వైపు దృష్టిని మరల్చే ప్రమాదముందని సమాజాన్ని హెచ్చరించే ఉద్దేశ్యంతో కూడా ఇలాంటి కథలను రచయితలు సృజించారని చెప్పవచ్చు.

నిరంతర కరవు కాటకాలు రాయలసీమ రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. దానికి తోడు అప్పుడప్పుడు అతివృష్టి. దీంతో పొట్టకూటికోసం రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. కొంతమంది ఆత్మాభి మానాన్ని చంపుకొని పనికి ఆహారపథకంలో కూలికి వెళ్తన్నారు. కొందరు ఆత్మగౌరవం అడ్డుపడి అప్పుల ఊబిలో చిక్కి బతికిపోతున్నారు. ప్రభుత్వాలు ఈ పరిస్థితిని మార్చ డానికి చిత్తశుద్ధితో పనిచేయకపోవడంతో వలసలు ఎక్కువైనాయి. అప్పులు తీర్చలేని రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలా ఉత్పత్తి రంగం నిర్వీర్యమైతే సమాజాభివృద్ధి కుంటుబడుతుందని రచయితల భావన. రైతుల జీవితాలను బాగు చేయాల్సిన అవసరాన్ని సమాజం, ప్రభుత్వాలు గుర్తించాలనేదే రచయితల అభిప్రాయం.

ఈ సమస్యల నేపథ్యంలో రైతులు వ్యవసాయం మానేసి ఇతర వృత్తులవైపు దృష్టి మరల్చితే ఆహార సంక్షోభం ఏర్పడుతుందనీ... అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలనీ, రాబోయే ప్రమాద ఘంటికలను రచయితలు ముందే ఊహించి సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి పూనుకున్నట్లు అర్థం చేసు కోవచ్చు.

రాయలసీమ రైతు సమస్యలను, వ్యవసాయ కష్టా లను కె.సభా, పులికంటి కృష్ణారెడ్డి, పి. రామకృష్ణ, కేతు విశ్వనాథరెడ్డి, సింగమనేని నారాయణ, సొదుం జయరామ్, శాంతి నారాయణ, మధురాంతకం రాజారాం, మధురాంతకం నరేంద్ర, చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణస్వామి, వెంకటకృష్ణ, దాదాహయత్, సుంకోజి దేవేంద్రాచారి, చక్రవేణు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి వంటి రచయితలు అక్షరబద్ధం చేశారు. వ్యవసాయ దారుల కష్టాలను ప్రత్యక్షంగా చూసి అనుభవించిన రచయితల్లో సింగమనేని ఒకరు.

## మార్కెట్ మాయాజాలం :

ధర దగ్గర నుంచి తూకం వరకు రైతును నిలువునా ముంచిన మార్కెట్ మాయాజలం గురించి తనదైన శైలిలో సింగమనేని నారాయణ 'అడుసు' కథలో చిత్రించాడు.

రైతుల పరిస్థితి మార్కెట్‌లో దయనీయంగా ఉం టుంది. కారణం దళారీ వ్యవస్థ. రైతులు కొనేటప్పుడు పండ్లు కూరగాయాలు మొదలైన వాటికి అధిక ధరలు వసూలు చేస్తారు. కాని అమ్మేటప్పుడు దోపిడికీ గురౌతారు.

ఇదంతా మార్కెట్ మాయాజాలం. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక పోతే రైతు నిరాశకు లోనౌతాడు.

సింగమనేని నారాయణ 'అడుసు' కథలో గిట్టుబాటు ధర లభించలేదనే కోపంతో ఒక రైతు తాను పెంచిన చీనాచెట్లను తానే స్వయంగా నరికేసుకుంటాడు.

నారాయణప్ప అనే రైతు తన నాలుగెకరాల పొలంలో చీనీతోటను సాగుచేస్తాడు. నిరంతరం శ్రమించి ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పెంచిన చెట్లు కాపుకొచ్చి అధిక దిగుబడి వస్తుంటే నారాయణప్ప ఆనందానికి అవధిలేదు. నారాయణప్ప చీనీకాయలను లారీలతో నాగపూర్ మార్కెట్‌కు తోలుతాడు. ఉన్నట్టుండి వాతావరణం చల్లబడడంతో చీనీకాయల ధర తగ్గిపోతుంది. మార్కెట్‌లో వేలంపాట గాళ్ళు సరకును తక్కువ ధరకు పాడడంతో నారాయణప్ప నివ్వెరపోతాడు.

తన బిడ్డ పెళ్ళి డబ్బుల కోసం నారాయణప్ప నాగపూర్ మార్కెట్‌ను నమ్ముకుంటాడు. తన సరుకు తూకంలో కూడా నారాయణప్ప మోసపోతాడు. పన్నెండు, పద మూడు టన్నులు తూగవలసిన చీనీపండ్లు దళారుల మోసంవళ్ళ పదిటన్నులే తూగుతాయి. ఈ విషయాన్ని నారాయణప్ప, ఆయన బావమరది గమనిస్తారు. కాని ఎదురు మాట్లాడలేని పరిస్థితి.

ఇక వేలంపాట విషయానికొస్తే కొంతమంది పాట గాళ్ళు కాయల రాశి దగ్గరికి వచ్చి ఒకరితో నొకరు గుసగుసలాడుకొని ఆయనను మోసం చేస్తాడు. కాయ నాణ్యతను పరీక్షించే నెపంతో రాశినంతా గెలికి గెలికి కొన్ని కాయలు బయటికి తీస్తారు. చేతులతో తడుముతూ, వాసన చూస్తూ, కాయలను వలిచి రుచి చూస్తారు. కొన్ని చిన్నసైజు కాయల్ని, అక్కడక్కడ నల్లమచ్చలున్న కాయలను తప్పుబడతారు. 'కాయ బొత్తిగా పాలీష్ లేదే. అని ఒకరితొనొకరు వచ్చీరాని తెలుగులో నారాయణప్ప వినేలా మాట్లాడుతారు. చివరకు ధర విషయంలోనూ, తూకం విషయంలోనూ నారాయణప్ప తీవ్రంగా నష్ట పోతాడు. తీవ్ర అసహనానికి గురైన నారాయణప్ప తన కొడుకును వెంట బెట్టుకొని చీనీతోటను నరికేస్తాడు. ఈ కథలో వస్తూత్పత్తిదారుల మాదిరి రైతులు కూడ తమ పంటకు తామే ధర నిర్ణయించుకోలేకపోవడం ఎంతో శోచనీయమని నారాయణప్ప వాపోవడం రైతుల దీన స్థితికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తరతరాలుగా వ్యవసాయ జీవనానికి ప్రాతినిథ్యం వహిస్తున్న కుటుంబాల నుంచి వచ్చిన రచయితలు చాలామంది సాహిత్యంలో ప్రవేశించారు. అలాంటి రచయితల్లో శాంతి నారాయణ ఒకరు. ఈయన సామాజిక విమర్శకు సాహిత్యాన్ని ఆయుధంగా ఉపయోగించు కున్నారు. రాయలసీమ వ్యవసాయరంగ సంక్షోభాన్ని తన రచనల్లో విమర్శనాత్మకంగా చిత్రించాడు.

శాంతినారాయణ లాంటి అనంత కథకులు రైతుల కష్టాలకు కేవలం ప్రకృతినే దోషిగా నిలబెట్టే రచనలు చేయలేదు. చాలా కథల్లో ప్రకృతితోబాటు దళారీవ్యవస్థను కూడ రచయితలు తీవ్రంగా తప్పు పట్టారు. రైతులను నట్టేట ముంచి పెట్టుబడి దారీవర్గం విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్న వైనాన్ని అనంతపురం వ్యవసాయ జీవితం ఆధారంగా చెప్పగలిగారు. అంతేకాకుండా పారి శ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులకు ధరలను నిర్ణయించే హక్కును ఎలా పొందారో అలాగే రైతులు కూడ తమ వ్యవసాయోత్పత్తులకు తామే ధరలను నిర్ణయించే స్థాయికి ఎదగాలని ఈ కథకులు కొత్త ఆలోచనలు రేకెత్తించారు. దళారులను సంపన్నులుగా చేసి రైతును నాశనం చేస్తున్న వ్యవస్థను తన కథల్లో శాంతినారాయణ తూర్పారబట్టాడు.

పంటను మార్కెటుకు తోలి అమ్ముకోడానికి వెళ్ళిన అమాయక రైతుల్ని పట్టణ వ్యాపారులు మాటల చాకచక్యంతో బురిడీ కొట్టించి మోసం చెయ్యడాన్ని 'దళారి' కథలో శాంతి నారాయణ చిత్రించాడు. 'రామప్ప' అనే రైతు తన పొలంలో ఎంతో కష్టపడి ఉల్లిగడ్డలు పండి

స్తాడు. పట్టణంలో వ్యాపారం చేస్తున్న సుబ్బరాయుడుతో రామప్పకు పరిచయం ఏర్పడి అతని సలహాతో తన సరుకును మార్కెటుకు తోలుతారు. దళారి కమీషన్, లారీ బాడుగ, ఫోను బిల్లు, మార్కెటులో విచారణ మొదలైన ఖర్చులు పోను రామప్పకు ఆశించిన ఫలితం దక్కదు. మార్కెటు మోసానికి బలైపోయిన ఈ రైతు దీనావస్థకు వాస్తవిక రూపమే ఈ 'దళారి' కథ.

శాంతి నారాయణ మరో కథ 'కల్లమయిపాయ'. 'నాలుగేండ్ల నుంచీ కరువు జుట్టుకున్నా పెద్దోల్లకు, చీమ గుట్నెట్టు గుడకాలే' అని ఈ కథలో ఒక పాత్ర ప్రశ్నిస్తుంది. ఆరుగాలం కష్టపడి కరువుతో పోరాటం చేసి ఋతువుల మోసానికి గురై పంట పండించిన 'మల్లప్ప' తీరా మార్కెటులో అమ్మితే వచ్చిన ఆదాయం ఏమూలకు సరిపోలేదని తెల్లమొగం వేస్తాడు. దిక్కుతోచని పరిస్థితిలో తాను ఎంతో ప్రేమించే భూమిని అమ్ముకొని పట్టణానికి కూలీగా వలసపోతాడు. 'బూమమ్మను నమ్ముకొని ఏమి బాగుపడ్నాము' అనే నారమ్మ ప్రశ్నకు జవాబే లేదు. "వూర్లోకి బోతే వుండ బుద్ధిగాదు. ఈటికొత్తే సూడబుద్ధి గాదు' అని తన పట్టణ కూలిజీవితాన్ని తలచుకొని మల్లప్ప వాపోతాడు. ఇలాంటి పరిస్థితి దేశంలో చాలాచోట్ల ఇవాళ కనిపిస్తుంది.

## కరువు – ఆత్మహత్య ప్రయత్నాలు :

శాంతి నారాయణ కథలైన 'ఎండమావి', 'ఈ పయనం ఎక్కడి', 'రతనాల సీమలో', 'నమ్ముకున్న రాజ్యం' రాయలసీమ జీవిత ప్రతిఫలనాలు.

కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో రైతులు తమ ఆర్థిక పరిస్థితి కుదుటపడడానికై వాణిజ్యపంటలను నమ్ముకుంటారు. రైతుల ఆశలు అడిఆశలైన తీరును 'ఎండమావి' కథలో శాంతి నారాయణ వాస్తవికంగా చిత్రించాడు.

అనంతపురం జిల్లాలోని పల్లె ప్రజలు వ్యవసాయ పనులు లేక బతుకు భారమై పట్టణాలకు వలస వచ్చి స్థిరపడవలసిన దుస్థితిని 'ఈ పయనం ఎక్కడి' అనే కథలో చిత్రించాడు. రైతుల ఆత్మహత్యలను చూసి చలించి పోయిన శాంతి నారాయణ 'ఒకప్పుడు రత్నాలు పండిన రాయలసీమ పొలాల్లో శవాలు పండుతున్నట్లు అభి వర్ణించి, ఈ వాస్తవాన్ని 'రత్నాలసీమలో' ఆవిష్కరించాడు. ఎంతో కష్టించి పనిచేసే సుగాలీలు తమ శ్రమ నిష్ఫలమైన కారణంగా తమ పిల్లలను అమ్ముకోడానికి సిద్ధపడతారు. ఈ కఠోర సత్యాన్ని 'నమ్ముకున్న రాజ్యం' కథ వివరించింది.

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు, గ్లోబలైజేషన్, ప్రైవేటీకరణ, సరళీకరణ పుణ్యమా అని అనంత రైతులు కొత్త కష్టాలు ఎదుర్కొంటున్నారు.

సింగమనేనితోపాటు శాంతినారాయణ, స్వామి, చిలుకూరి దేవపుత్ర కథలు అనంతపురం జిల్లా కరువు తరాల మధ్య అంతరాన్ని సృష్టించి మానవ సంబంధాలను ఛిద్రం చేస్తున్న తీరును ఎండగట్టారు. విముక్తి, అగాథం, అడుసు, కల్లమయిపాయ, పల్లేరు ముళ్లు, తాలుగింజలు, ఎండమావి, రతనాలసీమలో, సావుకూడు, బ్రతుకు ఊబి, నీళ్ళు, వానరాలె, నీడ, మన్నుదిన్న మనిషి మొదలైన కథలు కరువు, దళారీ వ్యవస్థ, ఆత్మహత్యలు మొదలైన సమస్యలకు అద్దం పట్టడమే కాక పాఠకులను ఆలోచింపజేస్తున్నాయి.

చిలుకూరి దేవపుత్ర 'మన్నుదిన్న మనిషి' కథలో మానవసంబంధాలను విధ్వంసం చేసిన కరువు పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

భూమిని నమ్ముకొని బ్రతికే తండ్రికి ఏవిధంగానైనా భూమి అమ్ముకొని జల్సా చేయాలనే కొడుకుకు మధ్య ఈ కథ నడుస్తుంది. పుట్టినప్పటి నుంచి ఏనాడు తండ్రికి ఎదురుమాట్లాడని కొడుకు "బూమి ఎట్లమ్మవో నేను జూస్తా... లేదా నా భాగానికి వచ్చేది నాకిచ్చెయ్యి" అని తండ్రితో కఠినంగా మాట్లాడతాడు. ఇక్కడి కరువే ఆ కొడుకును అలా మాట్లాడించి తండ్రిపై తిరుగుబాటు

చేయించింది. తండ్రి చెన్నప్ప భూమిని అమ్మడం ఇష్టం లేక భూమిలోనే ప్రాణాలు వదులుతాడు. ఇక్కడి కరువు భూమికి రైతుకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని నిర్దాక్షిణ్యంగా తెంచేస్తున్నట్లు ఇలాంటి కథలు నిరూపిస్తున్నాయి.

బండినారాయణ స్వామి బ్రతుకు, ఊబి, నీళ్ళు, వానరాలే లాంటి కథలు అనంతరైతు జీవితాన్ని అతలాకుతలం చేసిన కరువు పరిస్థితులను అక్షరీకరించాయి.

'సావుకూడు' కథ ప్రజల అతిసాధారణమైన కోర్కెలను సైతం తీర్చుకోలేని స్థితిని కలిగిస్తున్న కరువును కళ్ళ ఎదుట చూపించింది. రైతులు ఆర్థికంగా చితికిపోవడం, నిరాశ బతుకు గురించి 'బ్రతుకు ఊబి' ప్రతిబింబిస్తుంది. ప్రేమతో పెంచుకున్న పశువులను సైతం మేత దొరకని పరిస్థితులలో కబేలాలకు అమ్ముకున్న కఠిన వాస్తవాన్ని 'నీళ్ళు' కథలో చూడవచ్చు. 'ఈ సేద్యాలు చేసుకునే దానికంటే కూలికి పొయ్యేది మేలు కదా అప్పా' అని ఒక పెద్దరైతుతో అనిపించగల సత్తా ఈ ప్రాంత కరువుకే ఉంది. కరువు నోట్లో చిక్కి చిత్రవధ అనుభవించడం కన్నా హైనా నోట్లో పడి చావడం మేలు'' అని ఒక రైతు భార్యతో పలికించగలిగే సత్తా ఈ కరువుదే. ఈ మాటలను మనం కెం.ఎం. రాముడు రాసిన 'హైనా' కథలో గమనించవచ్చు.

ప్రకృతి అనుకూలించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి గురైపోవడం, దళారుల దోపిడి అనంతరైతు ఆత్మహత్య చేసుకోడానికి ప్రేరేపించాయి. కరువు కోరల్లో చిక్కి తిండి కోసం మనుషులు పరస్పరం దాడి చేసుకోవడం, ప్రేమతో పెంచిన పశువుల్ని కబేళాలకు తెగనమ్మడం, పుట్టిన ఊరు వదిలి వలసలు పోవడమూ, నమ్ముకున్న భూమిని చౌకగా అమ్ముకోవడమూ, బతుకు తెరువుకోసం ఫ్యాక్షనిష్టులను ఆశ్రయించడం లాంటి సంఘటనలు ఈ జిల్లాలో మామూలైపోయాయి.

## విద్యావ్యవస్థపై సీమ కరువు ప్రభావం :

విద్వాన్ దస్తగిరి రాసిన 'నే నేర్చిన అనుభవం'. ఒక దళిత ఉపాధ్యాయుని కథ. ఓబులేసు అనే ఉపాధ్యాయుడు దళిత వాడలో ఉంటూ తనతోటి ప్రజలను సామాజిక సమస్యలపట్ల చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి పూనుకుంటాడు. ఈ విషయంలో కినుక వహించిన భూసామ్య వర్గం అతన్ని బదిలీ చేయించే ప్రయత్నం చేస్తుంది.

దళిత ఉపాధ్యాయుల సాంఘిక స్థితిలో ఎలాంటి మార్పు రాలేదని ఇంకా అణచివేతకు గురౌతున్నారని సింగమనేని నారాయణ గారు 'మకరముఖం' కథ నిరూపిస్తుంది. గొప్ప చదువులు చదువుకొని ఉద్యోగాలు పొందినప్పటికీ, ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పటికీ సాంఘికంగా, సాంస్కృతికంగా దళితులు అణగదొక్కబడుతున్నారని తెలియజేస్తున్నాయి ఈ కథలు. వీటికన్నింటికీ కారణం తరతరాల కరువు పరిస్థితులేనని తెలిస్తుంది.

అగ్రవర్ణాలు నడిపే ప్రవేట్ విద్యాసంస్థలో దళిత ఉపాధ్యాయునికి జరిగిన అన్యాయాన్ని విస్పష్టం చేస్తుంది స్వామి రాసిన 'ఒక హెచ్ సరస్వతి కథ'. ఆధునిక నాగరిక సమాజంలో సైతం వీడని సాంఘిక పీడనను ఈ కథ రుజువు చేస్తుంది.

వ్యవస్థలోని అమానవీయతకు అత్యంత ఎక్కువగా ప్రభావితమయ్యే పిల్లల గురించిన ఇతివృత్తాలు మన సాహిత్యంలో తక్కువే. ఈ అంశం మీద కథలంటే మొదట గుర్తుకొచ్చేది నామినిగారే.

రచయిత శశికళ విద్యావ్యవస్థలోని అమానవీయతను తన కథల ద్వారా చిత్రీకరించారు. బెత్తాలు లేని స్కూళ్లను రాస్తాడు గోపాలకృష్ణ స్వప్నించాడు.

రచయిత్రి ఆర్ శశికళ గారు ఉపాధ్యాయురాలు. పిల్లలతో గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఈవిడ విరసం సభ్యురాలు కూడా. ఈ రెండు నేపథ్యాల

కలయికతో కథాసాహిత్యంలో ఆమెది ప్రత్యేకమైన కంఠస్వరం.

పిల్లలు కోల్పోతున్న సున్నితమైన బాల్యానుభూతులను వాళ్ళ మీద కర్కశంగా మోపబడుతున్న గుదిబండలను ఆర్తితో తమ కథల ద్వారా చిత్రీకరించారు.

పిల్లలు సంపూర్ణ మానవులుగా ఎదిగే క్రమం ఎలా ఉండాలి, ప్రస్తుతం మన వ్యవస్థ ఎలా ఉంది, ఉంటున్న దనేదే ఈవిడ కథల్లో కేంద్రకాంశం. వీరు 2003 సంవత్సరంలో తాను రాసిన కథలను "చెదిరిన పిచ్చిక గూడు" అనే పేరుతో సంకలనంగా తీసుకొచ్చారు. 2017 సంవత్సరంలో మరో 15 కథలను 'మా తు ఝె సలాం' పేరుతో ఇంకొక సంకలనం విడుదల చేశారు.

వ్యవస్థ తనకు అనుగుణమైన మనుషులనే తయారు చేసుకుంటుంది. పెట్టుబడిదార్లకు ఊడిగం చేసే కూలీలను మన విద్యావ్యవస్థ ఉత్పత్తి చేస్తుందని వీరి అభిప్రాయం. ఈ పనిలో కుటుంబం కూడా భాగస్వామ్యం అవుతుంది. పెట్టుబడి ఎంత అమానుషంగా ఉంటుందో, ఎంత విధ్వంసపూరితంగా ఉంటుందో అదంతా విద్యా వ్యవస్థలో ప్రతిఫలిస్తుందని నేటి వ్యవస్థలోని లోపాలను బైట పెట్టడానికి వీరు ప్రయత్నం చేశారు.

శశికళ గారు పిల్లలతో అనుసంధానమై కథలు రాశారు. ఆమె కథల ద్వారా ఆమెలోని మానవీయకోణాన్ని పరిశీలించవచ్చు. పిల్లలను అమితంగా ప్రేమించే ఉపాధ్యాయురాలిగా వారి గురించే కాక వారి కుటుంబ పరిస్థితులను గురించి కూడా పట్టించుకొని సమస్యలను వీరు అర్థం చేసుకొంటారు.

'మా తుఝె సలాం' కథల్లో తల్లి జీవితం అత్యంత క్లిష్టమైంది. అత్యాచారానికి గురై శరీరాన్ని అమ్ముకొని జీవించే స్త్రీ తన ఇద్దరు కూతుర్లను ఎలా చదివిస్తుంది? బడికి పంపేటప్పుడు ఎలాంటి జీవన పోరాటాన్ని చేస్తుం దని తెలియజెప్పే కథ ఇది.

మన వ్యవస్థకు కప్పిన ముసుగును తొలగించే కథ ఇది. చిన్న కూతురును ఉన్నత చదువులు చదివించ డానికి స్కూల్ ఫైనల్ వరకు అబ్బాయి వేషంలో పంపుతూ ఉంటుంది ఆమె. కూతురికి తాను కలగన్న ఒక మంచి భవిష్యత్తును అందించి నిష్క్రమిస్తుంది ఆ తల్లి.

స్కూల్‌లో పిల్లలను చేర్పించేటప్పుడు స్కూల్ రికార్డుల్లో రాయడానికి తండ్రి పేరును పదే పదే అడుగుతారు. 'పేరు లేదు గీరు లేదు, నా పేరే రాసుకోండి, నేనే గదా చదివించేది అంటుంది తల్లి. మళ్ళీ అడిగితే రెట్టించిన కోపంతో నా పేరే రాసుకోండి. 'కమలమ్మ' యని గట్టిగా గదమాయించిన రాటుదేలిన, జీవమున్న పాత్రగా కమలమ్మ పాత్రను చిత్రించారు శశికళగారు.

'తండా అమ్మాయి', 'అంకితం' కథల్లో కరువు బారిన బడి చదువులు మానేసే పిల్లలకు ప్రేమను పంచే ఉపాధ్యాయులు తారసపడితే తప్ప పై చదువులు చదవ లేరని లేదంటే వ్యవస్థ శిథిలాల కింద నలిగిపోతారని సందేశముంది. శశికళ గారు తొలినాళ్ళలో రాసిన 'వర్తమానం హెూరులో' కరువు వల్ల పొట్టచేత బట్టుకొని వలసబోయే కుటుంబాలలోని పిల్లల మానసిక స్థితిని చిత్రించారు.

రోడ్డు ప్రక్కన గుడిసెల్లో నివాసముండే ఓ దళిత కుటుంబం తమ పిల్లలతో సహా సామానంతా మూట గట్టుకొని ఒక స్కూల్ బిల్డింగులో పడుకుంటారు. చలి జ్వరంతో ఆ పిల్లల తల్లి చనిపోతుంది. పిల్లలను డబ్బులు అడుక్కురమ్మని తండ్రి వారిని వీధుల్లోకి పంపిస్తాడు. తమ ఈడు పిల్లలు స్కూలుకు వెళ్ళే సమయానికి వీరు యాచనకు బయలుదేరుతుంటారు. జీవితం నేర్పుతున్న చేదు అనుభూతులతో ఈ పిల్లలు ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోయి బిచ్చగాళ్ళుగా తయారై వీధిలోకి వెళ్ళడాన్ని రచయిత తీవ్ర వేదనతో ఈ కథను చిత్రించారు. తెలుగు సాహిత్యానికి ఒక గొప్ప ఆశాకిరణంలా కనబడిన చక్రవేణు అతిచిన్న వయసులో మరణించడం తెలుగు కథకు అపార నష్టం కలిగిన మాట అక్షర సత్యం.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

కళాశాల విద్యార్థులు సెలువుల్లో పల్లెలకు పోయి గ్రామీణ పేద దళితుల్ని చైతన్యపరుస్తూ, భూస్వామ్య వ్యవస్థపట్ల అవగాహన కలిగించి తమ భూముల్ని తాము స్వాధినపరచుకునేటట్లు చేస్తారు. 'కొత్త చదువు' కథలో విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకొనే దాని కన్నా భిన్నమైన జీవిత వాస్తవాల్ని బయటి వాస్తవ ప్రపంచంలో చదువుకుంటారు. గ్రామీణ దళిత విద్యార్థులకు అదివర కున్న సంప్రదాయ బానిసజ్ఞానం స్థానంలో కొత్త జ్ఞానాన్ని అందిస్తారు. ఈ కథలో అటు ప్రజలు, ఇటు విద్యార్థులు కొత్త చదువులు చదువుకుంటారు. ఇందులో నాయకులు ప్రజా జీవితంలోంచి వారిసమస్యల పరిష్కార ప్రయత్నా ల్లోంచి ఎదిగొస్తారనే మరో సందేశం కూడా ఉంది.

1986 ప్రాంతంలో నూతన విద్యావిధానంలో భాగంగా నవోదయ పాఠశాలలను దేవశ్యాప్తంగా ప్రారంభించింది భారత ప్రభుత్వం. అధిక సంఖ్యాకులైన విద్యార్థులు పూరిపాకల్లో, చెట్ల నీడల్లో చదువులు కొనసాగిస్తుంటే తక్కువ మంది విద్యార్థులకు ఎక్కువ సౌకర్యాలు కల్పిం చిన తీరు మీద సాహిత్యం స్పందించింది. చక్రవేణు 'తల్లిపేగు కథ' అలాంటిదే. విద్యార్థిని కుటుంబం నుంచి తన సహజ పరిసరాల నుంచి వేరుచేసి ఒక ప్రత్యేక ప్రపంచంలో పెడితే ఎదురయ్యే పరిణామాల గురించి చిత్రించిన కథ ఇది. గంగమ్మ కొడుకు చంద్రం తల్లిని అమితంగా ప్రేమించే పరిస్థితి నుంచి నవోదయ పాఠశాలలో చేరుతాడు. తనను చూడడానికి వచ్చిన తల్లిని గేటు దగ్గరి నుంచే బయటకు పంపిస్తాడు. తన తల్లిని సహధ్యాయులు చూస్తే పేదరికాన్ని అంచనా వేస్తారని, ఎగతాళి చేస్తారని మూర్ఖంగా ఆలోచిస్తాడు ఆ విద్యార్థి. మనిషిని సమూహంలోంచి వేరు చేస్తే ఎదురయ్యే పరిణామాలకు కారణమైన నూతన విద్యావ్యవస్థలోని మునుగును తొలగించడానికి ప్రయత్నం చేశాడు చక్రవేణు.

మధురాంతకం మహేంద్ర తెలుగు వాచకంలోని 'ప్రతిజ్ఞ'ను ఆధారంగా చేసుకొని రాసిన కథే 'ప్రతిజ్ఞ'. ఎడారిగా మారబోతున్న అనంతపురం జిల్లాలోని కరువు రక్కసి విలయతాండవాన్ని విస్పష్టంగా చూపించి కథను నడిపించాడు మహేంద్ర.

రెడ్డిగారి చిన్నకొడుకు చిట్టిబాబు, అరుగు మీద కూర్చొని పాఠాలు చదువుతుంటే దారిన పొయ్యే నర్సింహులు కొడుకు 'ఎంకటేశు' పుస్తకం చూడకుండానే అదే పాఠం తనకు వస్తుందని కంఠోపాఠగా చెబుతూ వెళ్ళిపోతాడు. దానిని అవమానంగా భావించిన రెడ్డి చిన్నకొడుకుకు కోపం వస్తుంది. కరువు పరిస్థితులలో పొట్టచేత పట్టుకొని వలస వచ్చిన నర్సింహులుకు, అతని కుటుంబ సభ్యులకు ఎదురైన అవమానాలు అన్నీ ఇన్నీ కావు.

ఇంకా రాయలసీమ నుంచి అనేకమంది రచయితలు తమ కథల ద్వారా విద్యావ్యవస్థను చిత్రించే ప్రయత్నం చేశారు. రాయలసీమ వెనుకబడిన ప్రాంతం అయినప్పటికీ సాహిత్యం విషయంలో ఇతర ప్రాంతాలకు ఏమాత్రం తీసిపోలేదు. వ్యవసాయం, విద్యావ్యవస్థపైన అనేక కథ లొచ్చాయి. ఈ అంశాలపైన కథకులు విభిన్నమైన వస్తువు లను స్వీకరించి తమదైన శైలిలో ఆ కథలను పాఠకుల ముందు ఉంచి సామాజిక మార్పుకు కృషి చేశారు.

## ఆధార గ్రంథాలు :

1. కడప కథ - తవ్వా ఓబుల్ రెడ్డి - నందలూరు కథా నిలయం.
2. కృష్ణారెడ్డి పులికంటి కథావాహిణి - విశ్వంబర పబ్లికేషన్స్, తిరుపతి-2003.

3. డా॥ లక్ష్మి కె.బి. ఐ.వి.ఎస్. అచ్చుతవల్లి - తెలుగు కథకులు కథన రీతులు - సింగమనేని నారాయణ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. మధురాంతకం రాజారాం కథాయాత్ర - అజొవిభో ప్రచురణలు, హైదరాబాద్, 2000.
5. రామకృష్ణ .పి - పి. రామకృష్ణ రచనలు - మానవి పబ్లికేషన్స్, పోరంకి, విజయవాడ.
6. వందేళ్ళ తెలుగు కథ - చిన్నవీరభద్రుడు - ప్రచురణ: ఎమెస్కో బుక్స్, జనవరి 2001
7. విశ్వనాథరెడ్డి కేతు నమ్ముకున్న నేల - ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1982.

★★★

# రాయలసీమ కథా సాహిత్యం - సామాజిక జీవన చిత్రణ

- డా॥. పాలెం రమాదేవి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ప్రపంచీకరణ, సరళీకరణల ప్రభావం వల్ల గ్రామాల స్వరూపమే పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు గ్రామాల్లో మానవ సంబంధాలు పటిష్టంగా ఉండేవి. డబ్బు విలువ పెరగడంతో వివిధ వ్యక్తుల మధ్య ఉండవలసిన సంబంధ బాంధవ్యాలు క్రమేణ అంతరించిపోతున్నాయి. చివరకు కుటుంబ సభ్యుల మధ్య సైతం ఈ అంతరం మరింత ఎక్కువైంది.

గ్రామాల్లో వ్యవసాయంపైనే ముఖ్యమైన జీవనాధారం. వ్యవసాయం పైన గ్రామీణ వృత్తులన్నీ ఆధారపడి ఉం టాయి. ఒకప్పుడు రైతే రాజు అనే భావన ఉండేది. ఆత్మాభిమానం, ఆత్మగౌరవంతో బతికిన రైతు కష్టాల కడలిలో ఈదుతన్నాడు. ఇందుకు అనేక కారణాలు, కరువు, అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, కుటుంబ కష్టాలు, వ్యయభారం పెరిగి అప్పుల పాలుకావడం మొదలైన సమస్యలు రైతును వెంటాడుతూనే ఉంటాయి. ఇలా రైతు పరిస్థితి క్రమక్రమంగా దుర్భరమైంది. సాగునీరు అందక, తగిన జలవనరుల్లేక, స్వేదాన్ని చిందించి సేద్యం చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, పంటను రోడ్లపై తోలి వట్టి చేతులతో వెళ్ళిపోయిన సందర్భాలు అనేకం, పెట్టిన పెట్టుబడులు రాక రైతు జీవితం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది.

మరొక పక్క గ్రామీణ జీవితానికి నీళ్ళే ఆలంబన. సాగునీరు తాగునీరు కష్టాలు తెల్లవార్లు చెప్పినా ముగిసి పోవు. కడివెడు నీళ్ళ కోసం మైళ్ళకు మైళ్ళు నడిచి, చెలిమెలు తీసి నీళ్ళు తోడి బానకు నింపి భుజానికెత్తుకొని ఎద్దులాగా మోసుకొని వచ్చి ఇంటికి చేరుకుంటే తృప్తి లేదు. పొలం జ్ఞాపకమోస్తుంది. కరెంటు రాకడ కోసం గంటల తరబడి పడిగాపులు కాయడం మామూలే. బోర్లు ఎండిపోవడం సకాలంలో వానలు కురవక భూములు బీళ్ళుగా మారిపోతుంటే రైతుకంట కన్నీరు ఆగదు. ఇలాంటి నేపథ్యంలో హృదయాలను కదిలించే ఎన్నో కథలు రాయలసీమ నుంచి వచ్చాయి. రాయలసీమలోని రైతుల వాస్తవ జీవితాన్ని కథలుగా రాయాలన్న తపన 'నమ్ముకున్న నేల', 'వానకురిస్తే', 'గడ్డి,' 'పశువులు గాసే పిల్లగాడు', 'ఎర్రిపెన్నేరు', 'వానొచ్చే సిత్తాట' మొదలైన కథల్లో కనిపిస్తుంది.

కేతు విశ్వనాథరెడ్డి, రా.రా., సొదుం జయరాం, రామక్రిష్ణారెడ్డి లాంటి కథకులు నిరలంకారమైన శైలిలో కథలు రాశారు. కథను సూటిగా చెప్పడం వీరి కథా శిల్పంలోని ప్రత్యేకత.

కేతు విశ్వనాథరెడ్డి 'నమ్ముకున్న నేల (1982) కథా రచన కాలంనాటి కడప జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలు ప్రారంభమై రైతులు, రైతుకూలీల జీవనశైలిలో అనేక మార్పులు తెచ్చాయి. రైతులు సిమెంటు ఫ్యాక్టరీల్లో పను లకు పోయే కూలీలుగా మారడమే ఇందులో కథా వస్తువు. కథ ప్రారంభంలోనే రాయలసీమలోని కరువు సంబంధిం చిన వర్ణన ఉంది. కరువు కరాళ నృత్యాన్ని కళ్ళ ముందుం చిన సజీవమైన వర్ణనతో కథ మొదలవుతుంది.

గ్రామీణ ప్రజల అసహనం వీరన్నపాత్రలో కనిపిస్తుంది. ప్రభుత్వం వారు కరువు ప్రకటన చేయగానే "యీ కలెక్టర్లో, మంత్రులో ప్రకటిస్తే తప్ప ఇది కరువు ప్రాంతంగా కాకుండా పోతుందా! సిగ్గు శరమూ లేని జాతి సొతంత్రం వచ్చి యిన్నేండ్లయినా మంచినీళ్ళ కరువు తీవ్రత కూడా ఉంది.... రైతుల కడుపు మండుతుంది ప్రకటనలకు" అంటాడు వీరన్న. ప్రభుత్వం సాగునీటి సౌకర్యమూ ఎలాగు పట్టించుకోలేదు. కనీసం తాగునీరైన అందించలేదే? అని వీరన్న తన కోపాన్ని రాయలసీమ యాసలో వెల్లడిస్తాడు.

ఒకప్పుడు ఇరవై ఎకరాల ఆసామి వీరన్న. ఈ కష్టజీవి తన వెలిభూమిని కొంత అమ్మి ఆశతో ఒక తోట కొంటాడు. కానీ తోటకు కొంత అడ్వాన్సుగా మాత్రమే ఇవ్వగలిగాడు. మిగతాది అప్పులు కట్టుకోడానికి సరి పోయింది. తాను కొత్తగా కొన్నతోట తన జీవన గతిని మారుస్తుందని నమ్మాడు వీరన్న, షరామామూలే. కరువొచ్చింది చెట్లకు కాయలు కాయలేదు. అప్పుగా తెచ్చిన సొమ్ముకు వడ్డీలు పెరిగిపోయాయి. అప్పుల వాళ్ళ కోసం భూమిని అమ్మడం మొదలు పెట్టాడు. హారతి కర్పూరంలా భూమి తరిగిపోయింది. బతకలేక రైతు కూలీగా మారాడు. అలా కూడా కుదరక పొద్దుటూరులో ఒక భోగం కంపెనీలో పనిమనిషిగా చేరాడు. వ్యవసాయం నమ్ముకునేకంటే భోగం కంపెనీలో పనిచేయడం మేలు అనే మానసిక స్థితికి నెట్టిన పరిస్థితిని గురించి ఆలోచింప చేసే కథ ఇది. ఇందులో వీరన్న తప్పేమీ లేదు. వీరన్నను చుట్టుముట్టిన సమస్యలదే తప్పంటాడు రచయిత. రైతు తిప్పలు, వాళ్ళ జీవనగతిని దిగజార్చిన సందర్భాలు మనకు కనిపిస్తాయి. రైతుల దీనస్థితికి అద్దంపట్టే కథ యిది. అనావృష్టి కరువుతో ముంచితే పెట్టబడిదారుల దోపిడి, రైతు జీవితాన్ని అతలా కుతలం చేసి అగాథంలోకి నెట్టివేసిన పరిస్థితిని సజీవంగా చిత్రించాడు రచయిత.

ఇక రామకృష్ణారెడ్డి పెన్నేటి కతల గురించి చెప్పు కోవాలి. ఆయన పేరు చెప్పగానే గుర్తుకొచ్చేవి ఈ పెన్నేటి కథలే. ఈయన గొప్ప వాస్తవిక వాది. తను చూసిన జీవితాన్ని ఉన్నదున్నట్లుగా నిజాయితీగా కథల రూపంలో చిత్రించాడు. అతను ప్రస్తావించిన ప్రధాన జీవన సమస్య కరువు ప్రకృతి వైపరీత్యం. అదే అతివృష్టి అనావృష్టి. రెక్కాడితేగాని డొక్కాడని అనామక జనంలోని నీతిని, ఆత్మోన్నత్యాన్ని జీవిత కాంక్షనీ బలంగా వ్యక్తం చేశాడు రామకృష్ణారెడ్డి. వీరి కథలు నేలమీద నిలిచేవే గాని గాల్లో కసరత్తులు చేసేవి కావన్నమాట. వీరి కథలకు పుట్టినిల్లు పల్లె. పల్లె హృదయాన్ని తన తనువు నిండా పరుచుకొన్న కథలు వీరి రచనలో కనిపిస్తాయి. గ్రామీణ జీవితంలోని వెలుగు చీకట్లను ప్రతిబింబిస్తున్న సాహితీసాగరమైన ఈ కథలు రాయలసీమ మట్టివాసనల పరిమళాలకు ప్రతిరూపాలు.

ఈ పెన్నేటి కథల్లో ఒక్కో కథ ఒక సంగటి ముద్ద. పొద్దు కుంకిందాకా మడిలో పనిచేసే రైతు సంగటి ముద్దను ఎర్రకారెంలో అద్దుకొని ఎంతో ఆప్యాయంగా, తృప్తిగా తింటాడు. ఈ కథలు కూడ అంతే ఆత్మీయత కలిగిన కథలు.

కొన్ని కథల్లో విషాదంతోపాటు సున్నిత హాస్యం కనిపిస్తోంది. కరువును కూడా వ్యాపారంగా మలుచుకొన్న కర్రె నాగయ్య పాత్రలు కూడా మనకు కనిపిస్తాయి. కర్రెనాగయ్య పిసినారి. వొంటి మీద చొక్కా లేకుండా బతుకుంటాడు. అలాగని డబ్బుల్లేని పేదోడు కాదు. దళారిగా బతుకుతూ రైతుల కష్టాన్ని దోచుకోవడమే పని. చొక్కాలేకుండా తిరుగుతుంటే కారణమడిగిన వాళ్ళతో "నా గురించి నా దగ్గరున్న డబ్బు గురించి అందరికి తెలిసినపుడు చొక్కా వేసుకోకపోతోనేం" అంటాడు. పోని ప్రొద్దుటూరుకు పోయినప్పుడైనా చొక్కావేసుకోవచ్చు కదా అని ఎవరైనా ప్రశ్నిస్తే" అక్కడ నా గురించి ఎవరికి తెలుసు?" అని దబాయిస్తాడు.

గ్రామీణ సగటు మనిషి పరాయీకరణ చెందుతున్న బతుకులు, యజమానిపై శ్రమజీవి చేసే మూగ తిరుగు బాట్లు కూడ మనముందు కదలాడే కథలను రామకృష్ణారెడ్డి ఎంతో సహజంగా మలిచాడు. ఇందులో ఒకటి 'ఏటుకాడు' అనే అద్భుతమై కథ. వామి వేసే కూలీని ఏటుకాడంటారు. ఆ వూర్లో "ఏసోబు' గొప్ప ఏటుకాడు.

వామివేసే కళలో ఆరితేరినవాడు. "ఏసోబుకు కొంత జంబం వుందికానీ వామి ఏసినాడంటే వానమ్మా నా కొడుకు వాడే ఎయ్యాల" అంటారు పల్లెజనాలు. కాని ఏసోబు విలువ ఆ వామివేసే కాలంలోనే మిగతా రోజుల్లో జనాలు అతనిని అంతగా పట్టించుకోరు. కనీసం

మానవత్వం కూడ ప్రదర్శించరు. ఇంత కళాత్మకంగా వామిని వేసే ఏసోబు ఒక రోజు ఉన్నట్టుండి తన పనిని మానేసి నిరసన తెలపుతాడు. అందుకు కారణం ఆయన కోడలు. ఏసోబు చేతవామి వేయించుకున్న రైతు తన కోడలుకు పశువుల కోసం ఇంత గడ్డి అడిగితే నిరాకరించ డమే. దీన్ని సహించలేక యజమానిపై ఏసోబు తిరుగు బాటు చేస్తాడు. కూలిజనం మునుపటిలాగా ఇప్పుడు పడుండటం లేదు. భయపడం లేదు. కడుపు మండి నపుడు ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్నారు. కాళ్ళకింద తొక్కిపట్టి పనిచేయించుకొనే కాలం పోయింది. రైతమీద కూలిజనం పట్టు పెరిగిందనడానికి ఉదాహరణలే ఇలాంటి కథలు.

ఎర్రి పెన్నేరు మీద ఆధారపడిన రైతుల బతుకులను ఒక జూదంతో పోల్చుతాడు రచయిత రామకృష్ణారెడ్డి. వ్యవసాయం ఒక 'సిత్తాట'. అదొక వ్యసనం. ఒక జూదం. ఓడిపోవచ్చు గెలువవచ్చు. ఏది గ్యారెంటీ కాదు. లాభమూ, నష్టమూ అంచనా వేయలేమంటాడు. 'వానొచ్చే' కథలో 'ఈ పొద్దు వాన గ్యారంటి' అని సంబరపడిపోయిన వ్యవ సాయ కుటుంబానికి వానసరిగ్గా పడక నిరాశ ఎదురౌ తుంది. 'వాన వస్తాది వస్తాదనుకుంటే రాదని, రాదను కుంటే వస్తాదని వాళ్ళకొక నమ్మకం. "ఊరికే ఊపిరిబుడ్డ మాదిరి ఉబికిపోతే అవతల టప్పుని పగిలిపోవాల" అంటాడు రచయిత. ఇక్కడ వ్యవసాయం ఒక 'సిత్తాట'.

'కరుబుజ్జ తోట' కథలో చాలా కష్టపడి రైతు కర్భూ పండ్లు పండిస్తాడు. ఇంత ముందెన్నడు పండని రకరకాల పండ్లన పండించి రాబడి తలచుకొని సంబరపడు తుంటాడు. అలాంటి సమయంలో మిన్ను విరిగి మీద పడినట్లు ఫలసాయం చేతికందే సమయంలో ఏరొచ్చి పంట అంతా మునిగిపోయి కొట్టుకుపోతుంది. పెన్నానది ఒడ్డున జీవించే రైతుల కష్టాలను అతివృష్టి అనావృష్టి రూపంలో ప్రకృతి సృష్టిస్తున్న విలాసాలను మన కళ్ళ ముందుంచాడు రామకృష్ణ గారు.

గ్రామీణ తెలుగు జీవితానికి అద్దంపట్టే కథలను మధురాంతకం రాజారాం గారు సృజించాడు. ఆయన కథలను పరిశీలిస్తే తెలుగు దేశపు సాంఘిక పరిణామం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పరిణామం వివిధ రంగాల్లో ఆయా కథల ద్వారా వ్యక్తమౌతుంది.

వ్యవసాయ పనులులేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళే కాలం నుంచీ, గల్ఫ్ దేశాలకు వలసవెళ్ళే శ్రమజీవుల జీవన పరిణామాన్ని రాజారాం కథల్లో చూడవచ్చు. కష్టపడి తాము సంపాదించిన ఆస్తినంతా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడానికి ధారపోసి కుటుం బాలూ, వరకట్నం కోసం లక్షలకు లక్షలు సమర్పించుకొని పూర్తిగా నిరాశ్రయులైన తల్లిదండ్రుల జీవితాల్లో వచ్చిన పరిణామాలను మనం వీరి కథల్లో దర్శించవచ్చు. ఒకప్పటి అన్యోన్య ఉమ్మడి వ్యవస్థ నుంచీ, ఏకాకిగా మిగిలిపోయిన తల్లిదండ్రులుగల కుటుంబ వ్యవస్థ పరిణామాన్ని గమనించవచ్చు. ఇక వివాహ వ్యవస్థను గమనిస్తే అన్యోన్య దాంపత్య జీవితం నుంచి విడాకుల దాకా పరిణమించిన కాలాన్ని మనం చూడవచ్చు. బతకాడానికి బడిపంతుల ఉద్యోగమనే కాలం నుంచీ పేదల బతుకుల్లో చిచ్చుపెట్టే కాన్వేంటు చదువులు, డబ్బే పరమావదిగా చదువులు చెప్పే చిత్తశుద్ధి లోపించిన గురువుల కాలన్నీ గమనించవచ్చు.

వ్యవసాయ జీవితంలో వచ్చిన మార్పులు అనేకం రాజారాం కథల్లో చూడొచ్చు. కపిల బానలు, ఆతర్వాత బోరింగులు, బోర్లు, కరెంటు మోటర్లు రైతుల జీవితాలను మార్చివేసి వ్యవసాయం ఒక జూదంలా మారిన పరిమాన్ని ఈ కథలు మనకు తెలియజేస్తాయి.

మనిషికి మనిషికి మధ్య ఆత్మీయతలే విలువైనవని తెలిపే రాజారాం గారి కథ 'దారితోడు'. ఇందులో కొండ్రావు పెద్ద ఆఫీసర్ గా రిటైర్ అవుతాడు. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కూతురు. కుమారులందరూ ఉద్యోగాల్లో స్థిరపడి ఆయనకు దూరంగా ఉంటారు. తన కుమార్తె వివాహాన్ని కుమారులందరి సమక్షంలో

ఘనంగా జరపాలనుకుంటాడు కొండ్రావు. పెళ్ళికి ఒక పది రోజులు ముందే అందరినీ రమ్మంటాడు. కాని కుమారులు మాత్రం పెళ్ళిరోజు మాత్రమే వస్తామని బదులు చెబుతారు. ఆయన ఎంతో బాధపడతాడు. గుండెల్లోని బాధల్ని తన దగ్గర ఉద్యోగం చేసిన నాగులయ్యకు చెప్పి తగ్గించుకోవాలనుకుంటాడు. కొండ్రావు పరిస్థితిని అర్థం చేసుకున్న నాగులయ్యకు వారం రోజులు ముందుగా పెళ్ళికి వచ్చి అన్ని ఏర్పాట్లు తనే స్వయంగా చూస్తాడు. కాని ఒకప్పుడు తన దగ్గర పనిచేసిన నాగులయ్యను కొండ్రావు అనేక శిక్షలకు గురి చేసి ఉంటాడు. అయినప్పటికీ ఆ విషయాలన్నీ మర్చి పోయి నాగులయ్య ఆదుకున్న తీరు కొండ్రావులో ఎంతో సంతోషాన్ని నింపుతుంది. కొండ్రావు కూడా నాగులయ్యను ఎంతో ఆత్మీయంగా ఆదరిస్తాడు. శ్రామిక జన హృదయాల్లో ఆత్మీయతలు నిండుగా ఉంటాయన డానికి ఉదాహరణే ఈ కథ.

సమాజంలోని మంచి చెడ్డల మేలుకలయికతో వైవిధ్యభరితమైన కథలు రాయడానికి రచయితలకు రాయలసీమలో మంచి ముడిసరుకు లభిస్తుంది. ఈ పొడిమట్టిలో పుట్టిన ప్రతి కథా హృదయపు లోతులను తాకుతుంది. రైతుల జీవితాలను రమ్యంగా చిత్రించిన రచయితల్లో పులికంటి క్రిష్ణారెడ్డి శైలే వేరు. రాయలసీమ గ్రామీణ జీవితాలను నిండుగా చిత్రించిన అనేక కథలను వీరి రచనల్లో గమనించవచ్చు. పాఠకుడి హృదయంపైన బలీయమైన ముద్రవేసే కథ 'మోసులెండి పోతున్నాయి'.

ఒక సన్నకారు రైతు తన పొలంలోని బావిలో ఉన్న కొద్ది పాటి నీటితో చెరుకుతోట పండించాలనుకుంటాడు. పంట బాగా వచ్చే సమయంలో బావిలో నీళ్ళు తగ్గి పోతాయి. వర్షం కోసం ఎదురు చూస్తాడు. వరుణుడు సైతం కరుణించలేదు. తన పంటను కాపాడుకోవాలని రైతు తపన పడతాడు. బ్యాంకుల నుంచి లోను, తెలిసిన వాళ్ళ దగ్గరి నుంచి అప్పు రూపంలో కొంత డబ్బు సమ కూర్చుకొని బావిలో పూడిక తీయిస్తాడు. ఎంత ప్రయత్నం చేసినా బావిలో నీటి మట్టం పెరగదు. చెరుకుపంట మోసులు ఎండిపోతాయి. పశువుల మేతకు కూడా పనికి రాకుండా పోతుంది. ఆ రైతు బతుకు బుగ్గిపాలౌతుంది. ఇలాంటి దృశ్యాలు మనకు రాయలసీమ ప్రాంతంలో అనేకచోట్ల కనిపిస్తాయి. ఇలాంటి కథే 'బంగారు సంకెళ్ళు'. రైతాంగపు కష్టాలు పాఠకులకు కన్నీళ్ళు తెప్పిస్తాయి. స్వర్ణముఖి నది ఎండిపోవడంతో చుట్టపక్కల భూముల్లో ఉన్న బావులు సైతం అడుగంటుతాయి. నీటి కరువు రావడంతో రైతులు పంట పడించలేక అప్పుల పాలౌతారు. భూములు అమ్ముకోడానికి సైతం సిద్ధపడి మనసొప్పక, అగమ్య గోచరంగా తయారైన రైతు జీవితాలను పులికంటివారు గుండెను తడిచేసే కథల్లో చొప్పించారు.

సాహిత్యం సామాజిక జీవిత సమస్యలను పాఠకుల ముందుంచడమేగాక సమస్యల పరిష్కార మార్గాలను చూపించేదిగా ఉండాలనేది విమర్శకుల అభిప్రాయం. ఆయా కాలాల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక సంఘ టనలు, సందర్భాలు మనిషిలోపల జరిగే నిరంతర సంఘర్షణలు పరిణామాలు రచయితల మీద ప్రభావం చూపుతాయి. వీటన్నింటినీ సాధారణీకరించడానికి, రచయితలు సాహిత్య సృష్టి చేస్తారు. సామాజిక వాస్తవిక పరిస్థితులను తమదైన శైలిలో సృజించి రాయలసీమ కథారచయితలు సాంఘిక జీవితాన్ని వాతావరణాన్ని ఆయా కథల్లో అద్భుతంగా చిత్రించారు. చైతన్యవంతులైన ఈ రచయితలు సామాజిక చైతన్యం కోసం ఆరాటపడ్డారు.

## ఆధార గ్రంథాలు :

1. కడప కథ - తవ్వా ఓబుల్ రెడ్డి - నందలూరు కథా నిలయం.

2. కృష్ణారెడ్డి పులికంటి కథావాహిణి - విశ్వంబర పబ్లికేషన్స్, తిరుపతి-2003.
3. డా॥ లక్ష్మి కె.బి. ఐ.వి.ఎస్. అచ్చుతవల్లి - తెలుగు కథకులు కథన రీతులు - సింగమనేని నారాయణ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. మధురాంతకం రాజారాం కథాయాత్ర - అజొవిభో ప్రచురణలు, హైదరాబాద్, 2000.
5. రామకృష్ణ .పి - పి. రామకృష్ణ రచనలు - మానవి పబ్లికేషన్స్, పోరంకి, విజయవాడ.
6. వందేళ్ళ తెలుగు కథ - చిన్నవీరభద్రుడు - ప్రచురణ: ఎమెస్కో బుక్స్, జనవరి 2001
7. విశ్వనాథరెడ్డి కేతు నమ్ముకున్న నేల - ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1982.

★★★

# 21వ శతాబ్దంలో రాయలసీమ కవిత్వం - వ్యవసాయ సంస్కృతి

- డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

"ధ్యానం చేసే వాడి కన్నా ధాన్యం చేసేవాడే మిన్న" (ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి) అనే కవులకు నమస్కారం.

ఆధునిక రాయలసీమ కవిత్వం ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాల కవిత్వంలాగే విభిన్న పరిస్థితులను వస్తువుగా స్వీకరించి ముందుకు సాగింది. భావ, అభ్యుదయ వాదాల నుండి నేటి ప్రపంచీకరణ పరిణామాల వరకు అన్ని విషయాల్ని కనిపెట్టుకొని నడుస్తోంది. అయితే, స్థానికత లేదా ప్రాంతీయ అస్తిత్వం అనే ప్రత్యేక లక్షణం రాయసీమ జీవితాన్ని మరింత ఆర్ద్రంగా చిత్రించింది. రాయలసీమ అనగానే చచ్చిన ఫ్యాక్షన్ భూతాన్ని సజీవంగా చూపించే సినిమాలు జనానికి గుర్తొస్తాయి. అందుకు భిన్నమైన మానవజీవితాన్ని చూడడానికి, చూపించడానికి ఈ సినిమాలు ఇష్టపడవు. మనసున్న మనుషులు, దాతలు, యోగులు, వీరులు, కవులు, కళాకారులు, మేధావులు, నాయకులను కన్న పుణ్యధాత్రి రాయలసీమ. బహు మతాల బహు భాషల, బహుళ సంస్కృతుల మేళవింపు రాయలసీమ అని గుర్తించాలి.

వ్యవసాయ సంస్కృతి ప్రపంచమంతా ఉన్నా, రాయల సీమ పరిస్థితి వేరు. ఆయా ప్రాంతాల భౌగోళిక నైసర్గిక ప్రాకృతిక పరిస్థితులను బట్టి వ్యవసాయ సంస్కృతి మారిపోతూ ఉంటుంది. నీటిపారుదల, భూసార లక్షణా లను బట్టి వారి జీవితాలు మారుతుంటాయి. నదులు ప్రవహించేచోట సారవంతమైన భూమి ఒకటి రెండు ఎకరాలున్నా సుఖంగా బతికేయచ్చు. రాయలసీమలో నీళ్ళు లేని ప్రాంతంలో వందల ఎకరాలున్న రైతు కూడా పేదరికంలో నలిగిపోతుంటాడు. ఇక్కడి రైతులు భూమికి అప్పు పడ్డ బాధితులు. చెమటనూ, రక్తాన్ని రంగరించి వ్యవసాయ యజ్ఞం చేస్తూ, కన్నీళ్ళను మిగలబెట్టు కుంటున్న శాపగ్రస్థులు. ఎముకల్ని మోసే బక్కరైతులు శవాకారంలో రాయలసీమ పల్లెల్లో దర్శనమిస్తుంటారు. ఆధునిక రాయలసీమ కవులు గతాన్ని కీర్తించి, వర్తమాన పరిస్థితులకు వగచి, భవిష్యత్తుపై కొత్త ఆశలు పెట్టు కోవడాన్ని గమనించవచ్చు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సంస్కృతిని సీమకవులు ఎలా చిత్రించారో పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

### శ్రమ సౌందర్యం :

వ్యవసాయ జీవితం నిరంతర శ్రమతో ముడిపడిన వృత్తి. చేతివృత్తుల వారు తమ పనికి సమయాన్ని, కష్టానికి ధరను నిర్ణయించుకోగలరు. కానీ, రైతులకు ఆ అవకాశం కూడా లేదు. అయినా నిరంతరం భూమితో, వాతా వరణంతో, చీడపీడలతో, దళారులతో పోరాడుతూనే ఉంటారు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతు తన చెమట చుక్కలకు రూపాయి లెక్కలు వేయడు. పైగా ఆ పనిలో సంతోషాన్ని వెతుక్కుంటాడు.

ప్రముఖ కథా, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి రైతులంతా పొలంబడులకు వెళ్తారని, మట్టి పొత్తిళ్ళ పలకల్లో అక్షర బీజాల్ని విత్తుతారని, పొలమంతా పచ్చదనపు పాటల్ని నాటుతారని, పాటల్లో ధాన్యశ్రీ నాట్యాన్ని పొదిగేందుకు శ్రమిస్తారని అంటాడు. గొర్రు అనే రథం మీద విత్తనసమరం చేసి, భూమిని పరవశింప చేసే చదువులో రైతులు గురువులౌతారని ఆనందాన్ని వ్యక్తం చేస్తాడు.

**"మట్టి పేటికలు చిట్లి**
**పరిమళ సుగంధం ఎగిసి**
**రైతు కళ్ళల్లో బంగారు కలల్ని పూస్తుంటే**
**వాళ్ళు తమ్ము తామే మరుస్తారు"**

(నాగేటి చదువు బడి)

అంతటి ఆనందాన్ని శ్రమతో పొందుతున్న రైతు 'ప్రపంచం కోసం బీజాక్షరాల్ని నాటుతూనే ఉన్నాడు, నాగేటి చదువు కొనసాగిస్తూనే ఉన్నాడు.'

'ఆకుపచ్చని పంక్తుల్ని చదివి చదివి అలసి సొలసి పోయే సూరీడు కుర్రాడు, నాలుక మెలిపెట్టి లొట్టగొట్టి అదిలిస్తే ఎద్దులకు బదులు పలికే మేఘాలు, ముల్లుగర్ర పైకెత్తి 'థే' అని పొడిస్తే జలజలా కురిసే మొయిలు, నాగలి చాళ్ళ నిండా పొంగి పొర్లే పచ్చదనం వెంకటరామిరెడ్డి కవిత్వంలో కనిపిస్తుంది. "పుడిసెడు నీళ్ళతో పుడమికి ఆకుపచ్చని రంగేసే మహత్తున్న గంధర్వుడు రైతు..." (పాదముద్రలు-బడి) గా దర్శనమిస్తాడు. రైతు జీవితంలో అల్లుకున్న వ్యవసాయ సంస్కృతిని సుందరీకరిస్తూనే, ప్రస్తుత స్థితిగతులను కూడా కళ్ళకు కట్టిస్తాడు.

"కోడికూతకు ముందే నిద్రలేచి, మడకను భుజాన వేసుకొని, ఎద్దుల మెడపై కాడిమాను పెట్టి నడిచి పోతుంటే, ఎద్దుల మెడలోని గంటలు చీకటి స్థబ్దతను చీల్చే శబ్దకిరణాలుగా ఉంటాయని' (కన్నీటిసీమ) డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి అంటాడు. పొలం పనుల్లో కష్టానికి బదులు ఇష్టాన్ని చూసే రైతులు తాము తాలుగింజల్ని తిని, మేలు గింజల్ని ప్రపంచానికి ఇచ్చే త్యాగసంస్కృతిని ఎత్తి చూపిస్తాడు. పంటను పనోళ్ళకు వాటాలేసి పంచేటప్పుడు ధర్మరాజు అంటే తానేనని ఉప్పొంగి పోతాడు. ఇంటి నిండా బాధలు మూలుగుతున్నా, స్వార్థంతో ఏ ఒక్కరి కష్టాన్నీ దోచుకోని నిఖార్సయిన మానవీయుడుగా రైతు దర్శనమిస్తాడు. భోజన సమయానికి ముఖం తెలియని వాడొచ్చినా, తినే అన్నంలోనే వాటాయిచ్చి సంతృప్తితో తేన్చేస్తాడు. పంటలు పండించే శ్రమైక మహాయాగంలో తనను తాను కాల్చేసుకుంటున్నా, ఇతరులకు చల్లని వెలుగునే ఇచ్చి పోతాడు. మానవ సంబంధాలను రూపాయలతో, కుల మతాలతో కాక బంధుత్వ వాచకాలతో వృద్ధి చేస్తుంటాడు. ఇదే నిజమైన రాయలసీమ రైతు సంస్కృతి.

## వ్యవసాయం, సామాజిక సంబంధాలు :

అనేక పరిశ్రమలకు వ్యవసాయ రంగం ఊపిరిలాంటింది. వ్యవసాయ ఉత్పత్తులు లేకుంటే, వాటిపై ఆధారపడి నడిచే పరిశ్రమలు మూతబడతాయి. గ్రామాలలో వ్యవసాయం చేసేది రైతులే అయినా, ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక చేతివృత్తుల వారికి పని కల్పిస్తుంది వ్యవసాయ రంగం. వివిధ సామాజిక వర్గాల ప్రజలు వ్యవసాయానికి అండగా నిలబడతారు. సమాజంలో కుల అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నా, రైతులు ఏ కులాల వారైనా, కుల పట్టింపులు పక్కనపెట్టి, బాంధవ్య వాచకాలతో పిలుచుకోవడం, ఒకరి కొకరు అన్నట్టుగా కలిసిపోవడం, వ్యవసాయ ఫలాల్ని వాటాలేసుకోవడం వంటి బృహత్కర సంస్కృతి సీమ వ్యవసాయదారుల్లో కనిపించేది. పనిపాటల్లో సాంఘిక ఐక్యత విప్పారేది.

"పొద్దు పొడిచే సరికి / ఎకరం నేల చాడ / ముందు మా నాయన ఎద్దుల మడక / వెనక మా మాల పెద్దాయన, శీనడు, మాదిగ సిద్ధడు, గంగోడు / నాసిపురెడ్డి రామచంద్రమామ రామనాథన్న / చిట్టచివర / నా దున్నపోతుల మడక / అదొక మడలక రైలుబండి" (పొలి - సేద్యం కావ్యం - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి). మడకల వరస, రైలు పెట్టెల్లా, ముందు మడక రైలింజన్‌లా, ఆ దృశ్యం అమోఘం. ఇందులో వ్యవసాయ పనులలో ఉన్న నైపుణ్యాన్ని బట్టి మడకలు ముందు వెనకలుగా నడిచేవి. వయసును బట్టి గౌరవాలు దక్కేవి. దున్నకాల్లో పురుషులు కలిసి పనిచేస్తే, నాట్లు,కలుపు తీతల్లో మహిళలు కలిసి పనిచేస్తారు. "కలుపు తీసే పనికి / మా మంగమ్మత్త నాయకత్వం / మా నాశమ్మత్త ఉపనాయకత్వం / మాల రామక్క, బొర్రక్క, కర్రెక్క ఊళ్ళో చెంగమ్మ, ఇల్ల రాజమ్మ / చేతుల్ని దువ్వెనల్ని చేసి / నేలకు చిక్కుతీసినట్లు / కలుపు తియ్యడం / యూనివర్సిటీలు నేర్పని విద్య" (పొలి) అంటారు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. చిత్తూరు జిల్లా గ్రామాలలో రెడ్డి, కమ్మ, బలిజ, బోయ, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, ఇల్ల, మాల,

మాదిగ, చాకలి, పిచ్చుకగుంట్ల మొదలైన కులాలు వ్యవసాయ పనుల్లో భాగస్వాము లౌతాయి. వారి మధ్య మానవ సంబంధాలు స్నేహ పూర్వకంగా, బంధు వాచక సంబంధాలతో పరిమళిస్తుంటాయి. మోతుబరి రైతులు, కర్రపెత్తనం చేసే సంపన్నులు ఉన్నచోట ఈ సంబంధాల స్థానాలు తలకిందులౌతుంటాయి. పండిన పంటను వాటాలేసే రైతు 'చాకలి రోశయ్య, మంగలి సుబ్బ రాయుడు, తోటి చెంగల్రాయుడు, తలారి నారయ్య, కంసాలి దొరసామి, కుమ్మరి రామక్క, పూజారి మునెయ్య, ఇల్ల సుబ్బయ్య' లను దృష్టిలో పెట్టుకొని 'మేర' ఇవ్వడాన్ని రాయలసీమ వ్యవసాయ సంస్కృతిలో స్పష్టంగా చూడ వచ్చు.

21వ శతాబ్దంలో వ్యవసాయంలో వచ్చిన మార్పులు రైతును యాంత్రీకరణ వైపు నడిపించింది. వ్యవసాయ కూలీలను ఉపాధి హామీ వైపు, అరకొర చదువుకున్న యువతను పట్నాలవైపు, కరువు ఆక్రమించుకున్న ప్రాంతంలో వలసలవైపు జనం అడుగులేయడం చూడ వచ్చు. ఆత్మగౌరవం పేరుతోనో ఆత్మన్యూనతా భావన తోనో కుల సంఘాలు, స్వార్థనాయకులు , వ్యవసాయ సంస్కృతిలోని సాన్నిహిత్యాన్ని ధ్వంసం చేశారు.

## రైతుల వలస :

వర్షాలపై ఆధారపడ్డ వ్యవసాయం రాయలసీమది. వర్షాలు కురిసే సంవత్సరాల కన్నా, వర్షాభావ సంవత్స రాలు రెట్టింపు సంఖ్యలో ఉంటాయి. ఉన్న ఒకటి రెండు వర్షాధార నదులు ఎప్పుడు ప్రవహిస్తాయో, ఎప్పుడు బిగుసుకు పోతాయో తెలియదు. ముసలి తల్లిదండ్రు లను ఊర్లకు కాపలా పెట్టి ఏ బెంగుళూరుకో, మద్రాసుకో పొట్టచేత పట్టుకొని రైతుకుటుంబాలు వెళ్ళిపోతున్నాయి. 2018 సంవత్సరంలో కేరళ రాష్ట్రానికి వలస వెళ్ళిన రైతులు ఉండడానికి చోటులేక, కక్కసు(టాయిలెట్స్)ల్లో నిద్రించిన హృదయ విదారక చిత్రాలు ప్రముఖ పత్రికల్లో కనిపించాయి. ఇలాంటి సంఘటనలు కవులను కదిలిం చాయి.

"చుక్కనీరు కరువు - సీమ బతుకు బరువు / పాడి పంటల తరువు - మంట గలిసిన తెరవు / వలస బాటన పల్లె - నడచిపోతూ ఉంది / నగర కూపాలలో చేరి - పల్లె నరకమవబోతోంది తల్లి (రావె రావె ఓ ఉగాది - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి) వంటి గేయకవితలు సీమదుస్థితికి అద్దం పడతాయి.

"ఊర్లో ధ్వంసమై మొలకెత్తని / విత్తనమొకటి / పట్నంలో ఓ ఇంటి గేటు ముందు / గ్రీష్మం కురిసిన ఓ చెట్టై నిలబడింది" (గాయపడ్డ విత్తనం - ఈ. రాఘవేంద్ర). రైతులు ఇళ్ళముందు కాపలాదార్లుగా మారిపోతున్నారని వాపోతాడు కవి. "వ్యవసాయ పనిముట్లన్నీ / పురాతన ప్రదర్శనశాలలో / అపురూప వస్తువుల జాబితాలో చేరి పోయాయి" అనడంలో ఛిద్రమైపోయిన వ్యవసాయ సంస్కృతే కళ్ళముందు నిలుస్తుంది.

**"ఎవరు శాపమొగాని, నెర్రెలిచ్చెను భూమి**
**గింజ మొలకెత్తక చచ్చిపోయెను ఓర్మి**
**తల్లి లాంటిపల్లె వెలవెలా బోయింది**
**పైరు బిడ్డలు లేని ధీనురాలయ్యింది**
**పొట్ట చేతబట్టి తమ్ముడా – వలస**
**బాట పట్టినారు చెల్లెలా..."**

(వలసపోయిన సీమ - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి)

అంటూ కవులు శోకించడాన్ని చూడవచ్చు. రాయల సీమలో వ్యవసాయం బతకాలంటే రైతులను ఆయా పల్లెల్లోనే ఉండి బతికే అవకాశం కల్పించాలి, ఆసరాగా నిలబడాలి.

## పంటపొలాల ధ్వసం :

పరిశ్రమల పేరుతో, రియల్ ఎస్టేట్ పేరుతో, మర ఫంకాల పేరుతో, సోలార్ విద్యుత్ పేరుతో పంటపొలాలు బలైపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం అమరావతి పేరుతో ముప్పైమూడు వేల కిలమీటర్ల విస్తీర్ణంలోని పంట భూముల అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేశాయి. రాయల సీమలోనూ పంట పొలాలు రకరకాలు వ్యాపాంలకు బలైపోతున్నాయి.

"నా సీమ భూములు / పంటలు వదిలి పవన ఫంకాలను ప్రసవిస్తున్నది / విప్పుకున్న బాహువులతో గాలిమరలు / గాలి సేద్యాన్ని చేస్తున్నాయి / నా నేల గర్భం అమ్మకమై / సరోగతి పద్ధతిన విద్యుత్‌ను కంటోంది... భూమిని అత్మగా వచ్చిన కాసుల మూట విప్పకుండానే అప్పుల పంపకాలు అయిపోయాయి. ఇప్పుడు రైతుతో రూకాలేదు! భూమీ లేదు"

(గాయపడ్డ విత్తనం - ఈ. రాఘవేంద్ర)

ఇబ్బడి ముబ్బడిగా ఉన్న కొండ ప్రాంతాల భూముల్ని, బంజరు భూముల్ని వదలి, నీటి సౌఖర్యం కలిగిన సారవంతమైన భూముల్ని రైతులకు దూరం చెయ్యడమే పారిశ్రామీకరణ సృష్టిస్తున్న పెద్ద విషాదం. అటు రూపాయికి, ఇటు పొలానికి దూరమైన రైతులు నిరుపేదలుగా మారిపోతున్నారు. వలసకూలీలుగా అవతారం ఎత్తుతున్నారు. రాయలసీమలో వ్యవసాయ సంస్కృతిని ఛిద్రం చేస్తున్న 'భూ' వ్యాపారాన్ని అడ్డు కోకపోతే, కార్పొరేటు గద్దలు బక్క రైతుల రక్తమాంసాలను వాటాలేసుకోవడం ఖాయం.

**"ఏ వైపు చూసినా కండలు కొరుక్కో జూసే తోడేళ్ళే... ఏ పల్లె కాపును చూసినా / వ్యవసాయ పోరులో ఓడి / మూలబడి మూలుగుతున్న క్షత గాత్రుడే"**

(మహాభినిష్క్రమణం - సడ్లపల్లె చిందబరరెడ్డి)

కనిపిస్తున్నాడు. "మట్టిని అన్నం చేస్తే, రైతుల ప్రాణాలు దక్కవిప్పుడు" (ఒక కత్తుల వంతెన - చం) అనేంతగా వ్యవసాయం ఎందుకు నాశనం అవుతోందో విజ్ఞులు ఆలోచించాలి. దేశ వెన్నెముకగా చెప్పుకునే రైతు కుదేలై పోతే, దేశం ఎలా అభివృద్ధి చెందుతుందో ఆలోచించాలి.

## ముగింపు :

'పైరు గొంతులకు పాలకోశాలుగా పిగిలిన 'చెరువులు బలవంతుల చెరలో (రియల్ ఎస్టేట్) చిక్కిపోతున్నాయి. 'మేఘాలు వేసే చిక్కు లెక్కల్ని, వంతుల బావి దరి మీద కూచొని ఎంత విప్పినా ఒకటిగా వచ్చే శేషం కోసం' రైతు బుర్రను బద్దలు కొట్టుకుంటున్నాడు' (బుతువుల కార్తెలు అంతుచిక్కడం లేదు). ప్రపంచ వంచకుడి కల సాకారమై నట్లు, వాణిజ్య వటవృక్షాల ఊడలు, పల్లె పల్లె మీదా దళారీ పడగలై బుసలు కొడుతున్నాయి (కార్పొరేట్‌ల దౌర్జన్యం). 'కరువు చితిమీద కట్టెలు చాలక సగం కాలిన అనాథ శవం నా రాయలసీమ (కరువు). ఇక్కడ రైతుగా జన్మించడమంటే న్యాయశాస్త్రాన్ని వెక్కిరించే తీవ్రనేరం చేసి, శిక్షను వారసత్వంగా తదనంతరం తరానికి బదిలీ చేయడమే' అన్నంతగా రాయలసీమలో వ్యవసాయ సంస్కృతి మారిపోయింది. సముద్రం పాలౌతున్న వరద జలాలను సీమ భూములకు ఇచ్చి ఆదుకోవాలని ప్రతి రైతూ చేతులు జోడించి వేడుకుంటున్నా, రాజకీయ వైకుంఠపాళీలో ఏ పథకమూ ఉన్నత దశకు చేరకముందే అవకాశాద రాజకీయ పాములనోట్లో పడి పల్టీలు కొడు తోంది.

రాయలసీమ వ్యవసాయ సంస్కృతికి సంబంధించి కవిత్వం రాసిన కవులు శతాధికంగా ఉన్నారు. కవిత్వం భావోద్వేగాల ప్రవాహం కాబట్టి, వ్యవసాయ జీవితంలోని ప్రతి సూక్ష్మ అంశాన్ని కథలా, నవలలా చిత్రించలేక పోయింది. రాచపాళెంగారి 'పొలి' దీర్ఘ కావ్యం కాబట్టి వ్యవసాయ జీవితంలోని అనేక సామాజికకోణాలకు రూపాన్నిచ్చింది. 21వ శతాబ్దిలో వచ్చిన, వస్తున్న ఆధునిక కవిత్వం రాయలసీమ రైతుజీవితాన్ని, వ్యవసాయ పరిణామాలను ఆర్ద్రంగా చిత్రిస్తోంది.

## ఆధార గ్రంథాలు :

1. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - పొలి (సేద్యం - కావ్యం) (2007)
2. ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి - మెరుపు తీగలు (2009)

3. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి - బడి (కవితల సంపుటి) (2018)
4. సడ్లపల్లి చిదంబరరెడ్డి - మహాభినిష్క్రమణం (రైతు కనుమరుగు)(2019)
5. చం. -ఒక కత్తుల వంతెన (2008)
6. డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి - కన్నీటి సీమ (2003) - నా కొక మనిషి కావాలి (2020)
7. లోసారి సుధాకర్ - మైనపు బొమ్మలు (2012)
8. పిళ్ళా కుమారస్వామి - మట్టిపోగు (2018)
9. ఈ. రాఘవేంద్ర - గాయపడ్డ విత్తనం (2019)
10. పలమనేరు బాలాజీ - మాటల్లేనివేళ (2007)
11. యలమర్తి మధుసూదన్ - కొత్తపాట (2017)
12. డా॥ పల్లా కృష్ణ (సంపాదకులు) - గళమెత్తిన రాయసీమ కలం (2019)

★★★

# శప్తభూమి నవల – అనంతపురం ప్రజల నమ్మకాలు

- **పప్పుల శైలజ,** అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల (అటానమస్), సిద్దిపేట.

బండి నారాయణ స్వామి గారు రచించిన 'శప్తభూమి' దళిత బహుజన చారిత్రక నవల, ఈ నవల తానా అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను సొంతం చేసుకుంది.

శప్తభూమి నవల కథాకాలం 1775 నుండి 1788 వరకు. ఇందులో చారిత్రక పాత్రలతో పాటు చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందిన కల్పిత పాత్రలు అనేకం. అవి తనను తాను ఉదాత్తీకరించుకొని ప్రభువు క్షేమం కోసం సంస్థాన క్షేమం కోసం, ఆత్మార్పణగా వించుకున్న బిల్లే ఎల్లప్పజెట్టి, తనను తాను దిగజార్చుకున్న కోడెనీలడు, ప్రేమను దక్కించుకోలేక, దక్కిన ప్రేమను అర్థం చేసుకోలేక సతమతమై చివరకు ఒంటరిగా మిగిలిన ఇమ్మడమ్మ, తననుతాను తెలుసుకుంటూ పది మందికీ సహాయం చేసిన పద్మసాని, మాదిగలలో చైతన్యం కల్గించ డానికి పాటుపడిన గురవడు (నిడుమామిడి స్వామి), అగ్రవర్ణాల అన్యాయానికి బలై చివరకు థగ్గులలో చేరిన శరభడు, స్వార్థానికి ప్రతీకగా నిలిచిన నాగప్ప ప్రగఢ, ఇంకా...విలయతాండవం చేసిన కరువు, స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, అస్పృశ్యత, మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచాలు వీటి చుట్టూ నవలా కథ నడుస్తుంది.

రాయసీమకు చెందిన అనేక చారిత్రక సంఘటనలతో పాటు, గులిగానప్ప పరస, వీరమంటపం, దేవదాసీ వ్యవస్థ, సతీసహగమనం, బసివిని, వంటి చారిత్రక వాస్తవికత ఆధారంగా కల్పిత పాత్రల సృష్టితో ఈ నవల ముందుకు సాగింది. ఈ నవలకు ముందు మాట రాస్తూ "ఈ రచనకు పూనుకోవటానికి ముందు స్వామి (రచయిత) కైఫీయత్తులను, శిలాశాసనాలను, గెజిటియర్లను, వీరగల్లులను మాత్రమే కాక ఆయా కాలఘట్టాలను, సామాజిక నమ్మకాలను, ఆచార వ్యవహారాలను కూలం కషంగా అధ్యయనం చేశారు" అంటారు ప్రఖ్యాత కన్నడ రచయిత వీరభద్రప్ప గారు.

భారతీయ సమాజంలో కొన్ని నమ్మకాలు, కొన్ని మూఢనమ్మకాలు తమవంతు పాత్రను నిర్వహించాయి. అవిద్య వల్ల అజ్ఞానం అలముకోగా వాటికి పేదరికం, కులం, అధికారం తోడై మూఢనమ్మకాలనే విష వృక్షాన్ని పెంచి పోషించాయి. ఈ నవల ఆధారంగా నవలాకాలం నాటి నమ్మకాలను గురించి తెలియజేయడమే నా పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## శుభ సూచకం :

18వ శతాబ్దంలో కన్యలను, బ్రాహ్మణులను, కపిల గోవును దర్శించడం శుభ సూచకంగా భావించేవారు. హండే సిద్ధ రామప్పనాయుడు స్నానానంతరం కన్యలను, బ్రాహ్మణులను, కపిల గోవును దర్శించుకొని, ఆరాధ్య నామావళులను విని సభకు వెళ్ళేవాడు.

## బ్రాహ్మణ హత్య :

బ్రహ్మ హత్య మహాపాతకం అన్న విశ్వాసం ప్రజలలో బలంగా ఉండేది. బ్రాహ్మణులు సమాజంలో ఉన్నత స్థానంలో ఉండే వారు. వీరికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. తప్పుచేస్తే శిక్షించడానికి కూడా భయపడేవారు.

కుట్ర చేసిన బ్రాహ్మణుడైన రామోజి ప్రగడకు కారా గార శిక్ష విధించి, అతనికి సహకరించిన బ్రాహ్మణేతరు లకు మాత్రం మరణ శిక్ష విధిస్తాడు పవాడప్ప నాయుడు. కారాగార జీవితాన్ని భరించలేక రామోజి ప్రగడ ఆత్మహత్య చేసుకోగా అది తనని బ్రహ్మహత్యగా వెంటాడుతున్నట్టు భావించి భయపడతాడు పవాడప్ప నాయుడు. బ్రహ్మ హత్య మహాపాతకం దానికి తిరుగులేదని, గోదాన, భూదాన, సువర్ణ దానాలతో పాపం శమించ వచ్చని

బ్రాహ్మణులు సలహా ఇస్తారు. గోదాన, భూదాన, సువర్ణ దానాలతో పాటు అగ్రహార దానం కూడా చేస్తాడు. అయినా పవాడప్ప నాయుడిలో భయం పోలేదు. బ్రహ్మ రాక్షసే తనను వెంటాడుతున్నట్టుగా మీది మీదికి వస్తున్నట్లుగా భ్రమించి తన గొంతు తానే పిసుక్కొని చనిపోతాడు.

### ఆకు పూజ :

భోగేశ్వరీ మాతకు ఐదు రోజుల పాటు ఆకు పూజ చేస్తే కన్నె పిల్లలకు మంచి వరుడు దొరుకుతాడని, సంతానం లేని ఇల్లాండ్రు సంతాన వంతులౌతారని నమ్మే వారు. ఐదు రాత్రులూ గర్భగుడిలోనే నిద్రించాలి. తోడుగా వచ్చిన వారు బయటే పడుకోవాలి. ఆ ఐదు రాత్రులూ (సంతానం కాగోరేవారు) ఐదుగురు గంధర్వులు తమ అంశలతో స్త్రీ గర్భంలోనికి ప్రవేశిస్తారని చెప్పుకునేవారు.

కానీ గుడిలోని పూజారులు భక్తుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారికి మూలికనిచ్చి స్పృహతప్పేట్టు చేసి లైంగిక దోపిడీకి పాల్పడే వారు.

### గులిగానప్ప పరస :

ఈ పరసలో కొత్తగా పెళ్ళి చేసుకున్న మాదిగ జంట గుండ్లు కొట్టించుకొని, గుండు చుట్టూ సున్నపు బొట్లు పెట్టించుకొని, అగ్రహారం స్వామికి అపరాధ సుంకం చెల్లించాలి. నూతన జంట అలా చేయకపోతే తమ ఇంటికి అరిష్టమని, వంశం నిర్వంశం అవుతుందని నమ్మే వారు.

ఒకప్పుడు అగ్రహారంలోని అందగాడైన మాదిగ యువకుడు ఆంగ్ల అధికారి క్రాపును చూసి ఆవిధంగా చేయించు కుంటాడు. దాంతో ఆ యువకుడు మరింత అందంగా కనిపిస్తాడు. అతడిని చూసి అన్ని కులాల పడుచులు అతనిపై మనసు పారేసుకుంటారు. అది అగ్రహారీకులకు కంటగింపవుతుంది. అతడిని ఏ విధంగానైనా శిక్షించాలని ఆలోచించి క్రాపు చేయించుకోవడం నేరమని అతడికి బోడి గుండు కొట్టించి, గుండు చుట్టూ సున్నపు బొట్టు పెట్టించి, గ్రామ బహిష్కరణ చేసి, అగ్రహారంలోని మాదిగ లకు కూడా ఒక నియమం పెట్టారు. కొత్తగా పెళ్ళైన మాదిగ జంట గులిగానప్ప పరస రోజు గుండ్లు కొట్టించు కొని, గుండు చుట్టూ సున్నపు బొట్లు పెట్టించుకొని తమకు రెండు కాసులు నేర సుంకం చెల్లించాలని శాసనం చేసారు. ఈ విధంగా గ్రామాధికారులు వేసిన శిక్ష రానురాను విశ్వాసంగా మారిపోయి దానిని వ్యతిరేకిస్తే తమకు కీడుకలుగుతుందన్న నమ్మకం బలపడింది.

### గాలిదేవర జాతర :

గాలిదేవర జాతర జరిపితే వర్షాలు పడతాయని ప్రజలు నమ్మేవారు. ఆ జాతర జరపడం ఎంతో ఖర్చుతో కూడుకున్నదీ, తమ తాహతుకు మించినదీ అయినప్పటికీ ప్రజలు వర్షాలకోసం జరిపేవారు. గ్రామ దేవతల నైవేద్యంగా దేవరపోతును బలిచ్చి పొలిమేరలో పొలి అన్నంచల్లి వాన రానీ గాలి దేవుడా ! చెరువు నిండనీ గాలి దేవుడా ! మమ్మల్ని సల్లంగ సూడు గాలి దేవుడా! అంటూ పూజించి తమ ఇళ్ళలో ఏటలు కోసేవారు.

చెరువులో పల్లె గ్రామస్తులు కూడా వర్షాలు లేక పోవడంతో గాలిదేవర జాతర జరుపుతారు. కానీ ఆ ప్రాంతంలో వర్షమనేదే పడదు.

### అగ్ని దివ్వె పరీక్ష :

పాప పుణ్యాలకు సాక్షిగా అగ్ని దేవుని నమ్మేవారు ప్రజలు, ఎర్రగా కాల్చిన ఇనుప గుండును నేరం ఆరోపింప బడిన వ్యక్తి చేతులలో ఉంచి, చేతులు కాలితే ఆ వ్యక్తి దోషిగా కాలకపోతే నిర్దోషిగా ప్రకటించెడివారు.

కంబళి శరభడు ఎర్రకొండాపురంలో నల్ల నాగిరెడ్డి వద్ద పనిచేస్తున్న దళితుడు. అతడిని అందరూ బాల భీముడు అనేవారు. ఆ ఊళ్ళో చిన్న గుండు, నల్ల గుండు, గండ శిల అని మూడు ఎత్తుగుండ్లున్నాయి. ఎవరికీ తెలియని కాలంలో నల్ల గుండు ఎత్తిన మొనగాళ్ళు ఉండేవారని చెప్పుకునేవారు. దసరా పండగ సందర్భంగా నల్ల నాగిరెడ్డి నల్ల గుండును ఎత్తి ఊరి వారి ప్రశంసలు

పొందుతాడు. అది చూసిన కంబళి శరభడిలో నల్ల గుండును ఎత్తాలన్న కోరిక పుడుతుంది. అర్థరాత్రి ఎవరూ చూడకుండా నల్ల గుండును ఎత్తడానికి వెళ్ళి దాని పక్కనే ఉన్న గండశిలపై దృష్టి పడి దానినే ఎత్తుతాడు. ఇంత వరకూ గండ శిలను ఎత్తిన మొనగాడే లేడు. దానిని చూసిన తలారి ఊరి పెద్దలతో చెప్పి పంచాయతి పెట్టి స్తాడు. ఆ పంచాయితీలో తాను గండ శిలను ఎత్తానని కావాలంటే మళ్ళీ అందరి ముందు ఎత్తుతానని అంటాడు శరభడు. కానీ ఆ గండ శిలను అందరి ముందు ఎత్తితే నల్ల నాగిరెడ్డి కంటే బలవంతుడిగా దళితుడైన శరభడు గుర్తించ బడతాడని, ఒక్కసారి ముట్టుకుంటే మైలపడిన శిల రెండవసారి ముట్టుకుంటే ఇంకెంత మైలపడుతుందో అంటూ దానిని నిరూపించుకునేందుకు అగ్ని దివ్వె పరీక్ష పెడతారు. ఎర్రగా కాల్చిన ఇనుప గుండును శరభడి చేతులలో ఉంచగా అతడి చేతులు కాలి బొబ్బలు వస్తాయి. దాంతో నేరం బుజువైందని శరభుడిని శిక్షిస్తారు.

## మరుల మందు :

ఎవరికైనా మరుల మందు పెడితే వారు తమను విడిచిపోరని నమ్మేవారు.

హరియక్క కోడెనీలడిని వివాహం చేసుకొని, అతడు తనను విడిచి పెట్టకుండా ఉండడానికి తాంత్రిక క్రతువు నిర్వహించి మరులమందు పెడుతుంది. అయినప్పటికీ కోడెనీలడు హరియక్కను విడిచి వెళ్ళిపోతాడు.

## అస్పృశ్యత :

శూద్రులు చూడడం వల్ల తమ విద్యలు మైల పడతాయని విప్రవినోదులు భావించేవారు. ఒకవేళ ఎప్పుడైనా వారు చూడడం జరిగితే శుద్ధి కార్యక్రమంతో ఆ దోషం నుంచి బయట పడతామని వారు భావించేవారు.

మాదిగలు దేవాలయం ఉన్న కొండ ఎక్కితే వారికి పక్షవాతం వచ్చి కాళ్ళు చేతులు పడిపోతాయని, వారు కోనేటిలో మునిగితే మళ్ళీ పైకి రారని, అసలు సత్రాలలోకి వారు పోనే పోకూడదని, ధ్వజస్తంభం ముట్టగూడదని, దేవాలయంలోకి అడుగు పెడితే తల వేయి వక్కలుగా పగిలి పోతుందని నమ్మేవారు. బ్రాహ్మణులపై మాల మాదిగల నీడ పడితే బ్రాహ్మణులు మైల పడి నరకానికి పోతారని బ్రాహ్మణులు విశ్వసించేవారు.

ఇవన్నీ వట్టి మూఢనమ్మకాలేనని మాదిగలలో చైతన్యం కలిగించడానికి గురవడు (నిడు మామిడి స్వామి) విశ్వ ప్రయత్నం చేస్తాడు.

## వీరమంటపం :

వీర మంటపం ఎక్కి ఆత్మ బలిదానంతో మల్లి కార్జునుని మెప్పిస్తే కోరిన కోర్కెలు తీరతాయన్న విశ్వాసం ప్రజలలో ఉండేది.

వర్షాలు పడక బుక్కరాయ సముద్రం పూర్తిగా ఎండి పోతుంది. కరువుతో ప్రజలు అల్లాడుతుంటారు. దాంతో టిప్పూసుల్తాన్‌కి చెల్లించాల్సిన రూకలు చెల్లించలేక పోతాడు హండే సంస్థానాధీశుడు సిద్ధరామప్ప నాయుడు, సిద్ధరామప్ప నాయకుని వద్ద అమర నాయకునిగా ఉన్న ఎల్లప్ప జెట్టి ప్రభు భక్తితో అనంతపురంలో వర్షం కురిసి బుక్కరాయ సముద్రం నిండాలని, హండే సంస్థానం బాగు పడాలని శ్రీశైలం వెళ్లి వీర శిరో మంటపం ఎక్కి ఆత్మ బలిదానం చేసుకుంటాడు.

అయినప్పటికీ అనంతపురంలో వానలు పడక, చెరువులు నిండక, రూకలు చెల్లించలేక పోవడంతో గుత్తి సుబేదారు సిద్ధరామప్పను బందీగా చేసి తీసుక వెళతాడు. పట్టపు రాణి అతడి కొడుకులూ మరణించడంతో హండే సంస్థానం అంతరించి పోతుంది.

ఇలా ఈ నవల అనేక మూఢనమ్మకాలతో ఆనాటి సమాజానికి ప్రతిబింబంగా నిలిచింది.

**ఉపయుక్త గ్రంథసూచి :** నారాయణ స్వామి బండి : శప్తభూమి

★

# అనంతపురం జిల్లా - బంజారా సాహిత్యం - సంస్కృతి

- **మూడ్ రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. అతి ప్రాచీనకాలం నుండి అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే భారత దేశానికి ప్రత్యేకతను సంతరించి పెట్టింది. దాదాపు భారతీయ ప్రాచీనతకు సమానంగా చెప్పుకోబడుతున్న భారతీయ సంస్కృతి మాత్రం చెక్కు చెదరక నేటికీ విరా జిల్లుతూనే ఉంది. దేశ సంస్కృతిని తలమానికం చేయడంలో ఇతరులతో పాటు గిరిజనుల పాత్ర కూడా ముఖ్యమైనది.

భౌగోళికగా, జాతిపరంగా, మతపరంగా, రాజకీయ పరంగా భారతీయ సంస్కృతిని పరిశీలిస్తే భిన్నత్వంలో ఏకత్వం కనబడుతుంది. ఆదిమ తెగల నాటి ప్రాచీన సంస్కృతిలో ఆచార సంప్రదాయాలు, జీవన విధానాలు నాగరిక సమాజంలో ఒక భాగమయ్యాయి. భారతీయ సంతతి వివిధ జాతుల సముదాయమని, భిన్న జాతుల స్వభావ స్వరూపమే భారతదేశం అని పేర్కొంటారు. ఆది వాసులు, గిరిజనలు, ఆటవికులు, సంచార తెగలు, జాన పదులు నాగరికులతో మిళితమైన దేశం భారతదేశం. ఆచార సంప్రదాయాలను, జీవిత విధనాలను తరతరాల నుండి అనుసరిస్తూ ఆచరిస్తున్నారు. నాగరికత ప్రభావం ప్రసరించని కొండల్లో, కోనల్లో, అడవుల్లో జీవిస్తున్న గిరి జనుల ఆచార, వ్యవహారాలను మౌఖిక సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రాచీన సంస్కృతి స్వరూప స్వభావాలు అవగత మవుతాయి.

బంజారాలు రూపు రేఖల్లో, వేష భాషల్లో, ఆచార వ్యహారాల్లో, జీవిత విధానంలో మిగిలిన గిరిజనుల కంటే ప్రత్యేకతతో ఉంటారు. మొదట లంబాడీలు లేదా బంజారాలు ఉత్తర భారతదేశంలో ఉండేవారని, తర్వాత దక్షిణ భారత దేశానికి వచ్చారని, చరిత్రకారులు చేబుతారు. వారి సాహిత్యం, ఇతిహాసాలు పరిశీలిస్తే తెలుస్తుంది.

రాథోడ్ వంశము - రామావత్ గోత్రం, శ్రీ రాంజి నాయక్ గారికి ముగ్గురు కుమారులు (1) భీమానాయక్ (2) సామనాయక్ (3) ఖీమానాయక్. వీరు తమ బిడారులను నడుపుచున్న కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతమైన ఆనంతపురం జిల్లాలోని గుత్తి తాలుకా, గుత్తికోట ప్రాంతంలో నివసించారు. శ్రీ భీమానాయక్ గారికి మొదటి సంతనాం గుత్తికోట - రామచంద్రకొండకు మధ్యలో ఉన్న చౌడేశ్వరీ కొండ పాదంలోని తండా. శ్రీ భీమా నాయక్ గారి ధర్మపత్ని ధర్మణి యాడికి చాలా కాలం వరకు సంతానం కలుగ లేదు. భార్యాభర్తలు ఇద్దరూ చింతగ్రస్తులై ఉండిరి. ధర్మణియాడి ప్రతివ్రతా శిరోమణి, తన భర్త భీమా నాయక్‌తో తనకు సంతాన ప్రాప్తి కలిగించమని వేడు కుంటుంది. ఆమెను ఓదార్చుతూ తన సంతాన ప్రాప్తికై ఘోర తపస్సు చేస్తారు.

ఏడు (వీరికి సాత్ భవాని) మంది దేవతలు ప్రత్యక్ష మైన తన కోరికను అడుగుతారు. నాకు పుత్ర భిక్ష పెట్టమని వేడుకొంటాడు. దేవి నీకు పుత్ర సంతానం ప్రాప్తిస్తుంది. కానీ, నీ మొదటి కుమారుడు సేవాలాల్‌ను 12 సం။రాల వయస్సు అయిన తర్వాత మాకు ఇచ్చి వేయవలయును అని తెల్పినారు. ఆ విధంగా ఒప్పుకొని తన తండాకు వస్తారు. కొద్ది రోజుల తరువాత ధర్మణి యాడి గర్భం ధరిస్తుంది. 15-2-1739 సోమవారం నాడు శ్రీ సేవాలాల్ మహారాజ్‌ను జన్మనిస్తారు. ఆ తరువాత వారు తమ బిడారులతో కర్ణాటక రాష్ట్రములోని శివమొగ్గ ప్రాంతము నకు వెళ్ళిపోతారు. 6 నెలల ప్రాయంలో ఉ

న్నప్పుడు బాలుడు కొండ మీద గుడిలో చౌడీశ్వరి మాతతో ఆడుకుంటూ వుండేవాడట. ఒక రోజు తండ్రి కనుగొనగా, మేము రోజు ఆడుకుంటాము అన్నారట. శ్రీ భీమానాయక్ గారికి 4 కుమారులు (1) సేవాలాల్ మహారాజ్ (2) బద్దు నాయక్ (3) హాఫా నాయక్, ఖానా (పూరా) నాయక్.

సేవాలాల్ గోవులను కాచేటప్పుడు అన్నం వెంట తీసి కొనిపోయేవాడు కాదు. ఒకవేళ తన తల్లి బలవంతంగా కట్టిచ్చిన ముద్దను గోవులకు తినిపించేవాడట. ఆకలి అయినప్పుడు బంకమట్టిని రొట్టెలుగా చేసి తినేసేవాడట. సేవాలాల్ ఎల్లప్పుడు భజన చేస్తుండేవాడు. రాళ్లను పళ్ళెములుగాను (కంచు పళ్ళె శబ్దం) మోతుక ఆకులను తాళములుగా చేసి భజన చేసేవారట. శ్రీ సేవాలాల్ మహారాజ్ 12 సం။రాలు వయస్సు వస్తుంది. దేవి ప్రత్యక్షమై భీమానాయక్‌ను తన మొదటి సంతానమైన శ్రీ సేవాలాల్ మహారాజ్‌ను పంపమని కోరుతుంది. కాని సేవాలాల్ దేవి వెంట పోవుటకు సమ్మతించక తన తల్లిదండ్రుల సేవ చేసుకొనవలయునని మంకు పట్టు పడతారు. ఎంత చెప్పిన వారి వెంట పోలేదు. చాలా కష్టాలపాలై తిండికి కూడా కరువై సేవాలాల్ మహారాజ్ తల్లిదండ్రులు రెండు రొట్టెలు కూడా దొరకకుండా ఉంటారు. వీరు కొన్ని రోజులు కొండ గడ్డిని కోసి దానిని అమ్ముకొని జీవనం చేస్తారు.

**కరలరే భాయా భగతి మారి ।**
**కరూ కచనేరి కాయా తారి ॥**
**అన్ ధనేరి భరూ కొటడి ।**
**ఛో మీనార్ వగం కియూఁ ॥**
**రణ, వేర్‌తో జితన్ లాయూఁ ।**
**ఢిల్లీ ఆగ్రనామ్ చలా యూఁ ॥**
**మారి భగత్ కర్‌ల సేవా ఛాయా**

**అర్థం :** ఓ సేవాదాస్, నీవు నన్ను పూజించు, నేను నిన్ను సంపదలో ముంచి వేస్తాను. నిన్ను ధన ధాన్యములతో తులతూగినట్లు చేస్తాను. ఇంతే కాదు, ఓ సేవాదాస్ నేను నిన్ను ఆరు నెలల ముందే ఏమి జరిగేది ముందుగానే తెల్పుతూ ఉంటాను. ప్రతి కష్టములోను(యుద్ధం) ప్రతి సందర్భములోను నీకు విజయమును కల్పించుతాను మరియు ఢిల్లీ - ఆగ్రాల వరకు నీ పేరు వచ్చేటట్లు ఢంకా మ్రోగిస్తాను. అదుకని ఓ సేవా దాస్ నీవు నన్ను శరణు వేడుకొనుము.

సేవాదాస్ దేవి యొక్క ఆదేశమును ఖాతారు చేయలేదు. సేవాదాస్ చెప్పినది ఏమనగా "హే జగదంబా! నేను నిన్ను భక్తితో పూజించుతాను ! నీ శరణు కూడా పొందుతాను,కాని నీవు పూజలో బలికోరుతావు. అది నేను ఇవ్వలేను. హేమా నీవు ఈ భూమండల మంతటికి తల్లివి. అయితే తమరు నీ కోరకికై నీ బిడ్డలనే బలికావాలని అడిగితే దానిని నీవు ఎలా సహించగలవు" ఓ తల్లి నీవు గొప్ప గొప్ప అశురులను (రాక్షసులను) సంహరించు మహా శక్తి ప్రదాయిని అయిన నీకు ఈ చిన్న బలిపశువు (మేక పోతు) తుచ్ఛమైన దీనితో నీకు కడుపు నిండుతుందా?

ఇది నీ శక్తికి, గొప్ప శక్తిని ఇస్తుందా? బంజారాలను హింసా మార్గం నుండి అహింసా మార్గంలో పయనించునట్లు చూవలయునని ప్రయత్నం చేసారు. మరియామ దేవి సేవాదాస్ తన మాటకు రానందున అతని గోవులు 3751 మరియు 6400 బిడారి వ్యాపార ఎద్దులను చంపి వేసినది. అందులో సేవాదాస్ యొక్క "గరసియాసాండ్" పేరు గల, ఆవులపై వదలిన 'గూలి ఎద్దు' కూడ ఉన్నది.

"తోళారాం" పేరు గల గుఱ్ఱం మరియు చిన్న తమ్ముడు ఖానా కూడా చనిపోయాడు. పైవాటిని దేవి చంపి వేసినది, లక్షల విలువ గల మొత్తం తమ ఆస్తిని నాశనం చేసింది. దేవిశాపము వలన భీమా నాయక్ కుటుంబము, రెండు రొట్టెలు కూడా దొరకకుండా కష్టాలు పాలైనారు.

ఎన్ని కష్టముల పాలు చేసినను శ్రీ సేవాలాల్ బాల బ్రహ్మచారి, లొంగడు. అందువలన మరియామా యాడి

ఆఖరుకు విధి లేక సరసికోట (సాగర్) అను ప్రాంతంలో ప్రత్యక్షమై సేవా ఛాయని కొన్ని కోరికలు కోరుకోమని చెపుతుంది. "ఆది శక్తి సేవాలాల్ బాల బ్రహ్మచారికి తన విశ్వరూపం చూపిస్తుంది. సూర్యచంద్రులను తన కళ్లుగాను,మొత్తం (విశ్వం) బ్రహ్మాండమును తన శరీరంగా దర్శనమిస్తుంది. ఇది చూచిన సేవాలాల్ ఆశ్చర్య చకితుడౌతారు. ఆ తర్వాత ఆమె చెప్పినదంతా వింటూ వస్తాడు.

అప్పుడు శ్రీ సేవాలాల్ భగవాన్ బాలబ్రహ్మచారి ఈ క్రింది కోరికలను కోరినాడు.

(1) తన తమ్ముడిని తనకు తిరిగి ఇవ్వమన్నాడు. సరే అన్నది. (2) మాకు జీవనాధారంగా ఉన్న మొత్తం3751 గోవులను, 6400 బిడారి ఎద్దలను తిరిగి ఇవ్వమన్నాడు సరే అన్నది. (3) నా సంతతి (మా సంతతి) వారికి 14 తరముల వరకు నీ పూజలు చేసుకొనేటట్లు వరమివ్వు అన్నాడు. సరే అన్నది (4) నా నోటి నుండి వచ్చిన ప్రతి వాక్కు అమలు కావలెను సరే అన్నది. (5) నేను సంవత్స రమునకు ఒకసారి మాత్రం పూజలు చేస్తాను. అది తలవూపి కాని, ఒళ్ళు విరచికాని పూజించను. మీకు రక్త తర్పణం కావలయును. నాకు సరిపడదు నా పూజలు మామూలు పొంగలి, పాయసం, చుర్మో, చపాతీలు నెయ్యి వేసి పూజిస్తాను. నీకు కావలసిన మాంసం, పప్పు ఎముకలను దూరం నుండే చూపిస్తారు. (6) మా బంజారాలకు ఎల్ల వేళలు ఆరోగ్యంగా, ఆహార కొరత లేకుండా, రొట్టెలు, పప్పు నెయ్యితో భోజనం దొరకునట్లు చూడవలెను. సరే అన్నది. ఆ విధంగా వరములు పొందిన తర్వాత, తనచేతితో మొదటి దేవి పూజ చేయవలయునని నిశ్చయించుకొన్నారు.

అప్పుడు వారి వద్ద 4 ముంతల బియ్యం (అనగా 12 సేర్లు) మాత్రము ఉన్నది. జనాభా చూస్తే 10 వేల మంది పైబడి ఉన్నారు. ఈ బియ్యంతో ఇంత మంది భోజనాలు ఎలా చేసేది అన్నాడు. దేవి మరియమ, నీ తల్లి ధర్మణి యాడి అన్నపూర్ణ ఒక బియ్యం మెతుకుతో వేల మంది భోజనం చేయించగలదు. ఆ నాలుగు ముంతల బియ్యం నీ తల్లికి ఇచ్చి, చుట్టూ డేరా కట్టండి అని తెల్పుతుంది. తన తల్లి చేతుల మీదుగా దేవి పూజలు చేసి మొత్తం 10 వేల మందికి, అదే బియ్యంతో భోజనాలు చేయిస్తారు.

సేవా భాయ తనతల్లికి ఒక వరం ఇస్తారు. దేవి చంపి వేసిన తన తమ్ముని, నాకు ప్రసాదించు అని కోరియున్నది ఆ వరం ఇప్పుడు ఇస్తున్నాను. నాకు తమ్ముని ప్రసాదించు అని తల్లిని కోరుతాడు. అక్కడ అందరు ఆశ్చర్య పోతారు. ఇదేమి వింత తల్లికి 80 సం॥రాలు, తండ్రికి 90 సంవత్సరాలు వీరికి సంతానం ఏమిటి అని ఆశ్చర్య పోతారు. తన తల్లి శరీరం ముడతలు పడి ఉంది నవరంధ్రాలు సన్నగిల్లనవి ఈమెకు సంతానము ఏమిటి అని ఆశ్చర్యంలో ఉన్నప్పుడు సేవాలాల్ అంటారు.

"కామవాంఛ లేకుండా, రక్తప్రసరణ జరగకుండా ప్రసవ వేదన లేకుండా, ఎటువంటి పురటినొప్పులు లేకుండా, తొమ్మిది నెలల తొమ్మిది రోజులకు నిండు అమావాస్య నాడు నాకు తమ్ముడు జన్మిస్తాడు అని చెప్పాడు. ఆ మాట తల్లి చెవిలో పడగానే ఆమె శరీరంలో మార్పు వచ్చినది".

అది విన్న తండ్రి భీమానాయక్ ఆశ్చర్యచకితుడై అంత పెద్ద జన సంఖ్య ముందు ఏమియూ చెప్పక తన కోపమును తనలోనే అణుచుకొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఇంటిలో కూర్చుని వుండగా కోపంతో ఉన్న భీమా నాయక్, ఆవులు కట్టుటకు ఉపయోగించు పలుపుతాడును చేతిలో తీసుకొని వెనక నుండి సేవాలాల్ వీపు మీద 'ఫెడమని' ఏడు ఎనిమిది చరిచి (కొట్టి) పెద్ద భక్తుడు వచ్చాడు ముసలి వాళ్లకు వరం ఇస్తాడట అని తనలో తాను తిట్టుకుంటాడు.

మీరు నాకు జన్మనిచ్చారు. మీరు నన్ను కొట్టే హక్కు ఉన్నది. దానికి నేనేమి అనను. కాని మీ తప్పుకు గాను రేపు ప్రొద్దున నీవు ముఖం కడగుకునేటప్పుడు మీ ఎడమ

కనుగ్రుడ్డు మీ చేతిలోకి వస్తుంది అని అంటారు. అది చూస్తాములే ! నీ శక్తి ఎంత ఉందో భీమానాయక్ గారు ఉదయమునే లేచి, ఆవు దూడలను తల్లి దగ్గర వదిలి పాలు పితికి, బొగ్గుతో పళ్లు తోముకుంటాడు. ఆ తర్వాత నీళ్ల చెంబు చేతిలో తీసుకొని ముఖం కడుగుకునేటప్పుడు నీళ్లు కుడి చంపకు తీసుకొని, తిరిగి ఎడమ చంపపై త్రిప్పి ముఖం కడుగుతాం ఆ విధంగా తన చేయి ఎడమ కన్నుపై తగలగానే ఏమాత్రం నొప్పి లేకుండా భీమా నాయక్ కనుగ్రుడ్డు చేతిలోకి వచ్చినది. అది చూచి ఆశ్చర్యపోయిన భీమా నాయక్ తన రూమాలు కొడుకు పాదాల మీద ఉంచి ఒంటి కాళ్లపై నిలచి చేతులు జోడించి నమస్కరించారు. తండ్రి నన్ను క్షమించు అని ప్రార్థించాడు అప్పుడు సేవాలాల్ తండ్రిని చూచి నేను వరం కోరినపుడు బంధుత్వం గూర్చి అడగలేదు కావున నా వాక్కునకు తిరుగులేదు. మీరు ఒంటి కన్నుతోనే ఉండవలెను, తప్పదు అన్నాడు

## సేవాలాల్ బోధించిన ధర్మ సూత్రాలు :

1. నా తల్లిదండ్రులకు బిడ్డగా వారికి సేవలు చేయడం పుత్రుడిగా నా ధర్మం దానిని నేను మరువలేను.
2. నంగరిలలో ఒకరిగా ఉండి నంగరి ప్రజలకు సేవలు చేయడం నా ధర్మం.
3. బంజారా వ్యక్తిగా జన్మించిన నేను బంజారాలను ఆదుకోవడం నా ధర్మంగా భావిస్తున్నాను.
4. దండి మాత మాంసాన్ని నైవేద్యంగా పెట్టమని కోరుకుంటుంది. ఆ మహా తల్లి ఈ చిన్న చిన్న జీవాల రక్తం కోరుకుంటుంది. అయినప్పటికీ వాటిని నేను బలి చేయదలచుకోలేదు.

సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ మహిమలకు ఆశ్చర్యపోయి నవాబు అతణ్ణి తన దగ్గరకు రప్పించు కుంటాడు. ''కొన్ని పరీక్షలు పెడతా. వీటిలో నెగ్గితే మిమ్ములను గౌరవిస్తా'' అని నిజాం రాజు సేవాలాల్‌తో అంటాడు. అప్పుడు సేవాలాల్ పరీక్షలకు అంగీకరిస్తాడు. అతణ్ణి ఒక లోతైన బావిలో దించుతారు. ఆ బావిలోకి ఒక నూలు పోగు (దారం) విడిచి దానితో పైకి రావాలం టాడు. సేవా భాయ్ అదే విధంగా పైకి వస్తాడు. ఆదృశ్యాన్ని చూసి అతని మహిమను నవాబు ప్రశంసిస్తాడు. భక్తితో గౌరవిస్తాడు. సేవాలాల్ మహారాజ్‌కు నిజాం ఒక ఏనుగు, ఖడ్గం, డాలు, బళ్ళాలను కొంత ధనాన్ని ఇచ్చి హైద్రా బాద్‌లోని ''మహారాజ్ గంజ్'' బంజార హిల్స్‌ను కూడా ఇనాంగా ఇస్తాడు.

సేవాలాల్ మహారాజ్‌కు తెల్లగుడ్డతో జెండాను, మేరమ్మకు ఎర్రబట్టతో జెండాలను కట్టుతారు. ఈ విధంగా బంజారాలకు సేవాలాల్ ప్రబోధనలు ఎంతో ప్రేరణను ఇచ్చినది. ఆయన అవలంబించిన అహింసా మార్గం బంజారాలకు నైతిక స్థైర్యానిచ్చింది.

అహింసా వాదాన్ని బోధించిన గొప్ప సంఘ సంస్కర్త, నీతి బోధనలు చేసిన ఒక ప్రవక్తగా అతని గుణాలు కనబడుతున్నవి. ఒక కబీర్, ఒక పూలే, మహాత్మగాంధీ, గౌతమ బుద్ధుడు, స్వామి వివేకానంద మొదలగు వారి సూక్తులు వారి కంటే ఎంతో ముందుగానే సేవాలాల్ మహారాజ్ గ్రహించినట్లుగా భావించవచ్చు.

భారతదేశంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15 ఉత్సవాలు జరుపుకుంటారు. ఈ వేడుకలో సేవాలాల్ మహారాజ్‌ను కేవలం ''భోగ్'' అనగా ''గోళేర్ చుర్మో (బెల్లం, బియ్యపు పిండిలతో చేసిన రొట్టెలను పిసికి ముద్దలుగా చేయుట) గోలేర్, ధానేర్ ముద్ద అనగా లాప్సి (బెల్లం అన్నము ముద్ద) కలిపి 'ఛూరి'లో ఉన్న నిప్పులపై వేసి ఆపై నుండి నెయ్యిని పోయం మూలంగా మంటలు పైకి వస్తాయి. దీనిని ''భోగ్'' ''భండారో'' నైవేద్యంగా సమర్పించడంటారు. సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్‌ని బంజారాల తమ జాతిపిత,

ఆధ్యాత్మిక గురువు బంజారా జాతి మొత్తాన్ని సన్మార్గంలో నడపడానికి ఆయన చేసిన కృషి, బంజారా జాతిపట్ల ఆయనకున్న ప్రేమ, దేవతలు మనుషులలో వుంటారని ప్రతి మనిషిని ప్రేమించి సృష్టిలోని ప్రతి జీవిపై ప్రేమ, జాలి, దయ చూపించి, మసలు కోవాలని బంజారా జాతి మొత్తాన్ని ఒక్క తాటిపై నడపటానికి ఆయన చేసిన కృషి ఆయన్ని గోర్ బంజారా జాతికి యుగపురుషునిగా చరిత్రలో నిలచిపోయింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బంజారాల చరిత్ర, సంస్కృతి - డా॥ గుగులోత్ వీరన్న
2. బంజారాల తీజ్ పండుగ - ఆచార్య భట్టు రమేష్
3. బంజారా - (పండుగలు - సాహిత్యం) - హంసావత్ నాగేంద్ర
4. బంజారా మౌఖిక కథలు - డా॥ జె. రాజారాం.
5. లంబాడీ - డా॥ కె. శ్యామల
6. బంజారా సంస్కృతి - ప్రదర్శన కళలు - జి. శంకర్ నాయక్
7. గిరిజన వీరులు - హంసావత్ నాగేంద్ర
8. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి - బి. బీనియా నాయక్
9. బంజారా గేయ సాహిత్యం - తెలుగు ప్రభావం - డా॥ లూనావత్ నెహ్రూ నాయక్
10. తెలంగాణ గిరిజన ఉద్యమ చరిత్ర - గుగులోత్ శంకర్‌నాయక్

★★★

# భూచక్రం నవల : రాయలసీమ నూతన ఆర్థిక జీవన విధానం

- డా॥. వెంకటరామయ్య గంపా

ఆదిమ సమాజం నుంచి నేటి వరకు మనిషి జీవితాన్ని ప్రభావితం చేస్తున్నవి ఆర్థిక విషయాలేనని సామాజిక శాస్త్రవేత్తలు చెప్పేమాట. ఆ ఆర్థిక విషయాలు నేటి రాయల సీమ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్నట్లే రాయల సీమలోనూ స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం జరుగుతూ ఉంది. గత రెండు దశాబ్దాలుగా రాయలసీమలో జరుగు తున్న స్థిరాస్తి వ్యాపారం కొంత ప్రత్యేకతను కలిగివుంది. గత రెండు దశాబ్దాల కాలం నుంచి రాష్ట్రంలోని ముఖ్య నేతలందరూ ఈ రాయలసీమ ప్రాంతం నుంచి ప్రాతి నిథ్యం వహిస్తున్నారు. దీనివలన ఒకదశలో ఒక రాష్ట్ర రాజధానిలో జరిగినంత స్థిరాస్తి వ్యాపారం ఒక సాధారణ ప్రాంతంలో జరిగింది. దీని ఫలితంగా ఆర్థిక అస మానతలు పరాకాష్టకందుకున్నాయి. కొందరు బల వంతులు చేస్తున్న ఒత్తిడితో సాధారణ పౌరులు తమకు అన్నం పెట్టిన నేలను ఒక్కసారిగా తక్కువ ధరకు గత్యం తరం లేని పరిస్థితుల్లో అమ్ముకొంటున్నారు. రైతు జీవితాంతం ఏ ఆధారంలేనివాడుగా మిగిలిపోతున్నాడు. వ్యవసాయం మీద ఆధారపడిన రైతు కూలీలు చివరికి వలస కూలీలుగా మారిపోతున్నారు. చాలీ చాలని కూలితో ఎంతోమంది తనువులు చాలించారు. పచ్చని పొలాలు స్థిరాస్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లి పంటలకు దూర మవుతున్నాయి. పంట పొలాలు లేకపోవడంతో జీవనానికి అవసరమైన తిండి గింజలు లభించని పరిస్థితి నెలకొనింది. చివరికి సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ధరలు పెరిగాయి. చెరువులు, కాలువలు, బావులు పూడ్చివేయడంతో నీటి నిలువ తగ్గిపోయి తాగడానికి నీరు లభించని పరిస్థితి ఏర్పడింది. మరొకవైపు కొందరు ధనవంతులు తక్కువ ధరతో కొన్న భూములను స్థిరాస్తి వ్యాపారంలోకి మార్చి కృత్రిమ ధరలను నిర్ణయించి, లాభాలు సంపాదించి ధనవంతులవుతున్నారు. ఈ ధనాన్ని రాజకీయాల్లో పెట్టుబడిగా పెట్టి రాజకీయనేతలుగా మారిపోయి అక్రమ సంపాదనకు దారులు వేసుకుంటు న్నారు.

మధురాంతకం నరేంద్ర రచించిన భూచక్రం నవల ప్రస్తుత కాలంలో ఉన్న స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం గురించి వివరించే నవల. దాదాపు వంద సంవత్సరాల కాలం నుంచి తిరుపతి ప్రాంతంలో భూమిని వినియోగించుకోవడంలో వచ్చిన మార్పులను వివ రిస్తుంది ఈ నవల. "... యిదంతా పూరాగా మీతాతదే వొగప్పుడు... నేను పిల్లోడుగా వుండేటప్పుడు యిదంతా యవసాయం జేస్తావున్నె నేలే! ఆ యెగవన మామిడి తోపు... దానికి దక్షణంగా చెరుకుదోట... పడమరగా వరిమడి... మొత్తం మూడు కీనేరు బాయిలుండేటి వప్పుడు. అయిదారు మోటర్లతో రెండు గంటలు గొట్టినా జానెడు మట్టం నీళ్ళు తగ్గెటిదిగాదు" (నరేంద్ర, మధురాం తకం. భూచక్రం. 14) అని శేషారెడ్డి అమిత్‌తో చెబుతాడు. ఈ మాటలు నాడు తిరుపతిలో ఉన్న వ్యవసాయ భూముల పరిస్థితిని వివరిస్తాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ భూమి అనేది కనిపించని పరిస్థితి నెలకొనింది. దీనవలన కలిగే పరిణామాలు మొత్తం వ్యవస్థపై ప్రభావం చూపు తున్నాయి. రైతు అనేవాడు స్థిరాస్తి వ్యాపారి అవతారం ఎత్తడం అనేది రాయలసీమ లోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నది.

రచయిత ఇది తిరుపతి ప్రాంతంలో జరిగిన ఇతివృత్తంగా చెప్పినప్పటికీ ఇదే పరిస్థితి రాయలసీమలోని ప్రాంతాల్లో మాత్రమే కాకుండా (దేశంలోని) చాలా నగరాల్లో కనిపిస్తుంది. దాసరి అమరేంద్ర మాటల్లో

చెప్పాలంటే 'ఈ రచనలోని వస్తువు విశ్వవ్యాప్తమైనది. ప్రపంచంలోని అన్ని నగరాల్లో కూడా ఇటు వంటి ధోరణులు కనిపిస్తున్నాయి. భూ ఆక్రమణలూ, మాఫియా, దోపిడీ, ప్రజల తిరుగుబాటు వంటి అంశాలు ఏదో ఒక చోట జరుగుతున్నాయి'. నవలలో కనిపించే అంశాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని ప్రాంతంలో కూడా కనిపిస్తాయి. రైతుల భూములకు సంబంధించిన వార్తలు ప్రతిరోజు దర్శనమిస్తున్నాయి. కొంత మంది రైతులు తమ భూములు ఇవ్వడానికి నిరాకరిస్తుంటే వారిపైన కొందరు ఒత్తిడి తీసుకొచ్చి భూములను తీసు కుంటున్న వైనం కూడా కనిపిస్తుంది. భూముల కొనుగోలు దారులు దౌర్జన్యాలకు పాల్పడటం కూడా జరుగు తూంది. రాజకీయ నాయకులు, ధన వంతులు ఎక్కువగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు నవలలో కనిపిస్తుంది. నవలలో మధ్యవర్తి పాత్ర శేషారెడ్డి అమిత్ రెడ్డికి సెటిల్ మెంట్లు చేసే వ్యక్తి గురించి చెబుతాడు. "అన్నది హైద్రా బాదులో దర్బారయితే, తమ్ముడిది ఈ వూర్లో దర్బారు. పోలీసులూ, పొలిటీషియన్లూ, గవర్మెంటూ-అన్నీ ఆయనెట్ల చెప్తే అట్నే అని తల వూపతాయి. ఆయన దర్బారుకు మనం పోకుండానే వుండాల. పోయినాంక ఆయినేది చెప్తే అదే రూలు. కాదంటే ఆయిన కోర్టులో వేరే పనిష్మెంట్లుంటాయి. అవిట్ని ఆపేదానికి పోలీసుల వల్ల గాదు. కోర్టులూ, లాయర్లు నీకు పలకరు. బతికి బట్టగట్టాలంటే గొమ్మునావచ్చి రిజిస్ట్రేషన్ జెయ్యించు" (పైదే. 147) అని శేషారెడ్డి అమిత్‌రెడ్డికి సూచి స్తాడు. సెటిల్‌మెంట్లు చేసే వ్యక్తి ఆస్తి హక్కుదారులకు కేవలం రెండు లక్షల రూపాయల డబ్బు ఇచ్చి దాదాపు కోటి రూపా యలు విలువజేసే ఆస్తిని దౌర్జన్యంతో తీసు కున్నాడు. ఆ అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం అమిత్‌రెడ్డికి గానీ, కుటుంబ సభ్యులకుగానీ లేదు. శేషారెడ్డి మాటలు విన్న తరువాత కోటి రూపాయల విలువజేసే ఆస్తిని కాపాడుకునే ప్రయత్నం చేయడానికి సంకోచించాడు.

మరికొన్నిచోట్ల పలుకుబడి గలిగిన నాయకులు కనిపించిన విలువైన ఆస్తిని కాజేస్తున్నారు. భూమికి సంబంధించిన విషయాలలో ధనవంతులకు రాజకీయ నాయకులు, రాజకీయ నాయకులకు ధనవంతులు పర స్పరం సహకరించుకుంటున్నారు. వీరికి ప్రభుత్వాధికారుల అండదండలూ ఉన్నాయి. "ఇదంతా నా చిన్నప్పుడు పెద్దచెరువు. వూరు పెరిగినాంక దీంట్లోకి డ్రైనేజీ నీళ్ళొచ్చి చేరతావున్నాయి. మునిసిపాటీవాళ్ళు చెత్తంతా యిక్కడ్నే దిమ్మరించేటోళ్లు. దాంతో మెల్లిమెల్లింగా చెరువంతా పూడిపొయ్యింది. అప్పట్లో వూరికి పెద్ద తలకాయిగా వున్నాయిన, ఆయిన పేరుమిందే పత్రాలు బుట్టించి, యిదంతా ప్లాట్లేసి అమ్ముకునేసినాడు. యిప్పుడీ నేల వాల్యూ కోట్లల్లో వుంటుంది."( నరేంద్ర, మధురాంతకం. భూచక్రం. 141) అని బ్రోకరు శేషారెడ్డి అమిత్‌కు చెబు తాడు. మరికొంత మంది ధనవంతులు వారికి ఉన్న ధన, రాజకీయ అండతో సామాన్య ప్రజానీకాన్ని మనుషులుగా చూడటం లేదనే విషయం తెలుస్తుంది. "ప్లాట్లు కొను క్కున్న మేమంతా కలిసి వొక అసోషియేషను పెట్టుకున్నా మప్పుడే! మేమందరమూ ఒక రోజు ఆ నవాబు దగ్గిరికి కూడా వెళ్లాం. ఆయనయితే మమ్మల్ని మనుషులని గూడా అనుకోలేదు. సిటీకి మధ్యలో నాలుగెకరాల తోటలో వుంది ఆయన పాలెస్.. రాజుల యిండ్లు గూడా అంత దర్జాగావుండవు. ---" (నరేంద్ర, మధురాంతకం. భూచక్రం. 148) అని శేషారెడ్డి అమిత్‌రెడ్డితో చెప్పి బాధ పడతాడు.

భూములు చేతులు మారడంలో బ్రోకర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సాధారణ రైతుకు బ్రోకర్లు ఎన్నో మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారు. నవలలో మధ్యవర్తి/బ్రోకరు పాత్ర చాలా ప్రముఖంగా కనిపిస్తుంది. 1906లో మహంతు యోగదాసు దగ్గర పనిచేసే శిష్యుల దగ్గర నుంచి 2007లో అమిత్‌రెడ్డి ఇంటి అమ్మకాన్ని చూసే శేషారెడ్డి వరకు చాలామంది మధ్యవర్తులుగా/ బ్రోకర్లుగా కనిపిస్తారు. ఆనాడు మహంతు యోగదాసు

దగ్గర ఉన్న వారు మహంతుకు శిష్యులు/సేవకులుగా ఉన్నారు. మహంతు ఏమి చెప్పినా అది దైవవాక్యంగా భావించి వారి దగ్గర పని చేశారు. మహంతు దగ్గర ఉన్న శిష్యులు వారి మెప్పు కోసం ఒకరి మీద మరొకరు పోటీపడి వారికి సేవ చేశారు. చివరకు మహంతు తప్పు చేసినా కూడా అతనికి వత్తాసు పలికారు. రాజమన్నారెడ్డి దగ్గర పని చేసిన రోసిరెడ్డి కూడా రోసి దగ్గర పని మనిషిలాగానే ఉన్నాడు. రోసిరెడ్డి రాజమన్నార్ రెడ్డి మాటకు అను గుణంగా నడుచు కున్నాడు. కానీ అమిత్ రెడ్డి సమయానికి మధ్యవర్తి/బ్రోకర్ పాత్ర పూర్తిగా మారిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం వెలుగులోకి వచ్చిన తరువాత బ్రోకర్లు చెప్పినట్లు యజ మానులు వినాల్సిన పరిస్థితి నెలకొనింది.

ఒక విధంగా చెప్పాలంటే ఈ భూముల ధరలు అమాంతంగా పెరగడంలో బ్రోకర్ల పాత్ర కూడా ఉంది. లేని ధరలను నిర్ణయించి అమ్మకందారులను, కొనుగోలు దారులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒకే స్థలాన్ని/ఇళ్లను పలువురుకి అమ్మడం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అనుమతులు లేని స్థలాలను ఇతరులకు అమ్మడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. భూమి అమ్మకం లేదా కొనుగోలు గురించి పెద్దగా అవ గాహనలేని వారు బ్రోకర్ల చేతిలో మోసపోతున్నారు. సంవత్సరాల తరబడి కూడబెట్టుకున్న ధనాన్ని బ్రోకర్ల చేతిలో పెట్టి కొన్నవారు నిలువునా మోసపోతున్నారు. "నేను కుప్పం బాదూరు గ్రామీణ బాంకీ మేనజరు నండీ! ఈ బ్రోకరు నన్ను బురదలోకి దించేసినాడు. ఆ వైపు మీ కాలనీ కవతల లాండ్ చీప్‌గా వస్తుందని జెప్పి కొనిపించి నాడు. అయితే యీ కాండంతా లిటిగేషన్లో వుండాదని ఆ పైన తెలిసింది. బిన్నగా యిల్లు గడితే ఆ పైన యెవరూ యేమీ చేసుకోలేరని ఆ లాయరు ఫ్రెండొకడు చెప్పినాడు. ఆ మాట నమ్ముకొని గబగబా యింటి పనెత్తుకున్నాను. ఆ పక్కన లెంటింల్ దాంకా కట్టిన యిల్లుండాది జూడండి. అది నాదే! కడతావుండే యిల్లని గూడా జూడకుండా వాళ్ళు బుల్డోజరుతో సదరం జేసిపారేసినారు. యెంత అప్పు? యెంత ఇన్టరెస్టు? యెంత పని? యెంత నష్టం..." అతడి గొంతు విషాదంతో మూగబోయింది." (పైదే. 136) "చుట్టూ కూలిపడుతున్న గోడల పక్కన, రాలిపడుతున్న పైకప్పుల మధ్య, నొక్కులు పడ్డ సత్తు గిన్నెల లాంటి మనుషులు ప్రాణాలంతా వుగ్గ బట్టుకుని గొంతులు చినెగేలా అరుస్తు న్నారు. క్రమంగా వీధుల్లోకి విరిగిన మంచాలూ, పాత గిన్నెలూ, మసిబారిన కుండలూ, మాసిన బట్టల మూటలూ వచ్చి, చచ్చిన జంతువుల కలేబరాల్లా పడిపోసాగాయి. వర్షానికీ, యెండ లకూ మాత్రమే యిల్లని భావిస్తూ జీవితాలనంతా పూరి గుడిసల్లో గడిపేసిన ముసలివాళ్ళూ, స్త్రీలూ, పిల్లలూ, పడిపోతున్న యిండ్ల ముందు నిల్చుని కడుపులు బాదు కుంటూ శోకాలు తీస్తున్నారు. లాఠీలు పట్టుకున్న పోలీసులు కొందరు అక్కడక్కడ నలగని దుస్తులు తొడుక్కున్న అధికారుల పక్క నిలబడి నవ్వుకుంటూ కబుర్లు చెబుతున్నారు." (నరేంద్ర, మధురాంతకం. భూచక్రం. 133-134) ఇలా మోసపోయినవారి సంఖ్య చాలా ఉన్నట్లు భూచక్రం నవలలో కనిపిస్తుంది. చిన్నచిన్న పనులు చేసుకుంటూ బతికే సామాన్య ప్రజల సంఖ్య మోసపోయినవారి జాబితాలో కనిపిస్తుంది. మోసపోయిన వారు మోసం చేసినవారిపై దాడి చేయడానికి ప్రయత్నిస్తు న్నారు. బాధితుల చేతిలో దెబ్బలు తిన్న బ్రోకర్లు 'ఇది ఈ వృత్తిలో చాలా సహజం' అని దులిపేసుకొని మళ్ళీ తమ మోసపూరిత మైన విధానాలను కొనసాగిస్తున్నారు. కోపంతో రెండు దెబ్బలు కొట్టిన బాధితులు మాత్రం తాము చెల్లించిన ధనాన్ని తిరిగి సంపాదించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. కొందరు బాధితులు ఆర్థిక సమస్యల ఉచ్చులో చిక్కుకుని ఆ సమస్యల నుంచి బయటకు రాలేక తనువులు చాలించిన సంఘటనలు వార్తా పత్రికల్లో కనిపిస్తూనే ఉన్నాయి.

ప్రస్తుత యుగంలో ఈజీమనీ విధానం ఎక్కువగా కనిపిస్తుంది. మనిషి కష్టపడకుండా అతి తక్కువకాలంలో ఎక్కువ డబ్బు సంపాదించడం అనేది ఈజీమనీలో

కనిపించే ప్రధాన అంశం. గతంలో జూదం, అధిక వడ్డీ వ్యాపారం, దోపిడి వంటి విధానాల ద్వారా డబ్బు సులభంగా సంపాదించేవారు. జూదం, అధిక వడ్డీ, దోపిడిలను ప్రజలు చాలా చిన్న చూపు చూసే వారు. కానీ ప్రస్తుతం దోపిడి రూపం మార్చుకుంది. దోపిడీనీ దర్జాగా, చట్టబద్ధంగా కొనసాగే విధానాలు సమాజంలో ఉన్నాయి. ప్రస్తుతం దోపిడి ఈజీమనీ రూపంలోకి మారి పోయింది. ప్రతి అంశంలో కూడా ఈజీమనీ కనిపిస్తుంది. బహుళజాతి సంస్థల వస్తువులు అమ్మకంలో కనిపించేది ఈజీమనీ విధానమే. అతి తక్కువ కాలంలో బహుళజాతి సంస్థలు వేలకోట్లు సంపాదిస్తున్నాయి. చివరికి భక్తి వంటి విషయాలలో కూడా ఈజీమనీ కనిపిస్తుంచి. ఇక పచ్చని భూముల గురించి అయితే చెప్పాల్సిన పనిలేదు. పచ్చని పొలాల్లోకి రియల్ ఎస్టేట్ ప్రవేశించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కనిపించేది ఈజీమనీ విధానమే. అతి తక్కువ ధర కలిగిన భూములకు కృత్రిమ ధరలను నిర్ణయించి, రియల్ ఎస్టేట్ రూపంలో చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఆస్తి అమ్మకం లేదా కొనుగోలుదారులకు చెప్పే ధరకు, ప్రభుత్వానికి చూపు తున్న ధరకు ఎంతో వ్యత్యాసం ఉంటుంది. నవలలో ఎక్కువగా ఈజీమనీకి సంబంధించిన విషయాలు కనిపిస్తాయి. "అప్పుడు సమత్సరమంతా పండితే యెకరాకు నూరో యిన్నూరో వరుమానం. యెంతగా గిచ్చి గిచ్చి అమ్ముకున్నా అప్పుడు అంకణం రేటు మూడు వడ్లమూట రేటు కంటే జాస్తీగా వచ్చేటిదిగాదు." (పైదే. 15) అని శేషారెడ్డి అమిత్‌కు చెబుతాడు. ప్రస్తుతం వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారి, సామాన్య మానవుడు కొనడానికి వీలు లేని విధంగా ధరలు పెంచారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సులభంగా డబ్బును సంపాదించడంలో చాలామంది సఫలీ కృతులయ్యారు. పేద రైతులు వ్యవసాయం మీద కంటే రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉత్తమమనే భావన ఏర్పడింది. రైతు సంవత్సరమంతా కష్టపడినా కుటుంబ అవసరాలకు సరిపడే ఆదాయం రావటం లేదు. ఉన్న భూములను ఒక్క సారిగా అమ్మడం ద్వారా వచ్చే ఆదాయంతో వ్యాపారం చేసుకుని సంతోషంగా జీవించవచ్చనే అభిప్రాయం రైతుల్లో నెలకొనింది. చాలామంది రైతులు 'రైతు' అని పిలిపించుకోవడం కంటే 'వ్యాపారవేత్త' అని పిలిపించు కోవడానికీ ఇష్ట పడుతున్నారు.

నవలలో కొన్ని సామాజిక వర్గాల ఆధిపత్యం ఎక్కువగా కనిపిస్తుంది. రియల్ ఎస్టేట్ ఫలితంగా భూస్వాములందరూ రియల్‌ఎస్టేట్ యజమానులుగా అవతారం ఎత్తారు. రైతుల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి వెళ్ళడంతో ఒక్క సారిగా అధిక మొత్తంలో ధనం రైతుల చేతికి వచ్చి ఆ ధనాన్ని వారి రాజకీయ అభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్నారు. రాజకీయ నాయకుల అండతో కొందరు ధనవంతులు సామాన్య ప్రజలపై ఆధిపత్యం వహిస్తున్నారు. నవలలోని మూలాంక మస్తాన్‌రెడ్డి, నవాబు, బలరామయ్య వంటి వారు వారికున్న ధన బలంతో రాజకీయంగా పలుకుబడి సంపాదించి సామాన్య జనంపై ఆధిపత్యం వహిస్తున్నారు. ముఖ్యంగా పేదలు వివిధ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు వస్తున్నారు. వీరు నివసించడానికి తక్కువ ధరలో ఇంటి స్థలాల కోసం ప్రయత్నిస్తున్నారు. వీరి బలహీనతను ఆసరా చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ అనుమతులేని స్థలాలను వారికి అమ్ముతున్నారు. వలస ప్రజలు, సామాన్యులు తిరుగుబాటు చేసినప్పుడు వారికున్న పలుకుబడితో ప్రజల తిరుగుబాటును అణచివేస్తున్నారు. పోలీసులు కూడా సహజంగానే ధనవంతుల వైపు మొగ్గు చూపి వారికి సహకరిస్తున్నారు. "ఈ యిండ్లలో వుండే వాళ్ళంతా వచ్చి యిండ్లు సోధీనం జేసేది లేదని యెగరేసి మాట్లాడతావుండారు. వాళ్ళ దుడ్డు వడ్డీతో సహా యిస్తేగానీ తావులోంచీ కదలమని మంకుకు గుచ్చునేసినారు. దుడ్డీకపోతే యీాన్నించీ పోనిచ్చేదిలేదని అన్నను బెదర గొట్టదానికి జూసినారు. యీలోపల పోలీసులు వచ్చి

దిగేసినారు' అన్నాడు నాగన్న." (నరేంద్ర, మధురాంతకం. భూచక్రం. 132)

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్త్రీల వ్యక్తిగత జీవితంలో చెప్పుకోదగిన ప్రగతి కనిపించడం లేదు. ముఖ్యంగా స్త్రీల సామాజిక పరిస్థితుల్లో ఎటువంటి మార్పు ఉన్నట్లు నవలలో కనిపించదు. భర్త చాటు భార్యగా మిగిలి పోయారు. ఆస్తి స్త్రీల పేరు మీద ఉన్నప్పటికీ సమాజం లోనూ, కుటుంబంలోనూ వారికి ఎటువంటి ప్రాధాన్యత లేనివారుగా మిగిలిపోయారు. ప్రాచీన కాలంలో స్త్రీలు ఏ విధంగా అణిచివేతకు గురి అయ్యారో అదే విధంగా వర్తమాన సమాజంలో కూడా పురు షుల ఆధిపత్య ధోరణి కింద జీవిస్తున్నట్లు నవలలో కని పిస్తుంది. ఆస్తి సంపా దనలో స్త్రీ కష్టపడినప్పటికీ చివరికీ ఆస్తి మొత్తం పురుషుడి ఆధీనంలో ఉంది. చివరికి భర్త మరణాం తరం కూడా ఆస్తిపై భార్యకు ఎటువంటి హక్కులేని వ్యక్తిగా రాజ మన్నార్ రెడ్డి భార్య కనిపిస్తుంది. తండ్రి ఇచ్చిన ఆస్తి మొత్తం కూతురుపేరుపై ఉన్నప్పటికీ వాస్తవంగా ఆస్తిని అనుభవిస్తు న్నది అల్లుడే.

ఈ నవలలో యిలవరసి అనే స్త్రీ చాలా కష్టాలను చవి చూసింది. తన వాళ్లు వదిలేయడంతో సొంతవూరును వదిలేసి వడివేలు రెడ్డితో తిరుపతికి వచ్చింది. అక్కడ మహంతు యోగ దాసు ఆమెను లోబరుచుకున్నట్లు అతని సంభాషణల ద్వారా తెలుస్తుంది. అతని ద్వారా కలిగే బిడ్డకు తండ్రిని చూపించడం కోసం యిలవరసిని వడివేలురెడ్డి వివాహం చేసుకున్నట్లు మహంతు యోగ దాసు శిష్యుల సంభాషణల ద్వారా తెలు స్తుంది. మహంతు యోగదాసు రాజమన్నార్ రెడ్డిని తన కొడుకుగా భావించి వ్యవసాయ భూములను అతని పేరుమీద రాసివ్వడంతో అప్పటి వరకు వ్యవసాయం చేసుకుంటున్న మొదటి ఇద్దరు కొడుకులు భూమి లేనివారుగా మిగిలి పోగా, రాజమన్నార్ రెడ్డి భూస్వామి అవతారం ఎత్తాడు. ముగ్గురు పిల్లలను కష్టపడి పెంచి పెద్ద చేసిన యిలవరసి చివరికి కొడుకైన రాజమన్నార్‌రెడ్డిని ఎదిరించలేక మౌనం వహిస్తుంది. రాజ మన్నార్‌రెడ్డికి పుత్ర సంతానం లేక పోవడంతో ఇద్దరు కుమార్తెలు ఆస్తికి వారసులు అయ్యారు. ఆస్తి కూతుర్ల పేరు మీద ఉన్నప్పటికీ వచ్చిన ఇద్దరు అల్లుళ్లు కూతుర్లపైన ఆధిపత్యం వహించడం నవలలో కనిపిస్తుంది. రాజమన్నార్‌రెడ్డి చని పోయిన తరువాత ఆయన భార్య కూడా ఆస్తిపై తనకు ఏమి హక్కు లేనట్లు మౌనంగా ఉండిపోయినట్లు నవల ద్వారా తెలుస్తుంది. రాజమన్నార్ రెడ్డి అల్లుడు విలాసాలకు అలవాటు పడ్డాడు. ఆస్తికి యజమానిగా ఉన్న కూతురు మౌనంగా ఉండిపోయింది. "చదివిందేమో యింజినీరు దాంకా... బుద్దేమో పాడుబుద్ధి..." అని "ఆ సదువెప్పుడో మరిచిపోయి నాడు. యిప్పుడంతా అంకణాలూ, గుర్రాలూ, క్లబ్బులూ, సినిమాలూ..." (నరేంద్ర, మధు రాంతకం. భూచక్రం. 109) అని అమిత్‌రెడ్డి గురించి అతని చేతిలో మోసపోయిన వ్యక్తి చెబుతాడు. రాజ మన్నార్‌రెడ్డి కుమార్తెలు ఇద్దరూ ఉన్నత చదువులు చదివినవారు. కుమార్తెలు పురుషాధిపత్యంలో నలిగి పోయినవారుగా కనిపిస్తారు.

భూస్వాముల ఇళ్లలోని స్త్రీల కంటే రైతు కూలీల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఇలవరసి ఒక రైతుకూలిగా తన జీవితాన్ని ప్రారంభించింది. భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉండటం వలన కష్టపడి భర్తతో కలిసి భూమిని సాగుచేసింది. కానీ నేడు వ్యవసాయం చేయ డానికి భూమి కనిపించని పరిస్థితి ఏర్పడింది. రైతు కూలీలకు పనిలేకుండా పోయింది. చివరికి రైతుకూలీలు తినడానికి తిండి లభించని పరిస్థితుల్లోకి నెట్టి వేయ బడ్డారు.

రియల్ ఎస్టేట్ "ఈనాడు ఒక రాక్షసక్రీడ! మోసాలూ, గొడవలూ, కుట్రలూ, కుతంత్రాలూ, దోపిడీలూ, అన్యా యాలూ, హత్యలూ ఈ క్రీడలో భాగం! భూమికి లేని

విలువను సృష్టించి, అమాయకులను ముగ్గులోకి దించి, కృత్రిమ అవసరాన్ని సృష్టించి దోచుకోవడం ఈ రాక్షసక్రీడ పరమార్థం!" అని సింగమనేని నారాయణ భూచక్రం నవల ముందుమాటలో పేర్కొన్నారు. ఈ రియల్ఎస్టేట్ రాక్షస క్రీడ వలన రాయలసీమ ప్రాంతంలో ఆర్థికంగా, సామాజికంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మార్పులను గ్రంథస్థం చేసిన ఆధారపత్రంగా మధురాంతకం నరేంద్ర రచించిన భూచక్రం నవల కనిపిస్తుంది.

## ఉపయోగపడిన పుస్తకం :

1. నరేంద్ర, మధురాంతకం. 2013. భూచక్రం. అలకానంద ప్రచురణలు. విజయవాడ.

# డా॥ కేశవరెడ్డి నవలల్లో గ్రామీణ సంస్కృతి చిత్రణ

- డా॥. జి. పార్వతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆకాశవీధుల వెంట పరిగెడుతున్న తెలుగు సాహిత్యాన్ని నేలమీదికి దించింది నవల ప్రక్రియ అంటారు వల్లపాంటి వెంకటసుబ్బయ్య. ఆ ప్రక్రియతో సృజించబడ్డ రచనలతోనే సామాన్య ప్రజల సాంఘిక చరిత్ర సాహిత్యం పుటల్లోకి స్థానం పొందడం ప్రారంభమైంది. ఆ తర్వాత వచ్చిన ఆధునిక ప్రక్రియలు దానిని మరింత పరిపుష్ఠం చేశాయి. ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో ఎక్కువగా పేదరికంపై, దోపిడీపై చాలా రచనలు వచ్చాయి. అలాంటి రచనలు చేసిన కవులు, రచయితలు చిరస్మరణీయులుగా మిగిలారు. ఇంకా ముఖ్యంగా శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే రచయితలు రెండురకాలు. మహానుభావులు, మామూలు వాళ్ళు. మహానుభావులు గొప్పవారి కోసం గొప్ప విషయాలను గురించి రాస్తారు. మామూలువాళ్ళు మామూలు విషయాలను మామూలు మాటల్లో చెప్తారు. దానినిబట్టి చూస్తే డా॥. పెను మూరు కేశవరెడ్డి మామూలు రచయితల కోవలోకి వస్తారు. మామూలు ప్రజల జీవితాలను స్పష్టంగా, సామాజిక అవగాహనతో చిత్రంచగల నేర్పరి. ఆ ప్రజల జీవితాన్ని, వాటిచుట్టు ఆవరించి ఉన్న సమాజాన్ని సాహిత్యలోకానికి ఎరుకపరచాలనే సంకల్పంతో తనరచనల్లో ఇమిడ్చినవారు. ఆయన రచనల్లో గ్రామీణ సంస్కృతిని చిత్రించడం ఈ వ్యాసోద్దేశ్యం.

చిత్తూరు జిల్లా తలుపులపల్లె గ్రామానికి చెందిన డా॥ పి. కేశవరెడ్డి వృత్తిరీత్యా డాక్టరు. ప్రవృత్తిరీత్యా రచయిత. బానిసలు, భగవానువాచ - అన్న పెద్దకథలతో ఒక సంచలనంగా తెలుగు సాహిత్య లోకానికి పరిచయమయ్యారు. "ఇన్‌క్రెడిబుల్ గాడెస్" అనే నవలతో ఆధునిక తెలుగు నవలకు కొత్త మార్గనిర్దేశనం చేశారు. దానికి కొనసాగింపుగా "స్మశానం దున్నేరు" రాశారు. తర్వాత "అతడు అడవిని జయించాడు" అనే నవలికతో కల్పనా సాహిత్య సృజన చేశారు. "రాముడుండాడు రాజ్జిముండాది"లో సమకాలీన గ్రామీణ జీవన స్థితిగతుల్ని సమగ్రంగా, దానిలో రాబోయే విపర్యాయాలను విస్పష్టంగా చిత్రించారు. 'సిటి బ్యూటిఫుల్'లో అమానవీయ నగర జీవితపు వికృతస్వరూపాన్ని, 'చివరి గుడిసె'లో సమాజం పట్టించుకోని అట్టడుగు వర్గాల జీవన యాతనలను గ్రంథస్థం చేశారు. రైతుకు, భూమికి మధ్య వుండే అవిచ్ఛన్నమైన అనుబంధాన్ని 'మూగవాని పిల్లనగ్రోవి"తో పలికించారు. స్త్రీలపై సామాజిక దౌష్ట్యాలను "మునెమ్మ" అనే నవలతో మరోసారి సాహిత్య లోకంలో సంచలనాన్ని సృష్టించారు.

ప్రతి రచయిత ఏదో ఒక దృక్పథంతో రచన చేస్తూ ఉండాలి లేదా అవగాహన లేనివాడైనా అయి ఉండాలి అంటారు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు. ఆ దృష్టితో ఆలోచించినప్పుడు డా॥ కేశవరెడ్డి దృక్పథమంతా బహుజనులు, నిమ్నవర్గాలు, అట్టడుగు జీవనం సాగిస్తున్న దళితుల ఈతి బాధలే తప్ప మరొకటి కాదు అనేది స్పష్టమవుతుంది. ఆయన పేదవాళ్ళ పక్షం అని అర్థం. రాయలసీమ గ్రామీణ జీవితం, అందులోను చిత్తూరు జిల్లా గ్రామీణ జీవనం అక్కడి జీవిత సంఘర్షణల వ్యక్తీకరణలో 'సరిరారు ఆయనకెవ్వరు' అని అనిపించుకున్న రచయిత కేశవరెడ్డి. ఆయన రచనల్లో గ్రామీణ సంస్కృతిని విశ్లేషించడానికి నాలుగు శీర్షికలతో వివరించవచ్చు.

1. బహుజనుల బహు కష్టాలు
2. కులవృత్తుల విధ్వంసం
3. కాల్పనిక కష్టాలు
4. మహిళా చైతన్యం

**1) బహుజనల బహుకష్టాలు :**

డా॥ కేశవరెడ్డి సాహిత్యంలో బహుజనుల ఈతి బాధలు లేని రచనలు లేనేలేవు. ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు అనే రెండు నవలలు ఒకే కాలంలో 1979లోనే పుస్తకరూపంలో వచ్చాయి. ఇవి అధ్యయనం చేస్తుంటే ఇతివృత్తం ఒకటే రెండు భాగాలుగా వచ్చిందని స్పష్టమవుతుంది. అయితే మొదటిది బహుజనులకు నిరాశను మిగిలిస్తే రెండవది ఆశావాదాన్ని కలిగిస్తుంది. ఈ రెండు ఇతివృత్తాలను ఒకటిగానే అధ్యయనం చేయడం సముచితం.

ఈ రెండు నవలల్లోను కథ ఒకేచోట జరుగుతుంది. ఆ ఊరిపేరు అగ్రహారం. ఆ అగ్రహారానికి పెద్ద భూస్వామి పెద్దరెడ్డి అతనికి 450 ఎకరాలు. అతని మీద, అతని పొలం మీద ఆధారపడిన హరిజనుల్లో సంఘర్షణ కథావస్తువు ఆ 'అగ్రహారానికి ఆనుకొని ఉన్న మాలపల్లెలో 30 మాల కుటుంబాలుంటాయి. వాటిలో రంపాల తెగకు చెందిన ఏకైక మాలవాడ రామచంద్రపురం. ప్రతి కులంలోను తెగలు ఉన్నట్లు, మాలల్లో కూడా కొన్ని తెగలు ఉన్నాయి. పాకనాటి, రంపాల, రెడ్డి భూములు, మాల దాసరి, అరవమాల వంటి అనేక ఉపకులాలు ఉన్నాయి. వీళ్ళు ఒకే కులానికి చెందినప్పటికి తెగల విభజన వల్ల పరస్పరం విడిపోయి ఉండటం గ్రామాల్లో చూడవచ్చు. వీరి కుల సంస్కృతుల్లో కూడా అనేక వ్యత్యాసాలుంటాయి. అగ్రహారం గ్రామంలో కూడా 30 మాల కుటుంబాల్లో రామచంద్రుడిది రంపాల తెగకు చెందిన ఏకైక మాలకుటుంబం. గ్రామ భూస్వామి పెద్దరెడ్డి తరపున దొంగసాక్ష్యం చెప్పడానికి నిరాకరించినందుకు పెద్దరెడ్డి అగ్రహారానికి మిగతా వాళ్ళవాళ్ళ కోపానికి గురవుతాడు. ఫలితంగా ఊరి నుండి వెలివేయబడి తన కులస్థుల చేతనే ఊరి నుండి వెలివేయబడుతాడు. ఈ 'వెలి' అనే సాంఘిక దురాచారం ఒకనాడు గ్రామాల్లో బలీయమైన శిక్షగా ఉండేది. ఆ తర్వాత రామచంద్రుడు ఆ గ్రామం వదలి పెద్దరెడ్డి లాంటి దుర్మార్గులు లేని గ్రామానికి వెళదామని మరోగ్రామం వెళ్ళినా లాభం లేకపోగా కొడుకును కోల్పోతాడు. అక్కడి మునసబు పొలంలో ఎరువులు తినేశాయని రామచంద్రుని ఇరవైపందుల్ని హరిజన పాలేరు కొట్టి చంపేస్తాడు. ఆ గ్రామం కూడా వదలి మూడో గ్రామానికి నిరాశ్రయుడై చేరుకున్న రామచంద్రుని కుటుంబానికి ఒక అగ్రవర్ణరైతు ఆశ్రయమిస్తాడు. మాలవారికి ఆశ్రయమిచ్చాడనే నెపంతో ఆ రైతు ఇంటిని పైకులస్తులు నిప్పు పెట్టి చంపుతారు.

పై కథకు కొనసాగింపుగా రాసిన స్మశానం దున్నేరు కథ కూడా అదే అగ్రహారంలో జరిగింది. ఆ గ్రామ హరిజన వాడవాళ్ళు పెద్దరెడ్డి 450 ఎకరాల పొలం మీద బతుకుతుంటారు. ఒకసారి పెద్దరెడ్డి మాలవాళ్ళకు చెందిన స్మశానంలో 5 ఎకరాలు వ్యవసాయంలోకి తెద్దామని నిర్ణయించినప్పుడు మాల వాళ్ళు బాధపడాల్సింది పోయి మరింత పొలంపని దొరకుతుంది కదా అన ఆనందించడం విస్మయాన్ని కలిగిస్తుంది. 'పోరంబోకు భూమి పెద్దరెడ్డిది ఎలా అవుతుంది' అని ప్రశ్నించిన వాణ్ణి హరిజనులే తిడుతారు. ఆ స్మశానాన్ని సాగుచేస్తుంటే హరిజనులకు బంగారు కాసుల కుండ దొరికినపుడు దాన్ని పంచుకోవడంలో రంపాల కులానికి చెందిన వీరభద్రుడికి మిగితా మాలవాళ్ళకు తగువు కలుగుతుంది. కోపంతో వీరభద్రుడు పెద్దరెడ్డికి విషయం చెబుతాడు. మిగిలని హరిజనులంతా వీరభద్రుణ్ణి 'వెలి' వేస్తారు. సాంఘిక బహిష్కరణకు గురైన వీరభద్రుడి ఇంటిని హరిజనులు ధ్వంసం చేయడమే గాకుండా భార్యను, కూతురును బలాత్కారం చేస్తారు. వీరభద్రుణ్ణి కొట్టి చంపడానికి ప్రయత్నం చేస్తారు. పోలీసుల విచారణలో పెద్దరెడ్డి హరిజనుల మీదే నెపం నెడుతాడు. ఫలితంగా హరిజనులకు ఏడేళ్ళు జైలుశిక్ష పడుతుంది.

ఈ రెండు నవలల్లో బహుజనుల బహుకష్టాలు గ్రామీణ వాతావరణంలో కనబడుతుంది. హరిజనుల

మధ్య అనైక్యత వాళ్ళ ఉనికికే ప్రమాదమని ఎరుకపరుస్తుంది. గ్రామీణ సంస్కృతిలో హరిజనుల్లో ఉపకులాల మధ్యగల ఈర్ష్య, సంస్కృతి సంప్రదాయాల్లో భేదాలు, ఏదో ఒక పెత్తందారి భూస్వామి దగ్గర పనిచేయడం వంటివి కనిపిస్తాయి. భూమిమీద యాజమాన్యం అధికారం రైతులకే కానీ హరిజనులకు లేవని, హరిజనులు భూస్వాముల మీద ఆధారపడే దౌష్ట్యాన్ని తెలియజేస్తుంది. చిత్తూరు మాండలికంలో రాసిన ఈ కథ పండుగ నెల వస్తే వ్యవసాయపనులు ప్రారంభం కావడం ముఖ్యంగా వరిపంటల కోతకాలం, ఆ కాలంలోనే చేతినిండా పని దొరికుతుంది. బోధపడుతుంది. కూలికి ఎవర్ని పిలవాలి, కూలి ఎంత నిర్ణయించాలి భూస్వామేనని అవగతమవుతుంది. "మాలోడ్ని మాలోడే గతి పట్టించినాడు ఏవిటికి? సావు కార్లును మెప్పించడానికి. నాకు దెల్సు యిట్టాటి కతలు యినీయినీ రోసి పోయినా ననుకో. రాజ్జం మీద యాడజూసిన ఇట్టా ఏడుపులే" అంటూ చిత్తూరు జిల్లా ప్రజాజీవితంలో ఉండే వైరుధ్యాలను సూచిస్తాడు రచయిత. ఈ రకం గ్రామీణ సాంఘిక నిర్మాణంలో ప్రభుత్వ యంత్రాంగం, ఉద్యోగుల ప్రవర్తన ఎలా ఉంటాయో కూడా ఈ రెండు నవలల్లో స్పష్టమవుతోంది.

## 2. కులవృత్తుల విధ్వంసం :

భారతీయ సంస్కృతి, భారతీయ ఆత్మ సజీవమై నేటికీ వెలుగొందుతుంది అంటే అందుకు కారణం గ్రామాలు, అక్కడి ప్రజల ప్రస్థానంలో ముడివేసుకున్న కులవృత్తులు, విశ్వాసాలు, వీరగాథలు, పురాణ కథలు, గ్రామీణ సంస్కృతికి ఆలంబనలు. కులవృత్తుల ఆధారంగానే సమాజం మనుగడు సాగిస్తుంది. ఒక కులవృత్తి మీది మరో కులం ఆధారపడి మనుగడ సాగిస్తుంది. అలాంటి కులవృత్తుల విధ్వంసాన్ని గురించి 'రాముండాడు - రాజ్జిముండాది..." నవలలో కేశవరెడ్డి పూసగుచ్చి వివరించారు. కులవృత్తుల విధ్వంసం ద్వారా కులాల పతనంతో పాటు మానవ సమాజం పతనమవుతున్న తీరును వివరించారు.

'రాముండుండాడు రాజ్జిముండాది' నవలలోని ఇతివృత్తం ఒక గ్రామానికి సంబంధించిన చిన్నపాటి నవలిక అయినప్పటికి జీవిత సారాల్ని వివరించిన కథ. వ్యసాయ పనులు రైతులుకు భారం కావడమే అందరూ పట్టణాల వెంట ఉద్యోగాల కోసం పరుగు పెడుతుండటం, ప్రపంచీకరణ ప్రభావం కనిపిస్తుంది. వ్యవసాయ పనులు కోసం రైతులు హరిజనవాడలో కొచ్చి మాలవాళ్ళను బ్రతిమాలడడం కనిపిస్తుంది. వేల ఎకరాలున్న పెదనాయుడు లాంటి రైతులు గ్రామాల్లో ఉండకుండ సేద్యం కోసం ముత్యాలనాయుడు లాంటి గుమస్తాల మీద ఆధారపడడం ప్రపంచీకరణ ప్రభావం ప్రజలు కోరుకునే విలాసవంతమైన జీవితం మనకు అర్థమవుతుంది. పల్లెల్లో ఒక వృత్తి మీద మరో వృత్తి ఆధారపడడం కొన్ని వృత్తుల వాళ్ళు తమ కుల వృత్తులకు దూరం కావడం తద్వారా వ్యవసాయ పనులు కుంటుపడడం మనకు కనిపిస్తుంది. తిరుపాల నాయుడు లాంటి రైతులు చేసిన బ్యాంకు అప్పు వసూలు చేసే సందర్భంలో భూమి వేలం వేయడం గవర్నమెంటు రూల్స్ పేదరైతులను ఎలా ఇబ్బంది పెడతాయో ఈ నవలలో రచయిత స్పష్టం చేశాడు.

## 3. కాల్పనిక కష్టాలు :

రోజు రోజుకీ మారుతున్న సమాజంలో వచ్చే కష్టాలు మార్మికంగా చిత్రించగల నేర్పు ఓర్పు గల రచయిత డా॥ కేశవరెడ్డి. అలా చిత్రించిన నవల 'అతడు అడవిని జయించాడు." ఆదునిక సమాజంలో వస్తున్న మార్పులతో క్షీణిస్తున్న మానవ సంబంధాలను ఎక్కువవుతున్న జీవన సంఘర్షణలను మంచితో ఎదుర్కోవాలని సూచించే నవల ఇది.

'అతడు అడవిని జయించాడు' నవలలోని కథా వస్తువు అరుదైనది. పందులు మేపుకునే ముసలివాడి గురించిన ఇతివృత్తం ఇది. అతని రెండు సుక్కపందులు, ఒకటి రెండు రోజుల క్రితమే ఈనింది. రెండోది నేడో రేపో ఈనబోతున్నది. ఆ స్థితిలో ఉండే పందుల గుణం

వల్ల ఈనడానికి అనువైన ఏకాంతస్థలం వెతుక్కుంటూ అది అడవిలో మైళ్ళకొద్దీ సాగి అదృశ్యమైపోయింది. సంధ్యవేళ దాన్ని వెదుక్కుంటూ ముసలివాడు అడవిలోకి వెళతాడు.

సుక్కపంది ఈనిన ప్రదేశాన్ని గుర్తించిన ముసలివాడు అక్కడికి చేరుకుంటాడు. ముసలివాడిని చూసిన సుక్కపంది తన యజమాని అని గుర్తించక దెయ్యంలా ప్రవర్తించి అతనిపై దాడి చేస్తుంది. అతడు తప్పించుకుని సుంక్రేసు చెట్టు ఎక్కుతాడు. సుక్కపంది ఈనిన చంద మామల్లాంటి పదిపిల్లలను వాసనతో పసిగట్టిన నక్కలు దాడి చేస్తాయి. తొలిగా వచ్చిన ఒంటరి నక్కపై సుక్క పంది, రెండోసారి వచ్చిన మరో నక్కను ముసలివాడు హతమారుస్తాడు. ఈసారి ఏభైనక్కలు దాడిచేస్తుంటే సుక్కపందిని చంపితే తప్ప పందిపల్లలను కాపాడలేనని ముసలివాడు సుక్కపందిని చంపేస్తాడు. నక్కల గుంపును తరిమేస్తాడు. తెల్లారేసరికి మిగిలిన పందిపిల్లలను రెండో సుక్కపంది దగ్గరికి చేరిస్తే తప్ప పసిప్రాణాలు నిలవవని గ్రహించి తీంద్ర తీగలతో గంప అల్లి పిల్లల్ని ఎత్తుకొని సాగిపోతుంటే దారిలో రాబందులు బారినపడి మాంసపు ముద్దలుగా మిగులుతాయి. 'యుద్ధం ముగిసింది. పూర్తిగా ఓడిపోయాను' అని హతాశుడవుతాడు ముసలి వాడు. కానీ అతని సంకల్పశుద్ధినీ, కార్యదీక్షనూ, చిత్తశు ద్ధినీ ధీరోదాత్తతనూ రాత్రంతా గమనించిన మనం అతడు అభిమన్యుడిలా అడవిని జయించాడనే అనుకుంటాం.

ముసలివాడు మంచికి ప్రతినిధి. నక్కలు దుష్టశక్తులు. 'మంచితనం చుట్టూ ఉన్న దుష్టశక్తులతో నిరంతరం సాగించే పోరాటమే జీవితం' అన్న సూత్రాన్ని ఈ నవలలో శక్తివంతంగా ఆవిష్కరించారు రచయిత.

ఈ నవలలో రచయిత చెప్పిన మరో రెండు ఉప కథల్లో గ్రామీణ సంస్కృతి కన్పిస్తుంది. ముసలివాడు వయసులో ఉన్నప్పుడు వడగళ్ళవానకు వెర్రెత్తి ఓ కోడె వయసు ఎనబోతు కట్టుపగ్గాలు తెంచుకొని దయ్యం పూనినట్టుగా పారిపోగా ముసలివాడు ఎంతో నేర్పుతో పట్టుకున్న వైనాన్ని వివరించినది మొదటి కథ కాగా ముసలివాడు ఇది వరకు సుగాలోల్ల అడవిలో పశువుల కాపరిగా ఉన్నప్పుడు తనతోటి పశువుల కాపరి పశువులు పగ్గాలు తెంచుకొని పారిపోయి లోయల్లో పడి మరణిం చడం చూసి తానూ పైగుడ్డతో ఉరివేసుకున్న రెండవ కథ. ఈ రెండూ కూడా గ్రామీణ జీవితానికి సంబంధించి నవి. కథా శిల్పానికి ఆయువుపట్టులు.

## 4. మహిళా చైతన్యం :

శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేత ఉత్తమ నవల బహుమతి పొందిన కేవశరెడ్డి రచన 'మునెమ్మ'. ఈ నవలికలో ఒక స్త్రీ పాత్రను కేంద్రంగా చేసుకొని భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న మహిళల జీవితాల్ని చిత్రించారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యంతో సాగే ఈ నవలికలో స్త్రీని అర్థం చేసుకోవడంలో వైఫల్యానికి గురవుతున్న పురుషుల అంత రంగాల్ని ఆవిష్కరించారు.

మునెమ్మ జయరామిరెడ్డి భార్యభర్తలు. వాళ్ళిద్దరూ ఆరేళ్ళు కలిసి కాపురం చేశారు. వాళ్ళు ఒకరోజు పొలంలో పనిచేస్తున్నప్పుడు బొల్లి గిత్త తనరెండూ కాళ్ళూ పైకెత్తి మునెమ్మ మీది కొస్తుంది. అది గమనించిన భర్త, ఆ బొల్లిగిత్తను అమ్మేయాలని నిర్ణయించుకుంటాడు. ఆ బొల్లి గిత్తను కసితీరా కొట్టి దాన్ని అమ్మేయాలను కుంటాడు. దాన్ని అమ్మడానికి పశువుల సంతకు వెళ్ళిన భర్త ఇంటికిరాడు. కానీ ఆ బొల్లిగిత్త మాత్రం వచ్చేస్తుంది. ఆ రాత్రి మునెమ్మకు తన భర్త చనిపోయినట్లు కల వస్తుంది. తనకు మరది వరసైన సినబ్బను తోడు తీసుకొని తెల్లవారి తన భర్తను వెతకడానికి వెళ్తుంది. తన భర్తను మధ్యవర్తులు హత్య చేశారని తెలుసుకొని వాళ్ళపై ప్రతీకారం తీర్చుకుంటుంది. ఇది స్థూలంగా ఇతివృత్తం.

ఒక గ్రామీణ స్త్రీలో చైతన్యం ఎంత ఉంటుందో రచయిత కేశవరెడ్డి ఇలా చిత్రించారు. మునెమ్మ తన

భర్త చనిపోయాడు కదా అని తాను చనిపోవాలనుకోలేదు. అవసరం అన్నీ నేర్పుతుందంటూ - అది మనిషికే కాదు, గొడ్డుకీ వర్తిస్తుందని నవలిక ముగుస్తుంది.

పొలం పనులు చేస్తున్న మునెమ్మపైకి బొల్లిగిత్త 'ఫలం' అయినట్లు రంకె వేస్తూ రావడం జయరామరెడ్డికి బొల్లి గిత్తకు తనకు భార్యకు లైంగిక సంబంధం ఉన్నట్లు భావిం చడం పురుషుల మూర్ఖ మనస్తత్వానికి ప్రతిరూపం. అదిగాక జయరామిరెడ్డి బొల్లిగిత్తను ఎందుకు కొడు తున్నాడో ఆ పశువుకు తెలియకపోయినా తన యజ మానిని చంపిన వాళ్ళను చివరకు అదే చంపడం పశు వుల విశ్వాసానికి నిదర్శనం.

**ముగింపు :**

ఈ విధంగా సాగే డా॥ పెనుమూరు కేశవరెడ్డి నవలా సాహిత్యంలో గ్రామీణ సంస్కృతి కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. రాయలసీమ సాంఘిక జీవితంలోని ముఖ్యంగా చిత్తూరు ప్రాంత వాతావరణం కన్పిస్తుంది. చిత్తూరు జిల్లా మాండ లికంపై తమిళ ప్రభావం ఎలా ఉందో ఈయన నవలల్లో కనిపిస్తుంది. చిత్తూరు జిల్లాలో దాదాపు అరవైశాతం ప్రాంతం వాళ్ళు తమిళ పదాలను తమభాషలో మిళితం చేసి మాట్లాడే తీరును చక్కగా వివరించారు. సంక్రాంతి జరిగే నెలను పండుగనెల అని చిత్తూరు జిల్లాలో వ్యవహరిస్తారు. పండుగనెల వస్తే పంటలు చేతికొస్తాయి. మలిపంట కూడా అదే నెలలో వేస్తారు. ఈ తీరును గ్రామీణులు హర్షం వ్యక్తం చేసేతీరును. చక్కగా వివరిం చారు. వేసవికాలంలో జరిగే 'ధర్మరాజు తిరుణాల' 18 రోజులు పాటు జరిగే తీరును ఆ వీధినాటకాల పాటలు గ్రామీణ పాడుకునే తీరును కూడా వివరించారు.

**ఆధార గ్రంథాలు :**

1. రాముడుండాడు... రాజ్జిముండాది - డా॥ కేశవరెడ్డి
2. ఇన్ క్రెడిబుల్ గాడిస్ - డా॥ కేశవరెడ్డి
3. స్మశానం దున్నేరు - డా॥ కేశవరెడ్డి
4. మునెమ్మ - డా॥ కేశవరెడ్డి
5. అతడు అడవిని జయించాడు - డా॥ కేశవరెడ్డి
6. విభాత సంధ్యలు - సి.వి. సుబ్బారావు
7. విశిష్ట సాహితీ వైజయంతి - సన్మానోత్సవ సంచిక

★★★

# రాయలసీమ - బంజారా సంస్కృతి

- **ఆవుల అనిత,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

భారతదేశంలో గల ఆదివాసీలు గ్రామీణ సంస్కృతికి, నగర సంస్కృతికి, భిన్నంగా ఒక విశిష్ట సంస్కృతిని కలిగి ఉన్నారు. వారు తమ విశిష్ట సంస్కృతి చిహ్నాలైన నమ్మకాలు, సంప్రదాయాలు, సాహిత్యం సంగీతం నృత్యం, ఆటలు వేషభూషణాలు మొదలైన అంశాలతో భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 35 ఆదివాసీ తెగల్లో లంబాడీ తెగ ముఖ్యమైంది. రంగురంగుల దుస్తులు, దంతపు అభరణాలు ధరించే ఈ తెగ స్త్రీలను గమనిస్తే వారి సంస్కృతి మన కళ్ళముందు గోచిరస్తుంది. ఉత్తర భారతదేశంలో రాజస్థాన్ మూల ప్రదేశంగా ఈతెగ వివిధ కారణాల వల్ల వేర్వేరు ప్రాంతాలకు తరలి పోయినప్పటికి తమదైన విశిష్ట సంస్కృతి మరియు పరంపరను కొనసాగిస్తున్నారు. ఊరికి దూరంగా 'తండాలను' నిర్మించుకొని నివసించే వీరు బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి ఒడిలో సహజ సిద్దమైన జవనం సాగిస్తున్నారు.

లంబాడీలు తమను తాము 'గోర్‌మాటి', గోవట్, గోర, గోరబంజారా'లుగా పిలుచుకుంటారు. 'గోర్' అనగా అందమైన తెల్లని వర్చసు కలారు అని అర్థం. భారత దేశంలో విస్తృతంగా విస్తరించిన ఈ తెగను వేరు వేరు ప్రాంతాలలో 500 గసియా, గవార, గవారియా, గావరియా, గావాలా, ఘాణద, బంజారా, బంజారి, బ్రంజారి, బ్రజవాసి, బింజార, బనజారా, బళదియా, లంబాడా, సుగాలి, మొదలైన పేర్లతో పిలువబడుతున్నా వీరందరూ ఒకే జాతికి చెందిన వారని వారి భాష సంస్కృతులను అధ్యయనం చేసిన పండితుల అభిప్రాయం.

భారత ఉపఖండంలో లంబాడీ తెగ ప్రాచీన జాతిగా నిర్ధారించడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. చరిత్రకారుడు ఎస్.ఆర్. కనిట్కర్1934లో రచించిన 'దిహిస్టరీ ఆఫ్ ఇండియా'' అనే గ్రంథంలో లామాణి వ్యాపార మార్గాలు క్రి.పూ. 600 క్రీ.శ. 350 మధ్య కాలంలోనే ఉన్నాయని వివరించారు. అందువల్ల బంజారాలు గౌతమ బుద్ధుని కాలానికి పూర్వమే ఉన్నారని తెలుస్తుంది.

లంబాడీలు, వివిధ ప్రాంతలలో విభిన్నమైన పేర్లతో పిలువబడుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో లంబాడీలు, ఉత్తరాది రాష్ట్రాలలో బంజారాలు, ఆంధ్ర రాష్ట్రంలోని ''రాయలసీమ ప్రాంతంలో సుగాలీలుగా'' మరియు తెలంగాణా ప్రాంతంలో లంబాడీలుగా వీరు పిలువబడుతున్నారు.

'బంజరా' అనే పదం 'బన్', 'చరణ్' అనే రెండు పదాల కలయిక. బన్ అనగా వనం 'చరణ్' అనగా 'సంచారం' పూర్వ కాలం బంజారాలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలు సంచరిస్తూ ధాన్యం మరియు పశుగణంతో వ్యాపారం చేసేవారు. బంజారా తెగలో అతి ముఖ్యమైన ఉపతెగగా లంబాడీలను గుర్తించారు. సంస్కృత భాషలో 'లబాణీ' అనగా ఉప్పు. ఉప్పు వ్యాపారం చేయడం వల్ల వీరు లబానీలుగా పిలువబడుతున్నారు. 'లబాణీ' అనే పదానికి మూలపదం 'లంబన్'ను పేర్కొన్నారు. 'లంబన్' అంటే సుదీర్ఘమైనది పొడవైనది అని అర్థం. దూర ప్రాంతాలకు ఎడ్లబండ్లపై సుదీర్ఘమైన ప్రయాణాలు చేయడం ద్వారా వ్యాపార లావాదేవీలు నిర్వహించడం వల్ల వీరిని 'లంబాణీ'లు అని కూడా అంటారు.

క్రీ.పూ. 6వ శతాబ్దానికి పూర్వమే వీరు రాజస్థాన్ నుండి వివిధ ప్రాంతాలకు వలసపోయారు. క్రీ.శ. 12వ శతాబ్దంలో బౌద్ధ మతం క్షీణదశకు చేరుకున్న సమయంలో వ్యాపార వాణిజ్యాలు క్షీణించాయి. ఈ సందర్భంగా పడమటి దిశగా బంజారా వలసలు తగ్గిపోయాయి. అందువల్ల ఈ తెగ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నిత్యావసర వస్తువుల వ్యాపారాన్ని వాయువ్య భారత దేశానికి పరిమితం చేసుకుంది. రస్సెల్ మరియు మీరాలాల్ ప్రకారం లంబాడీలను గూర్చి మొట్టమొదటి సారి క్రీ.పూ. 4వ శతాబ్దంలో అసియాన్ వివరించారు. ఈ తెగ సంచార జీవనం గడుపుతూ మార్గమధ్యలో గుడారాలు వేసుకొని, పశువులను పోషించేనని తెలుస్తోంది.

'బంజారా' పదం పంతోమ్మిదవ శతాబ్దంలో ప్రాచుర్యం లోకి వచ్చింది. మధ్యయుగ కాలంనాటి రచనలన్నీ ఆంగ్లంఓకి అనువదించినపుడు బంజారాలను'బిడారి వ్యాపారస్థులుగా'' పేర్కొన్నారు. వీరి సాంఘీక చరిత్రను జీవన విధానం గూర్చి పదిహేడవ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి యాత్రీకుడు టోవెర్నియర్ రాశారు. అయితే 'బంజారా' అనే పదానకి మారుగా 'మనారీ' పదాన్ని వాడుతూ, వారి వస్తు వ్యాపారం ఆధారంగా, నాలుగు సమూహాలుగా వర్గీకరించాడు. ఈ వర్గీకరణ ప్రకారం మొదటి సముహం విత్తన వ్యాపారం, రెండవ సమూమం బియ్యం వ్యాపారం,మూడవ సమూహం వారు దినుసులు, నాల్గవ సమూహం వారు ఉప్పు వ్యాపారం చేసినట్లు ప్రతి సమూహం వెయ్యి ఎడ్ల బృందాలను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. విలియం క్రూక్, ట్రావెల్స్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో 'బంజారా'లకు నమానార్థంగా 'మనారీ'లను వివరిస్తూ నాలుగు సమూహాలు ఒకే జాతికి చెందినవని, వారి మధ్య సాంస్కృతిక అడ్డుగోడలను చెరిపి వేశారు. 'బంజారా' లందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకు రావడానికి పందొమ్మిదవ శతాబ్దంలోనే బీజం పడింది.

ఆంధ్రప్రదేశ్‌లో వీరిని 'లంబాడీలు' లేక 'లామాణీలు' అని పిలుస్తారు. 'లంబాడా' పదం సంస్కృత 'లవన' నుండి ఉత్పన్నమైంది. ఈ ప్రాంతంలో వీరు ఉప్పు రవాణా చేస్తూ వ్యాపారం కూడా చేసేవారు. అదే విధంగా మద్రాసు ప్రెసిడెన్సీలో వీరిని లంబాడీ, సుగాలీ అని పిలిచేవారు. 'సుగాలీ' అనగా హిందీ భాషలో 'సుపారి' అని అర్థం. ఈ ప్రాంతంలో వీరు వక్క వ్యాపారం చేయడం వల్ల 'సుగాలీ' అన్న పేరు వచ్చింది. మద్య భారతదేశంలోని ముక్రి బంజారీలు మొక్కజొన్న వ్యాపారం చేయడం వల్ల వారిని ముక్రి బంజారాలు అంటారు.

ఆంధ్రదేశంలో కోస్తా తీర ప్రాంతంలో ఉప్పు తయారీ ఒక ముఖ్యమైన పరిశ్రమగా ఉంది. మద్యయుగంలోనూ, ఆధునిక యుగంలోను, ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే ఉప్పు ఒరిస్సా, బీహారు, బెంగాల్, మహరాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. క్రీ.శ.7-18 శాతాబ్దాల మద్య కాలంలో రవణా చేయడంలో లంబాడీలుకీలక పాత్ర పోషించారు. బజారా శబ్దము యొక్క ఉత్పత్తి మరియు దాని వ్యవస్థ 'వాణిజ్యం' అను మూల శబ్దము సంస్కృత శబ్దము నుండి బంజారా లేక వనజారా అనుశబ్దము యొక్క ఉత్పత్తి అయినది. వాణిజ్య శబ్దము యొక్క అర్థం వ్యాపారం. ప్రాచీన కాలంలో బంజారా ప్రజలు, ఎద్దులు మరియు ఇతర జంతువుల వీపులపై ధాన్యములను తీసుకొని ఒక ఊరినుండి మరియొక ఊరికి అందిస్తూ అక్కడి నుండి వేరు పదార్థములను తీసుకొని వస్తూ వుండిరి.

వ్వాపార వృత్తి బంజారా ముఖ్య కార్యక్రమముగా వుండెను. అయినప్పటికి వారు సంపూర్ణ మనస్సుతో కేవలం మాట మరియు నమ్మకముపైననే జరుగు చుండెను. ఎద్దులపై గాని, ఒంటెలపై గాని వస్తువులను, ఆహార పదార్థములను రవాణా చేస్తు వుండిరి. రకరకాల వస్తువులు ధాన్యములు తీసుకొని పోవునప్పుడు (బస్తాలు) వాటిని భద్రపరచుటకు చర్మములతో తయారు చేసిన వాటిని కప్పుచుండిరి. వ్యాపార సమయములో వ్రాత కోతలు లేకుండగానే అక్క చూచిన సాక్షాధారములపైననే బంజారా ప్రజలు ఒక లెక్కగా తీసుకొని విశ్వాసపాత్రులుగా వుండి పని చేసేవారు.

భారతదేశంలో వేల సంవత్సరాల క్రిందటి బంజారాల లమన్ (వ్యాపారము) మార్గములు, కఠినమై, చారిత్రాత్మక మైన సత్యం. శ్రీ మానేశ్వర దీక్షత్, (డైరెక్టర్ ఆఫ్

ఆర్కియాలజి, డిపార్టుమెంట్ వారి మ్యూజియమ్‌లో లబించినది). 'లయన్ అనుశబ్దం ఎలా వచ్చినది అని పరిశోధన చేశాను. సంస్కృతంలో 'లయన్' యొక్క అర్థం ఉప్పు దీనిని బట్టి చూచిన ప్రాచీన కాలంలో ఎవరైతే ఎద్దులపై ఉప్పు వేసుకొని దూర ప్రాంతాలకు తీసుకొని పోయెవారు వారినే లయన్ అని పిలుస్తారు.

బంజారాలు లేక లమునీలు వీరి ముఖ్య వృత్తి రవాణా చేయడం వీరు ముఖ్యంగా ఆహార ధాన్యములు, ఉప్పు మరియు ఇతర సామాగ్రిని, ఒక చోటు నుండి మరియొక చోటికి లేక ఒక రాజ్యము నుండి మరి యొక రాజ్యము నకు తమ ఎద్దులపై ఒంటెలపై, గుఱ్ఱములపై మరియు ఇతరములైన జంతువులపై వీపులపై గోనె సంచులలో నింపి వాటి గమ్యమును చేర్చుచుండేవారు.

అటవీ సంపద దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అడవులు వాతావరణాన్ని, వర్షపాతాన్ని నియంత్రిస్తాయి. అడవుల్లో లభించే కలప, ఇతర ఉత్ప త్తులు వివిధ పరిశ్రమలకు ముడిసరుకుగా ఉపయోగ పడుతాయి. జీవ, జంతు జాలాలకు ఆవాసమైన అడవు లను పర్యావరన సమతూకాన్ని కాపాడాలి. చీపుళ్ళు, విస్తర్లు, ఆకులు, చింతపండు, బంక, తునికాకు, తేనె, కరక్కాయలు, కుంకుడు కాయలు వంటి అనేక ఉత్ప త్తులను అవి సరైన పక్వానికి వచ్చిన తర్వాత దేవతలను ప్రార్థించి, పూజించి సేకరిస్తారు. వాటిని అమ్మగా వచ్చిన ఆదాయంతో జీవనం గడుపుతారు. బంజారాలు లేదా లంబాడీలను పశుపోషకులుగా చెప్పుకోవచ్చు. పూర్వం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతా నికి తిరుగుతూ పశు పోషణ సాగించే బంజారాలు ఇప్పుడే స్థిర నివసాలు ఏర్పరచుకొని వ్యవసాయం, పశుపోషణ లపై ఆధారపడి ఉన్నారు. వీరు తమ పశువులనే కాకుండ ఇతర బంజారాల పశువులను కూడా పెంచుతూ ఉం టారు. పశుపోషణ, పాల ఉత్పత్తులు అమ్మడం సాంప్ర దాయక వృత్తి స్థిర వ్యవసాయాన్ని సాగిస్తున్నప్పటికీ వారి సంస్కృతిలో పశు సంపదకు ప్రాముఖ్యత ఉంది. ఇప్పటికీ వివాహ సమయాల్లో వరునికి ఆవులను కట్నంగా ఇవ్వడం అనే సంప్రదాయం బంజారాలో ఉంది. అనేక పండుగలు, పూజలు పశువుల, ఆరోగ్యం కోసం చేస్తుంటారు. నేటికీ బంజారాల్లో పశువులు లేని కుటుంబం లేదని చెప్పవచ్చు. వ్యవసాయంలో ప్రధాన పంటలు జొన్న, పత్తి, మొక్కజొన్న మొదలగు పంటలు లంబాడీలు పండిస్తారు. ఈ జాతి సంస్కృతి ఆచారం అన్నిటికంటే భిన్నమైన సంప్ర దాయంలో ప్రత్యేక విశిష్ఠతను కలిగి ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునిక సమాజంలో గిరిజన భాష - సంస్కృతులు - డా॥ భూక్య తిరుపతి
2. లంబాడి - డా॥ కె. శ్యామల
3. నిజాం పాలనలో లంబాడీలు - భంగ్యా భూక్యా
4. భారతీయ గిరిజనులు - నదీం హస్నైన్
5. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి బి. చీనియానాయక్

★★★

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

# రాయలసీమ సాహిత్యంలో గ్రామీణ సంస్కృతి

- **యం. అనురాధ లక్ష్మి,** లెక్చరర్, శ్రీకామిశెట్టి సుబ్బారావు చెన్నమ్మ డిగ్రీ కాలేజి, ప్రొద్దుటూరు.

దేశానికి వెన్నెముక్క వంటివి గ్రామాలు. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిళ్ళు గ్రామాలు. గ్రామాలు మనషుల మధ్య అనుబంధాలకు మారు పేర్లుగా ఉండేవి. ఒకప్పటి రాయలసీమ పల్లెలు ముని వాటికల లాగా ఉండేవని బెళ్ళూరి శ్రీనివాసమూర్తి తన 'రాయలసీమ గంజి కేంద్రము'లో వర్ణించాడు. అలాంటి పల్లెలు ఈ రోజు ఏ స్థితిలో ఉన్నాయి. ఈ పల్లెలోని రైతులు కరువు కాటకాలతో అల్లాడిపోతూ గంజి తాగి బతకాల్సిన పరిస్థితులు వచ్చాయని హృదయ విదారకంగా కళ్ళకు కట్టినట్లు వివరించాడు.

విద్యాన్ విశ్వంగారు రాసిన 'పెన్నేటిపాట' రాయలసీమ గ్రామీణ జీవన స్థితిగతులను సహజంగా కవితాపరంగా వర్ణించిన తొలి కావ్యము. ఈ కావ్యంలో విశ్వంగారు రాయలసీమ యొక్క గత వైభవాన్ని వర్ణిస్తూ జానపద గేయాలతో, తెలుగు పెద్దల పలుకులతో, జరీబుటాల జిలుగులతో పేరొందినది, ముత్యాలకు, కావ్యాలకు, భాష్యాలకు పరాక్రమానికి నిలయమని పేర్కొన్నాడు. ఒకనాడు ఎంతో గొప్పగా ఉప్పొంగి ప్రవహించే పెన్నానది నేడు ఎడారిగా మారిపోయినదని, ఒకప్పుడు గునపంతో ఒక్కసారి తవ్వగానే ఉబికి వచ్చే నీరు ఇప్పుడు రైతులు పారలతో చెమటలు కాలువ కట్టేట్టు తవ్వినా ఒక్క నీటి చుక్క కూడా దొరక లేదని, ఒక్కసారి పుక్కిలిస్తే చాలు జన్మధన్యమవుతుందని కాని అంతటి మహిమ గల పెన్న ఎందుకిలా ఎండిపోయింది? వేసిన ప్రశ్న ప్రశ్న గానే ఉండిపోయింది. పది మందికి అన్నం పెట్టిన రైతు ఇళ్ళు తేళ్ళు, పాములకు నివాసాలయ్యాయని వివరించారు.

కేతు విశ్వనాథరెడ్డి గారి 'నమ్ముకున్న నేల' అన్న కథలో గ్రామీణ జీవితం గురించి  చాలా చక్కగా వివరించారు. ఒకప్పుడు గ్రామాల్లో సంఘ జీవితం ఎంతో బాగుండేదని తెలుపుతూ గవినిలో ఉన్న వేప చెట్టు చుట్టూ ఉన్న అరుగుపై పగ్గాలు, మోకులు నేసే వాళ్ళని,  సరుకుల బండ్లు అక్కడే దించే వాళ్ళని పిల్లలు కథలు చెప్పించుకోవడం, ఆడుకోవడం అన్ని అక్కడే జరిగేవని వివరించారు.

అలాగే ఒకప్పుడు దేవాలయాలు గ్రామ వ్యవహారాలన్నింటికి నిలయాలుగా వుండేవని తెలిపారు. దేవళంలోనే వేమన్నలు, సాధువులు, సన్యాసులు, తత్వాలు పాడేవాళ్ళు, దొమ్మరాట, తోలు బొమ్మ లాడించేవాళ్ళు దిగేవాళ్ళు పౌరాణిక నాటకాలు అక్కడే నేర్చుకునేవాళ్ళు, ఊళ్ళోకి ఎవరైనా వస్తే పలకరింపులు అక్కడేనని కవి చెప్పడంలో సగం సంఘ జీవితం దేవళం దగ్గరేనని తెలుస్తోంది. అలాగే వర్షాలు పడని కాలంలో మూఢ నమ్మకాల ద్వారా కనిపించే సంఘ జీవితాన్ని కూడా వివరించాడు. అవి కప్పలకు పెండ్లిండ్లు చేయడం, విరాట పర్వం చదవడం భజనలు, పానకాల పంపకం, మొలకల పున్నమి, గిలకల కొట్లాటలు దేవలంలోనే జరిగేవి. ఆ దేవళం ముందరే యాటపోతులు తెగేవి. పత్రికలు చదవడం, రాజకీయాలు చర్చిచడం, పంటల గురించి చర్చలు, పశువుల పంచాయితిలు దొంగలకు శిక్షలు ఊరు మంచి, చెడు అక్కడే జరిగేవని చెప్పడంలోనే పల్లె సంస్కృతి ఏ విధంగా ఉండేదో తెలుస్తోంది.

ఈ కథానికలో గ్రామాల్లోని దేవాలయాలు సాంస్కృతిక కేంద్రాలుగా సంఘ జీవితానికి ప్రతీకలుగా ఉండేవని తెలుస్తోంది. పల్లె ప్రజలందరూ కలిసి మెలసి పనులు చేసుకొనేవారని, కష్ట సుఖాలను పంచుకొనేవారని అర్థమవుతుంది. అయితే కరువుల వల్ల గ్రామాల్లోని సంఘ

జీవితం కూడా మారిపోయిందని, ఊరంతా వలస పోయి నట్లున్నదని రచయిత వాపోయాడు. దేవళం కూడా పాడుబడి అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారినట్లు రచయిత కథలో తెలిపాడు.

వి.ఆర్.రాసాని రాసిన 'బతుకాట' అనే నవల వీధి నాటక కళాకారుల జీవితాలను వర్ణించే నవల అయినప్ప టికి రాయలసీమ సంస్కృతిని ఆచార వ్యవహారాలను నమ్మకాలను ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా యామిగాని పల్లెలో ఉగాది పండుగను జరుపుకోవడం గ్రామీణ సంస్కృతికి అద్దం పడుతుంది. ఉగాది రోజున ఊర్లో తప్పని సరిగా నాటకాన్ని ప్రదర్శించడం, గురువల తోపుకు వెళ్ళి పూర్వీకులు, గురువులు అయిన చనిపోయిన పెద్దలకు బట్టలు పెట్టడం, కాయా కర్పూరం సమర్పిం చటం ఒక ఆచారంగా కనిపిస్తుంది. అలాగే ఉగాది పండుగ రోజు వేయబోయో నాటకాన్ని కొన్ని రోజుల ముందు నుండే రిహార్సిల్స్ చేయడం మూడు రోజుల ముందు గజ్జెపూజ జరిపించడం ఆనవాయితిగా వస్తుంది. ఈ ఆచారాన్ని విడిచిపెట్టకుండా కాటోజీ మొదుల సిద్దోజీ వరకు ఐదారుతరాల వాళ్ళు పాటించినట్లు ఈ నవలలో మనకు కనిపిస్తుంది.

సమాజంలో కులమత బేధాలు కూడా ఉండేవి. కులాంతర వివాహం చేసుకున్న వారిని వెలివేయడం ఈ నవలలో కనిపిస్తుంది. గురువు వెంకోజీ కూతురు రేణుకమ్మ బంగారప్పను వివాహం చేసుకున్నప్పుడు వాళ్ళను పెద్దలు వెలివేసినా వారి మంచితనం కాలక్రమంలో పల్లెకు దగ్గర చేస్తుంది. "కులాలు, మతాలు పోగొట్టుకోకూడ దన్న పట్టుదలే కాని అందరూ మంచివాళ్ళే, మట్టి మనుషులే" నంటాడు రచయిత.

సమాజంలో నాటకాలు ఆడడమే కాకుండా వ్యవ సాయం చేయడం, కులవృత్తుల్ని చేయడం, గొర్రెలు మేపడం వంటి పనులు కూడా చేసుకొనేవారని తెలు స్తుంది.

నాటకాలను ప్రదర్శించేటప్పుడు కళాకారులందరు నియమ నిష్ఠలతో ఉండేవారు. గురువుకు మంచి గౌవరం ఉండేది. ఎవ్వరైనా నియమాలు పాటించకపోతే వారిని దూరంగా ఉంచడం కనిపిస్తుంది. గుర్రప్ప సారాయి తాగినపుడు వెంకోజీ అతన్ని నాటకం వేయనీయకుండా దూరంగా ఉంచుతాడు. సంఘంలో కరువు వల్ల తినడానికి తిండి లేకపోయినా భక్తి పెరిగి పోయింది. భజన యాత్ర జరగుతుంటే డబ్బు, ధాన్యం విరివిగా వచ్చేవారు. అలాగే భారతోత్సవాలు జరిపించడానికి ఎంత ఖర్చైనా వెనుకాడే వారు కాదు. పల్లెలో జాతరలు నిర్వహించడం కూడా ఒక సంస్కృతే.

సమాజంలో మూఢాచారాలు ప్రబలంగా వుండేవి. నిప్పులలో నడవడం, బలి బండి భోజనం తీసుకోవడం మొదలైనవి. అలాగే రాయలసీమలో వర్షం కోసం రైతులు చేసే కొన్ని పనులను కూడా ఈ నవలలో రచయిత వివ రించాడు. అవి చెరువులో పందిరేసి విరాట పర్వం హరికథ చెప్పించడం, గోదురు కప్పను రోకలి బండకు కట్టి ఇంటింటి వద్ద చెంబుడు నీళ్ళు పోయించడం, నడివీధిలో కుక్కలకు పెళ్ళిళ్ళు జరిపించడం, ఇంటింటి దగ్గర ముత్తయిదువ తలపై కడవతో నీళ్ళు పోయించడం, పన్నెండు పదమూడేళ్ళ కన్నెపిల్లల్ని అర్ధరాత్రి వెన్నెల్లో పెద్ద చెరువు మధ్యలో ఆడవాళ్ళు బట్టల్లేకుండా మడక దున్నిం చడం, వలస దేవరలు జరపడం లాంటివి చేసే వారిని రచయిత వర్ణించాడు.

ఆచారాలు ఏవైనా సరే పల్లె ప్రజలు వాటిని ఒక సంస్కృతిగా భావించి పాటించడం మనకు ఈ నవలలో కన్పిస్తుంది.

బండి నారాయణ, స్వామి రాసిన 'సావుకూడు' కథలో మొదటి నుంచి చివరి వరకు అనంతపురం గ్రామీణ జీవన చిత్రణను ఆవిష్కరిస్తుంది. అనంతపురం జిల్లా కరువును ముఖ్యాంశంగా తీసుకొని ఒక ముసలి వాని అంత్యక్రియలను పెద్ద దినం జరిగిన విధానాన్ని ఇందులో

వర్ణిస్తాడు. తినడానికి తిండి లేక కలబంద గడ్డలు తవ్వుకొని తింటూ కూడా పెద్దదినం గొప్పగా జరిపించాలన్న పట్టుదల గ్రామస్తుల్లో కనిపిస్తుంది. అందుకే "ఏది లేకపోయినా సంసారం జరుగుతుంది. కానీ సావు ఏర్పాట్లు జరుగు తాయా?" అంటాడు రచయిత. చివరి కోరికలు కూడా తీరని చావులు ఒకవైపు, చచ్చిన వాళ్ళకి అంత్యక్రియలు చేయలేని దారిద్ర్యం మరోవైపు ఆ గ్రామాల్లో తాండ విస్తాయి. పెద్దప్పయ్య చనిపోతే అంత్యక్రియలు ఖర్చు తప్పించుకోవటానికి అంతని ముగ్గురూ కొడుకులూ తప్పించుకొని తిరుగుతుంటే పెద్దలు మందలించి ఖర్చు సమానంగా పంచుకోవడానికి ఒప్పించాల్సి వచ్చింది. ఇక పెద్ద దినం రోజు 5,6 వందలు పెట్టి మంచి గొర్రెను కొనలేక మూడు వందలు పెట్టి ముసలి గొర్రెను పట్టుకొచ్చి దానిని వండడానికి ఆ ఇంటి వారు పడ్డ ఇబ్బందులను రచయిత వర్ణించాడు. తరువాత అన్నదమ్ముల వరుసైన వాళ్ళు ఏటి గట్టుకు పోయి సాంబ్రాణి పొగవేసి పిండం పెట్ట, ములసామెను విధవరాల్ని చేసి, గడ్డాలు, గుండ్లు గొరిగించుకొని ఇంటికి వచ్చి వరి అన్నం మాంసం కూర తిని ఎన్నాళ్ళయిందో అనుకుంటూ దాన్నొక పండుగ భోజనంలాగా తిన్నారని చెప్పడంలో వారి ఆకలి పేదరికం కనిపిస్తున్నాయి. ఇక బ్రాహ్మణుడు మంత్రాలు చదివి నీళ్ళు చల్లడం, దానాలు చేసినట్లు అక్షింతలు వేయించడం వంటి వన్నీ పూర్తి చేసి నిజం దక్షిణ ఇప్పించుకొని వెళ్ళిపోయాడు. ఇదంతా 'శూద్ర సంస్కృతీ వాతావరణం' అని రచయితే చెప్పాడు.

ఈ విధంగా పల్లెలో పండుగైనా, చావైనా అందరూ కలిసి ఒకటిగా జరుపుకునే సంస్కృతి మనకు కన్పిస్తుంది. రాయలసీమలోని పల్లెల్లో కరువులు ఈ సంస్కృతిని మారుస్తున్నాయి. పల్లెల్లో వాళ్ళంతా పట్టణాలకు వలస వెళ్ళిపోవడం వలన పల్లె సంస్కృతి కనుమరుగైపోతుంది. అంతే కాకుండా సంఘ జీవితంపై కూడా కరువు ప్రభావం ఎక్కువగా వుండటం వలన మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. ఏదేమైన మన సంస్కృతి సంప్రదా యాలను కాపాడు కోవడం మన బాధ్యత.

★★★

భావవీణ ప్రత్యేక సంచిక – జనవరి 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

BHAVAVEENA SPECIAL EDITION
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

# డా॥ వేంపల్లి గంగాధర్ కథలు – రాయలసీమ ప్రాంత ప్రజల జీనజీవన చిత్రణ

- డా॥ బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

- డా॥. బశెట్టి ఉపేంద్ర
అతిథి అధ్యాపకుడు, ట్రిపుల్ ఐ.టి., ఇడుపులపాయ, కడప.

రాయలసీమ ప్రాంత జన జీవనం తక్కిన తెలుగు ప్రాంతాలకంటే భిన్నంగా ఉంటుంది. ఇక్కడి ప్రజల ఆహారపుటలవాట్లు, వస్త్రధారణ, పండుగలు, జాతరలు, వ్యవసాయం చేసే విధానం, మాట తీరు, యాస, భాష అన్నీ వినూత్నంగా ఉంటాయి. ఈ అంశాలన్నీ వస్తువుగా స్వీకరించబడి వివిధ సాహిత్య ప్రక్రియల్లో రూపు దాల్చాయి. రాయలసీమలో వెలువడిన సమగ్ర సాహిత్యాన్ని అంటే ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఆధునిక కాలంలో రాయలసీమ జన జీవన తీరును, రీతిని డా॥ వేంపల్లి గంగాధర్ తన కథల్లో అద్భుతంగా చిత్రించాడు.

ఒకప్పుడు రాయలసీమ పల్లెల్లో ఇంటిపైకప్పుగా బోదను ఉపయోగించేవారు. కాలినడకన సుదూరం ప్రయాణించి అడవిలోని బోదనుకొసుకుని వచ్చేవారు. ఆ బోదతో ఇంటి పైకప్పు కప్పితే దాదాపు మూడు దశాబ్దాలైనా చెక్కు చెదరదు. అంత నైపుణ్యంతో కప్పేవారు. అలా కప్పడానికి కొందరు వ్యక్తులుండేవారు. ఆ బోదను తెచ్చుటకు ఎంత శ్రమ పడేవారో 'తూరుపు కొమ్మలు' అనే కథలో వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపారు.

"ఉదయాన్నే కొట్టం బోద గడ్డి కోసం ఎగువ కొండకు వెళ్ళిన లక్ష్మమ్మ నెత్తిమీద పెద్ద బోదమోపు పెట్టుకొని తన గుడిసెను చేరుకుంది. చమటతో ఆమె తడిసి పోయింది. కటుకున్నది పాతచీర కావడంతో దారాలు పల్చబడి అక్కడక్కడ చీరెచినిగిపోయి వుంది. కాళ్ళకు అడ్డు పడకుండా చీరెను పైకెత్తి కట్టుకోవడంతో మెత్తగా సన్నటి గుత్తతో వుండే గడ్డిముళ్ళన్నీ ఆమె రంగువెలసిన ఎర్రరంగు లంగా అడుగున అంటుకొని ఉన్నాయి. తల మీద బోద మోపు కిందవేసి కాసేపు పైట కొంగుతో విసురు కుంది. తర్వాత మెడలోని పసుపు తాడుకే తగిలించుకున్న తాళంచెవితో తలుపుతీసి లోపలికి నడిచింది", అంటూ బోద కోసం ఒక స్త్రీ చేసే శ్రమ పోరాటాన్ని వివరిస్తాడు. అడవి నుంచి బోద మోపు తెచ్చేటప్పుడు ఒక స్త్రీ ఎలాంటి జాగ్రత్తలు తీసికుంటుందో కూడా చక్కగా వివరించాడు.

ఒకప్పుడు రాయలసీమలో రైతులు వ్యవసాయాన్ని ఎద్దులపైన ఆధారపడే చేసేవారు. ఒకప్పుడు అంటే ఇటీవల కాలం వరకు అని అర్థం. వ్యవసాయానికి తమకు ఉపయోగపడే ఎద్దులను రైతులు అల్లారుముద్దుగా చూసుకునేవారు. వాటి కాళ్ళు బలంగా ఉండాలంటే వాటికి బిళ్ళలు కొట్టాలని భావించేవారు. ఈ విషయాన్ని పీరా పాత్రద్వారా వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు. 'నేలదిగని ఊడ' కథలో.

"పెద్ద పనేం లేదు జూడు... కాళ్ళు కలిపి తాడుతో గట్టిగా కట్టాలి. రోంత బిగువుతగ్గినా అది కాళ్ళు విదిలిస్తే నీ మూతి పళ్ళు ఒక్కటుండవు. మట్టసంగా ఒళ్ళుదగ్గర పెట్టుకొని చేయాలి. నాడా గిట్టలకు సరిపోయేలా అమర్చుకోవాలి. కొంత వెనక్కిగాని, కొంత ముందుకు గానీ పెట్టకూడదు. సరిగ్గా మధ్యలోకి సరిపోవాల. లేకుంటే కాళ్ళు ఒకదానికొకటి తట్టుకొని అవి పడిపోతాయి. నాడాలోకి మేకులు సున్నితంగా కొట్టాలి. గట్టిగా తగిలితే అది కట్టుతెంచుకుంటుంది. జాగ్రత్తగా వుండాల... ఏం జెప్పేది అర్థమైతా వుండాదా" అంటూ ఎద్దులకు బిళ్ళలు కొట్టేటపుడు తీసకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా చెబుతాడు. అయితే నేడు రాయలసీమలో ఎద్దుల స్థానంలో యంత్రాలు రంగప్రవేశం చేశాయి. దీని మూలంగా

బిళ్ళలు కొట్టే పని వారికి పనిలేకుండా పోయింది. నేడు జిల్లాకు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారని చెప్పవచ్చు.

ప్రపంచంలోనే అరుదైన వృక్షజాలం ఎర్రచందనం ఇది రాయలసీమలోని శేషాచలం అడవుల్లోనే దొరుకుతున్నది. అందువల్ల దీనికి చాలా డిమాండు ఉంది. స్మగ్లర్లు గ్రామీణ కూలీలకు అధిక కూలీ ఆశచూపి వారిచేత ఆ చెట్లను నరికించి వారిచేతనే మైదాన ప్రాంతానికి తెప్పించుకొని, వాటిని విదేశాలకు తరలించి కోట్లు సంపాదించుకుంటున్నారు. ఆక్రమంలో ఒక కూలీ దట్టమైన అడవిలోకి వెళ్ళి చెట్టును ఎలా నరకుతాడో, అపుడు అతని మానసిక స్థితి ఎలాంటిదో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు వేంపల్లి గంగాధర్ గారు తన 'కొయ్య బొమ్మలు' కథలో.

"శేషాచలం ఎగువ కొండలు... తూరుపు దిశగా ఆకాశం కింద పచ్చటి పందిర్లు వేసినట్లు విస్తరించి వున్నాయి. తొలిజాము ఎండపడి అడవంతా తళతళా మెరుస్తావుండి. నునుపుదేలి ఆకాశాన్ని చుంబించే కొమ్మలతో ఎత్తుగా ఎదిగి పూలతో నిండుగా విప్పారి ధీటుగా నిలబడిన ఎర్ర చందనం చెట్లు పడమటి గాలికి ఆగి ఆగి ఊగుతున్నాయి. సన్నని మద్ధిచెట్లు, ఆకు రాలిపోతున్న తపసి చెట్లూ గుసగుసలాడుకుంటున్నాయి. గడ్డి పొదల మధ్య నుంచి ఏదో జంతువు కదలి వెళ్ళి పోయింది. చెట్లపైన కొండ ముచ్చులు అటు ఇటు ఎగురుతున్నాయి. కొండరాళ్ళ మధ్య పుట్టిన జల ఊట సవ్వడి చేసుకుంటూ అటు ప్రక్కనుంచి జాలువారుతోంది. ప్రశాంతమైన అడవి ప్రపంచంలోకి అడుగు పెట్టాడు నాడలు. గొడ్డలితో తిరుగుతున్నాడు. తనకు మునుస్వామి చెప్పిన కొలతలు గల చెట్టు కోసం వెతుకుతున్నాడు. అలసిపోయిన నల్లటి ముఖమంతా అశాంతిగా ఉంది.

కాసేపటి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒక చెట్టు దగ్గర ఆగాడు... పైకి చుస్తూ అరచేత్తో చెట్టు మొదలును కొట్టి చూశాడు నేర్పుగా... నీళ్లలోకి దిగేముందు ఈతగాడు నీళ్ళను పరీక్షించినట్లు సంతృప్తిపడ్డాడు. వేటు... మొదటి వేటు పడింది... అడవంతా అదిరింది. చెట్లమీద పక్షులు బెదిరి ఎగిరాయి.

కొమ్మల్లో అల్లుకున్న గూళ్ళుకొన్ని కిందపడ్డాయి. పూలు రాలిపోతున్నాయి. కొమ్మలు రివ్వున ఊగుతూ పెనుగులాడుతున్నాయి. వేటు... వేటు తర్వాత వేటు... శక్తి కొద్దీ పడుతూనే వున్నాయి. ముక్కలు ముక్కలుగా చెట్టు విచ్ఛిన్నం...

ఒక సుదీర్ఘ పోరాటం తర్వాత వాడి ఆరాటం తీరింది. అడవంతా ఉలిక్కి పడేలా పెద్ద శబ్దం చేస్తూ వీడ్కోలు పలుకుతూ... తనలోకం నుంచి వేరవుతూ చెట్టు నేల కూలింది"- అంటూ ఒక కూలీ ఎర్రచందనం చెట్టును ఎలా నరికి కూల్చి వేస్తాడో కళ్ళకు కట్టినట్లు పూసగుచ్చినట్లు వివరించాడు.

చనిపోయిన వాళ్ళు దయ్యమై పడతారని రాయల సీమ పల్లెల్లో గట్టి నమ్మకముంది. ఆ దయ్యాన్ని దించడానికి కొందరు వ్యక్తులుంటారు. వారికి కొన్ని విద్యలు వచ్చి ఉంటాయి. ఆ విద్య ద్వారా వాళ్ళు దయ్యాన్ని దించుతారని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. అలాంటి ఒక సంఘటనను వస్తువుగా తీసికొని కథకుడు వేంపల్లి గంగాధర్ 'అంజన సిద్ధుడు' అనే కథ రాశాడు. ఈ కథలో పాపిరెడ్డి పెద్దకోడలు లక్ష్మమ్మకు దయ్యం పట్టి ఉంటుంది. పక్కీరయ్య అనే భూతవైద్యుడు అంజనం విద్య ద్వారా దయ్యాన్ని విడిపిస్తాడు. అప్పుడు ఆదయ్యం ఇలా చెబుతుంది.

"ఏం జేసేదిసామీ! నేను తురకదాన్ని. పూర్లోనే దిగదాల మాలిండ్లకానుకొని ఉండే కొట్టాల్లో ఉండే దాన్ని. మొగుడు కువైట్ దేశం పొయ్యినాడు. అత్త నేనూ ఇద్దరమే వుంటాం. ఇదిగో ఈయమ్మి మొగుడు పాపిరెడ్డి కొడుకు వెంకటరెడ్డి మా యిండ్లకాడికొచ్చేవాడు. వాళ్ళతోటలోకే నేను పనికి పోతావుంటి. ఒ రోజు మధ్యాహ్నమప్పుడు కానుగ చెట్టుకింద పండుకొని వుంటే వచ్చి పట్టుకున్నాడు.

వద్దు రెడ్డీ... వద్దు రెడ్డీ అని పెనుగులాడినాను. అయినా విడ్సిపెట్టలేదు. అనుభవించి ఆ రోజు కూలీ లెక్కకు ఇంగో ఇరవై రూపాయలు ఎక్కువిచ్చి పోయినాడు. అది మొదలు నేను ఎప్పుడు వాళ్ళకు పనికి పోయినా నన్ను వాడుకునేటోడు. పెద్దరెడ్లతో పెట్టుకొని మేం యాడబతి కేది? అందుకే భరిస్తా వుంటి. వాని కామానికి నేను తల్లినైనాను. ఆ సంగతి వాడికి జెప్పితే ఏంకాదని చెప్పి నాల్గునెల్ల క్రితం పొలం కాన్నే మోటారు కరెంటు తీగలు కాళ్ళకు చుట్టి చంపిబావిలోకేసి సంపినాడు. వూరి జనాన్ని 'నేను అత్తతో కొట్లాడి బావిలో దూకిచచ్చినట్లు' నమ్మించి నాడు. అందుకే నేను దెయ్యమై వాడి పెండ్లానికే పట్టుకున్నాను" అని చెప్పినట్లు కథకుడు తెలిపాడు. డా॥ వేంపల్లి గంగాధర్ కథల్లో కడప జిల్లా ప్రజల జన జీవనం కళ్ళకు కట్టినట్లుగా చిత్రించబడింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. దేవర శిల - వేంపల్లి గంగాధర్
2. తెలుగు కథ - వేదగిరి రాంబాబు
3. తెలుగు కథానికి స్వరూప స్వభావాలు - డా॥ పోరంకి దక్షిణామూర్తి
4. తెలుగు సాహిత్య సమీక్ష - రెండో భాగం ఆచార్య జి.నాగయ్య

★★★

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

# కర్నూలు జిల్లా జానపదులు - సాంప్రదాయములు

# వివాహ వేడుకలలో జరుపుకునే సంస్కృతి - సంప్రదాయములు

- డా॥. వి. శ్రీదేవి
ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీకళాశాల, చేబ్రోలు,
గుంటూరు జిల్లా.

- డా॥. యం. వెంకటలక్ష్మమ్మ
తెలుగు ఉపన్యాసకులు,
కె.వి.ఆర్.ప్రభుత్వ కళాశాల, కర్నూలు.

ఒక సంఘంలో ప్రజలు తరతరాలుగా పాటించిన పద్ధతులను ఆచార వ్యవహారములని అనవచ్చు. కాల క్రమంలో కొన్ని ఆచారాలు మర్చిపోయి క్రొత్తఆచారాలు రావచ్చు. ఆ క్రొత్త ఆచారాల తర్వాత తరాలలో ముఖ్య ఆచారాలుగా రూపొందవచ్చు. దీన్ని బట్టి ప్రతి ఆచారానికి పుట్టుక ప్రాబల్యం, చావు ఉంటాయని చెప్పవచ్చు.

ఆచారాల ప్రభావం ఏ సంఘం మీదైనా ఎక్కువగా వుంటుంది. పుట్టిన నాటి నుండి మరణించేవరకు అనుసరించే కార్యకలాపాలలో వివిధ ఆచారాలు పాటింప బడుతుంటాయి. ఆచారాలను సక్రమంగా పాటించి నందువల్ల దీర్ఘాయిష్షు, పుత్రజననం, ధనలాభం లాంటి మంచి జరుగుటయేకాక, చెడులక్షణాలు సమసిపోతా యని వీరి నమ్మకం. ఆచారాలను ఉల్లంఘిస్తే చెడు జరుగుతుందని ధైర్యం చేయలేక వాటిని తప్పక పాటి స్తారు.

కర్నూలు జిల్లా ప్రజల ఆచార వ్యవహారాలు వివాహా రాలు, వివాహ వేడుకలలో ప్రత్యేకంగా వుంటాయి. జాన పదులు జరుపుకును వేడుకలలో వివాహం ముఖ్యమైనది. వేడుకల అన్నింటిలోను అత్యంత ప్రియమైన వేడుక వివాహము. ఈకార్యక్రమములో స్త్రీలు అత్యధికముగా హాజరై తమ బాధలను మరచి బంధువులతోను, నూతన వ్యక్తులతోను కలిసి ఉత్సాహంగా వుంటారు.

మనిషి పుట్టినది మొదలు మరణించే వరకు జరిగే సంస్కారములలో వివాహమొకటి స్త్రీ, పురుషుల ఇద్దరికి, చతుర్వర్ణ సాధన కోసం కలిసి భార్య భర్తలు జీవించడం అవసరము. ఎలాగంటే సకల జీవులకు ప్రాణ వాయువు ఎట్ల అవసరమో, గృహాశ్రమ జీవితం అంతే అవసరము.

కర్నూలు జిల్లా జానపదుల పెండ్లికి సంబంధించిన ఆచారాలు ప్రత్యేకంగా వుంటాయి. అవి ఇల్లరికం, మేన రికం, పెళ్ళి చూపులు, నిశ్చితార్థం, ఓలి, లగ్న నిర్ణయం, కొట్నాలుదంచడం, శకునాలు పెండితంతు, ఎదురు కోళ్ళు, పెండ్లికూతురు పెండ్లి కొడుకు, అరుంధతీ నక్షత్రం, మహాదాశీర్వచనం, చదివింపులు, పెండ్లి భోజనం, వసంతోత్సవం అప్పగింతలు మొదలగునవి ప్రధానంగా వుండును.

### ఇల్లరికం :

ఆడపిల్లలు సాధారణంగా వారి తల్లిదండ్రులు నిర్ణ యించిన వరున్ని వివాహం చేసుకొని అత్తవారింటికి వెళ్ళి కాపురం చేస్తారు.కాని ఈ ఇల్లరికంలో వరుడు అత్తవారి ఇంటికెళ్ళి వధువులో కలిసి కాపురం చేయాలి దీనినే ఇల్లరికం అందురు. కర్నూలు జిల్లా జానపదుల్లో ఇలాంటి ఆచారంలో వుంది.

ఏ ఆడపిల్లలు అయిన తల్లిదండ్రులు చేసిన సంబం ధం చేసుకొని అత్తవారింటికి పంపుతారు. పండుగలకు, పబ్బాలకు, కాన్పులకు, శుభకార్యాలకు మాత్రమే పుట్టింటికి రావడం జరుగుతుంది కాని ఇల్లరికం అంటే వరుడు అత్తవారింటికి వధువుతో కలిసి వెళ్ళతాడు. అతడు అక్కడే వుండవలసి వుంటుంది. దీన్నే ఇల్లరికం అందరు. మాములుగా ఇలా ఇద్దరు కూతుర్లు లేదా ఒకే ఒక్క

కూతురు వున్నవారు ఇలా ఇల్లరికం తెచ్చుకునే ఆచారం కలదు.

## మేకనరికం :

మేనత్తకూతుర్ని వివాహం చేసుకోవడం మేనరికం అవుతుంది సాధారంగా మేనరికం వుండే వేరే సంబంధం చూడరు. జానపదులు మధ్య ఈ ఆచారం ఇప్పటికి వ్యవహారంలో వుంది.

మేనత్త కూతుర్ని, మేనమామ కూతుర్ని వివాహం చేసుకోవడం మేనరికం అవుతుంది. సాధారణంగా మేన రికం అనేది పూర్వం నుండి వస్తున్న సంప్రదాయం. మేనక రింను ఒక హక్కుగా భావించే వారు. ఒక వేళ మేనమామ కూతురిని ఇవ్వకపోతే ఎత్తుకుపోయి చేసుకుంటా మంటారు. ఒకవేళ మేనమామ చేసుకోకపోతే ఆ అమ్మాయికి మేనమామనే కట్నం యిచ్చి పెళ్ళి చెయ్యాలి. ఇలాంటి ఆచారంలు ప్రస్తుతంకూడ చాల కుటుంబాలలో వున్నవి.

## పెళ్ళిచూపులు :

వివాహం తలపెట్టినపుడు మొదట వధూవరులకు నిశ్చయించుకుంటారు. ఇరుపక్షాలవారు తమ తమ సంబంధాలను గూర్చి ముచ్చటించుకుంటారు. వరుని తరుపున పెద్దలు వధువుని చూడడానికి వస్తారు. వధువును చక్కగా అలంకరించి అమ్మాయి తల్లిదండ్రుల వారికి చూపిస్తారు. వధువును చక్కగా అలంకరించి అమ్మాయి తల్లిదండ్రులు వారికి చూపిస్తారు. వధువు కులగోత్రాలు, సౌందర్యా, స్వభావాది సమస్త గుణాలను హస్తాన్ని పరికించి, ఆయుష్షు, విధవతనం సంతానరేఖను చూసిన తర్వాతే మగపెళ్ళివారు ముహూర్తం నిశ్చయించుకుంటారు.

వివాహం చేయాలి అనుకున్నప్పుడు మొదట వధువురులను ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వరుని తరుపున వారు ఎక్కడెక్కడ అమ్మాయి వున్నారో కనుక్కొని అన్ని కుదురుతాయని అనుకునే సంబంధంను చూడడానికి అబ్బాయిని తీసుకొని అమ్మాయి యింటికి వస్తారు. అమ్మాయికి మంచి చీరను కట్టి, అలంకరించి, అమ్మాయి తల్లిదండ్రులు చూపిస్తారు. ఇలా చూసిన తరువాత, అమ్మాయి. టి, కాఫీ తెచ్చి యిచ్చినపుడు ముఖకవలికలు నడిచే విధానం, కాళ్ళు సరిగ్గా, చేతులు సరిగ్గా వున్నాయో లేదో గమనిస్తారు మరికొంత మంది మాట్లాడతారు. ఆడ మాట్లాడిన మాటల వలన అమ్మాయి. గొంతును, మాట తీరును బట్టి వ్యక్తిత్వంను గుర్తిస్తారు. అన్ని సరిగా వున్నట్లైతే కట్నం మాట్లాడుతారు. అన్ని సరిగా వున్నట్లైతే కట్నం మాట్లాడుకుంటారు. ఇద్దరికి ఆమోదయోగ్యం అయితే ముహూర్తం నిశ్చయించుకుంటారు.

## నిశ్చితార్థం :

వధూవరులు నచ్చితే వివాహం నిశ్చయించుకోవడం జరుగుతుంది. ఈ సమయంలో వధువుకు వరుని తరుపు వారు ఒక నగను ప్రధానం చేస్తారు దీనినే ప్రధానం చేయడం, నిశ్చితార్థం చేయడం అందరు. వధువుకు తమ తాహత్తుకు తగిన చీరెలు, నగలుపెట్టి తాంబులాలు పంచుతారు.

## ఓలి :

ఈనాడు తల్లిదండ్రులు మా కొడుకేం యిస్తారు అన్నట్లు మా అమ్మయికి ఏం నగలు పెడతారు. అవి అనడం మాములు వధువును వివాహ మాడడానికి వరుడు అతని తల్లిదండ్రులకిచ్చే సుంకం బలి. నిశ్చి తార్థానికి వరునితరుపున వధువుకిచ్చే నగలు ఓలిగా లెక్కింపబడతాయి.

## ముహూర్తం :

ఇంటి ముందు గుంతలు తీసి గుంజలతో పందిరి వేస్తారు. పందిరి గుంజలకు టెంకాయమట్టలు కట్టి, మామిడి తోరణాలు కడతారు. తరువాత స్త్రీలు పేడలో ఇల్లు అలికి ఎర్రమన్నుతోను, సున్నముతోను గుంజలకు పట్టెలుపెడతారు. అదే ఎర్రమన్ను, సున్నంతో పెళ్ళిపీట వేస్తారు. తరువాత పందిరికి పాలకొమ్మను కడతారు.

పందిరి గుంజకు ఒక చోట, నిండు కండుకు సున్నం ఎర్రమన్ను పూసి, బొట్లు పెట్టి పందిరి గుంజ దగ్గర పెట్టే ఆచారం కలదు. ఇల్లు అతికి ఎర్రమన్ను తోను గుంజలకు పట్టెలు పెడతారు. అదే ఎర్రమన్ను, సున్నంతో పెళ్లిపీట కూడ వేస్తారు. పీటపై పెళ్లిముగ్గువేస్తారు తరువాత పందిరికి గుంజకు ఒక చోట, నిండుకుండకు సున్నం ఎర్రమన్ను పూసి, బొట్లుపెట్టి పందిరి గుంజ దగ్గర పెట్టే ఆధారం కలదు.ఇది ప్రతి గ్రామంలోను కన్నులు పండుగగా వుంటుంది. అదే విధంగా బాజీభజంత్రీలు బాణసంచా ఏర్పాటు చేయుదురు.

## వివాహం :

వివాహం అన్నింటికంటే ప్రధానమైంది. వివాహం అనగా ఏడేడు జన్మలబంధం అని, తరతరాల అనుబంధం అని, అన్ని విషయాలలో ఘనమైనది అని జానపదులు నమ్మకం. వివాహం అయిన తరువాత వారికి కలిగి సంతానం ఎన్నో తరాలను యిస్తుందని వీరి నమ్మకం.

## మెరిమిని బండి :

వధువు తరుపున వారు ముహూర్తం దినమున వధువు ఊరికి రావడం జరుగుతుంది. పెండ్లివారు బయలుదేరి వరుని ఇంటికి దగ్గర్లో గాని, బస్టాంటు దగ్గరగాని, స్కూలు,చర్చి, గుడి దగ్గరకు గాని వచ్చి వుంటారు. అక్కడే వరుడు తరుపున వారు వారికి కావలసిన సౌకర్యములు ఏర్పాటు చేయుదరు. అక్కడే వారు భోజనాలు ఏర్పాటు చేస్తారు. రాత్రి పదిగంటలకు మెరమిని బండి బయలు దేరుతుంది. వధువుకు అక్కడనే స్నానం చేయించి, వరుడు తరుపున వారు పంపించే నూతన వస్త్రాలు పూలు, కుంకుమా స్వీకరించి, వాటితోనే వధువును అలంకరిం చెదరు, వరుడినికూడ అలాగే తయారు చేసి యుందురు. తదపరి మేళతాళాలతో మెరిమిని బండి అనగా ఎద్దుల బండి గాని, ట్రాక్టరును గని, కారునుగాని అందంగా అలంకరించి వాటి మీద వరున్ని కూర్చోబెట్టుకొని వచ్చి, పెళ్ళికూతురిని కూడ ఎక్కించుకొని, మేళతాళాలలతో, నృత్యాలతో, కర్రసాముతో, అనేక రకాల చిందులతో వూరంతా ఊరిగించెదరు అలా వధువు తరుపున వారిని వారింటి దగ్గరకి తీసుకవెళ్ళెదరు మెరిమిని బండి ఊరంతా సందడితో త్రిప్పేసరికి తెల్లావారుతుంది. ఇలా ప్రతి కులం వారు చాలా గొప్పగా వేడుక చేయుదురు.

## నలుగు పెట్టడం :

పెండ్లి కార్యక్రమంలో 'నలుగు' ప్రధానమైన కార్య క్రమం. వధూవరులకు పెండ్లికూతురిని పెండ్లి కొడుకును తయారు చేసిన తరువాత విడివిడన నలుగు ముత్తైదువు లతో వేయించిన తరువాత ఇద్దరికి కలిసి ప్రథమ నలుగును మెరిమిని తిరిగినతరువాత వేస్తారు. జంటలు జంటలతో నలుగు వేయించి, భార్య, భర్తల పేర్లను ఒకరివి మరోకరి చేత చెప్పింది ఒక వేడుకగా చేయుదురు చివరగా పెండ్లి కూతురు చేత పెండ్లి కొడుకుకు, పెండ్లి కొడుకు చేత పెండ్లి కూతురుకు నలుగు పెట్టించి నలుగు కార్య క్రమమును పూర్తి చేస్తారు. ఇలా రోజుకు ఐదుసార్లు నలుగు వేసే సాంప్రదాయం ఇక్కడ కలదు. వధూవరు లను నలుగు ముందే పీటపై అనగా రోకటిపై కూర్చోబెట్టి, గోళ్లుతీయించి స్నానం ఇరువురికి పసుపు బట్టలమీద ఒక చోట స్నాం చేయించుదురు.

## పాదాలు కడగడం :

''బిడ్డను యిస్తావా పడ్లను యిస్తావా'' అంటూ గడప దగ్గర కార్యక్రమం మొదలవుతుంది వధూవరుల పాదాలు, వధువు తల్లి దండ్రులు కాని, తోడ బుట్టిన తమ్ముడు లేదా అన్నలు కడుగుతారు కడిగి''బిడ్డను యిస్తవా పడ్డను యిస్తావా'' అంటూ వధువు సోదరుడు వధూవరులను అడుగుతాడు. అందుకు వారు బిడ్డను యిస్తా అని చెబుతారు. అలా వారిని ఇంటి లోపలకి అహ్వానించడం జరుగుతుంది.

## పెండ్లితంతు :

వధువు తల్లిదండ్రులు వరుని పాదాలు కడిగి, వధువుని యిచ్చి కన్యాదానం చేస్తారు. తరువాత

బ్రహ్మణులు వేదపాఠాలు వల్లిస్తూవుండగా వరుడు వధువు మెడలో మూడు ముళ్లతో సూత్రబంధం చేస్తాడు. తర్వాత వధూవరులను బంధుమిత్రులు పెద్దలు అందరూ అక్షింతలు చల్లి అశీర్వదిస్తారు. అనంతరం వధూవరులు తలంబ్రాలు పోసుకుంటారు.

## ఎదురుకోళ్ళు :

జానపదులు ఎదురుకోళ్ళ ఆచారాన్ని తప్పకుండ పాటిస్తారు. పెండ్లివారు బయలుదేరి వరుని వూరికి వచ్చి అక్కడ వూరిచివర అరుగుల మీద గాని గుడి దగ్గర గాని, ఖాళీ స్థలం వుండే చోట కాని విడిది ఏర్పాటు చేసిన చోటకు వస్తారు అక్కడకు మెరిమిణి బండితో వధువును ఊరేగింపుగా తీసుకొని వస్తారు. విడిది స్థలం దగ్గరకు పానకవు కండలతో, గంజి పాత్రలతో, కల్లు పాత్రలతో వరుని తరుపున వాళ్ళు అక్కడ వచ్చి ఎదురు కోళ్ళు ఆడడం జరుగుతుంది.

## సప్తపది :

వధూవురులకు బ్రహ్మముళ్లు వేసి ఏడడుగులు నడిపిస్తారు. అబ్బాయి చేయిని, అమ్మాయి చేతికి పట్టించి అగ్నిహెూత్రం చుట్టు ఏడడుగులు నడిపిస్తారు. ఇది హిందువులు మాత్రమే చేస్తారు. ఈ ఆచారం క్రైస్తవ, ముస్లీం మతలలో లేదు.పెండ్లి అయిన తరువాత గుడి బయటికి తీసుకొని వచ్చి అరుంధతీ నక్షత్రం కన్పించిందా అని ఆకాశం వైపు చూపిస్తూ వధూవరులను అడుగుతారు. ఇలా అరంధతీ నక్షత్ర దర్శనం లక్షిస్తుంది అనంతరం పెద్దల అశీర్వచనలంపాదాల దగ్గర మొక్కి తీసుకొందురు.

## చదివింపులు :

కర్నూలు జిల్లా జానపదులలో ఈ ఆచారం పూర్వం నుండి వస్తుంది వివాహంనకు వచ్చిన వారు వధువుకు, వరునికి బహుమతులు ప్రధానం చేయిదురు దీనినీ చదివింపులు అందురు చదివింపుల తరువాత అందరు భోజనాలు చేయుదురు.

## లగ్న నిర్ణయం :

ఈ ఆచారం తప్పని సరిగ వుంటుంది. లగ్నం నిర్ణయించడానికి జ్యోతిష్యులను సంప్రదిస్తారు వధువురుల జన్మనామ నక్షత్రాలను బట్టిపంచాగం చూపించి చంద్ర తారా బలాలు అనుకూలంమయ్యేటట్లు జ్యోతిష్యులు లేదా పురోహితులు లగ్నం నిర్ణయిస్తారు. వారు నిర్ణయం చేసిన ప్రకారమే లగ్నపత్రిక వేయిస్తారు.

## కొట్నాలు దంచడం :

పెండ్లిముహూర్తం నిర్ణయించగానే ముత్తదువులు సువ్విపదాలు, ఏలలు రకరకాల పాటలు పాడుతూ బియ్యం, పసుపు, కారం శనగ పప్పు ఇలా మొదలగు వానిని అన్నింటికి దంచించడం ఏరించడం జరుగుతుంది.

## అప్పగింతలు :

తల్లిదండ్రులకు, తొడపుట్టిన వారికి ఇది విషాదంగా వుంటుంది. తమ కూతురు తను కుటుంబ నుండి వేరే కుటుంబంలో సభ్యురావుతుందని తల్లిదండ్రులు దు:ఖంతో కూడిన సంతోషంతో సాగనంపుదురు, ఆడ బిడ్డను కనిపెంచి ఒకరిచేతులకు అందించేటప్పుడు ఆ తల్లిదండ్రులకు కలిగే దు:ఖం వర్ణనాతీతం పుట్టింటివారికి అత్తింటి వారికి మంచి పేరు తీసుకరమ్మని చెప్పి వరున్ని అతని తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోమని చెప్పి కూతురిని అత్తవారింటికి సాగనంపుతారు.

★★★

# ఒక్క వాన చాలు - రైతు, వలస కూలీ బతుకులు

- డా॥. పొన్నంరెడ్డి కుమారి నీరజ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

రాయలసీమంటేనే రత్నాలసీమ. కానీ ఇప్పుడు రాళ్ళ సీమ. అందరితో కలిసి ఆనందంగా రాగాలుబోయే రాయలసీమ వాసులకు, గుండెల్ని రాళ్ళు చేసుకుని బతికే కాలం వచ్చింది.పల్లెలే పట్టణాలకు పట్టుగొమ్మలు. మన సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలు. అలాంటి పల్లెలు నేడు పాడుబడిపోయే పరిస్థితి. వ్యవసాయం మన జీవనాధారం. నేడిది కలలోమాట. రైతే రాజు. కానీ నేడు రైతు కూలీగా వలస పోవాల్సిన స్థితి.

పల్లెల్లో పట్టణాల్లో మనిషి ఆశకు అంతేలేకుండా పోయింది. కుంటలు, చెరువులు ఆక్రమణకు గురై నీళ్ళకష్టాలొచ్చేశాయి. నీళ్ళు లేకుండా వానకురవాలంటే ఎలా సాధ్యం? వాన లేకుండా సేద్యం చేసే అవకాశం రాయలసీమ వాసులకెక్కడిది. సేద్యం లేకుండా తినడానికి తిండి?. వలసలతో ప్రారంభమైన మానవ జీవనం వలసలతోనే నడుస్తూంది. ముఖ్యంగా రాయలసీమలో. దీనికి కారణం సహకరించని ప్రకృతి, పట్టించుకోని ప్రభుత్వాలు. మెరుగైన జీవనంకోసం నేడు విదేశాలకు వలసపోవడం వేరు. ముద్దపెట్టే రైతు ముద్దకోసం వలస కూలీగా మారడం వేరు.

అన్ని ప్రాణులను చేరదీసి వాటిని ప్రేమగా చూస్తూ అందరితో కలిసిమెలసి బతుకుతూ లోకం ఆకలి తీర్చేవాడే రైతు. కార్తెల ప్రకారం అన్నీ జరుగుతున్నప్పుడు రైతే రాజు. కానీ నేడు? లక్షాధికారైనా కడుపుకు తినేది తిండే. ఆ తిండి పండించేవాడు రైతు. అలాంటి రైతు వర్షాధారిత రాయలసీమలో చినుకులేకపోవడంవల్ల, పంటలు పండించడానికి వీల్లేక పెళ్లాం పిల్లలకోసం పొట్టచేతబట్టు కుని పట్టణానికి పట్టెడన్నంకోసం వలస పోయి బతకాల్సిన పరిస్థితి. అలాంటి దారుణమైన పరిస్థితిని సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి ఒక్కవానచాలు నవలలో చిత్రించారు.

సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి 16 ఫిబ్రవరి 1963న ఎస్. లక్ష్మిరెడ్డి, ఎస్. చెన్నమ్మలకు, కడపజిల్లా బద్వేలు తాలూకా, కాశినాయన మండలం బాలరాజుపల్లెలో జన్మించారు. ఉపాధ్యాయుడుగా ఉద్యోగజీవితాన్నీ, రైతుల కడగండ్లనూ, కష్టాలనూ కథలు, నవలల్లో వ్యక్తపరుస్తూ సాహితీ వ్యవసాయాన్నీ చేస్తున్న నిత్య కృషీవలుడు. ఇప్పటివరకు బతుకు సేద్యం, కొత్త దుప్పటి, అనే - కథా సంపుటాలు, కాడి, పాండవబీడు, తోలుబొమ్మలాట, చినుకుల సవ్వడి, పాలెగత్తె, ఒంటరి, మబ్బులు వాలని నేల, ఒక్కవాన చాలు, కొండపాలం - నవలలు. 'బడి' కవితా సంపుటి వీరి రచనలు.

ఈ నవల రాయడంలో ఉద్దేశాలు ప్రాధమికంగా రెండు. ఒకటి రాయలసీమ రైతు, రైతు కూలీల బతు కులు ఇప్పుడు వలస బతుకులయ్యాయని చెప్పడం ఒకటైతే. ఎన్ని కష్టాలు వెంటాడుతున్నా, ఎంత ఆకలేసినా ఏడుస్తూ కూచోవడం, చేతులు చాచి అడుక్కోవడం ఇక్కడి మనుషుల లక్షణం కాదు. ఇక్కడి రైతులకు అల వాటు లేదు. నిరంతరం బతుకుపోరాటం. ఆడుకుంటూ పాడుకుంటూ కష్టాన్ని మరిచి కడుపారా తినడానికీ ఆలోచిస్తారని చెప్పడం రెండవది. మనల్ని ఆలోచింపజేసే విషయం రైతులకీ స్థితి కలగడానికి కారణం. దీనికి పరిష్కార మార్గం చూపాల్సిన వారేంచేస్తున్నారని. అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించడం. రైతు బాగుంటే వారిమీద ఆధారపడిన ఇతర వృత్తులవారూ బాగుంటారు. సంస్కృతీ సంప్రదాయాలు బతికుంటాయి.

వానలు పడకపోతే కరువు. కరువులో బతుకుతెరువు కోసం వలసలు వెళ్ళిన వారి కష్టాలే ఈ నవల. కడప జిల్లాలోని...ఒక కరువు ప్రాంతంనుంచీ కూటికోసం, కూలికోసం పట్టణంలో బతుకుదామని బయలుదేరిన

కొందరు సన్నకారు రైతుల బాధలే ఈ నవల. ఆదినుంచీ అంతం వరకూ ఒకటే కోరిక వాన కురవాలని. వానకురిస్తే ఇలాంటి పాణంలేని పని చేసే బాధ తప్పుతుంది. ఎవరితోనూ మాట పడాల్సిన పనిలేదు.అవమానాలు ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. తల్లి, పెళ్లాం పిల్లలతో ఇంటిపట్టునుండచ్చు ఊరంతా కలిసి.

వాన కురిపించు సామీ! పెద్దవాన, ఒక్కవాన చాలు తండ్రీ. వాన రాలాల! భూమి కుమల నానాల! కరువు జనం కన్నీరంతా కరగాల! వంకలు ఎగిరెగిరి పడాల! వాగులు పరుగుల్దీయాల! ఎర్ర నీటితో నిండి చెరువులు ఒద్దికగా పడుకోవాల...

ఒక్క వాన చాలు, పదునయ్యేవాన! చెరువుల్ని దొరు వుల్ని ఏకంచేసే వాన! చెట్ల చివర్లూ, మనుషుల తలలూ నాని నాని పడిశం పట్టే వాన! ఒక్క వాన చాలు! మింటికి మంటికి ఏకమయ్యేవాన! వాగులూ వంకలూ వూటలెత్తి పారేవాన.

వాన కురిస్తేగాని పని దొరకదు. వాన రావాల! పాన ముండే పని దొరకాలంటే వానరావాల! ఒక్కవాన.

ఇలా నవలలో పలు సందర్భాల్లో వానగురించే పలవ రింత!మేల్కొన్నా, నిద్రిస్తున్నా వాన గురించే కలవరింత! వాన వస్తే సమస్త జీవరాసులూ చైతన్య వంతమౌతాయని తలపోత!

నవలంతా వాన, భూమి, పంట, రైతు వాసనే. ఈ నవల కథా నాయకుడు శివుడు. రైతు అంటే ఏమిటో, రైతు ఎలా ఉండాలో నిరూపించిన యువకుడు. వానలు లేక, పనులు లేక, పట్టణానికి వలస వచ్చిన యువకుడు! వాన వస్తే అన్ని సమస్యలూ, పరిష్కారమౌతాయని కలలుగనే యువకుడు! నవల మొత్తం అతని వెంటే నడుస్తుంది. అతడూ, అతనితోపాటు వచ్చిన మరో ఆరేడు గురూ ఒక పట్టణంలో గడిపిన వలస జీవితం ఆవిష్క రించిన సామాజిక వాస్తవికత ఈ నవల. ఈ వలసలు వచ్చిన వారందరూ వానకోసం పలవరిస్తారు. వానొస్తే అజ్ఞాతవాసంలాంటి వలస జీవితంనుండీ బయటపడచ్చు. సొంతవూర్లో, సొంతపనులు చేసుకుంటూ సొతంత్రంగా బతకవచ్చు.చేతినిండా పనుంటుంది. అందుకే వీళ్ళంతా ఒక్కవానచాలు అని కలవరిస్తారు. వీళ్ళ అసహాయతను ఆధారం చేసుకుని రాజారావు అనే విస్తారమైన భూమిగల ఒక రిటైర్డ్ ఆఫీసర్ వీళ్ళకు మాయమాటలు చెప్పి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎస్టేట్ లాంటి తన పొలంలో వీళ్ళను పనులకు కుదురుస్తాడు. వీళ్ళను వాడుకుంటాడు.

అంతులేని ధనార్జనవైపు, భూదాహంవైపు రాజారావు లాంటి వాళ్ళు ప్రయాణం చేయడం వెనుక దాగున్న ఆర్థిక క్రూరత్వాన్ని సామాజిక అవినీతిని ఈ నవల బట్టబయలు చేసింది. విచ్చలవిడిగా పెరిగిపోయిన డబ్బు రాజారావు లాంటి వాళ్ళ చేతుల్లో వున్న డబ్బు భూమిమీద ఎలా పెట్టుబడిగా మారుతున్నదో ఆ వర్తమాన యదార్థాన్ని కూడా ఈ నవల ప్రశ్నిస్తుంది.

ఐదెకరాలయితే నువ్వు రైతువే! వందల ఎకరాలున్నో నివి నువ్వెట్లా రైతువౌతావు? రైతువు కాదు నువ్వు! భూమికి మొగునివి అని రాజారావులాంటి నడమంత్రపు భూస్వా ముల్ని ఈ నవల ప్రశ్నిస్తుంది.

భూమికి మొగునిగా చలామణి కావాలనుకున్న వాడెవడూ బాగుపడిన దాఖలాలు లేవు. భూమిని ఉం పుడుగత్తెగా మార్చుకోవాలని ప్రయత్నించిన వాళ్ళంతా మట్టిగొట్టుకుపోయారు అని ఈ నవల శపిస్తుంది.

ఎంత దూరాన్నుంచయినా, నదీజలాలు నగరాలకు మళ్ళిస్తున్నారు గదా! అలాగే పొలాల దాహమెందుకు తీర్చగూడదు? కరువు నేలలకు సాగునీరు అందించడం పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలిగదా? అప్పుడే గదా పచ్చదనం బతికి బట్టగట్టేది? వ్యవసాయ జీవితాలు వలసబాట పట్టకుండా వుండేది? మెట్టరైతులు కోరుకొనే దంతా కేవలం వర్షాభావ పరిస్థితుల్లో ఒకటి రెండు తడుల నీళ్ళేగదా! పొలాన్ని మాగాణి చెయ్యమనటం లేదుగదా? కొద్దిపాటి నీరు,పైరు చావకుండా రెండు తడుల నీరు!

ఆరుతడి పంటలు చేతికి వచ్చేనీరు అంటూ సాగునీరు మెట్టప్రాంతాలకు అందించాల్సిన అవసరాన్నిగూడా ఈ నవల నొక్కి చెబుతుంది.

వలస బతుకు అత్యంత దుర్భరమైంది. హేయమైంది. స్థానికులకు వీళ్ళపట్ల చులకన భావం. దురుసుగా ప్రవర్తిస్తారు. భరించాలి. సాటి మనిషిగా చూసేందుకు కూడా ఇష్టపడరు. సహించాలి.

కడపో, తిరిపతో వెళ్లి భవన నిర్మాణ పనుల్ని చూసుకొని రూపాయలు తెచ్చుకుంటారు.

## రైతు :

అమాయకత్వం, కష్టపడి పనిచేయడం, తన కష్టాన్ని నమ్ముకోవడం, నీతి నిజాయితీ, ధైర్యం, కష్టాల్లో ఉన్న వారిపట్ల సానుభూతి, ఆ కష్టాల్నుంచి వారిని గట్టున పడేయాలనే తపన, ఆరాటం, మట్టిలోని రకాలు, తత్వాలు, చెట్ల రకాలు వాటిమధ్య ఉన్న ఐకమత్యం, ఆకాశం, మబ్బులు, కార్తెలు వీటిగురించి తెలిసినట్లుగా మనుషుల మనస్తత్వాల గురించి తెలుసుకోలేనితనం. కష్టపడి పనిచేసేవాళ్లేగాని తేరగా వచ్చేవాటికి ఆశపడే వారుకాదు. అన్యాయాన్ని సహించేవారు కాదు. నిందలను పడలేరు. దుర్మార్గాన్ని భరించలేరు.

కష్టాల్నీ ఆనందంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తారు. కలిసి బతకడంలోని ఆనందాన్ని అనుభవిస్తారు. ఉన్న దాన్నే తిని తృప్తిపడతారు. అది గొడ్డుకారమైనా, నాటు కోడైనా. అందరి మంచీ కోరుకుంటారు. ఇతర ప్రాణుల గురించీ ఆలోచిస్తారు.

ఒక్క వాన చాలు! నేలంతా పదునయ్యే వాన... వాగులు, వంకలు, చెరువులు, దొరువుల్ని ఏకం చేసే వాన.... అంటూ మొక్కుబళ్ళూ చేస్తారు.

వాన వొంగుతే యింగేం నాయినా! వంద టెంకాయలు కొట్టమా. ఆంజనేయ సామికి ఆకుపూజ సేయించమా! ఇసుక తట్టమోస్తూనే అన్నాడు గుడ్డి రామిరెడ్డి.

ఒక్కపదును వాన సాల్నాయనా!...నీ ఆశ్రమానికొచ్చి అన్నదానం సేయిస్తా పైకెగజూస్తూ వేడుకుంటున్నాడు శివన్న.

వ్యవసాయం అందరిచేతులూ కలిస్తేగాని ముందుకు సాగని వృత్తి. ఇందులో భార్యపాత్రా ఎక్కువే. ఇంట్లో వంటపని, పొలంలో సాయమూ ఉంటేనే రైతు గట్టెక్క గల్గేది.

ఈ నవలలో కథానాయకుడు శివుడు.అన్యాయాన్ని సహించలేడు. మాటపడని మనస్తత్వం. కష్టపడి పని చేయడం తెలిసినవాడు. అన్యాయంగా మాట్లాడిన మేస్త్రీని, పాలవాన్ని, అంగడివాన్నీ అందరినీ ఎదిరించి వాళ్ళ నోళ్ళు మూయించినవాడు.రాజారావులాంటి పెద్దమనుషుల అంతరంగాన్ని పసిగట్టినవాడు. వ్యవసాయ దారుల్లో ఆణిముత్యంలాంటివాడు.

శివునికి వాన చినుకుల కలలు...చినుకులతో తడిసిన మట్టి వాసన కమ్మిన కలలు...ఒళ్ళంతా తపనపడుతూ వుంది నేలను పగల దున్నాలనీ, విత్తనాలనీ, పైరు పెంచాలనీ, పంట కోయాలనీ, గింజలు తూరుపెత్తాలనీ, పొలిగాన్ని పరామర్శించాలనీ, గాదెలు గరిసెల్ని నింపాలనీ....పల్లెకు వెళ్ళాలనీ....

ఇంటి వద్ద తనకోసం ఆరాటపడుతూ వుంటుంది తల్లి.... తనవెంట రమ్మంటే రాదు...ఇళ్ళంటది...దొడ్డి గోడలంటది....కోడి పిల్లలంటది....కళ్ళంలో చింత చెట్లంటది....బర్రె దూడలంటది...వాటిని వదిలి రానంటది...తనే వెళ్ళాలి... ఈ వలస తలుగులు తెంచుకొని తనే....వలస బాట చెదిరి పోవాలంటే వాన రావాలి....అని ఆరాట పడతాడు.

## రైతు కూలీ గుండెధైర్యం :

మేస్త్రీ కేశవులు పల్లెల్ని కించపరుస్తూ మాట్లాడేసరికి తట్టుకోలేకపోయాడు. ఎదిరించాడు. కూలీ లేకపోయినా పరవాలేదని తన వాళ్ళంతా వద్దని వారిస్తున్నా ఆత్మాభిమానం చంపుకోలేక వచ్చేశాడు.

'నీ పనెవురిగ్గావాల? నా బొచ్చుగానిగ్గావాల్నా? నా కూల్లెక్క నాకీ....' అంటూ పక్కకు సర్దుకున్నాడు.

పాలవాడు రైతులే పాలల్లో నీళ్లు కలుపుతున్నారని, వారికి ఆశ ఎక్కువైందని అబద్ధాలాడితే సహించలేక పోతాడు శివుడు. పల్లెన్నమ్ముకుని బతికే వీడుకూడా తన్ను బతికించే రైతుల్ని స్వార్థపరులుగా మోసగాళ్ళుగా చిత్రీకరిస్తున్నాడు.

వ్యాపారస్తుడు బియ్యంలో రాళ్లు, ధనియాల్లో పుల్లా పుడకా రైతులు కలిపారని అన్ని నేరాల్నీ రైతులమీద నెడుతున్న వ్యాపారితో శివుడు నిసావుకారీ! ఇన్నిన్ని అబద్ధాలాడిన ఆ నోటితో బువ్వెట్టా తింటావు? రైతులెవ రన్నా బియ్యం పండిస్తారా? వడ్లు...వడ్లు పండిస్తారు. మీరొచ్చి ఆ వడ్లు కొంటారు. మిషనాడిస్తారు. మిషన్లోంచి రాల్లు రప్పల్లేకుండా బియ్యమొస్తయి. ఆ బియ్యంలో రాల్లు కలపడానికి రైతులు మల్లా మిషన్లకాడికి వస్తారా?ి అని ప్రశ్నిస్తాడు. నిపల్లెల్లో బతకలేక రైతులంతా కూలి మాసులై కడుపు సేతపట్టుకొని టౌన్లకొస్తాంటే.... వాల్లను తప్పుడోల్లన్జేసి ఎందుకయ్యా అడ్డమాటలు మాట్లా డ్తారు?...... రైతుల్నంటే పురుగులుబడి సస్తారు....ఎఅంటూ విసవిస అక్కణ్నించి వెళ్ళపోతాడు.

'మోసం చేసి బతికే మాత్రమైతే ఊరిడిచి ఇంతదూరం రాబన్లే...ఎద్దు ముడ్డి పొడుచుకొని బతికే వాల్లం....మాకా మోసాల్దెలవయ్యో' అంటాడు శివుడు.

'యీ అంగడోల్లు తప్పున్నాకొడుకులై పల్లె రైతుల్ని తప్పుడోల్లంటండారు. యీల్లు దొంగనాకొడుకులై బూమి దున్నుకునేటోల్లను దొంగోల్లంటండారు. రైతులు తప్పు డోల్లో దొంగోల్లో అయ్యింటే యీల్ల మాదిరే మిద్దెలు మేడలు కట్టుకొని పల్లెల్లోనే సుకంగా బతక్క పొట్టసేత బట్టుకొని కూలీ పన్జేసుకొనేందుకు టౌనుకొస్తరా?' అంటాడు.

టౌను జనాలందరికీ పల్లెలంటే చులకన. రైతులంటే ఎంటికతో సమానం. చివరకు తాపీబట్టుకునే బేల్దారి క్కూడా గడ్డిపోచకింతే లెక్క.

రాజారావులాంటి పెద్దమనుషులు అడ్డమైన గడ్డీ తిని సంపాదించిందాంతో వందల ఎకరాల పొలాలు కొని, ఆక్రమించుకునీ వాటి బాగోగులు చూసేవాళ్ళులేక శివుని లాంటి పనోడైతే బాగుంటుందని ఆశపడతాడు. శివుడం దుకు ఒప్పుకోడు. ఎప్పుడువానొస్తే అప్పుడు తమవూరికి వెళ్ళిపోయే తానీ పని చేయలేనంటాడు. రాజారావు బలవంతపెడితే రైతుకు నేల అమ్మలాంటిది. అమ్మకు మొగున్ని కమ్మని ఎట్లా చెబుతండావయ్యా అని ప్రశ్ని స్తాడు. తినడానికి కావాల్సింది పండించుకునేందుకు ఐదు పదెకరాలున్నోడు రైతు. నువ్వు రైతువు కాదు. భూమికి మొగునివంటాడు. నీలాంటి వాళ్ళకు భూదేవి లొంగదం టాడు.

మట్టిని, ఆకాశాన్ని నమ్ముకొనే రైతులు ఇప్పుడు మనిషి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడటం భరించలేకున్నారు.

రైతుపనికోసం, ప్రాణమున్న పనికోసం ఆరాటపడ తాడు శివుడు.

రాజారావుతో 'పనిగావాల పెద్దయ్యా! రైతుపనగావాల. భూమిని పగలదున్నాల... విత్తనాలు విత్తాల... కలుపుల్దీయాల... మడవగట్టాల... కోతలు కొయ్యాల... కళ్లాలు జెయ్యాల. గింజలు ఇంటికి మొయ్యాల.. పొలం పని గావాల...రైతుపని మీద మొగమోస్తాంది... యీ యిటికెలు ఎగరెయ్యడాలూ, సిమంటు మొయ్యడాలూ యీ పనుల్తో సచ్చేంత యాసిరికె వస్తాంది. పన్జేస్తాంటే యింగా యింగా చెయ్యాలనిపించాల. కుశాల పుట్టాల... పనిలో పానముండాల... పానముండే పనిగావాల పెద్దయ్యా!.... పానముండే పని దొరకాలంటే వాన రావాల....ఒక్క వాన....'

## సిమెంటు పని :

కరువుబారినుంచి తప్పించుకునేందుకు రైతు ఎద్దుల్ని, బర్రెల్ని కసాయివాళ్లకు తోలి పెండ్లాం పిల్లల్ని ఇంటివద్ద వదిలేసి తన పొలంపనికొచ్చే కూలీల్తోపాటు కూలికెళ్ళే పరిస్థితే దారుణమనుకుంటే అక్కడ ఎదురయ్యే

అవమానాలు మరింత దారుణం. పల్లెల్నుంచి కడపకు వలసవచ్చిన కూలీలు లక్ష్మిరంగ థియేటర్ దారిలో పేవ్ మెంట్ల మీద అక్కడక్కడా చిన్న చిన్న గుడ్డసంచులు, గోనె మూటలతో దిగాలుగా కూచుని ఉన్న మనుషులు. పల్లెల్నుంచి కూలిపనులకోసం వలస వచ్చి పనులు దొరక్క, ఎటూ వెళ్ళేందుకు అర్ధంగాక, అయోమయంగా చూసేవారు కొందరు. తర్వాత ఇటుకలు అందించడమో, కంకర మోయటమో, గోడలకు నీళ్ళు పట్టటమో, సెనక్కాయలు అమ్ముకోవడమో, ఏ పని దొరికితే అది చేయడం... ఆకలి పూడ్చుకోవడం..

ఒక్క వ్యవసాయదారునికి తప్ప ఏ పనివానికైనా అతనికి నైపుణ్యమున్న రంగంలో పనుల్దొరుకుతాయి. అక్కడ వ్యవసాయంలో ఎంతో నైపుణ్యమున్న వాళ్ళు ఇక్కడ ఇటుకల కింద బలి కావాల్సిందే. సేద్యగాని నైపుణ్యం చేలో సమాధి కావాల్సిందే.

ఆశ్లేష కార్తెకూడా దాటిన తర్వాత రైతులంతా ఇక వర్షాలు పడతాయన్న ఆశను వదిలి పట్నానికి చేరడం. పాపిష్టికాలం అని తిట్టుకోవడం. కూలీలు ఎక్కువయ్యే సరికి కూలీల రేట్లూ తగ్గించేస్తారు మేస్త్రీలు. ముసలీ ముతకకు పనులు దొరకడం గగనంగా మారుతుంది. కండపుష్టివున్నవాళ్ళను ఏరుకొని జబ్బపట్టి పరీక్షించి పనికి తీసుకెళ్తారు. సగం పనికే ఇబ్బడిముబ్బడిగా పని చేయించుకుంటారు.

బతకలేక ఊరు విడిచి వచ్చినందుకు అందరికీ వలస కూలీలంటే చులకనే. మేస్త్రీల దగ్గర ఒల్లుతో పాటు మానంపానం కూడా వంచాలని బాధపడతారు. కృష్ణయ్య పరిస్థితి ఇదే. పక్కూరి బక్క రైతు. యాభైయేళ్ల వయస్సు వాడు. బోరు బావి సౌకర్యంలేని సన్నకారు రైతు. పట్నానికి వలసకూలీగా వచ్చి సిమెంటుబస్తా మెట్లమీద తీసుకెళ్తూ పొరపాటున బస్తాజారిపోతే మేస్త్రీకి పట్టరాని కోపంవచ్చి నానామాటలూ అంటూ పనిలోకి అవసరంలేదని మెడపట్టి గెంటేంత పని చేస్తాడు.

'ఎద్దుముడ్డిపొడుచుకొనే నాయాలివి అట్లాంటి పనులే చూసుకోవాల. సేతగాని పనికెందుకోయ్ రావడం? ఒంగినట్టే వుండాల..... లేచినట్టే వుండాల.... పన్జేసినా సెయ్యకున్నా కూలీ మాత్రం కావాల...ఛ....దాటు యీన్నించి.... యీ పూట నీకు కూలీ లేదు. పనిలేదు ఫో... అంటూ హూంకరించాడు. బరకదున్నే నాయాలికి నీకెందుకోయ్ యీ పని...పో..పో...' అంటూ మెడబట్టి గెంటేంత పన్జేశాడు. ఏడ్చుకుంటూ వెళ్ళడంతప్ప ఏమీ చేయలేకపోయాడు కృష్ణయ్య. ఎవరికీ ఎదిరించే ధైర్యం లేదు. ఎదిరిస్తే రేపటినుండీ కూలి లేదు. కూలి లేకుంటే తిండిలేదు.

రైతుకు వానమిందే గురి. బోరు, మోటారు, కరంటూ .....వీటిని నమ్ముకుంటే కుదరదని ఇవన్నీ అశాశ్వతమైన వనీ, వాన, వాన నీళ్ళు శాశ్వతంగా వుంటాయని రైతుల నమ్మకం.

## నివాసాలు :

పల్లెల్లో చిన్నా చితకా ఇండ్లల్లో వుండే వీళ్ళు పట్నంలో అద్దెలకు భయపడి చిన్న గదిలోనే అందరూ గడపాల్సిన పరిస్థితి.

కడప శివారులోని పల్లెను నగరం మింగుతూవున్న ప్రాంతమది. అక్కడ ఖాళీగా వున్న రేకుల షెడ్లు, పెంకుటిల్లు, పాతమిద్దెల్లాంటి ఆవాసాల్లో వలస కూలీలు ఐదారు మంది కలిసి ఓ చిన్న గదిలో సర్దుకొని బాడుక్కుండాల్సిన పరిస్థితి. ఇంకొందరైతే బడి, పంచాయితీ ఆఫీసుల్లో తల దాచుకునే దీనస్థితి.

## కాలక్షేపం :

పల్లెల్లో పగలంతా వ్యవసాయపనుల్లో మునిగిపోయి అలిసిపోయి, సాయంత్రం పదాలు పాడుతూనో, భజనలు చేస్తూనో, వ్యవసాయానికి సంబంధించిన ముచ్చట్లాడుకుంటూనో అలసట మర్చిపోయేవారు.

ఇప్పుడు పట్నంలో కొందరు టీవీలున్న ఇళ్ళముందు మెట్ల పక్కనో, గోడ చాటున్నో నిలబడి సీరియల్స్ తొంగి

చూస్తే, ఇంకొందరు ముసలాళ్ళు ఇళ్ళముందున్న చిన్న అరుగులమీద కూచుని నిశ్శబ్దంగా బీడీలు పీలుస్తూ గడుపుతున్నారు. టీవీలు సినిమాల్తో కూడిన యాంత్రిక జీవితాలు... వాళ్ళనిండా ఘనీభవించిన మౌనాన్ని కరిగిస్తున్నారు.

ఏం తింటున్నారో, ఏం తాగుతున్నారో తెలీదు. ఎవరి వద్దా చేయిచాచి అడిగిందిలేదు. ఎట్ల బతుకుతున్నారో కూడా తెలీదు. గుట్టు బైటకు రాకుండా కాలం వెల్ల బుచ్చుతూ పనులు చేసుకుంటారు.

కష్టాన్ని మరిచిపోవడానికి పదాలు పాడుకుంటారు. ఆ పదాలే గుండెల్ని మెలేస్తే

**'....మూడురూపాయిలిస్తమంటే ముప్పావు కొర్రలియ్యరు**

**పది రూపాయిలిస్తమంటే పావు జొన్నలియ్యరన్నా!'**

అని బాధపడుతూ నిశ్శబ్దమైపోతారు.

### కలలు :

వలస కూలీల కలల్లోనూ వ్యవసాయమే. నిద్రపోతున్నా వాన.. పొలం...విత్తనాలు...పందుల గోలే.

వ్యవసాయం కలగా మిగిలిపోయింది.కరువు దాని స్మృతుల్ని కూడా తినేసింది.చెన్నయ్య పందుల్రోయ్....... తిరుక్కోండి.... బెయ్యండి... కేకలు నిద్దర్లో.

ఈ వ్యవసాయం కలగా మిగిలిపోతుందేమోనన్న భయం.

అదనులో దున్నటం, పదనులో విత్తటం, కలుపులు తీయటం, బలుపెక్కించటం, కార్తెలతో వానల్ని కొల వటం, రుతువులతో పంటను లెక్కించటం, పైరు కోయటం, కళ్లాలు చేయటం, వాములేయటం, ఎద్దుల్ని మేపటం....ఈ దృశ్యాలన్నిటినీ కేవలం కలగా మిగిలి పోయేలా చేసింది కరువు.

### నెమరువేసుకోవడం :

వలస కూలీలుగా మారిన తర్వాత ఒకటే బాధ గతాన్ని గుర్తుచేసుకుని. చేలో విత్తనాలు వేయడం, అవి మొల కెత్తేంత వరకు రాత్రీ పగలూ కాపలా కాయడం వాటి స్మృతుల్లో గడిపేస్తారు.

'యిత్తిన వారానిగ్గానీ మొలక రాదు. యీ వారం రోజులూ వాటెక్క పందులు....యామారకుండా కావిలి గాయాల... గొర్రుతో యిత్తి గుంటక పాసి సాల్లు కనబడ కుండా చేస్తాం!.... విత్తన సాల్లంబడి ముట్టెతో దున్నుతా యిత్తనాలన్నీ యేరక తింటాయి.... మొలకెత్తినాన్నుంచీ కాకుల పోదు.... ఈ కావిళ్లతో పగలూ రేత్రీ అరిచి అరిచి గొంతు రాపెక్కిపోతాదనుకో'.

### పెళ్లి :

పదిమందికన్నంబెట్టే రైతు వలస కూలీగా మారిన తర్వాత తాను బతకడమే కష్టంగా మారింది. తోటి వాళ్లో ఇంట్లో పెద్దలో వయసుకొచ్చిన వాళ్ళను పెళ్లి చేసు కోమంటే వారి గుండెల్నిండా బాధే.

'ఈ కరువు గాలాల్లో మనమే బతకలేక యాడేన్నోబడి అడక్కతింటాంటే...ఇంకో మాసిని కూకోబెట్టి సాకేందుకు మనతో అయిద్దే?' అంటాడు సూర్యుడు.

అదే వానొస్తే పొలం పని చేసుకుంటారు కాబట్టి అప్పుడు హాయిగా గడపొచ్చని

వాన రావాల...వాగులు వంకలు చెరువులు దొరువులు నిండే ఒక్కవాన రావాలగాని ఆ పిల్లను సాకడం పెద్ద పని కాదులేరా అంటాడు శివుడు.

మనస్పర్థలతో దూరంచేసుకున్న భార్యను దగ్గరకు తెచ్చుకోవడానికీ కరువే అడ్డంకి రమణకు. మంచివాన వస్తే మళ్లీ అన్నీ తొలగిపోతాయని ఆశ.

ఇష్టమైన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని. కానీ కూలిపనికి బయటొస్తే వాళ్ళెక్కడ ఆ అమ్మాయికి మరొ కరితో పెళ్లి చేసేస్తారోనని భయం. ఆ భయం కలలోనూ. శ్రీను కలలో ఏడుస్తుంటే శివుడు లేపాడు.

'రమ కల్లోకొచ్చింది. ఆయమ్మి నాయన ఆమెను ఎవరికో ఇచ్చి పెండ్లి జేస్తాన్నెట్టూ, మేం ఒకర్నొకరం

పట్టుకొని ఏడ్చుకొన్నెట్టూ...అన్నా! వానొచ్చేదెపుడన్నా? మనం వూరికి పొయ్యేదెపుడు?' దీనంగా అడిగాడు.

**అనారోగ్యం :**

కంట్లో మన్నుబడి కన్ను మంటబెడుతున్నా ఆసుపత్రి కెళ్తే ఒకరోజు కూలి సరిపోతుందో, రెండవకూలీ ఖర్చవు తుందోనని భయం.

**చులకన :**

మట్టిలో పడి బతికే వాళ్లను తిట్టనోడెవుడబ్బీ! పెద్దా ఫీసర్లనుంచి చిల్లరంగడోల్లదాకా అందరికీ సేద్దెగాల్లంటే వాల్ల ఎంటికతో సమానం గదా! కాలమట్లా వొచ్చింది. ఏం జెయ్యాల్నాయినా! గురయ్య అన్నాడు.

వానల్రాక బూములు బీల్లుబడిగదూ అందరికీ మనం సులకనయ్యింది. మన అగసాట్లు తీరాలంటే మంచి వాన రావాలి...ఒక్క వాన... అన్నాడు శివుడు.

మగదిక్కులేని సరోజమ్మ కూతురు గౌరిని బల వంతంగా పెళ్లి చేసుకోవాలనుకున్న ఆమె తమ్ముడు తాగుబోతు వీరారెడ్డిని ఎదిరించడానికి వీధివారెవ్వరూ పోకపోతే పాపం కష్టాల్లో ఉన్న తోటి మనిషికి సాయం జేయాలనే మంచి మనసుతో అమాయకులైన వలస కూలీలు వెళ్లారు.

వీరారెడ్డి 'పోరా...పోంగ్రా.. యాన్నుంచో ఎత్తొచ్చిన కూల్నా కొడుకులు.. మీకెందుకురా ఈ గొడవలు? పోండి...' అంటూ తన చేతులకు అడ్డురాబోతున్న గుడ్డి రామయ్యను విసురుగా తోశాడు. దానిక్కారణం కేవలం తాము బతకలేక వలస వచ్చిన కూలోల్లం కాబట్టి శివన్న మనస్సు చివుక్కుమంది.

కూలోల్లకు ఈ ఊరు కాకపోతే మరోవూరు. మరి వీధిలోని వారు గొడవల్లో తలదూర్చితే కోర్టులు, కేసులంటే తామెక్కడ తిరిగేదని వాపోతారు.

'వీధిలోని ఉద్యోగి భార్య వాల్లకేం నాయినా! కూలీమారాజులు. ఇక్కడ కుదరకుంటే ఎక్కడికయినా పోతారు. కడప కాకుంటే తిరపతి. యాడయితేనేం? కూలి దొరికితే సాలు... మేం కుదురుగా సంసారాలు చేసుకుండే టోల్లం... అంత పని మాకేడవుద్ది?' అంది.

వానొస్తే భూముల్దున్నొచ్చు. పైరు బెట్టొచ్చు. పంటలు పండించొచ్చు. లోకమంతా కడుపునిండా తినాలంటే రైతే గద పండించాలి. పల్లెలోల్లే గదా! రైతుల మేలు కోరుకుంటే అందరికీ మేల్జరిగినట్లే.

రైతుంటే పల్లెవుంటుంది. పల్లెవుంటే సంస్కృతి వుంటుంది. ఆ రైతు వుండాలంటే నీళ్ళు కావాలి. అందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

★★★

# సుగాలీ పండుగలు - ఆచరణ పద్ధతులు

- **మార్తల పవన్ కుమార్ రెడ్డి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

సాధారణంగా అన్ని వర్గాల వారు పండుగలు, చేసు కున్నట్లే సుగాలీలు కూడా పండుగలు చేసుకుంటారు. కాని వీరు చేసుకునే పండుగల్లో కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. హిందువుల పండుగలు లాగా సుగాలీ పండుగలు ఒకే మాసంలో ఒకే ఋతువులలో వస్తాయి. అయితే వీరి పండుగల్లో ఆచార వ్యవహారాలు భిన్నంగా కనిపిస్తాయి. హిందువుల లాగా అన్ని పండుగలు జరపాలనే నియమం వీరికి ఉండదు. వీరు తప్పనిసరిగా చేసుకునే పండుగలు హోలి, దీపావళి, ఉగాది, గాలిదేవరపండుగ. అయితే వీరు తప్పనిసరిగా చేసుకునే పండుగలు దసరావ్, పూజ అనే పేర్లు ఉండటం గమనించదగ్గ విషయం. ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు సకాలంలో సానుకూలంగా ఉన్నప్పుడు మూడు సంవత్స రాలకొకసారి తేజ్‌పండుగను మరియు మరియమ్మ జాతరను ప్రత్యేకంగా జరుపుకోవడం వీరి ఆచారంగా మనం గమనించవచ్చు. తాండాలలో ఏ పండుగైన, ఉత్సవమైన, జాతరైన జరపాలంటే నాయకుని యొక్క అనుమతి తప్పనిసరి. వీరు ఎప్పుడూ అలంకరణ ప్రియులుగానే కనిపిస్తారు. వీరి వేషధారణ, భాష ఇతర గిరిజనులతో పోల్చుకుంటే వైవిధ్యంగానే కనిపిస్తుంది. పండుగల సందర్భంలో వీరు ఆచరించే సాంగ్యాలు భిన్నంగా కనిపిస్తాయి. అన్ని వయస్కుల స్త్రీపురుషులు, నదీతీరం లేదా సముద్రతీర ప్రాంతాలకు వెళ్ళి స్నానం చేసి కొత్త బట్టలు ధరించి ఆట, పాట, విందు వినోదాలతో ఆరోజు కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడుపుతారు.

**దీపావళి :**

తాండా ప్రజల్లో భక్తి భావాలు ఎక్కువ. ఏదైనా దైవకార్యం మొదలు పెట్టాలంటే, మొదట తాండా నాయకునికి తెలియజేయడం వీరి యొక్క ఆనవాయితి. బంజారాల ఆడవారికి, ముఖ్యమైన పండుగ దీపావళి. కాని హోళి పండుగ విషయంలో స్త్రీలు పట్టణాలకు వెళ్ళి డబ్బులు అడుక్కునే ఆచారం ఉన్నప్పటికి ఈ పండుగలో స్త్రీల కంటే పురుషులే ఎక్కువ పాల్గొంటారు. దీపావళి పండుగలో కొన్ని ప్రత్యేక ఆచారాలు కనిపిస్తాయి. మూలపురుషులకు అగ్రపూజ చేస్తారు. చేసే ముందు జంతువులను బలిచ్చి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ రోజు సాయంత్రం లక్ష్మీపూజ చేస్తారు. రాత్రికి పెళ్ళికాని కన్యలంతా దీపాలు చేతపట్టుకొని తాండాలోని ఇంటి ఇంటికి తిరుగుతూ కులదైవానికి, చనిపోయిన వారికి సంబంధించిన పాటలు పాడుతూ వెళ్తారు. ఇలా తిరుగుతూ పాడేపాటను "మేరాపాట" అంటారు.

ప్రతి ఒక్కరిని పేరుపేరునా దవాళి రక్షించుగాక! చల్లగా చూచుగాక! అని దీపాలు పట్టుకొని ఇంటింటా తిరుగుతున్నప్పుడు దీపంలో తాండా ప్రజలు దక్షిణ వేస్తారు. ఇలా చేసేటప్పుడు ఎవరి ఇంటినైనా పొరపాటున మరచితే వారు వెళ్ళి తాండా నాయకునికి ఫిర్యాదు చేయవచ్చు. అప్పుడు తాండా నాయకుడు వారిని పిలి పించి వారికి క్షమాపణ చెప్పమని మందలిస్తాడు. అలా జరగకుండా శ్రద్ధతో దీపాలు పట్టుకొని తాండాలోని ప్రతి ఇంటికి తిరుగుతారు. సమర్థలైన ఆడపిల్లలంతా దీపావళి పండగకు మేముండ బోవమని, ప్రతి ఇంటికి పోయి, బోరు బోరున మొరపెట్టుకుంటారు. ఆ రోజు రాత్రి కార్యక్రమాలన్నీ ముగుస్తాయి. మరుసటిరోజు తెల్లవారక ముందే స్నానాలు చేసి పూర్వీకులను పూజిస్తారు. చనిపోయిన పెద్దలకు కొత్తబట్టలు పెడతారు. బియ్యపు పిండితో చేసిన పాయిసం, నెయ్యిని అగ్ని హోమంలో వేస్తూ పూజలు చేస్తారు.

పెద్దలకు జంతుబలి ఇచ్చేముందు నైవేద్యంగా సారా, కల్లును ఉంచుతారు. పండుగకు ముందు జ్వరం, జలుబు లాంటి అనారోగ్యంతో బాధపడే మనుషులు ఇంట్లో ఉంటే ఈ పండుగ అచ్చిరాలేదని, ఈసారి మేము పండుగ చేసుకోము, వచ్చే ఏడాది మేకను గాని గొర్రెను కాని బలిస్తామని మ్రొక్కుకుంటారు. పండుగ రోజున ప్రతి ఇంటికి 10 నుంచి 20 టెంకాయలు దాకా కొడతారు.

పెండ్లీడుకు వచ్చిన ఆడపిల్లలు దీపావళి పండుగ రోజున గోవుల పేరు మీదగా ఉపవాస దీక్షా వ్రతం చేస్తారు. ఉదయాన్నే లేచి స్నానం చేసి ఆడపిల్లలందరూ గుంపుగా అడవికి వెళ్ళి రకరకాలపూవులను తీసుకొచ్చి ఆవులపేడతో చేసిన గొబ్బెమ్మలను అలంకరిస్తారు. వారు చేసిన తీపి పదార్థాలను గోవులకు తినిపించి ఉపవాస దీక్షను విర మిస్తారు. తాండాలో ప్రతి ఇంటికి ఆవులుండేవి గోపూజ వీరి సాంప్రదాయం. ఏ వస్తువులను తీసుకరావాలన్న, తీసుకుపోవాలన్న ఆగోవుల మీదనే రవాణా చేసేవారు. దీపావళిని సుగాళీల ముఖ్యపండుగగా చెప్పవచ్చు. నేటి ఆధునిక కాలంలో ఈ సాంప్రదాయాలు, ఆచార వ్యవ హారాలు 80% మరుగున పడిపోయాయని చెప్పవచ్చు. దీనికి కారణం తాండా ప్రజలు అక్షరాస్యులు కావడం. బ్రతుకుదెరువు కోసం పట్టణాలకు వలసపోవడం, వీటిని ఆచరించమని చెప్పే పెద్దలు వీరికి అందుబాటులో లేకపోవడం.

## తీజ్ పండుగ :

మూడు సంవత్సరాలకొకసారి జరుపుకునే పండుగే ఈ తీజ్ పండుగ. హిందూవుల దసరా పండుగకు ఇది భిన్నంగా ఉంటుంది. తీజ్ పండుగ సుగాలీలకు మొలకల పున్నమితో సమానమైనది. ఈ పండుగ రాజస్థాన్‌లోని సుగాళీలు ఎక్కువగా జరుపుకునేవారు. అక్కడివారు ఇక్కడికి వలసరావటం మన వారిలో మమేకమై జీవిం చటం వల్ల ఈ పండుగను మనవారు కూడా చేసుకోవడం ఆనవాయితీగా మారిపోయిందని చెప్పవచ్చు. ఈ పండుగలో అందరూ పాల్గొంటారు. స్త్రీపురుషులు అనే వ్యత్యాసం ఉండదు. అందరికి సమానమైన హక్కులు ఉంటాయి. హిందూవులలాగా వీరు గణేషుడిని 5 నుండి 10 రోజుల దాకా ఉంచుకొని నిమజ్జనం చేస్తారు. ఈ పండుగ వేడుకలు 10 రోజుల వరకు జరుగుతాయి. ఈ పండుగ వసంత ఋతువులో ప్రారంభమవుతుంది. తీజ్ అనగా మొలకల బుట్టలు. వీటిని 10 రోజుల తర్వాత నిమజ్జనం చేస్తారు. అందుకే ఈ పండుగను ఆంధ్ర ప్రదేశ్‌లో తీజ్‌పండుగగా పిలుస్తారు.

## తీజ్ పుట్టుక :

అబ్బు గబ్బు అనే అన్నదమ్ములకు పూర్వం 5000 ఆవులు ఉండేవి. వాటిని మేపటానికి పొలాల్లోకి తీసుక వెళ్ళేవారు. తిరిగి ఇంటికి తీసుక వచ్చేవారు. అలా ఒకరోజు ఆవులు అన్ని గోధుమచేనును మేసి ఇంటికి వచ్చి ఒక బండపైన పేడవేశాయి. ఆ పేడలో నుంచి గోధుమ గింజలు మొలకెత్తాయి. అది గమనించిన వారు తీజ్ సత్య మైంది. మాయింటి కులదేవత మరియమ్మ ఈ రూపంలో మాకు దర్శనమిచ్చింది అని అప్పటి నుంచి ఆ తాండా వారు పూజలు చేయడం జంతుబలులు ఇవ్వడం ఆచారంగా మారిపోయింది.

పెండ్లీడుకు వచ్చిన ఆడపిల్లలంతా మరియమ్మ పేరు మీదగా గోధమనారతో బుట్టలు చేస్తారు. ఆ బుట్టల్లో మట్టి పోసి, నాయకుడితో కాని అతని భార్యతో కాని గోధుమ విత్తనాలు నాటిస్తారు. అవి మొలిచిన తర్వాత పదిరోజుల వరకు కాపాడుకోవలసిన బాధ్యత ఆ ఆడపిల్ల లకు ఉంటుంది. ఆ పదిరోజులలోపు ఆ గోధుమనార పసుపువర్ణం తిరిగితే ఆడపిల్లలు అపవిత్రులు అని పచ్చగా ఉంటే పవిత్రులని తాండా నాయకుడు నిర్ధారిస్తాడు. తప్పుచేశారని నిర్ధారించబడిన ఆడపిల్లల తల్లిదండ్రులు "భగత్" దగ్గరకు వెళ్ళి మా అమ్మాయి తప్పును మన్నిం చండి, దానికి పరిహారంగా మరియమ్మకు పూజలు జరి పించి జంతుబలులు ఇస్తామని వేడుకుంటారు. కాబట్టి

ఇలా జరగకుండా ఆడపిల్లలంతా భక్తి శ్రద్ధలతో నిష్ఠగా ఉంటూ కారం, ఉప్పు, పసుపులో చేసిన ఆహార పదార్థాలను తినకుండా చప్పిడి అన్నం తింటూ, నీటి కోసం చెరువులకు, కుంటలకు వెళ్ళి వచ్చేవారు. దారి మధ్యలో యువకులు వారిని హేళనగా ప్రశ్నలు అడుగుతారు. వాటికి యువతులు సమాధానాలు చెప్పే ఆచారం ఉండేది. కాని ఈ పద్ధతి ఆధునిక కాలంలో అంతగా కనిపించదు.

## తీజ్ నిమజ్జనం :

గోధుమబుట్టలలో గోధుమనారను పదిరోజులు గారాబంగా పెంచిన యువతలు నిమజ్జనానికి బయలు దేరేముందు నాయకుని ఆధ్వర్యంలో బుట్టను దేవుని దగ్గర ఉంచి గొర్రెలను బలిచ్చే ఆచారం కనిపిస్తుంది. ఈ కార్యక్రమానికి వచ్చిన పొరుగు తాండాలవారి తలపాగలను, గోధుమనారతో అలంకరిస్తారు. మా తాండా వచ్చినందుకు మీకు ప్రతిఫలంగా ఒక్క రూపాయి ఇస్తున్నాం అని చెప్పేవారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి పూజచేసిన ఆ గోధుమ నారను పంచుతారు. యువతులు ఆ సమయంలో వృద్ధస్త్రీలచే నేర్చుకోబడిన నృత్యాన్ని ప్రదర్శిస్తారు. నిమజ్జనానికి వెళ్ళేముందు యువతులు ఏడుస్తారు. ఎందుకంటే ఈ అవకాశం మాకు మళ్ళీరాదు అని, పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతామని బాధపడుతారు. ఇంత ఆదరణ అత్తగారింటికి పోయిన మాకు ఉండదు అని చెప్పుతూ దుఃఖిస్తారు. గోధుమ బుట్టలను నెత్తిన ఎత్తుకొని దగ్గరలో ఉన్న చెరువు, కుంటలకు వెళ్ళి నిమజ్జనం చేసి వెనుకకు తిరిగి నేరుగా తాండా చేరుకుంటారు.

## గాలిదేవర పండుగ :

సుగాలీ పండుగలలో మరో ముఖ్యమైన పండుగ గాలిదేవర పండుగ. ఈ పండుగను గాలికాలంలో చేస్తారు. గాలి తగ్గాలని సుగాలీలు ఈ పండుగను చేస్తారు. కొన్ని రాళ్లను తీసుకొని వాటిని నీటిలో కడిగి పసుపు, కుంకుమతో అలంకరించి దేవుళ్ళుగా కొలిచి టెంకాయలు కొడతారు. ఈ పండుగ చేసేటప్పుడు కేవలం మొగవారు మాత్రమే ఉండాలి. ఈ పండుగనాడు ఒక గొర్రెను తీసుకొని వచ్చి పూజచేసి, పూలదండ మెడలో వేసి ముఖం మీద నీళ్ళు చల్లుతారు. ఆ సందర్భంలో దేవుడిని కొన్ని కోర్కెలను కోరుకొని ఆ గొర్రెను వదిలివేస్తారు.

## హోళి :

హోలీలో రంగు పొడులు కాదు రంగు నీళ్ళు చల్లుకుంటారు. ఒకప్పుడు మగపిల్లలు బాటిళ్ళలో రంగు తీసుకుపోతే అమ్మాయిలు వెదురు, రేకు, పిచికారీలు వాడేవారు. ఇప్పుడంతా ఇన్‌స్టంట్, చేతిలో పౌడర్ వేసి కాసిన్ని నీళ్ళు పోసి మొహానికి పులమడం కనిపిస్తుంది. ఒకప్పుడు వీధి వీధుల్లో రంగుబండ్లు అన్ని కట్టి పెద్ద గంగళాలు, బెళ్లం కాసుల్లో రంగుకలిపి ఊరంతా తిరుగుతూ రంగు చల్లేవారు. ఇప్పుడు ఆ వేడుక 80% తగ్గిపోయింది. ఈ రంగుల పండుగ విజయనగర రాజుల కాలంనాటి నుండే ఉండేదని తెలుస్తుంది. రాబర్ట్ స్వెల్ రాసిన 'ది పార్గటన్ ఎంపైర్' తెలుగులో విస్మృత సామ్రాజ్యంలో అప్పటి ఇటలీ యాత్రికుడు 'నికోలోడీ కాంట్' చెప్పిన పండుగల్లో ఈ పండుగ ఉంది కానీ దాన్ని రచయిత ఆయనకు సహాయకులుగా ఉన్న పండితులు పొరబడి హెూలి అన్నారు.

ఇవాల్టి రోజుల్లో పుస్తకాల్లో, పత్రికల్లో హెూళిపండుగ రాధాకృష్ణుల రాసలీల గానే కాకుండా ప్రహ్లాదుని కథలో అతన్ని మోసపుచ్చి కూర్చోబెట్టుకొని మంటల్లోకి దిగి దహనమైన హోళికథ చెబుతారు. అసలు హోలి ఒక విషాధపండుగ. నిజానికి ఒకప్పటి పండుగల జాబితాలో దీన్ని 'కాముని పున్నమి' అనేవారు. శివపార్వతుల కళ్యాణం కోసం పంపబడి, శివుడి క్రోదాగ్నిలో భస్మమైన మన్మథుని విషాదగాథయే హెూళి. ఒకప్పుడు కామనపెట్టిలు అని పోగుచేసేవారు. ఆ పున్నమి రాత్రి వాటిని దహనం

చేసేవారు. ఇదే కామదహనం. ఇప్పుడు ఈ ఆచారం మాయమైంది కానీ ఇంకా ఒకటి అరాసుగాలి/లంబాడా తాండాల్లో కనిపిస్తుంది. కామదహనం జరిగాక శోకిస్తూ ఆ బూడిదను పూసుకునే ఆచారం కనిపిస్తుంది.

**మౌఖిక ఆధారాలు :**

1. ఎం. లక్ష్మమ్మ, 80 సం॥ - అనంతపురం (గుర్రపుగారిపల్లి), ఓడిసి మం॥
2. ఎం. మహేశ్వరి, 20 సం॥ - అనంతపురం (గుర్రపుగారిపల్లి), ఓడిసి మం॥
3. ఎం. లక్ష్మీపతి నాయక్, 27 సం॥ - అనంతపురం (గుర్రపుగారిపల్లి), ఓడిసి మం॥
4. బి. బాలాజీ నాయక్, 30 సం॥ - పులివెందుల (కనంపల్లి)
5. డా॥ బి. అరుణ్ కుమార్, 33 సం॥ - పులివెందుల (కనంపల్లి)
6. బి. వేణుగోపాల్ నాయక్ - నాగసానిపల్లి తాండ, ఖాజీపేట మం॥
7. ఇ. శివనాయక్ - ఎర్రగుడి తాండ, చక్రాయపేట మం॥
8. బి. సీకునాయక్ - చిన్నబిడికి తాండ, సుండుపల్లి మం॥

★★★

# రాయలసీమ కథల్లో బహుజన జీవితం

- **కట్టా సుబ్బారావు,** తెలుగు అధ్యాపకులు, యస్. వి .ఏ. ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తి.

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో బహుజన జీవితాల నేపథ్యంలో ఎన్నో కథలు తెలుగు కథా సాహిత్యంలో వచ్చాయి. బహుజనులంటే కులవృత్తులు చేసుకొనేవారు. రిజర్వేషన్‌పరంగా చూస్తే వీరిని వెనుక బడిన తరగతులుగా పరిగిణిస్తారు. తరతరాలుగా మన సమాజంలో కులం కారణంగా మానవ శ్రమ సంస్కృతి అవహేళనకు గురికావడం, అలాగే ఆధునికత, ప్రపంచీ కరణ నేపథ్యంలో కులవృత్తులు ఒడిదుడుకులకు లోనుకావడం ఎంతోమంది రచయితలను ఆలోచింప చేసింది. బహుజన కథను గౌరవించడమంటే మానవ శ్రమను, సంస్కృతిని గౌరవించడం కుల దృక్పథం కలిగిన భారతదేశానికి లేదు. ఈ దేశంలో శ్రమను అవమానించే సంస్కృతే అన్ని రంగాల్లో కొనసాగుతుందన్న బి.యస్. రాములు గారి మాటలతో ఏకీభవించిన ఎంతోమంది రచయితలకు బహుజన జీవితం కొత్త వస్తువైంది. ఇందుకు రాయలసీమ రచయితలు మినహాయింపు కాదు.

రాయలసీమకు సంబంధించి బహుజనుల జీవితాలను గురించి ఎక్కువగా తన కథల్లో చిత్రించింది రాసాని వెంకట్రామయ్య (వి.ఆర్.రాసాని). ఈయన కథల్లో ఎక్కువగా బహుజన జీవితం బహువిధంగా కనిపిస్తుంది. కులాల కుంపట్లు నేపథ్యంలో దేవుని విగ్రహాల ఊరేగింపులో జరిగిన ఘర్షణలో అమాయకుడైన రంగన్న గాయాలు పాలవడం, కొడుకు బాలకృష్ణన్ని కోల్పోవడం వంటి సంఘటన ద్వారా అగ్రకులాలు, బహుజనుల మధ్య గల వైరుధ్యాలను తన 'మెరవణి' కథలో చక్కగా విశ్లేషించారు. అలాగే 'కొలిమి' కథలో కంసాలులకు సమాజంలోని ఇతర వర్గాలతో గల సంబంధాలను, ఆ వృత్తిలో ఎదురయ్యే సాదక బాధకాలను గురించి చాలా చక్కగా చిత్రించారు. 'సురసాగర మథనం'లో మురికి బట్టలు ఉతికే చాకలి తన వృత్తి జీవితంలో ఎదుర్కొనే అవమానాలను, అవహేళలను చక్కగా ఆవిష్కరించారు. అలాగే కుప్పం పరిసర ప్రాంతాలలో వీధి నాటక కళా కారుల దుర్భర జీవితాల నేపథ్యంలో సాగే 'పగటి తారలు' 'తపస్సు' కథలు చిధ్రమైన బహుజనుల బతుకు చిత్రాలకు ప్రతిబింబాలుగా చెప్పుకోవచ్చు. 'నేలరాలిన వసంతం' కథలో గొర్రెలు మేపే పిల్లవాడు కళ్ళు పోగొట్టుకున్న వైనాన్ని ఎంతో విషాదభరితంగా చిత్రించాడు. 'గాలిచెట్టు' కథలో మునిలక్ష్మి తొలుత భర్త నిరాదరణలకు గురౌతుంది. కాలగమనంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న మునిలక్ష్మి తన బిడ్డతో ధైర్యంగా జీవిస్తుంది. తల్లీబిడ్డల సంబంధాన్ని పుడమి చెట్టుల సంబంధంగా భావిస్తుంది. ఈ క్రమంలో భార్యాబిడ్డలకు దగ్గరవ్వాలని తపించిన ఆమె భర్త వెంకట మునిని ఈసడించుకుంటుంది.

బండి నారాయణ స్వామి రాయలసీమకు చెందిన ప్రముఖ కథకుడు, నవలాకారుడు. ఈయన రాసిన అనేక కథలు బహుజన జీవితంతో ముడిపడినవేనని చెప్పుకోవచ్చు. అలాగే కుల సంస్కృతి అవశేషాలను అనేక కోణాల్లో ఈయన ఆవిష్కరించాడు. 'ఎవరి వేరు ఎక్కడ' అన్న కథలో భూమితో గల అనుబంధం అగ్రవర్ణాలకు, అణగారిని వర్గాలకు ఒకే విధంగా ఉండదని, భూమి గురించి ఆలోచించే తీరు బ్రాహ్మణులకు, బిసీలకు మధ్య ఎంత అంతరం ఉంటుందో తులనాత్మకంగా చిత్రించారు. 'అవశేషం' కథలో వెనుకబడిన కులాలలో ముఖ్యంగా కురుబలలో గల సంప్రదాయాలను, వైరుధ్యాలను చక్కగా విశ్లేషించారు.

చిత్తూరు జిల్లా, సోమల ప్రాంతానికి చెందిన తుమ్మల రామకృష్ణ పల్లెమంగలి కథలు మంగలి వృత్తిలోని సాదక

బాధకాలను చిత్రించాయి. ముఖ్యంగా 'అడపం' కథలో మొగిలప్ప అనే మంగలిపై నరసయ్య అనే రైతు కక్ష కట్టి మొగిలప్పకు పని ఇవ్వకుండానే వేరే గ్రామంలోని క్షురకుల్ని పిలిపించి వారిచేత పనిచేయిస్తుంటాడు. ఇది సహించలేని మొగిలప్ప ఎంతో ఆవేదనతో అడపం (పని ముట్ల పెట్టె) కాలవలోకి పారేస్తాడు. చివరకు తన కులవృత్తినే మానేస్తాడు.

కడప జిల్లాకు చెందిన వేంపల్లి గంగాధర్ బహుజన కథకుడిగా చెప్పుకోచ్చు. 'కొయ్య బొమ్మలు' కథలో కర్రతో బొమ్మలు తయారుచేసి అమ్మేవారి కష్టాలను కడగండ్లను, అలాగే వారిపై ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలను అక్షరీక రించారు. అలాగే 'నేల దిగిన ఊడ' కథలో ఎద్దుల కాళ్ళకు నాడాలు కొట్టి పొట్ట పోసుకునే వారి జీవిత చిత్రాన్ని ఎంతో హృద్యంగా ఆవిష్కరించారు. ఇంకా వీరి 'మైనం బొమ్మ' కథలో పేదరికం కారణంగా దళారుల మాయలోపడి మహిళలు ఏవిధంగా పడుపువృత్తిలోకి దిగుతున్నారో కరుణరసాత్మకంగా చిత్రీకరించాడు. ఇంకా వీరి 'శిలబండి', 'హంసనత్తు', 'వాడొక్కడు' వంటి కథలు బహుజన బతుకులకు నిలువుటద్దాలుగా చెప్పుకోవచ్చు.

జి.వెంకటకృష్ణ కర్నూలు జిల్లాకు చెందిన వర్ధమాన కథకుడు. బహుజనుల నేపథ్యంలో 'గరుడ స్తంభం', కథల సంపుటిని వెలువరించారు. 'దీపపు చెమ్మ' కథలో దాసరి ఐదెకరాల రైతు. ఆ వూరిలో రైతు సంఘానికి అధ్యక్షుడు రెడ్డి. దాసరి పేరుతో రెడ్డి బినామీ లోను తెచ్చుకొని వాడుకుంటాడు. ఆ అప్పును దాసరి కట్టాల్సి వస్తుంది. తాకట్టులో పొలం పొగొట్టుకుంటాడు. విధిలేని పరిస్థితులలో మళ్ళా కులవృత్తిని చేపట్టి గరుడస్తంభం పట్టుకొని తిరగడాన్ని, అగ్రవర్ణాల జులుంను ఈ కథలో చక్కగా చిత్రించారు. ఈయన రాసిన 'దృశ్యాదృశ్యం' కథలో ఓ మంగలి జీవన పోరాటాన్ని చిత్రించాడు. శ్రీశైలం ప్రాజెక్టు ముంపు కారణంగా తన గ్రామంలో తన కులవృత్తిని కోల్పోయి అడపం చేతబట్టి పట్నం చేరుకుం టాడు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. అతనితోపాటు ఆ వూరి రెడ్డి టౌనుకు వస్తాడు. కానీ ఆర్థికంగా నిలదొక్కు కునే క్రమంలో అగ్రవర్ణాలకు కులం బలం వెన్నుదన్నుగా నిలుస్తుందన్న నగ్న సత్యాన్ని ఈ కథలో తెలియజేస్తాడు. అలాగే 'కూలిన గూడు' కథలో చాకలి కులంలో పుట్టిన ఓ యువకుడు ఫాక్షనిజానికి దూరంగా బతకాలనుకొని పట్నానికి చేరుకుంటాడు. పట్నం చేరుకున్నా ఫాక్షనిజం అతన్ని నీడలా వెంటాడుతుంది. చివరకు రజక సంఘం ద్వారా ఆ యువకుడు ఫాక్షనిస్టులను ఎదుర్కోవడం జరుగుతుంది. 'వేపకాయంత నిజం' కథలో గొల్లలకు వేపకాయంత వెర్రి అనే సామెతను తలకిందులు చేస్తూ వారిలో పెరుగుతున్న రాజకీయ చైతన్యాన్ని, రాజకీయ పదవులకు పోటీపడే క్రమాన్ని చక్కగా విశ్లేషించాడు.

చిత్తూరు జిల్లాకు చెందిన జిల్లేళ్ళ బాలాజీ తన 'సిక్కెంటిక' కథల సంపుటిలో ఊరూరా తిరిగి వెంట్రుక లతో తయారు చేసిన సవరాలు అమ్ముకునే బడుగు జీవుల బతుకు చిత్రాన్ని చక్కగా ఆవిష్కరించారు.

అనంతపురం జిల్లా చెందిన చిలుకూరి దేవపుత్ర దళిత బహుజన జీవితాలను, అనావృష్టి కారణంగా వలస కూలీలుగా మారుతున్న వైనాన్ని 'మన్నుతిన్న మనిషి' వంటి కథలో చక్కగా చిత్రించారు. వడ్రంగి జీవితాలకు సంబం ధించిన కథల్లో సుంకోజి దేవేంద్రాచారి రచన 'అన్నం గుడ్డ' కులం మూలాల్ని, చేతివృత్తుల వాళ్ళ జీవితాలు ఆధునికత సాధించిన ప్రగతికి ఏవిధంగా కకావికలం అయ్యాయో తెలిపే కథ.

మన సమాజంలో దాదాపు 85 శాతం మంది బహు జనులే. కానీ ఆ మేరకు బహుజనుల గురించిన కథా సాహిత్యం వెలువడలేదు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాయలసీమలో ఫాక్షన్ కథలు కన్నా, కరువు కథలు కన్నా బహుజన కథలే ఎక్కువగా వచ్చాయని చెప్పుకోవచ్చు. అయితే ఆశించినంత స్థాయిలో ఆయ కథల్లోని బహుజన జీవితాన్ని గురించిన చర్చ గానీ, విశ్లేషణగాని జరగక పోవడం బాధకరమైన విషయం. ఈ దిశగా రాయలసీమకు చెందిన రచయితలు, సాహితీవేత్తలు ముందడుగు వేస్తారని ఆశిద్దాం. ★

# కొత్త దుప్పటి కథాసంపుటిలోని గ్రామీణ వాతావరణం

- డా॥. (శ్రీమతి) ఎం. ప్రఫుల్లా, అసోసియేట్ ప్రొఫెసర్, శ్రీ సత్యసాయి ఇన్సిస్ట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్, అనంతపురము.

రాయలసీమను రతనాల సీమగా అభివర్ణించారు ఒకనాడు. నేడు అంతటి వైభవాన్ని సంపదను కొల్పోయిన ఈ నేలను రాళ్ళసీమ అంటూ వెటకారం చేస్తున్నారు. ఒకనాడు పల్లెలు ఆత్మీయతలు, అభిమానాలు, వేడుకలు సంబరాలు మొదలగు వాటికి నిలయాలుగా ఉండేవి. కాని ఈనాడు సీమ పల్లెల పరిస్థితి దీనికి భిన్నంగా వుంది స్వార్థం, స్వప్రయోజనం, కక్షలు, కార్పణ్యాలు, కరువు కాటకాలు, హత్యలు, దొంగతనాలు, మొ॥ వాటికి చోటు కల్పిస్తున్నాయి. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి కథల సంపుటి 'కొత్త దుప్పటిలో' పాఠకులకు ఇలాంటి వాతా వరణం కనిపిస్తుంది.

## వ్యవసాయం :

రాయలసీమలో వ్యవసాయం అంతా వర్షం మీద ఆధారపడినదే. సకాలంలో వర్షాలు లేక వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూపులు చూస్తూ చివరికి పెట్టుబడి కూడా దక్కని పరిస్థితులను వెంకటరామిరెడ్డి గారు కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఒక్కవాన చాలు కథలో "ఒక్క వానొస్తే చాలు ముక్కాలు పంట దక్కినట్టే" అన్న రమణ మాటల్లో ఆశాభావం, "పదిరోజులట్నే ఉంటే గుంటికలు కట్టాలన్న" కృష్ణ మాటల్లో ఆవేదన, "ఉత్తర కార్తెలో ఉరుముతే కాయంగా వానొచ్చుద్దెన్నా" అనే మూగెన్న మాటల్లో అనుభవం కనిపిస్తాయి.

"ఉత్తర చూసి ఎత్తర గంప" అని సామెత. ఉత్తర కార్తెలో వర్షాలు లేకపోతే ఇక వలసలే శరణ్యం. ఉత్తరలో వానలేదు. "ఉరిమి ఉరిమి ఉత్తర కార్తె దాటింది. హస్తలో సగం జరిగింది. వాన ఒంగలేదు. పైరంతా కొసలు కొసలు ఎండి పోయింది", "చెరువు తెగిపోకుంటే ఇంత బాధ లుండేవి కావు". అనడంలో పెట్టిన పైరుకు కనీసం నీరు లేకుండా పోయిందన్నది స్పష్టం. తెగిన కట్టను బాగు చేయించే ఆలోచన కూడా గ్రామ పెద్దలకు లేకపోయింది. "వేరు శెనగ దాదాపు పూర్తిగా ఎండిపోయింది దానికేసి చూసేందుకు కూడా మనస్కరించక పగలు చేనికేసి వెళ్ళటం లేదు" యజమాని. కనిపించిన వారినంతా వాన వస్తుందా అని ఆశగా ప్రశ్నిస్తున్నాడు. చివరకు బంగాళా ఖాతంలో వాయుగుండం కారణంగా "వారం రోజులు మింటికి మంటికి ఏకధారగా వాన కురిసింది"వాన వెలిసిన తరువాత చేని వద్దకు వెళ్ళిన రైతు హతాశుడయ్యాడు "చెట్లు కనిపించలేదు అసలు చేనంతా నల్లగా ఉంది. ఆకులన్నీ కుళ్ళిపోయి నేలకు అంటుకొని ఉన్నాయి. వానకోసం ఆశగా ఎదురుచూసిన రైతుకు కనీసం గొడ్డు మేత కూడా దక్కకుండాపోయింది ఈ పాపిష్టి వానతో" అని వర్షాన్ని తిట్టుకున్నాడు. స్వాతి కార్తెలో "నీళ్ళ తడికి గతిలేని వాననే నముకున్న చేలల్లో ముక్కాలు భాగం ఎండిపోయిన పైరు, ఈ వాన దెబ్బకు ఊడలతోసహా కుళ్ళిపోయింది". రాక రాక వచ్చిన ఈ వాన రైతు కళ్ళ చెరువుల్ని అలుగులు పొంగేలా నింపి వెళ్ళింది" ఇలా ఉంటుంది. రాయలసీమలో అతివృష్టి లేదా అనావృష్టి .

పైరును, పండిన పంటను, కళ్ళాల్లో చేర్చిన ధాన్యాన్ని, గట్టున వేసిన గడ్డిని, పందుల నుండి బర్రెల నుండి పక్షుల నుండి రక్షించుకోవడం ఒక యాగం "ఏ చేనిలో చూసినా చేని మధ్యలో కంచె, కంచె మీద మనిషి, మనిషి చేతిలో వడిసెల, ఎగిరే రాళ్ళకు, కేకలకు బెదిరి శపిస్తూ దూరంగా దూసుకెళ్ళే చిలుకలు"[5]

కళ్ళాలకు చేర్చిన ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం రాత్రంతా రైతన్నలు కళ్ళాల దగ్గర కాపలా "దొంగమను షులకు లాగే దొంగ గొడ్లకూ కాపలా కాయాలి. కొందరు తెల్లవారుజామున పాలు పిండుకోగానే దొంగగడ్డి కోసం బర్రెల తలుగులు విప్పుతారు. అవి వాటి శక్తి వంచన

లేకుండా కడుపునింపుకొస్తాయి. బంధించి బందెల దొడ్డికి తోల్దామంటే చేతులకు దొరకవు''

''కరువుకు తోడు అడవి పందుల పోడు ఎక్కువైంది. ఏమారితే చాలు చేనంతా దున్నిపారేస్తున్నాయి'' ''నల్లటి గుండ్రాళ్ళు పేర్చినట్లుగా పందుల మంద చేలల్లోకి చొరబడతాయి. ఒకళ్ళ కేకలు విని మరొకళ్ళు లేచి వాటిని తరిమే సరికి తెల్లారి కోడికూస్తుంది. పునర్వసు కార్తె మొదలు తమ మగాళ్ళనెవర్నీ ఇంటి కాడ ఉంచనీయ ట్లేదు. ఈ పందులు మందలు మందలుగా వచ్చి రాత్రిళ్ళు చేలల్లో పడి పైరంతా నాశనం చేస్తున్న వీటికి కావలి పడుకోవడం తోటే సగం జీవితం గడిచిపోతుందని, ఇల్లాళ్లు వాపోతుంటారు.

పాపం కొత్త దంపతులకు కూడా ఈ ఎడబాటు తప్పడం లేదట. ఇలా ఉంటాయి పంటకాలంలో రాత్రిళ్ళు. చలి, గాలి, వానలకు అతీతంగా కాపలా కాస్తూంటారు రైతులు. ఆ కష్టాల్లోనే వెన్నెల భోజనాలు కబుర్లు లాంటి చిన్ని చిన్ని ఆనందాలను వెతుక్కుంటారు పల్లె ప్రజలు. ''కళ్ళాలలో ఇంకా సద్దుమణగలేదు. పల్చటి మజ్జిగలాంటి పంచమి చంద్రుని కాంతిలో కొందరు భోంచేస్తున్నారు. ఇంకొందరు లోకాభిరామాయణాలు బిగ్గరగా చర్చించుకొంటున్నారు. కొన్ని కళ్ళాలలో తల్లుల వెంట ఇంటికెళ్దామని పిల్లలు మారాం చేస్తున్నారు.

## రైతుల జీవితాలు :

''చినుకు రాల్చని గగనం.... పాతాళానికి చేరిన జలం... బీళ్ళుగా మారిన పొలం... కన్నీళ్ళ పాలయిన రైతు జీవితం'' ''అమ్మా నాన్నలు అదృష్టవంతులు. రైతుల్ని ఆత్మహత్యలు దిశగా తీసికెళ్ళే వ్యవసాయాన్ని కళ్ళ చూడకుండానే వెళ్ళిపోయారు'' అనుకుంటారు. 'తమ్ముడి ఉత్తరం' కథలోని ఉపాధ్యాయుడు. కరువులూ, అప్పులూ, సంతకు తోలే పశువులూ, నిలువెండిపోతున్న చెట్లూ వానల్లేక పోవడం వలన పల్లెల్లో తాగేందుక్కూడా నీళ్ళు లేవుట. రెండేళ్ళ నుంచి కె.సి కెనాల్‌కు నీళ్ళు వదలకపోవడం వలన ఆయకట్టు కింద కూలీలే కాకుండా ఆ ఆయకట్టు మీద ఆధారపడి బతికే జనం కూలికోసం ఇరుగు పొరుగు టౌన్లు చేరుతున్నారు. ''నేను గుటకా బాగా బతికినోన్నేలే సిన్నోడా! కాలం కలిసిరాక యిటొచ్చినా! పదెకరాలం పొలం, బోరు, కుంటనీళ్ళు, ఎందుకులే నాయనా అయ్యన్నీ! వానదేవుడు కన్నుదెర్సాలగానీ భూమి లేకి ఎన్ని బొక్కలు దించితేం ఏ లాభం? బోర్లు బేసి బేసి నీళ్ళు పడక... అప్పులు పాలై... కొడుకు పురుగుమందు తాగి సచ్చినా... మనమండ్ల కోసరం మొండిగా బతుకుతా.... ఏం జెయ్యాలయ్యా! వానదేవుడు దెబ్బకొట్టె '' అంటాడు. 'దెబ్బ' కథలో రామిరెడ్డి[12] 'కూలి నాలి జనమే పనుల్దొరకక కడుపు చేత పట్టుకొని టౌనుకొస్తున్నారనుకొన్నాడు. కానీ రైతుల్ని సైతం వూరు విడిచి కూలిపనులు వెదక్కోనేలా యీ కరువు వాళ్ళ జీవితాలు ఛిద్రమయ్యేంతగా దెబ్బతీస్తుందని రామిరెడ్డి ప్రత్యర్థి ఊహించలేదు.

## పశువులు :

కరువు కాటకాల కారణంగా పశువులకు పచ్చగడ్డి లేకపోవడంతో వాటిని పక్కవాళ్ళ పొలాలకు దొంతమేత లకు తోలేవాళ్ళు కొందరైతే మరి కొందరు ఎవరూ కాపలా లేని సమయంలో గడ్డి దొంగతనం చేసేవారు. చేలు, గట్లు లేని గొడ్లపాడి మీదే బతికేవాళ్ళు ''ఆ చేలో పిడికెడో ఈ గెట్టున కనికెడో కోసప్పోకుంటే మా బరుగొడ్లు మాత్రం ఎట్టా బతకాలా'' అంటారు ఆ గడ్డి దొంగలు. ''ఎవరూ తరిమే వాళ్లే... సిలకల్ని తరిమినట్లు ఏ గెట్టు మీద వొంగనియ్యరు ఏ చేలో గడ్డి పెరకనియ్యరు. గంపెడు గడ్డి పెరక్కపోవాలంటే కన్నమేసి దొంగతనం జేసినంత కష్టమై కష్టమైతాంది. ఏ గెట్ల మీద గడ్డి తీసప్పోకుంటే మా బరుగొడ్డెట్టా బతకాలి'' అని వారి దు:ఖం

## విద్య :

గ్రామాల్లో పాఠశాలలుంటాయి. కానీ విద్యార్థులుం డరు ''పేర్లు మాత్రం అరవైకి పైగా ఉన్నాయి. హాజర య్యేది ఏనాడు ముప్ఫైకి మించలేదు. కొందరు ప్రైవేటు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

స్కూళ్ళకు.... ఇంకొందరు పొలాలపైకి. పిల్లల్ని బడిలోకి రప్పించలేక పోవడం తన చేతగానితనంగానే అభిప్రాయ పడుతున్నాడు మండల విద్యాశాఖాధికారి." అన్న ఉపాధ్యాయుడు రమణ మాటల్లో పరిస్థితులు ఎలాంటివో స్పష్టమవుతాయి "నెల రోజుల్నించి నువ్వు బడుకొస్తాంటే మరి పిల్లోల్లంతా ఎందుకుండారు సారూ? ఎంత మంది పేర్లుండాయి? ఎంతమంది బడికొస్చాండరని సూసుకొని వూర్లోకొచ్చేది లేదా" గ్రామ సర్పంచ్ కొత్త టీచర్ తనను కలవలేదనే అక్కసుతో అధికారం దర్పం చూపిస్తాడు ఇలా.

**కక్షలు :**

రాయలసీమ గ్రామాల్లో పగలు, ప్రతీకారాలు ఈ మధ్య కాలంలో సర్వసాధారణమయ్యాయి. ఓర్వలేని తనంతో చిన్న చిన్న దొంగతనాలు మొదలుకొని కోర్టులు, కేసులు, హత్యలు, కిరాయి హంతకులు ఇలాంటిని లెక్కలేనన్ని 'గిరిగీ యొద్దు' కథలో పక్కింటి మీది అసూయతో కోడిని చంపినాడు. దూడకాలు విరగ్గొట్టి నాడు, పేడ దొంగిలించి తన దిబ్బ నింపుకున్నాడు ముసలోడు రామయ్య. కొక్కొరొకో కథలో "భూముల రేటు ఎక్కువేయించేందుకు ఆర్డీవోను ప్రసన్నం చేసుకోవాలని" రైతులు మనిషికో పుంజను రెడ్డి ఇంట్లో ఇవ్వాలనే ఒప్పందం మీద మూర్తి పరాయి వాళ్ళ కోడిపుంజును దొంగిలించాడు. అక్కడి పేదరికం అలాంటిది. "వాళ్ళు మా పార్టీ కాదు" కథలో రెండు రాజకీయ వర్గాలు నీటికి కటకట అయినా, ఊరి బయట ఉన్న బోరుబావిలో నీటిని ఒక పార్టీ వారు మరో పార్టీవారిని వాడుకోనియ్యరు. "వాళ్ళీ బోరుకాడికి రారు. వచ్చినా రానియ్యం, "వాళ్ళు మా పార్టీ కాదు" నిజానికి హరిజనులు కూడా ఆ బోరు దగ్గరే నీళ్ళు పట్టుకుంటారు. పార్టీలు మధ్య వున్న విభేదాలు అంటరానితనం కంటే కష్టంగా ఉంది.

తడి అనే కథలో అక్క చెల్లెళ్ళ పిల్లలే ఒకళ్ళ మీద ఒకళ్ళు పగలు, ప్రతీకారాల కోసం కోర్టులో కేసులు పెట్టుకుని ఉన్న ఆస్తులను తెగనమ్ముకుంటారు.

"అతను మామూలు రైతే కాకుంటే ఈ మధ్య తన వాళ్లందరి ప్రేరణ మీద రాజకీయాల్ని పూసుకొని ప్రెసిడెంటు దృష్టిలో దోషి అయ్యాడు. కేవలం ఐదు వేలకే ఓ కిరాయి హంతకుడు ఆ రైతును చంపినాడు. తన తండ్రిని చంపినవాడిని చంపేందుకు సహవాసగాళ్లతో తిరుగుతుంటాడు. ఇలా గ్రామాల్లో కక్షలకు అంతంలేకుండా పోతుంది.

వసంతాలాడడం, పెద్ద పండగ సందర్భంగా దేవాలయం దగ్గర పారువేటు వంటి సంబరాలు తప్ప ఈ కథా సంపుటిలో వేడుకల గురించి విస్తారంగా కనిపించదు.

★★★

# వైసివి రెడ్డి కథలు – పరిశీలన

– యస్. గంగాధర రెడ్డి, పరిశోధక విద్యార్థి (ఎస్.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం,కడప.

కడప జిల్లా కవులకు, కళాకారులకు పుట్టినిల్లు. తొలి తెలుగుశాసనం లభించినచోటు. ఈ ప్రాంతంలో ఎంతో మంది కవులు, కళాకారులు, రచయితలు జన్మించి సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

కడప జిల్లా తెలుగు సాహిత్యంలో వైసివి రెడ్డి ప్రఖ్యాతమైన కవి. వీరు 1926 సంవత్సరం పులివెందుల తాలూకా బోనాల గ్రామంలో జన్మించారు. ఈయన స్వయంగా కవి, కథకుడు, విమర్శకుడు. రెడ్డిగారి రచనలలో ప్రధానంగా తొలకరి చినుకులు, మేనక, రంభ, సింధూరరేఖ, రాయబారం, పారిజాతం, గట్టిగింజలు కథా సంపుటి మొదలైనవి. ఈ రచనలన్నింటిలో గట్టిగింజలు విశిష్టమైనది.

వైసివి రెడ్డి కథలలో ముఖ్యంగా వెట్టిచాకిరి, పేదరికం, ఆకలి, ఆధిపత్యం, కరువుకాటకాలు, రైతుల సమస్యలు, కూలీల సమస్యలు, బాల్య వివాహం మొదలైనవి ప్రధాన మైన అంశాలుగా దర్శనమిస్తాయి. రెడ్డిగారి కథలు ఎక్కడా అల్లినట్లు కనిపించవు. ప్రకృతి సిద్ధంగా ప్రకాశిస్తాయి. ఈ కథలలో పల్లె జీవితం ప్రత్యక్ష్యంగా పరవళ్లు తొక్కుతూ ఉంటుంది.

వైసివి రెడ్డి గారి కథలలో పాత్రల విషయానికొస్తే, రచయిత సృష్టించిన పాత్రలన్నీ కష్టపడే తత్వం గలవి. ఆత్మాభిమానాన్ని నరనరాల్లో జీర్ణించుకొన్నవి, అక్కడక్కడ దోపిడీని వ్యక్తం చేసే పాత్రలు కూడా ఉన్నాయి. రచయిత పాత్రలను ఎంచుకోవటంలో నేర్పరి. అంతేగాక రెడ్డిగారు రచించిన ఇరవైఒకటి కథలలో పేదవారి పాత్రలే ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వ్యాసంలో అన్ని కథలను ప్రస్తావించటం కష్టతరం కాబట్టి కొన్నింటిని మాత్రమే వివరించడం జరిగింది.

## గట్టిగింజలు కథలు :

### మంచివాళ్ళు :

రెక్కాడితేగాని డొక్కాడని పేదస్త్రీ గంగమ్మ కథ. భర్త పెళ్లైన రెండు సంవత్సరాలకే వదలి వేయడంతో గంగమ్మ కూతురితో కలసి జీవితాన్ని సాగించటం కష్టతరమైన పరిస్థితుల్లో ఇతరుల సహాయాన్ని ఆశించని ఆత్మాభి మానం గలస్త్రీ. ఈ కథ అంతా ఉత్తమ పురుషలో సాగుతుంది. గంగమ్మకు ఏదోరకంగా ఉపయోగపడాలనే పాత్ర రచయితది.

### గుడిసె దక్కింది :

కూలీగా జీవనం సాగించే రామయ్య కుటుంబ పరి స్థితిని చిత్రించే కథ గుడిసె దక్కింది. శరీర కష్టం ద్వారా తన కుటుంబానికి మూడు పూటలా అన్నం పెట్టలేని పరిస్థితి రామయ్యది. తన కుటుంబం నివాసం ఉండ టానికి ఒక చిన్న స్థలంలో పూరిగుడిసె కట్టుకుంటే ఆ స్థలం నాదని ఒక భూస్వామి వాదించటంతో రామయ్య ఆ ఊరి కరణాన్ని ఆశ్రయిస్తాడు. అప్పుడు ఆ భూస్వామి పొలానికి రాత్రిపూట కాపలా ఉండమని ఒప్పందం చేయిస్తాడు కరణం. కాని ఆ ఒప్పందం ఎన్ని రోజులకు చేసుకున్నాడనే విషయం చెప్పకపోవటంవల్ల ఆ భూస్వామి కుటుంబానికి వెట్టిచాకిరి చెయ్యటాన్ని గమనించిన ఆ ఊరిలో కొందరు ప్రజలు రామయ్య తరపున వాదించారు, కొట్లాడారు. ఫలితంగా గుడిసెతో పాటు స్థలం కూడా రామయ్యదేనని ప్రభుత్వం నిర్ణ యించి ఇంటికి పట్టా మంజూరు చేసింది. మొత్తం మీద రామయ్యకు గుడిసె దక్కింది.

స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో సంవత్సరాలైన ఒక కూలీ సొంత ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్నాడంటే దేశంలో

దారిద్ర్యం ఏ స్థాయిలో ఉందో మనకు ఈ కథ ద్వారా స్పష్టమవుతుంది.

**దొంగ బర్రెగొడ్లు :**

ఒక మధ్యతరగతి రైతు రామయ్య వ్యవసాయ అస్థిత్వాన్ని వివరించే కథ ఇది. రాయలసీమ ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడ్డ ప్రాంతం. రైతు పంటను విత్తినప్పటి నుండి పంట చేతికొచ్చేదాకా పందులు, బర్రెలు, దున్నపోతులు మొదలగు జంతువుల నుండి కాపాడుకోవటం నేటికి కష్టతరమైనపని.

ఈ కథలో ప్రధాన పాత్ర రామయ్య భార్య సీతమ్మ వీరికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి సంతానం. కూతురు పెళ్ళీడుకొచ్చిందని మంచి సంబంధం చూసి పెళ్లి చేయాలని భార్య ఎన్నోసార్లు చెబుతూ ఉంటుంది. కాని ఆర్థిక పరిస్థితి సరిగాలేకపోవటంతో రామయ్యకు తాను ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు. ఈ సందర్భంలో తోబుట్టువు రాములమ్మ ఆస్థినమ్మి కూతురికి పెళ్లి చెయ్యమని రామయ్యను నిలదీస్తుంది. చివరకు చేసేదేమీలేక గంగిరెడ్డి, వీరారెడ్డి, రంగారెడ్డిల దగ్గర తన భూమిలో కొంత తాకట్టు పెట్టి, ఐదు వేలరూపాలు అప్పు తెచ్చి కూతురు పెళ్ళి ఘనంగా జరిపించాడు. కాని సంవత్సరాల తరబడి పంటలు పండక పోవటం వలన మూడు ఎకరాలు భూమి అమ్మి వీరారెడ్డి, రంగారెడ్డిల అప్పు తీర్చాడు. తర్వాత గంగిరెడ్డి అప్పుతోపాటు ఎకరాతోట నాలుగు ఎకరాల చేను మిగిలింది. గంగిరెడ్డి అప్పు తీర్చమని బలవంతం చేయడంతో రామయ్య తన మనసులో ఇలా అనుకుంటాడు.

“ఇంతకుముందు దొంగబర్రెగొడ్లును గురించి ఆలోచించేవాణ్ణి. ఇప్పుడు అప్పులిచ్చినవాళ్ళను గురించి ఆలోచించాల్సి వస్తుంది. కాపలా ఉండి తోలితే బర్రెగొడ్లు పోతాయి. మరి అప్పులోళ్ళో![1] అంటూ విసుక్కుంటూ గొనుక్కుంటూ ఉంటాడు. రైతే రాజు అని అంటారేగాని నిజజీవితంలో రాజసం కరువేనని తెలుస్తుంది. నేటి పరిస్థితుల్లో రైతులకు రాజవైభవం లభించటం గగనమే.

**కుట్రల్లో కూలోడు :**

సమర్థుడైన ఒక కూలీ అతడు ఒక చిన్నకారు రైతుగా బ్రతకాలనే ఆశతో కష్టపడి పొలాన్ని తయారు చేసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. కొందరి కుట్రలకు బలై మళ్లీ కూలీగా మారే వైనాన్ని వర్ణించే కథ కుట్రల్లో కూలోడు.

గంగడు మంచి కూలీ, సేద్యగాడు. జీవితంలో చిన్నకారురైతుగా బ్రతకాలనే ఆరాటంగల వ్యక్తి. భార్య లచ్చితో కలసి కొంత బంజరు భూమిని పైరు పెట్టడానికి తయారుచేసుకుంటాడు. వర్షంపడి పదును అయిన తర్వాత సేద్యపు పనులకు వెంకటరెడ్డి ఎద్దులుపయోగించుకుంటాడు. అందుకు ప్రతిఫలంగా వెంకటరెడ్డి పొలంలో కొన్ని రోజులు మధ్యాహ్నం వరకు పనికి వెళ్ళే విధంగా గంగడు మాట్లాడుకున్నాడు. వెంకటరెడ్డి గంగడి శ్రమను ఏవిధంగానైనా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. పంట ఖర్చులకు సోమిరెడ్డి గంగడికి అప్పు ఇస్తాడు. డబ్బు సాయం చేసినందుకు సోమిరెడ్డి ఇంట్లో పనికి పంపడానికి తన భార్య లచ్చిని ఒప్పిస్తాడు.

పంట బాగానే పండింది. సోమిరెడ్డి ఖర్చులు పోనూ ఐదు మూటెలు కొర్రలు, చెత్త మిగిలాయి. గంగడు, లచ్చి తమ కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని సంతోషపడ్డారు. కాని వెంకటరెడ్డి కుట్రలో ఇరుక్కున్నామని వారికర్థం కాలేదు. తమ భూమికి శాశ్వత పట్టా ఇప్పిస్తానని మభ్యపెడుతూ వెంకటరెడ్డి నాలుగు సంవత్సరాల తర్వాత పట్టా అయితే ఇప్పించాడు కానీ, అందుకయ్యే ఖర్చు ఐదు మూటెల కొర్రలు, చెత్త కాక అదనంగా రెండువందల రూపాయలు ఖర్చు చేసినట్లు వెంకటరెడ్డి చెబుతాడు. వడ్డీ మొదలు రెండువందల రూపాయలకు మూడు సంవత్సరాలకు ఆరువందలైంది. వడ్డీ కట్టడానికి గంగడు పొలాన్ని రాయించుకున్నాడు వెంకటరెడ్డి. అయితే ఇంకా అసలు మిగిలే ఉంది.

నిజానికి గంగడు, లచ్చి కష్టపడి పనిచేసినందుకు వెంకటరెడ్డి, సోమిరెడ్డి ఉచితంగా పంట సాగుకు సాయం

చేయాలి. కానీ కష్టానికి తగిన ప్రతిఫలం అందకపోవడం వల్ల వారు మళ్లీ కూలీలుగా మిగలాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ కథలో ప్రధానంగా వెట్టిచాకిరి గురించి, అలాగే యజమానులు కూలీలను తమ అవసరాలకు వాడుకొనే విధానాన్ని రచయిత హృదయవిదారకంగా వర్ణించాడు. అంతేగాక కూలీల పట్ల అలసత్వాన్ని క్రింది విధంగా చెప్తాడు.

"నీకేం పోరా కష్టంచేసే వానికి నీవెట్లయినా బాగుం టావు అందరికి పండితే నీకు పండుతాదిలే"[2] అని చెబుతాడు. మొత్తం మీద సమాజంలో కుట్రలకు గురైన కూలీల పరిస్థితికి ఈ కథ అద్దం పడుతుంది.

**గట్టిగింజలు :**

కూలీలంతా కలిసి సంఘంగా ఏర్పడి, తమ హక్కు లను గురించి ప్రస్తావించుకొనే సందర్భంలో ఇద్దరు భార్యా భర్తల మధ్య జరిగిన సంభాషణే ఇతివృత్తంగా సాగిన కథ 'గట్టిగింజలు'.

ఈ కథలో వెంకటమ్మ, దుగ్గన్న భార్యాభర్తలు. వెంకటమ్మకు సినిమాలంటే పిచ్చి. భర్తను సినిమాకు రమ్మని బ్రతిమాలుతుంది. అప్పుడు దుగ్గన్న ఎంకీ నేను ఒకటి చెబుతాను గమనించుకో అని ఇలా చెబుతాడు. ఈ మధ్య సినిమాల్లో ఎగుల్లాడేది ఎక్కువగా ఉంటుంది. పెద్ద పెద్ద మిద్దెలు, టౌన్లు, బజార్లు - కార్లు, ఏందో చూపిస్తా ఉంటారు. ఆడుతూ పాడుతూ పెద్ద మిద్దెల్లో ఏ పనీ పాటా లేకుండా ఎగుల్లాడుతున్నట్లు చూపిస్తు న్నారు. మనబోటోల్ల కత వుంటే పరవాలేదు. ఎక్కడున్నా షావుకారు పిల్ల సన్నోన్ని ప్రేమిస్తుందా? పెళ్ళి చేసు కొంటుందా? నువ్వే చెప్పు. మనల్ని ఊరించేందుకే ఇదంతా! అని చెబుతాడు. తర్వాత వెంకటమ్మ సినిమాకు వెళ్తుంది.

దుగ్గన్న వెంకటమ్మకు తెలియకుండా రాత్రిపూట రోజూ కూలీల సంఘంలో సభ్యుడుగా మీటింగులకు వెళ్తుంటాడు. ఒకరోజు వెంకటమ్మ దుగ్గన్నను రోజూ రాత్రి ఎక్కడి వెళ్తుంటావని అడుగుతుంటుంది. దుగ్గన్న మీటింగ్ గురించి వివరిస్తూ సమాజంలో భూస్వాములు కూలీలపట్ల శ్రమ దోపిడి, రైతులపట్ల అవలంభించే విధానాలు, భూస్వాములు భూస్వాములుగా, కూలీల ఇంకా కూలీలుగా మారే విషయాన్ని చెప్తాడు. వెంకటమ్మ ఇదంతా అర్థం కాలేదు గాని మనకు ఎవరు సరిపోనోల్లో తెలిసిందని మనసులో అనుకుంటుంది.

పేదకూలీలు, తమ కూలీలకు తగిన వేతనం కోసం, అలాగే తమ హక్కులు సాధించుకోవడానికి సంఘటితమై పోరాడాలని ఈ కథ ద్వారా మనకు అర్థమవుతుంది. దేశానికి కూలీలు గట్టిగింజలు అని చెప్పడంలో అతిశయోక్తి లేదని చెప్పవచ్చు.

**ఇంటి మాదిగోడు :**

పారిశ్రామిక విప్లవంవల్ల పల్లె జీవితంలో వచ్చిన మార్పులను చిత్రించే కథ. ఈ కథ ఉత్తమ పురుషలో సాగుతుంది.

ఈ కథలో ప్రధాన పాత్ర రాముడు. హరిజనకులానికి చెందిన వ్యక్తి. తొంబై సంవత్సరాల వయస్సులో కూడా నులక పేడడం, మంచాలు అల్లడం, పగ్గాలు నేయడం మొదలగు పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు.

పూర్వకాలంలో రైతులకు హరిజనులకు మధ్య ఉన్న సంబంధాలను రచయిత రాముడి పాత్ర ద్వారా ఇలా పలికిస్తాడు.

'రైతులు మాకు - మేము రైతులకు అనుకున్నాం. మా వూర్లో మాదిగోళ్ళల్లో నేను పెద్దభాగస్తున్ని. చాకిరీకి రైతుల యిళ్ళను మూడేళ్ళకొకసారి పంచుకొనేవాళ్లం. నాకు ఆణాభాగముండేది. మాపని గాలికాలం నుండి ఉగాది వరకు ఉండేది. మాకాలంలో కవిలె (కపిల) తోలేవాళ్లం. నేడు ఇంజన్లు మోటర్లు వచ్చి మానోటికాడ కూడు పోయింది. అంతే గాక రైతుల ఇంట్లో ఎవరైనా చనిపోతే బంధువుల వూర్లకు పోయి చెప్పి రావాలి. శవాన్ని

పూడ్చడానికి గుంత తొగాలి. మూడు రోజులు గుంతకాడ కాపలా ఉండాలి. మాదిగోడు చేయని పని ఏముందబ్బా![3] అంటూ వివరిస్తాడు.

ఒకప్పుడు వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉన్న పరిస్థితి. కాలక్రమంలో నాగరికథలో మార్పు, డబ్బు మీద వ్యామోహం పెరిగి మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయి.

పైన చెప్పిన కథలలో రైతు కూలీలు ఒక సంఘటిత శక్తిగా రూపుదిద్దుకుంటే వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పవచ్చు. అంతేగాక కాటిగాడు, ఆస్తి విలువ, ఐదురూపాయలు, రెడ్డొచ్చి మొదలెత్తుకో, పరువు ప్రతిష్టలు మొదలగు కథలన్నీ పల్లీయుల జీవితాన్ని చిత్రించాయి.

వైసివి రెడ్డి కథలు భాష విషయంలో ఏం పనబ్బా, బువ్వ నీళ్లు, పురుగు పుట్రా, మోకులు, పగ్గాలు మొదలగు పదాలన్నీ కడప జిల్లా పులివెందుల తాలూకాకు చెందిన మాండలిక పదాలుగా గుర్తించవచ్చు.

## ముగింపు :

సీమ సాహిత్యంలో సమగ్రంగా తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న వ్యక్తి వైసివి రెడ్డి. వీరు పద్య ఛందస్సు అయినా మాత్రా ఛందస్సు అయినా అవలీలగా వాడిన కవి. పల్లెటూరులో నిత్యం మన కళ్లెదుటే మహిళల వాస్తవిక వేదన, సామాజిక దృక్పథాన్ని తన కవితల్లో, కథల్లో ఆవిష్కరించారు. కులమతాలకు అతీతమైన కవిగా చెప్పవచ్చు. నాలుగు దశాబ్దాలుగా అభ్యుదయ రచయితల సంఘానికి రెడ్డిగారు చేసిన సేవలు అనిర్వచనీయం.

## ఆధార గ్రంథాలు

1. వైసివి రెడ్డి - సమగ్ర సాహిత్యం
2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - కథాశిల్పం
3. కడప సాహితి - ఖలందర్

★★★

# రాయలసీమ కథాసాహిత్యం - మనిషి పశువుల సంబంధాలు

- యం. శోభారాణి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాయలసీమ ప్రజలు పశువులను తమ పిల్లలుగా భావిస్తారు. వాటిపై ప్రేమ మమకారాలు పెంచు కుంటారు. పశువులను సంబోధించటంలో ఎద్దులను 'నాయనని', ఆవు, ఎనుములను 'తల్లి' అని పిలుస్తారు. తన పిల్లలకు ఎలాంటి గౌరవం ఇస్తారో. పశువులను అదే విధంగానే గౌరవిస్తారు. ఆవును 'గోమాత'గా పూజిస్తారు. ఎద్దులను కొత్తగా కొని, ఇంటికి తెచ్చినప్పుడు నీటితో శు భ్రపరిచి, గజ్జెలు, గంటలతో అలంకరించి, (నూతన వధూవరులను ఇంట్లోకి ఆహ్వానించినట్లు) కుడికాలు మొదట పెట్టించి, ఇంట్లోకి ఆహ్వానిస్తారు. పశువులకు అనారోగ్యంగా ఉన్నప్పుడు. శ్రద్ధగా చూసుకుంటారు. రాయలసీమంటే కరువు ప్రాంతం. ఎండాకాలం మనుష్యు లకు తిండి, నీరు దొరకటమే కష్టం. పశువులను పోషించట మంటే క్లిష్టమైన పరిస్థితి. ఇలాంటి సందర్భాలలో కూడా రాయలసీమ ప్రజలు తప్పు అని తెలిసినా దొంగ తనంగా నయినా పశువులకు గడ్డి వేస్తారు కాని పస్తులుంచ టానికి ఇష్టపడరు. భార్య మెడలోని తాళి కొదవ పెట్టయినా గడ్డి కొంటారు. ఈ విధంగా రాయలసీమవాసులు పశు వులను ఎంతో ఆప్యాయంగా చూచుకుంటారు. రైతులు, పశువుల పట్ల చూపే ప్రేమకు అవి కూడా వారి పట్ల అలాంటి ప్రేమనే చూపుతాయి. మనిషి పశువుల మధ్య ఉండే సంబంధాలను ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, నవల, నాటక రూపంలో రచయితలు వివరించారు.

ఈ పత్రకోసం నాలుగు కథా సంపుటాలలో రచ యితలు మనిషి పశువుల మధ్య సంబంధాలను ఏవిధంగా చిత్రించారో వివరిస్తాను. అవి

1) సడ్లపల్లె చిదం బరరెడ్డి గారి కొల్లబోయినపల్లె కథా సంపుటిలోని 1) పశువులు 2) జీవన చిత్రం అనే కథలు.
2) జి. వెంకటకృష్ణగారి 'గరుడస్తంభం' కథా సంపుటిలోని (1) పశువుల సంత అనే కథ
3) చిలుకూరి దేవపుత్ర గారి 'ఆరుగ్లాసులు' కథా సంపుటిలోని 'నెర్లు' అనే కథ
4) నామిని సుబ్రమణ్యం గారి 'మిట్టూరోడి' కథా సంపుటిలోని 'పాలపొదుగు' అనే కథలు తీసుకున్నాను.

### 1) కొల్లబోయినపల్లెలోని 'పశువులు' కథ :

రైతు పశువుల పట్ల ఎంత ప్రేమ పెంచుకుంటారో సడ్లపల్లె చిదంబరరెడ్డి గారు పశువులు అనే కథలో వివరించారు.

ఎద్దులతో సేద్యం మాని, అందరు ట్రాక్టర్లతో వ్యవ సాయం చేస్తుంటే కొండారెడ్డి సంతకు వెళ్ళి ఎద్దులుకొని తెస్తాడు. ఇంటికి వస్తూనే వాటిని శుభ్రపరిచి, గంటలు, కొమ్ములు, గజ్జెలతో అలంకరించి ఇంట్లోకి ఆహ్వానిస్తాడు. పొలం దున్నటానికి వెళితే, తనకు తెచ్చిన రాగి సంగటిలో కొంత భాగం ఎద్దులకు తినిపిస్తాడు. రాత్రి ఏ సమయంలో మెలుకువ వస్తే అప్పుడు గడ్డివేసి, గాటివద్ద శుభ్రపరిచే వాడు. వరుసగా రెండు సంవత్సరాలు వర్షం రాకపోవటంతో కరువు వచ్చి, పశువులకు గడ్డి దొరకదు. తోటి రైతులు ఎద్దులు అమ్మమని కొండారెడ్డికి చెప్తారు. వారితో కొండా రెడ్డి 'నాబిడ్డలు కోతకు అమ్మనని చెప్తాడు. ఎద్దులను తమ బిడ్డలుగా చెప్పటంలో రైతులకు వాటిపట్ల ఎంత ప్రేమ ఉందో మనకు తెలుస్తుంది. అత్తగారి ఊర్లో వర్షాలు పడి, పంటలు పండటంతో, గడ్డి కోసం వారింటికి బయలుదేరాడు కొండారెడ్డి. రైలుగేటు దాటే క్రమంలో ఒక ఎద్దుకాలు పట్టాల మధ్య ఇరుక్కుంటుంది. కొండా రెడ్డి ఎంత ప్రయత్నించిన ఎద్దుకాలు పట్టాల మధ్య నుంచి రాదు. అదే సమయంలో రైలుకూత వినబడుతుంది.

దాంతో కొండారెడ్డి భయపడి, మరో ఎద్దు తాడు తొల గించి, బండిని, ఎద్దును ప్రక్కకు చేరుస్తాడు. రైలు దగ్గరకు వచ్చిన ఎద్దుకాలు లాగటానికి ప్రయత్నిస్తుంటే మరో వ్యక్తి కొండారెడ్డిని పక్కకు లాగుతాడు. ఎద్దు ప్రాణాలు కోల్పోవడం కళ్ళారా చూచిన కొండారెడ్డి అయ్యో నేనట్ల బతకల్లప్పా? కన్నకొడుకు మాదిరి పనిజేసిన మూగ జీవము కండ్లముందరే మరణించిందని బాధపడ్డాడు. అదే చివరిసారి కొండారెడ్డి మాట్లాడటం. తర్వాత మంచాన పడ్డాడు. నా చెయ్యి, భుజం తెగిపోయింది. ఎలా బతకాలనీ కలవరిస్తూ ఉలుకుపలుకు లేకుండా ఉన్నాడు. ఎద్దులు ఇంటికి వచ్చిన ముహూర్తం బాగా లేదని, ఎవరు పట్టించుకోక సగం తగ్గిన మరో ఎద్దును కోతకు అమ్ముతారు. కోతకు వెళ్ళే పశువులను వ్యానులో కుక్కించి ఎక్కిస్తారు. ఆ క్రమంలో ఎద్దు ప్రాణాలు వదలుతుంది. అంతేకాక, ఎద్దును తీసుకున్న దళారుల ప్రవర్తనకు సాధు జీవులయిన రైతుల ప్రవర్తనకు మధ్య ఉన్న తేడాను చూసి ఎద్దు మనుష్యులంతా మంచివారనే భ్రమలో ఉన్నాయని బాధపడుతుంది.

## 2) జీవనచిత్రం :

కరువుతో పశువులకు గడ్డి దొరకటం లేదు. పెన్నయ్య రెండు ఆవులు గడ్డిలేక బక్కగాయ్యాయి. భార్య మెడలోని తాళి కొదవపెట్టి గడ్డి తెస్తే, వారం రోజులలోనే, దొంగ పశువులు వామి ఖాళీ చేశాయి. కరువుకాలంలో ప్రజలకు కరువు బియ్యం ఇచ్చినట్లు పశువులకు గడ్డిస్తే మేలని పెన్నయ్య కష్టకాలంలో కూడా, మనిషి కష్టం కంటే పశు వుల కష్టానికే ప్రాధాన్యత ఇస్తాడు. ఆవులకు గడ్డిలేక సంతలో అమ్మి ఇంటికి వచ్చి కాళ్ళు కడగకముందే, ఆవుల అరుపులు వినపడతాయి. పశువుల కొట్టంలోకి వచ్చి చూస్తే, గాయాలతో ఉన్న ఆవులు కనబడతాయి. ఆవులు కొన్నవారు వచ్చి, వీటిని వ్యానులో ఎక్కించగానే తాళ్లు తెంపుకొని అడ్డమొచ్చిన వారిని గాయపరిచి వచ్చాయని వివరిస్తారు. చేసేది ఏమిలేక డబ్బు తిరిగి ఇచ్చి వాటిని ఇంట్లో ఉంచుతాడు. ఏదో విధంగా వీటికి గడ్డి సంపా దిస్తాను కాని, వీటిని అమ్మనని పెన్నయ్య నిర్ణయించు కుంటాడు.

**గరుడ స్తంభంలోని పశువుల సంత :**

రమణ మంచి పెయింటర్. కంప్యూటర్ ద్వారా పెయింటింగ్ నేర్చుకుంటే బాగా సంపాదించవచ్చు అనుకుంటాడు. కరువు వల్ల రమణ తండ్రి, అన్నవదినలు వలస కూలీలుగా వెళ్లారు. తల్లి పశువులు (ఆవులు, ఎద్దులు, ఎనుములు) చూసుకుంటూ ఇంటి వద్ద ఉంటుంది. ఎండాకాలం, కరువు కారణంగా మనుష్యు లకు నీరు దొరకటమే కష్టంగా ఉంటే, అన్ని పశువులకు నీరు తేవటం రమణ తల్లికి శక్తికి మించిన పని. అంతేకాక పశువులు పస్తులు చూడలేక, దొంగగా గడ్డి తేవటానికి వెళ్ళి, పట్టుబడి తనకంటే చిన్న వయస్సు వారితో అవ మానించబడుతుంది. దీంతో ఆమె మనసు విరిగి, పశు వులను పస్తులుంచటం కన్నా, సంతలో అమ్మి, ఆడబ్బుతో కొంత అప్పు తీర్చవచ్చునని నిర్ణయించుకుంటుంది. కొడుకు రమణను, అన్న రంగప్పతో పశువులను సంతకు పంపుతుంది. హైదరాబాద్ వెళ్ళి కంప్యూటర్ నేర్చుకోవ డానికి డబ్బు వస్తుందని రమణ అంగీకరిస్తారు. కాని దారిలో ఆ పశువులు అమ్మటానికి తల్లి ఎంతో దుఃఖిం చిందో రంగప్పమామ ద్వారా విని, చాలా బాధపడతాడు. సంతలో ఎన్నో పశువులు ఆహారం లేక బక్కచిక్కి ఉం డడం చూసి బాధపడతాడు. తన పశువులను కోతకు అమ్మనని, మేపుకొనెవారు కొంటారని ఎదురు చూస్తాడు. కాని ఎవరు ఆ విధంగా రాకపోవడంతో పశువులను తిరిగి ఇంటికి తీసుకవెళ్ళదాం మామ అవసరమయితే నేను పెయింటింగ్ మాని, వీటికి నీరు, గడ్డి ఏర్పరచటానికి ప్రయత్నిస్తానని చెప్తాడు. అప్పుడు రంగప్ప పశువులను చూడు తిరిగి ఇంటి వరకు నడవగలవా అని రమణను ప్రశ్నిస్తాడు. చేసేదిలేక కోతకు కాదని చెప్పిన దళారుల మాటవిని తన పశువులు అమ్మేస్తాడు. లారీలో వెళ్తున్న పశువులను చూసి, అవి తనవే కోతకని తెలిసి పరుగున

వెళ్ళి లారీ దగ్గరకు వెళ్ళలేక రాయి విసరటానికి కిందికి వంగి, మరో లారీ కింద ప్రాణం విడుస్తాడు.

**ఆరుగ్లాసులలోని నెర్లు కథ :**

అవ్వ తన కొడుకు ఉద్యోగం కోసమని పట్టణం వెళితే, ఆమె మాత్రం పశువులతో వ్యవసాయం చేసుకుంటూ పల్లెలోనే ఉంటుంది. కరువుతో ఎద్దులు, ఆవులకు గడ్డిలేక చిన్నప్పటినుంచి పెంచుకున్న బొల్లెద్దు అమ్ముతుంది. అమ్మినప్పటి నుంచి అవ్వకు ఎద్దు దిగులు పట్టుకుంది. అన్నం తినకుండ, ఏడుస్తూ, ఎద్దు గురించి ఆలోచిస్తుంటుంది. ఎద్దు అమ్మిన రెండోవరోజు రాత్రి బొల్లెద్దు అరుపు వినబడుతుంది. కొట్టంలో వెళ్ళి చూస్తే ఎద్దు ఉంటుంది. అవ్వ ఆనందపడుతుంది. మరుసట రోజు ఎద్దుకొన్న వారికి డబ్బు తిరిగిస్తుంది. ఏదో విధంగా నేను ఎద్దును పెంచుకుంటానని ఆనందపడుతుంది.

**మిట్టూరోడిలోని పాలపొదుగు కథ :**

తప్పిపోయి తన పశువుల కొట్టంలోకి వచ్చిన ఎనుముకు కర్రెక్క తన బక్క ఎద్దులతోపాటు, గడ్డి వేస్తుంటుంది. అది ఎదకు వచ్చి 'ఈనె' సమయం వస్తుంది. ఎనుము వచ్చినప్పటి నుంచి ఊర్లోని వారు ఎన్ని విధాల ఎగతాళి చేసిన, బాధపడిందేకాని, దాన్ని వదలలేదు. కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఎనుము ప్రసవ సమయంలో రాత్రంతా మేలుకొని "వార్చుకో కూతురా! ఈనేస్తావు నీనెత్తి బరువు నేలదిగిపోతుందని" తన కన్నకూతురు ప్రసవ వేదన పడినట్లు ఓదార్పు నిస్తుంది. ప్రసవం తర్వాత వేడినీటితో ఎనుమును శుభ్రపరిచి, శరీరమంతా బూడిద పూస్తుంది. గడ్డి లేక పోవడంతో ఎనుమును పస్తు ఉంచలేక ఉదయానే చెరుకుతోటలో పనిచేసి కసువు (గడ్డి) సంపాదించి ఎనుముకు పెడుతుంది. చెరుకుతోట పూర్తయిన తర్వాత ఎనుముకు గడ్డి దొరకడం కష్టమవుతుంది. దాంతో పక్కింటి కమలమ్మ పొలంలో కలుపుతీయను వెళ్తూ, ఎనుమును తీసుకెళ్ళి, చెట్టుకు కట్టేసి కలుపు మొక్కలు ఎనుముకు వేస్తుంది. ఎనుము పాల ద్వారా వచ్చే, డబ్బుతో బక్క ఎద్దులు అమ్మి, భర్తకు కొత్త ఎద్దులు కొంటుంది. ఇంట్లోకి కొంత సామాను తెస్తుంది. తన అవసరాలు తీరటానికి కారణం ఎనుము అని దాని ఎంతో గౌరవిస్తుంది. అడవికి గడ్డి మేయటానికి వెళ్ళి ఎనుము రాకపోవటంతో రాత్రిపూట అడవికి భర్తతో వెళ్ళి వెతుకు తుంది. అక్కడ కన్పించక పోవటంతో దిగులుపడుతుంది. ఇంటికి వచ్చి, కొట్టంలో ఉన్న ఎనుము చూచి సంతోషి స్తుంది. దానికి హారతి ఇచ్చి, భర్త, పిల్లలకు కళ్ళకు అద్దుతుంది.

ఈ కథల ద్వారా మనిషి తాను పెంచుకునే పశు వులు తన కళ్ళముందర మరణిస్తే ఆ బాధతో మంచం పట్టడం, కోతకు వెళ్తే, వాటిని రక్షించటానికి వెళ్ళి ప్రాణాలు కోల్పోవటం, గడ్డి లేక అమ్మిన పశువులు తిరిగి ఇంటికి రావటంతో ఎన్ని కష్టాలకైనా ఓర్చుకొని వాటిని పెంచు కుంటాడే కాని వాటిని వదులుకోడని అర్థమవుతుంది. అంతేకాక మనిషి పశువుల పట్ల ఎలాంటి ప్రేమ, ఆప్యా యతలు చూపుతున్నాడో అదే విధంగా పశువుల కూడా తమ యజమానిపట్ల అంతే ప్రేమాభిమానాలు కనపరు స్తాయి. అందువల్లే అవి వాటిని ఎవరికైనా అమ్మినా యజమానిని వదిలి వెళ్ళడానికి ఇష్టపడవు. తిరిగి యజ మాని వద్దకే చేరుకుంటాయి. వీటి ఆధారంగా మనిషి పశువుల మధ్య తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే బంధం ఉన్నట్లు చెప్పవచ్చు. రాయలసీమ ప్రజలు, పవువులను తన బిడ్డలుగా చూస్తారని ఈ కథల ద్వారా మనకు అర్థమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**


1. చిదంబర రెడ్డి. సడ్లపల్లె - కొల్లబోయినపల్లె ప్రథమ ముద్రణ - 2013
2. దేవపుత్ర. చిలుకూరి - ఆరుగ్లాసులు మొదటి ముద్రణ - 2016

3. వెంకటకృష్ణ. జి - గరుడస్తంభం కథలు - 2005
4. సుబ్రమణ్యం. నామిని - మిట్టూరోడి పుస్తకం - రెండవ ముద్రణ - 2013
5. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి - కథాశిల్పం తృతీయ ముద్రణ - 2008

★★★

# సింగమనేని నారాయణ కథలు – సామాజిక సమస్యల చిత్రణ

– **వేలూరు భారతి,** తెలుగు అధ్యాపకులు, ఎస్.కె.ఆర్. & ఎస్.కె.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కడప.

కథా సాహిత్యానికి పెట్టింది పేరు రాయలసీమ ప్రాంతం. రచయితలు అనేక మంది ఈ ప్రాంత ప్రజల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని అనేకమైన కథలు రాయడం జరిగింది. వారిలాగానే రాయలసీమ ప్రాంతపు మట్టి పరిమళాలు గుబాళించేలా కథా రచన చేసిన గొప్ప కథారచయిత సింగమనేని నారాయణ. కథా రచనలో తనకంటూ ప్రత్యేక శైలిని, గుర్తింపును సంపాదించుకున్నాడాయన.

ఒక నాటి రతనాల సీమ నేడు కేవలం రాళ్ళసీమగా మిగిలిపోయిన రాయలసీమ ప్రాంతపు సామాజిక జీవితాన్ని తన కథల ద్వారా పాఠకుల కళ్ళకు కట్టేలా రచనలు చేశారాయన. రాయలసీమ పల్లె ప్రజల బ్రతుకుల్లోని ప్రతీ సమస్యను ఆయన స్పృశించడం జరిగింది.

వర్షాభావ పరిస్థితుల కారణంగా రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను, వారి కుటుంబాలు పడుతున్న సంఘర్షణను, వేదననూ తెలియజేసే కథలతో పాటు నేటికీ రాయలసీమ పల్లెల్లో కనిపించే కులవివక్ష కారణంగా నలిగిపోతున్న దళితుల జీవితాలను భూమికగా తీసుకుని రాసిన కథలు అలాగే కాలమెంత మారినా ఎప్పటికీ మారనీ, తీరనీ మరో సమస్య వరకట్న సమస్యను గూర్చి, స్త్రీ పురుష సమానత్వమనేది కేవలం ఊహల్లోనే సాధ్యమనిపిస్తుందే తప్ప వాస్తవ జీవితంలో అది ఎప్పటికీ సాధ్యం కాదనిపించేలా నేటికీ పితృస్వామ్య భావజాలంతో ఉన్న వ్యక్తుల చేతిలో నలుగుతున్న స్త్రీల జీవితాలను గూర్చి వీరు రాసిన కథలు పాఠకుల హృదయాలను కదిలించేలా ఉంటాయి.

## రైతు సమస్య :

ఇక కథల విషయానికొస్తే, సింగమనేని గారి కథల్లో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ, రాయలసీమ రైతుల ప్రస్థావన అనేక కథల్లో కనిపిస్తుంది. నిత్యం కరువుతో పోరాటం చేస్తూ వ్యవసాయం మీద ఆశ చావక, అభిమానం చంపుకుని కూలి పనులకు వెళ్ళలేక బ్రతకడానికి నానా అగచాట్లు పడుతు నిత్యం చస్తూ బ్రతుకుతున్న రైతుల దుర్భర జీవితాలను గూర్చి ఆయన రాసిన అడుసు, జూదం, ఊబి, విముక్తి, యక్షప్రశ్నలు అనే కథలను చదివిన వాళ్ళెవరికైనా హృదయం ద్రవించక మానదు.

ముఖ్యంగా 'అడుసు' కథలో చీనీ పంటను సాగు చేస్తున్న నారాయణప్ప అనే రైతు పడే ఇబ్బందులను చెప్పడం జరిగింది. చీనీ పంటను నాటడం మొదలుకొని ఎనిమిదేళ్లపాటు జాగ్రత్తగా కంటికి రెప్పలా కాపాడుకొని తీరా పంట కాపుకొచ్చి నాలుగు రాళ్లు సంపాదించుకోవచ్చు అనుకునే సమయంలో కాయలను లారీకి ఎత్తడం దగ్గర నుంచి మార్కెట్‌లో అమ్మే వరకు లారీల మేనేజర్ మొదలు మార్కెట్‌లో దళారులు "సూట్" పేరుతోను, మామూళ్ల పేరుతోను తూనికల్లో అవకతవకలతోను, ఇంకా రకరకాల వసూళ్ల పేరుతో రైతులను నిలువునా ముంచేస్తున్న వైనాన్ని రచయిత కళ్లకు కట్టినట్లు చెప్పడం జరిగింది.

ఇందులో నారాయణప్ప చెప్పినట్లు "దేశంలో సరకు తయారు చేసే ప్రతి ఒక్కరూ తమ సరకు ధరను వాళ్లే నిర్ణయిస్తారు. కానీ పంట పండించే రైతుకు మాత్రం తన వస్తువు ధరను తను నిర్ణయించే హక్కు లేదు. ఇది ఎంత అన్యాయమో కదా." ఈ మాటలు అక్షర సత్యాలు, మన దేశంలో రైతులు దళారుల చేతిలో ఎలా మోసాలకు గురౌతున్నారన్న విషయం ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

మరో ముఖ్యమైన కథ "జూదం". దేశానికి వెన్నెముక లాంటి రైతు నేడు వెన్నెముక లేనివాడై పోయాడన్న రచయిత మాటలు ముమ్మాటికీ నిజం. ఈ "జూదం" కథలో ఒకప్పుడు బాగా బ్రతికిన నారప్ప అనే రైతు కుటుంబం, ఇప్పుడు వర్షాలు లేక పంటలు పండక, వ్యవసాయాన్ని విడిచి పెట్టలేక పెట్టుబడి కోసం బ్యాంకుల్లోను తెలిసిన వాళ్ల దగ్గర చేసిన అప్పులు ఒకవైపు, కిరాణా కొట్టులో చేసిన బాకీ మరోవైపు తడిసి మోపెడై పోతాయి.

చివరికి బ్యాంకు వాళ్లు తమ అప్పు తీర్చమని పీకల మీద కూర్చునేసరికి వాళ్ల అప్పు తీర్చడం కోసం తన పంటను అరకొర రేటుకు అమ్ముకోవాల్సి వస్తుంది. నారప్పకు మిగతా బాకీల సంగతి గుర్తుకొచ్చి ఏం చేయాలో పాలుపోక లోలోపలే క్రుంగిపోతాడు. ఈ కథ మొత్తాన్ని పరిశీలిస్తే బడా వ్యాపారవేత్తలకు కోట్లల్లో అప్పులిచ్చి వాళ్లు అప్పు తీర్చకుండా ఎగవేసినా పల్లెత్తు మాట అనని బ్యాంకుల వాళ్లు రైతుకు అప్పులివ్వాలంటే సవాలక్ష షరతులు పెట్టి వాటిని అణాపైసలతో సహా కట్టించుకొనే తీరు, అలాగే రైతుల అవసరాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు, దళారులు చేస్తున్న మోసాలు పరిశీలిస్తే నిజంగానే వీళ్లందరూ కలిసి రైతుల జీవితాలతో "జూదం" ఆడుతున్నట్లుగానే ఉంటుంది.

అలాగే మరో కథ "ఊబి". వర్షాలు లేక పంటలు సరిగా పండక పోవడంతో, అప్పుల ఊబిలో కూరుకు పోయిన రైతు నారప్ప. అయినా వ్యవసాయం మీద ఆశ చావక కొడుకు సలహాతో కనీసం బోరు వేయిస్తేనైనా నీళ్లు పడతాయనే ఆశతో మళ్లీ అప్పు చేసి బోరు వేయించి చివరకు చుక్కనీళ్లు కూడా పడక చేసిన బాకీలతోపాటు బోరు కోసం చేసిన బాకీ దానికి తోడు ఇదివరకు చేసిన బాకీ, ఎనిమిదినెలల కరెంటు బిల్లు కూడా వచ్చి చేరడంతో దిక్కు తోచక విలవిలలాడిపోతాడు.

ఇలాంటివే "విముక్తి, యక్షప్రశ్నలు' కథలు కూడా. సాగునీటి కోసం రాయలసీమ ప్రాంత ప్రజలు పడుతున్న అవస్థలన్నీ ఇందులో చెప్పడం జరిగింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం రైతు సమస్యల్లో చెప్పుకోవాల్సిన అంశం బోర్లు వేయించడం. ఈ బోర్లు వేయించి నీరు పడక, ఒక వేళ పడినా అది మూణ్ణాళ్ల ముచ్చటే అయి అప్పుల పాలైపోయిన రైతు కుటుంబాలెన్నో ఉన్నాయి. వీటన్నింటినీ రచయిత ఇందులో చెప్పడం జరిగింది.

**కుల సమస్య :**

రాయలసీమ ప్రాంత పల్లెల్లో నేటికీ కుల వివక్ష అలాగే కొనసాగుతుందన్న విషయాన్ని సింగమనేని కథల ద్వారా మనం గ్రహించవచ్చు. అనాదిగా వేళ్లూనుకునిపోయిన సామాజిక సమస్యల్లో ఇది మరొక ముఖ్యమైన సమస్య. ఎందరు బాపూజీలు, బాబా సాహెబ్‌లు వచ్చినా దీనిని రూపుమాపడం అసాధ్యమనిపించేలా ఇది మన సమాజంలో చొచ్చుకు పోయింది.

సింగమనేని కథల్లో 'మకర ముఖం', 'ఉచ్చు' కథలు సీమపల్లెలోని అంటరానితనమనే జాడ్యాన్ని మన కళ్లకు కట్టే కథలు. 'మకర ముఖం' కథ ద్వారా వెనుకబడిన కులాలలోని యువతకు ఉద్యోగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్ల పై అగ్రవర్ణాల వారికి ఉన్న అసూయను, చులకన భావనను రచయిత తనదైన శైలిలో చెప్పడం జరిగింది.

వెనుకబడిన కులాలలో ఉద్యోగం సంపాదించుకున్న వాళ్లందరూ వారి ప్రతిభతో కాక రిజర్వేషన్‌లతో సంపాదించుకుంటున్నారని అగ్రవర్ణాల వాళ్లు దెప్పి పొడుస్తున్న తీరు చాలా సహజమైన పద్ధతిలో చెప్పారు. దళితుడు పాఠాలు బోధించే ఉపాధ్యాయుడైనా సరే గుడిలోకి రానివ్వని అమానుషత్వాన్ని ఈ కథలో మనం గమనించ వచ్చు.

నాగరికతలో మనిషెంత గొప్ప స్థాయికి చేరినా నేటికీ పల్లెల్లో అనాగరికత రాజ్యమేలుతున్న వైనాన్ని 'ఉచ్చు' కథలో చూడవచ్చు. అగ్రవర్ణాల వాళ్లు తక్కువ కులాల వారిని 'జీతగాళ్లు'గా పెట్టుకుని వారిని జంతువుల కంటే హీనంగా చూడడం మనమీ కథలో చూడవచ్చు. ఇందులో

అగ్రవర్ణాల వారి అహంకారానికి, దార్ష్టికానికి బలైపోయిన 'నాగన్న' అనే దళితుని కథ చెప్పబడింది. అతని చుట్టూ ఉచ్చు పన్ని ప్రభుత్వం ఇచ్చిన భూమిని అగ్రవర్ణాల వాళ్లు ఎలా లాక్కున్నారో ఇందులో మనం గమనించవచ్చు.

### వరకట్న సమస్య :

ప్రాంతమేదైనా, భాషేదైనా మన దేశంలో ఆడపిల్లను కన్న తల్లిదండ్రులందరూ ఎదుర్కొంటున్న మరో సామాజిక సమస్య వరకట్నం. దీని కారణంగా రాయలసీమ లాంటి కరువు ప్రాంతంలో ఆడపిల్లల తల్లిదండ్రులెంత ఇబ్బందులు పడుతున్నారన్న అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని సింగమనేని గారు రాసిన కథల్లో ముఖ్యమైనవి దృశ్యమూ - అదృశ్యమూ, జ్ఞాతమూ-అజ్ఞాతమూ, ఒక గతి - ఒక శ్రుతి, యక్షప్రశ్నలు, నీకూ నాకూ మధ్య నిశీథి అనే కథలు.

'దృశ్యమూ-అదృశ్యమూ' అనే కథలో "ఇంత నుండి దారుణమైన కరువు రాజ్యమేలే ఇక్కడ కూడా కట్నాలు మాత్రం ఎండిపోకపోవడం చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. ఇంత కరువులోనూ మనుషులు, మనుషుల ధరలు పెంచడం ఎంత విషాదం! ఎండిపోతున్న గోమాత పొదుగు నుండి చుక్క చుక్కా చివరి బిందువు వరకూ పాలు పిండుతున్నట్లు కట్నం పిండుతూనే వున్నారంటే ఎంత హింస!" అని రచయిత అన్న మాటలు పరిశీలిస్తే మొత్తం రాయలసీమ ప్రాంతంలోని ఆడపిల్లల తల్లి దండ్రుల వేదనా ఇందులో కనిపించక మానదు.

కూతురి పెళ్లికోసం మగపెళ్లి వారికివ్వాల్సిన కట్న కానుకల కోసం నానా అవస్థలు పడి మగపెళ్ళివారు పెట్టిన షరతులన్నిటికీ తలొగ్గి తన కుమార్తె వివాహాన్ని అత్యంత వైభవంగా తన తాహతుకు మించి చేయడం కోసం వడ్డీలకు డబ్బు అప్పుగా తెచ్చి, చివరకు పెళ్లి పనుల హడావుడితో సరిగా తిండీ తిప్పలు లేక ఆరోగ్యాన్ని పట్టించుకోక ప్రాణాలే పోగొట్టుకున్న తండ్రి గాథను "జ్ఞాతమూ - అజ్ఞాతమూ" అనే కథలో చూడవచ్చు. అలాగే 'యక్ష ప్రశ్నలు' అనే మరో కథలో కూతురి పెళ్లి కోసం 'సంజీవప్ప' అనే రైతు పడిన అగచాట్లను మనం గమనించవచ్చు. ఈ కథలో 'పేరు గొప్ప ఊరు దిబ్బలా మారిన' సంజీవప్ప ఆర్థిక పరిస్థితిని మనం గమనించ వచ్చు. చివరకు తనకున్న పొలాన్నంతా తనకా పెట్టి కూతురు పెళ్లి చేసిన తీరును ఈ కథలో చూడవచ్చు. ఇలాగే ఒక గతి - ఒక శ్రుతి, నీకూ నాకూ మధ్య నిశీథి అనే కథల్లో కూడా వరకట్న సమస్య ఆడపిల్లలను కన్నవారి జీవితాల్లో ఎంత అలజడి రేపుతుందన్న విషయం చెప్పబడింది.

కేవలం ఇవే కాకుండా మన సమాజంలో పేరుకు పోయిన అంధవిశ్వాసాలను ప్రశ్నిస్తూ, ఆయన రాసిన కథ "అవాస్తువికత". ఈ కథలో మానవుడు వాస్తుపిచ్చిలో పడి ఎంత అజ్ఞానిగా మారిపోతున్నాడన్న విషయాన్ని గమనించవచ్చు. ఇంటిని మనిషి ఎందుకోసం నిర్మించుకుంటాడు? దాని ప్రయోజన మేమిటనేది తెలుసుకోగలిగితే వాస్తు సిద్ధాంతాలన్నీ వట్టి బూటకపు మాటలేనన్న విషయం మనం గ్రహించగలుగుతామనే సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు. అలాగే పురుషాధిక్య భావజాలంతో నేటికీ స్త్రీలను వంటింటి కుందేళ్లుగానే భావిస్తున్న పురుషుల చేతిలో నిత్య నరకాన్ని చూస్తున్న స్త్రీల జీవితాలకు ప్రతిబింబం ఆయన రాసిన 'జవాబు' అనే కథ. ఇవే కాకుండా ఆయన రాసిన 'హింస' లాంటి కథలు అనేకం ఉన్నాయి. ఆయన రాసిన ప్రతీ కథ మానవ జీవితంలో ఏదో సందర్భాన్ని, ఏదో ఒక సమస్యను ఆవిష్కరించేదిగా ఉంటుంది. 'నిషిద్ధం' కథలో "సాహిత్యం అంటే జీవిత వాస్తవికతను ప్రదర్శించేలా ఉండాలని" చెప్పడమేగాక దానిని తన కథల ద్వారా చేసి చూపిన గొప్ప కథా రచయిత సింగమనేని.

### ఆధార గ్రంథం :

1. సింగమనేని నారాయణ కథలు - విశాలాంధ్ర పబ్లికేషన్స్

★

# రా.రా. కథలు-మానవ సంబంధాలు

- టి. హజరతయ్య, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట, కడప జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో రాచమల్లు రామచంద్రారెడ్డి (రా రా) గారిది విశిష్టస్థానం. విమర్శకుడిగానే గాక సృజనాత్మక సాహిత్యరచయితగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా బహుముఖ పాత్రలు పోషించిన ప్రజ్ఞాశాలి. రారా ముఖ్యంగా సృజనాత్మక వచన సాహిత్యం (కథలు, బాలసాహిత్యం) ద్వారా కథా సాహిత్యంలో అభ్యుదయకరమైన ఇతివృత్తం గురించి, దానికి అవసరమైన శిల్పం గురించి, తద్వారా పాఠకుల్లో కలిగే అనుభవం గురించి కూడా స్పష్టంగా ప్రస్తావించారు. రారా ప్రధానంగా విమర్శకుడు అయినప్పటికీ ప్రాథమిక దశలో కొన్ని కథలు కూడా రాశాడు.

## తెలుగు సాహిత్యం-మానవ సంబంధాలు :

'మానవుడే అన్నింటికీ మూలం? అనేది మానవతావాదం యొక్క మూలసిద్ధాంతం. వ్యక్తి స్వాతంత్ర్య పూర్వకమైన మానవప్రేమ మానవతావాద లక్ష్యం. "మానవుని సర్వశక్తిమత్వాన్ని, స్వాతంత్ర్యాన్నీ పరమ ప్రమాణంగా భావిస్తూ అతని ధార్మిక, వైజ్ఞానిక, కళాత్మక, ఆధ్యాత్మిక రంగాల వికాసానికీ, మానవాభ్యుదయానికీ, సంఘశ్రేయస్సుకూ మానవ సామర్థ్యాన్నే మూలంగా ప్రతిపాదించే విలువలే మానవీయ విలువలు" వసుధైక కుటుంబమే మానవతావాద ధ్యేయం.

సాహిత్యానికి సమాజానికి విడదీయరాని సంబంధం ఉంది. సమాజానికీ, జీవితానికీ వున్న సమన్వయ వైరుధ్యాల నుండే సాహిత్య రచన రూపుదిద్దుకుంటుంది. ఆ సాహిత్యంలో ఆనాటి మానవ సంబంధాలు ఆవిష్కృతమౌతూ ఉంటాయి. ఆధునిక తెలుగు సాహిత్యం మానవతావాద విలువల్ని ప్రతిష్ఠాపన చేయడంలో ముందు వరుసలో ఉంటుంది. అందులో కథా సాహిత్యానికి ప్రత్యేకస్థానం ఉంది. తెలుగు కథా సాహిత్యంలో గురజాడ, శ్రీపాద, చాసో, కొకు, రావిశాస్త్రి, కేతు విశ్వనాథ రెడ్డి, మధురాంతకం రాజారాం లాంటి ఎంతోమంది గొప్ప రచయితలు తమ రచనల ద్వారా తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేయడమే గాక పతనమైపోతున్న మానవ సంబంధాల్ని పునరుద్ధరింపజేసే ప్రయత్నం జేయడమే గాక, వాటికి పరిష్కారాలను సూచించడం గమనించవచ్చు.

## రారా కథలు-మానవ సంబంధాలు :

రారా మానవతావాది. కవి చీమలకు చక్కెర, పాములకు పాలు పోసే మానవతావాదం కాదు. మానవ సంబంధాల్ని మరింత మానవీయం చేసే ప్రక్రియే ఆయన మానవతావాదం. మానవత్వం కోసమే ప్రజాతంత్రం అంటూ స్వల్పమైన అన్యాయాన్నైనా సహించలేని సంస్కారమూ, సమిష్ఠిగా ఎదిరించే అలవాటూ, అవగాహన చేసుకునే బుద్ధి కుశలత ప్రజలందరిలో ఉండాలి. దీన్నే మానవత్వం అంటాడు రారా. రారా రాసిన కథలు కొన్నే అయినా, ప్రతీ కథలో మానవ సంబంధాల్ని ఆర్థిక కోణంలో స్పృశించగలిగాడు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదల జీవితాల్లోని అతి సామాన్యమైన విషయాలను (ఎవరూ పట్టించుకోని విషయాలనే) తన కథల్లో వస్తువుగా చేసుకున్నాడు. వస్తువు పరంగా ఈ కథలు ఆశించినంత అభ్యుదయకరంగా లేకపోయినప్పటికి శిల్పపరంగా గొప్ప కథలు.

రారా మొత్తం 13 కథల్ని కలిపి 'అలసిన గుండెలు' అనే పేరుతో ఒక సంపుటంగా తీసుకొచ్చాడు. ఇవేగాక బాలల కోసం కూడా కొన్ని కథలు రాశాడు. కుటుంబరావు గారన్నట్లు "జీవితంలో అందరూ ఉపేక్షించే విషయాల్నే ఇతివృత్తాలుగా తీసుకొని రారా కథలు రాశాడు" రారా కథల్లో ఎక్కువగా ఆర్థికాంశాల్ని, స్త్రీ సంబంధిత అంశాల్ని

ప్రధానంగా చర్చించాడు. ప్రస్తుతం సమాజాన్ని శాసించేది ఆర్థికాంశాలే అన్న నిజాన్ని కొన్ని దశాబ్దాల ముందటే పసిగట్టి కథలు రాసిన కథకుడు రారా. రారా కథల్లో అలసిన గుండెలు, నీతిగానుగ, ఉదర నిమిత్తం, దేశంలో దేవకన్యలు, ఆత్మహత్య మొదలైన కథలన్నీ ఆర్థికాంశాలతో ముడిపడినవే.

రారా కథల్లో ఒక ప్రతినిధి కథ 'అలసిన గుండెలు' పరిశీలిద్దాం. ఈ కథలో దారిద్ర్య భారంచేత అలసిపోయిన మధ్యతరగతి హృదయాలను చిత్రించడం కథానికా లక్ష్యం. ''ఆరో కాన్పుకు అమ్మగారింటికి పోవడానికి సిగ్గయ్యింది శేషమ్మకు. శేషమ్మ తనకు పుట్టిన ఐదుగురు సంతానంలో ఇద్దరు పిల్లలు పసితనంలోనే ఒక నెలలోనే చనిపోతే, వాళ్లు బ్రతికి వుంటే ఎంత కష్టంగా ఉండేదో ఆలోచిస్తే జీవితం ఎంతో దుర్భరంగా అనిపించేది ఆమెకు. పిల్లలకు అందరికీ అన్నం పెట్టలేనందుకు బాధపడాలో, చచ్చినందుకు సంతోషించాలో తెలియని పరిస్థితి. జీవితంలో బాగా అలసిపోయిన తల్లికి మాత్రమే ఇలాంటి ఆలోచన వస్తుంది.

'పిల్లలు చనిపోయినందుకు బరువు తగ్గిందా?' ఈ ఆలోచన వచ్చినపుడల్లా పిల్లలు చచ్చినందుకు సంతోషిస్తున్నానా అని ఆమె అంతరాత్మ ఆక్రోశిస్తుంది. దీనికి తోడు శేషమ్మ తన పురుడుకు అమ్మను పిలిపించుకొని ఆమెను తన దగ్గర ఉంచుకోవాల్సి వస్తే ఆమెకు తిండి పెట్టడం గురించి భార్యాభర్తల మధ్య జరిగిన చర్చల్ని పరిశీలిస్తే పేదరికం మానవ సంబంధాల్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవచ్చు. శేషమ్మ కుటుంబంలోనే గాకుండా మన సమాజంలో ఏ సగటు మధ్యతరగతి కుటుంబాన్ని తొంగి చూసినా ఇలాంటి దృశ్యాలే దర్శనమిస్తాయి. ఈ కథ చివర్లో శేషమ్మ తనకింక పిల్లలు వద్దని దేవునికి ముడుపు కట్టుకోవడం మరో విషాదం. తాను స్వయంగా ఇలాంటి సంఘటనల్ని ప్రత్యక్షంగా అనుభవించటమో లేక దగ్గరినుండి గమనిస్తే తప్ప రచయిత యింత సూక్ష్మంగా చిత్రించలేడు. రారా ఈ కథ రాసే కాలం దాటికి కుటుంబ నియంత్రణ విషయంలో ఎలాంటి చట్టాలు లేకపోవడం గమనార్హం.

'దేశంలో దేవకన్యలు' కథానిక కూడా సామాజికార్థికాంశాల్ని చర్చకు పెట్టిన కథే! ఈ కథ లో ఒక అందమైన యువతి క్షయ రోగంతో రక్తం కక్కి చనిపోతుంది. పల్లెలు ప్రశాంత నిలయాలనే సూక్తికి పూర్తి విరుద్ధంగా నడిచిన కథ. 1950 వ దశకం నుండి నేటికి కూడా వైద్యం ప్రైవేటీకరణ అయ్యిందే తప్ప పేదలకు వైద్యం అందడంలో ప్రగతి లేదనే చెప్పాలి. ''దేశంలో రోగులూ ఉన్నారు. మందులు ఉన్నాయి. డాక్టర్లూ ఉన్నారు. కానీ, వీళ్ళెవరికీ స్వాతంత్ర్యం లేదు. అందరినీ శాసించే హక్కు డబ్బుకుంది? కథ రాసే కాలంనాటి పరిస్థితులకీ, నేటికీ మధ్య ఆర్థిక వ్యవస్థ సామాన్యులకు అందని ద్రాక్షలాగే వుంది. అప్పటికీ, ఇప్పటికీ ఆర్థికాంశాల పునాదుల మీద మానవ జీవితాలు ప్రభావితమవుతూనే వున్నాయి. మన సమాజంలోని మానవ సంబంధాల్ని మన ఆర్థికం శాసించే స్థాయిని అందుకుంది.

రారా కథల్లో 'మన జీవిత కథలు' ప్రత్యేకంగా పరిశీలించదగ్గది. నిస్సారమైన జీవితం గడుపుతూ, ఏ ఆసక్తీలేని ఓ పెద్దమ్మను గూర్చి ఓ రచయితా, అతని భార్య యొక్క ప్రతిచర్యలతో కూడిన కథ ఇది. కొడుకుకీ, కూతురుకీ దూరంగా ఒంటరిగా జీవించే ఆ పెద్దమ్మ జీవితంలో ఏదో పెద్ద 'ప్లాష్ బ్యాక్' ఉంటుందనీ, దానిని ఛేదించి, ఒక గొప్ప కథ రాయాలని రచయిత సంకల్పం. రచయితా, రచయిత భార్య ఎన్ని రకాలుగా ఆ పెద్దమ్మను అడిగి చూసినా ఆమె జీవితాన ఏ ప్రత్యేకతా, ఎలాంటి గొప్ప సంఘటనా కనిపించవు. 'ఇంత మామూలు మనిషి గురించి ఏమని కథ వ్రాయడం'' అని అంటాడు భార్యతో రచయిత. ''మీ దిగులంతా కథను గురించే! ఆమెను గురించి మీకేమాత్రం విచారం లేదు కదా'' అన్న భార్య మాటలతో కథ ముగుస్తుంది. నిజానికి ఈ చివరి వాక్యమే

కథలో కీలక మలుపు ఈ కథలో పెద్దమ్మకు ఆనందం అనే వుంటే అర్థం కాదు ఎందుకంటే, ఆమెకు మానసిక జీవితమే లేదు గనుక. ఆ పెద్దమ్మనే కాదు ఈ సమాజం లోని ఆడవాళ్ళకు జీవితాలు అలా యాంత్రికంగా, నిస్సారంగా గడిచిపోతాయి. రారా శాస్త్రీయ దృక్పథం కలిగినవాడు కాబట్టే అందరికీ సాధారణంగా కనిపించే ఇలాంటి అంశాల్నే కథలుగా చిత్రించి మహిళల, పేదల పక్షంగా నిలిచాడు.

రారా రాసిన మరొక గొప్ప కథ 'నీతిగానుగ'. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న సత్యానికి కథారూపమే నీతిగానుగ. ఇష్టంలేని పెళ్ళి పెద్దలు నిర్ణయించిన కారణంగా ఒక అమ్మాయి పెళ్ళి రోజున తన ప్రియుడితో లేచిపోవాలని విఫలయత్నం చేస్తే, ఆ వార్త తెలిసి అసహ్యించుకున్న పెళ్ళి కొడుకు తండ్రి, అక్కలు అదనపు కట్నం ఇస్తామన్న కారణంగా ఆ నోటితోనే నీతిసూత్రాలు వల్లె వేస్తారు. ఆర్థికం అన్ని నీతి సూత్రాలను తుడిచివేస్తుందన్న వ్యంగ్యం ఈ కథలో వుంది. ఇందుకో ఇందులో కళ్యాణి అనే పెండ్లి కూతురు పాత్రకు సంబంధించిన ప్రేమ, మనస్తత్వాలను లెక్కకు రానివ్వకుండా కథంత డబ్బు చుట్టూ కేంద్రకృతమై వుంటుంది. ఇది శిల్పపరంగా లోప భూయిష్టమైన కథ అయినప్పటికీ ఆర్థిక స్థితి ఇతరత్రా అంశాల్ని ప్రభావితం చేస్తుందన్న సత్యాన్ని తెలియజేస్తుంది.

రారా కథల్లో అభ్యుదయ భావాలు గల స్త్రీ పాత్రను చిత్రించిన మరొక కథ 'ఉదరనిమిత్తం'. ఇందులో భార్యా భర్తలు పల్లె నుంచి పట్నం వచ్చి ఉదర నిమిత్తం ఒక హోటల్‌ని పెట్టుకుంటారు. హోటల్‌లో పరాయి మగాడితో మాట్లాడడం వల్ల భర్త నరసింహులు నొచ్చుకుంటాడు. దానికి ఆమె - 'భర్త ముఖంలోకి చూసి జాలిగా నవ్వి' యిలా అంటుంది. "మన వూళ్లోనే ఆ రామిరెడ్డి అలా ప్రవర్తించి వుంటే ఏం చేసేవారు?-" అని

"అప్పుడే పండ్లు రాలగొట్టి పంపించేవాణ్ణి-"

"మరి-ఈ రోజున ఆ పని ఎందుకు చేయలేదు?" హోటలన్న తర్వాత రకరకాల మనుషులు వస్తూ వుంటారు. అందరితోనూ కొట్లాట పెట్టుకుంటే హోటలు మూసుకోవలసి వస్తుంది-"

అదివిని, నరసింహులు భార్య నిబ్బరంగా ఉంటుంది - "నేననేదీ అదే -"అని. విద్య భార్యాభర్తల మధ్య ఎలాంటి అనవసర అనుమానాలకు, గొడవలకు తావివ్వకుండా ఎలా సంస్కారవంతంగా బ్రతకాలో నేర్పిస్తుందని ఈ కథ ద్వారా గ్రహించవచ్చు.

మారేలోకం అనే మరొక కథలో కొత్తగా ఉద్యోగంలో చేరిన సబ్‌ఇన్‌స్పెక్టర్ సమాజంలోని కల్మష వాతావరణ పట్ల విముఖత ప్రదర్శించిన వ్యక్తే, తర్వాతి కాలంలో డబ్బు రుచి మరి మానవ సంబంధాల్ని సమూలంగా నాశనం చేసిన వ్యక్తిగా దర్శనమిస్తాడు.

## రారా బాలసాహిత్యం-మానవ సంబంధాలు :

కల్మషం ఎరుగునటువంటి పసి పిల్లల హృదయాలు తర్వాతి కాలంలో కూడా స్వచ్ఛంగా వుండి సమాజంలో మానవ సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి రారా రాసిన బాల సాహిత్య కథలు దిక్సూచిలా పనిచేస్తాయి. బాలల కోసం వారికర్థమయ్యే భాషలో, సులభశైలిలో రెండు కథలు రాశాడు. అందులో ఒకటి 'చంద్రమండలం - శశిరేఖ'. ఇందులో గల చంద్రమండలం గురించిన శాస్త్రీయమైన విషయాలు పిల్లలూ, పెద్దలూ చదివి అర్థం చేసుకోవాల్సిన స్థాయిలో ఉన్నాయి. మరొక కథ 'విక్రమార్కుని విడ్డూరం' లో సైన్సు అభివృద్ధి చెందుతున్న కాలంలో దానికి సమాంతరంగా మనమూ నడవకపోతే ఎదురయ్యే సమస్యలు ఎంత హాస్యస్ఫోరకంగా ఉంటాయో వివరించాడు.

## ముగింపు :

రారా కథల్ని మొత్తంగా పరిశీలించినపుడు ఆర్థిక నేపథ్యం కారణంగా మానవ సంబంధాలు ప్రభావితమవు

తాయనే సత్యాన్ని ప్రతీ కథలోనూ ఆయన తేటతెల్లం చేశారు. అయితే ప్రతీ కథలోనూ ఆయా పాత్రలు ఆనాటి పరిస్థితులకనుగుణంగా సర్దుకుపోవడాన్ని మనం గమనించవచ్చు. ఆయా సమస్యల పట్ల ఏ ఒక్క పాత్ర కూడా తిరుగుబాటు ధోరణిని అవలంబించకపోవడం వీరి కథల్లో విశేషంగా కనిపిస్తుంది. వీరిలోని సృజనాత్మక రచయితా కోణం కంటే విమర్శక దృష్టి బలంగా ఉండడం వల్ల బహుశా వీరు ఎక్కువగా కథలు రాసినట్లు కనిపించదు. రాసిన కథలు కొన్నే అయినా, అవి శిల్పపరంగా గొప్పవిగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

1. రారా సమగ్రసాహిత్యం (మొదటి సంపుటం) - యుగ సాహితి ప్రచురణ
2. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. తెలుగు కథకులు-కథన రీతులు - సం.సింగమనేని నారాయణ.

★★★

# 'కడప' కథ - ముఠా కక్షలు

- డా॥. కె. యన్. సుందరేశ్వరరావు, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), కడప.

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో రాయలసీమ జిల్లాల్లో కడపకు ప్రత్యేకస్థానం, గుర్తింపు ఉన్నాయి. ఎందరో కవులు, పండితులు, సంఘసంస్కర్తలు, రచయితలు, కడపనేల నుంచి సాహితీపరిమళాలను వెదజల్లారు.

ఆంగ్లభాషా ప్రభావంతో రూపొందిన ఆధునిక తెలుగు వచనసాహిత్య ప్రక్రియల్లో బహుళజనాదరణ పొందిన ప్రక్రియ 'కథ'. తొలి తెలుగు కథ ఏది అనే చర్చ పక్కకు పెడితే, విమర్శకులు గురజాడ వారి 'దిద్దుబాటు'ను అన్ని ఆధునిక లక్షణాలు సంతరించుకున్న కథగా నిర్ధారించారు. అలా కోస్తాలో పుట్టిన తెలుగు 'కథ రాయలసీమలోని కడప జిల్లాలో 1918లో 'కడపటి పైసా' తో ప్రారంభమైంది. ఎందరో కథా రచయితలు గొప్ప కథలను ఇక్కడి నుండి రాశారు.

'నందలూరు కథానిలయం' ప్రచురించిన 'కడప కథ' కథాసంకలనంలో 1956 నుండి 2006 వరకు వెలువడిన 47 కథలు చోటు చేసుకున్నాయి. ఈ సంకలనం సంపాద కులు శ్రీతవ్వాఓబులరెడ్డి గారు, ప్రచురణకర్త శ్రీఅబ్బిగారి రాజేంద్రప్రసాద్ గారు. ఈ కథలు కడప జిల్లా గ్రామీణ ప్రాంత రైతుల, వృత్తికళాకారుల, దళితుల జీవితాలను చిత్రించాయి.

ప్రస్తుత వ్యాసంలో 'కడప కథ' సంకలనం లోని ముఠా కక్షలకు సంబంధించిన కథలను గ్రహించడం జరిగింది. ఇందులో కేతు విశ్వనాథరెడ్డి 'కూలిన బురుజు', రాధేయ 'గాయం', పాలగిరి విశ్వప్రసాద్ 'చుక్క పొడిచింది', నాగలారపు విజయసారథి 'చంద్ర గ్రహణం', చెరువు అనంతకృష్ణశర్మ 'సింహం-కుక్క-పులి', మరియు కొమ్మద్ది అరుణ రమణ 'మచ్చ' అనే ఆరు కథలు ముఠాకక్షలను ప్రధాన కథావస్తువుగా తీసుకొని రాయబడిన కథలుగా గుర్తించవచ్చు.

## ముఠాకక్షలు-'ఫ్యాక్షన్' దారుణాలు' :

'ఫ్యాక్షన్' అనే ఆంగ్లశబ్దానికి 'ముఠా' అనే తెలుగు అర్థం రూఢిగా ఉపయోగిస్తున్నారు. 'ముఠా' అంటే వర్గం, గ్రూపు, సంఘం అని అర్థాలు, బలవంతులైన, ధనవంతు లైన భూస్వాములు పేదలను తమవెంట తిప్పుకుంటూ వారి ఆలనాపాలనా చూస్తూ ఉంటారు. అవసరం వచ్చి నపుడు తాము తమ ప్రత్యర్థులపై చేసే దాడిలో భాగ స్వాములను చేస్తారు. అందులో ఎవరి ప్రాణాలైనా పోవచ్చు. ముఖ్యంగా ముందూవెనుకా పేదలు, దళితులే ఉంటారు కాబట్టి వారి ప్రాణాలకే ఎక్కువ హాని జరగడం మనం గమనిస్తాం. ఈ ముఠాకక్షలు ఒకరిద్దరిని చంపడంతో ముగియవు. పరస్పరం ఒకరినొకరు చంపు కొంటూ పోతారు. ఈ హత్యల్లో భాగస్వాములైన వాళ్ళం దరినీ కక్షగట్టి చంపడం ఇందులో ప్రధానాంశం. ఒక్కొక్క సారి వారి కుటుంబాల్లోని స్త్రీలు, పిల్లలూ బలి అవుతారు. ఈ విషసంస్కృతికి ప్రధాన కారణం ఆధిపత్యపోరు, రాజకీయ విభేదాలు.

గ్రామీణ వాతావరణంలో ఒకప్పటి ప్రశాంతత, స్నేహ పూర్వక వాతావరణం ఇప్పుడు కనిపించవు. ఒకనాడు ఆప్యాయతలతో, అనురాగాలతో కలిసిమెలిసి సహజీవనం చేసిన గ్రామీణుల మధ్య ఈనాడు అంతులేని కక్షలు, కార్పణ్యాలు చోటు చేసుకున్నాయి. రాయలసీమ గ్రామా ల్లోని ఒకప్పటి నిర్మలమైన వాతావరణం ఇంతగా కలు షితం కావడానికి ముఖ్యకారణం రాజకీయాలు, కుటుంబ కక్షలు, ఫ్యాక్షన్ రాజకీయాలకు మారుపేరైన ముఠాకక్షలు. వీటివల్ల ఎంతోమంది సామాన్యజనం గ్రామాలను వదలిపోతున్నారు. ఒక కుటుంబం ఒకసారి ఫ్యాక్షన్‌లోకి అడుగుపెడితే, సాలెగూడులా అల్లుకుపోవడం పరిపాటి అయ్యింది. ఈ పరిణామం కోస్తా, తెలంగాణాల్లో కంటే

కరువుసీమ రాయలసీమలో ఎక్కువగా ఉండడం ఎక్కువ బాధపడాల్సిన విషయం.

**i) కూలిన బురుజు (కేతు విశ్వనాథరెడ్డి) :**

ఫ్యాక్షన్ హత్యల దయనీయమైన స్థితిని ఈ కథ చిత్రించింది. రాయలసీమ ఒకప్పుడు రతనాలసీమ ఐనా, నేడు కరువు సీమ అయ్యింది. ఈ కరువును ఆయా రచయితలు తమ కథాసాహిత్యంలో ప్రతిఫలింపజేశారు. నిజానికి ఇవి కథలు కాదు, వ్యథలు. ఈ కథలన్నీ ముఖ్యంగా కరువు వాతబడిన జనం కథలు. రైతులు, రైతుకూలీల, ఇతరవృత్తుల జనాల వ్యథలు. రాయల సీమలోని అనావృష్టి, నిత్యకరువు, రాజకీయ కక్షలు, రైతు కూలీల దుస్థితి-ఇవన్నీ ఎంతగా సీమ ప్రజల జీవితాలను దుర్భరం చేశాయో ఈ కథలు వివరిస్తాయి.

'కూలిన బురుజు' కథలో సారాయివేలం పాటలో వచ్చిన తగాదా ఫ్యాక్షన్ హత్యలకు దారితీసింది. రచయిత బావను ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. తనభర్తను చంపినవారు చచ్చేదాకా, తాను గాజులు పగలగొట్టనని లక్ష్మక్క ప్రతిజ్ఞ చేసింది. ఆ బీభత్సస్థితికి భయపడిన ఊరి జనం యువకులు పారిపోయారు. అక్కడ ఏ కొత్తవ్యక్తి కనిపించినా, అనుమానంగా చూసేవారు. ఊరంతా శ్మశానంలా మారిపోయింది. ఇదే అవకాశంగా రాజకీయ పార్టీల వారు ప్రవేశించి, తనవర్గం వారికి బాంబులు సరఫరా చేయడం మొదలుపెట్టారు. ఊరిజనం వర్గాలుగా విడిపోయి, హత్యాకాండకు పాల్పడుతున్నారు. తాము కష్టపడి, కూలీనాలీ చేసి, పొలం పనులుచేసి సంపాదించిన డబ్బును పోలీసులకు, లాయర్లకు ధార పోస్తున్నారు. రాజకీయ నాయకులు తమ స్వార్థంకోసం గ్రామాల్లో ముఠాకక్షలు పెంచి, తమ పబ్బం గడుపుకుంటున్నారు.

**ii) 'గాయం'(రాధేయ) :**

ఇందులో ఫ్యాక్షనిస్టుల వెట్టిచాకిరీకి బలైన దళిత కుటుంబాన్ని గురించి రచయిత వివరిస్తాడు. 'వీరయ్య' అనే దళిత రైతు కూలీ కుటుంబం ఎలా ఫ్యాక్షనిస్టుల కోరల్లో మగ్గిపోయిందీ ఇందులో చెప్పబడింది. వీరయ్య దళితరైతు, సంజీవరెడ్డి దగ్గర జీతగాడు. సంజీవరెడ్డి కరుడుగట్టిన ఫ్యాక్షనిజానికి ప్రతీక. తన దగ్గర వ్యవసాయ పనులు చేసే వాళ్ళను ముఠా కక్షల్లోకి దింపి., వాళ్ళ జీవితాలలో ఆడుకోవడం అతని నైజం.

వీరయ్య తాడిపత్రి దగ్గర ఉన్న వెంకటరెడ్డిపల్లెలో నివసించేవాడు. తన తండ్రి చేసిన అప్పు తీర్చడంకోసం సంజీవరెడ్డి ఇంట్లో భార్యపిల్లలతో వెట్టిచాకిరీ చేసేవాడు. సంజీవరెడ్డి ఎంతకాలం చేసినా అప్పుతీరలేదు. అదే ఊర్లోని సుబ్బారెడ్డికి, సంజీవరెడ్డికి గొడవలుండడం గతంలో ఆ గొడవల్లో వీరయ్య దాయదులంతా బలికావడం తెలిసిన వీరయ్య వీరయ్య మళ్ళీ గొడవలు మొదలుకావడంతో భయపడిపోయాడు. తాను అక్కడే ఉంటే తనకూ ఆ గతే పడుతుందని భయపడి, కుటుంబంతో కలిసి పారి పోయి కడపకు చేరాడు. బుగ్గవంక దగ్గర గుడిసె వేసుకొని జీవనం గడపసాగాడు. ఒకరోజు కూలీపనుల కోసం వేరే ప్రాంతానికి వెళ్ళి, బస్సులో తిరిగివస్తుండగా, మధ్యలో సంజీవరెడ్డి ఆ బస్సు ఎక్కాడు. వీరయ్యను చూస్తూనే కోపంతో ఊగిపోతూ, కసితీరా వీరయ్యను తన్నాడు. వెనక్కి తిరిగివచ్చి తనదగ్గర వెట్టిచాకిరీ చేయకుంటే, వేటకొడ వలితో నరికిచంపుతానని బెదిరించాడు. వీరయ్య కుటుంబమంతా కలిసి, తమకెలాగూ చావు తప్పదని నిర్ణయించుకొని, వెట్టిచాకిరీ చేయలేక ఆత్మహత్య చేసుకున్నారు.

ముఠానాయకుల దౌష్ట్యం, దౌర్జన్యాలు ఈ కథలో కళ్ళకు కట్టినట్లు రచయిత చిత్రించాడు.

**iii) చుక్కపొడిచింది (పాలగిరి విశ్వప్రసాద్) :**

ఈ కథ ఫ్యాక్షన్ సంస్కృతికి దూరంగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్న 'సుజాత' అనే ఒక స్త్రీ కథ. ఇందులోని ప్రధాన పాత్రలు రవీంద్రారెడ్డి, సుజాతలు. రవీంద్రారెడ్డి పి.జి. చదివాడు. అతని భార్య సుజాత, గొప్పింటి ఆడబిడ్డ రవీంద్రారెడ్డి తండ్రి పంచాయితీ

ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటిచేసి, ఓడిపోయాడు. అయినా, గెలిచిన వర్గంవాళ్ళు ఓడిపోయిన రవీంద్రారెడ్డి తండ్రిని హత్యచేశారు. ఈ కేసు విషయంపై రవీంద్రారెడ్డి కోర్టుకు తిరిగాడు. కోర్టు తీర్పు అతనికి వ్యతిరేకంగా వచ్చింది. అందుకు ప్రతీకారంగా అతనివర్గం వాళ్ళు ఆ సర్పంచ్ తమ్ముణ్ణి కడప బస్టాండులో హత్యచేశారు. ఈ కేసులో రవీంద్రారెడ్డి మొదటి ముద్దాయి. కొంతకాలానికి ఈ కక్షతో ప్రత్యర్థులు రవీంద్రారెడ్డిని హత్యచేశారు. తమ అన్న హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని రవీంద్రారెడ్డి తమ్ముళ్ళు ప్రతిజ్ఞచేశారు. కొడుకుల ఆలోచనను తల్లికూడా సమర్థించింది. కానీ అతని భార్య సుజాత మాత్రం హత్యకు గురైన తన భర్త స్థితి తన బిడ్డలకు రాకూడదని భావించింది. తన తండ్రిని పిలిపించి, అత్త, మరుదుల్ని కూర్చోబెట్టి ఆస్తిలో తన వాటా తనకు ఇవ్వాలని, తనకు, తన పిల్లలకు ఈ ఫ్యాక్షన్ గొడవలు ఇష్టము లేదని చెప్పింది. పట్నం వెళ్ళి ఏదో ఒక పని చేసుకుంటూ బిడ్డల్ని చదివించుకోవాలని నిర్ణయించుకుంది. అత్త, మరుదులు ఆమెకు ఎంత ధైర్యం నూరిపోసినా, అంగీకరించలేదు. ఒక హత్య ఎన్ని అనర్థాలకు కారణం అవుతుందో, దాని పర్యవసానంగా ఎన్ని దుర్మార్గాలు జరుగుతాయో ఈ కథ వివరించింది.

**iv) 'సింహం-కుక్క-పులి' (చెరువు అనంతకృష్ణశర్మ) :**

ఒకప్పటి ఫ్యాక్షన్ నాయకులు మరోజన్మలో సింహం - కుక్క - పులి జన్మ ఎత్తి, వారిలో మార్పు కలగడాన్ని రచయిత వ్యంగ్యంగా చెప్పడం ఈ కథలో ప్రత్యేకత.

గతజన్మలో హత్యచేయించిన నాయకులు ఈ జన్మలో సింహంగా, పులిగా పుట్టారు. హత్యలు చేసినవాడు కుక్కగా పుట్టి ఆకలితో అలమటిస్తున్నాడు. హత్యకులోనైనవాళ్ళు మనుష్యజన్మ ఎత్తి, ఈ 'సింహం-కుక్క-పులి' లకు తిండి పెడుతున్నారు. ఇలా ఈ కథ వ్యంగ్యధోరణిలో సాగింది.

**v) చంద్రగహణం (నాగలారపు విజయసారథి) :**

ఫ్యాక్షన్ హత్యలు అమాయకులనే బలితీసుకుంటాయని ఈ కథ వివరిస్తుంది. ఊళ్ళో నాగిరెడ్డికి, రాఘవరెడ్డిల హద్య ఫ్యాక్షన్ గొడవలున్నాయి, నాగిరెడ్డి అనుచరుడైన నరసింహులు, తన యజమాని చెప్పినట్లు హత్యలు చేసేవాడు. అట్లా రాఘవరెడ్డి వర్గం వారిని ఎందరినో పథకం ప్రకారం చంపాడు. నాగిరెడ్డి దగ్గర డబ్బులు తీసుకొని హత్యలు చేయడం మానుకోమని నరసింహులు కొడుకు చంద్ర, తన తండ్రి నరసింహులును హెచ్చరించాడు. కానీ నరసింహులు లెక్కచేయలేదు. నాగిరెడ్డి మాట నరసింహులుకు వేదవాక్కు. నాగిరెడ్డి సూచనల మేరకు తన (దళిత) వర్గం వారికి స్థలాలు దక్కుతాయనే ఆలోచనతో, కొన్నాళ్ళ తర్వాత నరసింహులు రాఘవరెడ్డిని హత్యచేశాడు. దాంతో నరసింహులుపై రాఘవరెడ్డి వర్గం పగబట్టింది. చంద్రం తన ఎం.ఏ. సర్టిఫికెట్‌కోసం తిరుపతికి పోయి, తిరిగి వచ్చేటప్పుడు ఊర్లో బస్సు దిగగానే రాఘవరెడ్డి వర్గం అతన్ని హత్యచేసింది. కొడుకు హత్య వార్త విన్న నరసింహులు ఏడుస్తూ అక్కడికి వచ్చాడు. తన కొడుకు చావు చూసినాక గానీ అతనికి ఆ ఫ్యాక్షన్ హత్యలు అమాయకులను ఎట్లా బలితీసుకుంటాయో అర్థం కాలేదు.

నాగిరెడ్డి మాత్రం తన భార్యాపిల్లలతో సుఖంగా ఉన్నాడు. కానీ, అతని కొడుకును ప్రత్యర్థులు చంపేశారు. పుత్రశోకంతో నాగిరెడ్డి భార్య జీవితాంతం ఏడుస్తూనే ఉంది. అట్లాగే కొడుకును పోగొట్టుకున్న నరసింహులు కూడా జీవితాంతం దిగులుతో, భయంతో చచ్చేదాక బ్రతికాడు.

**vi) మచ్చ (కొమ్మద్ది అరుణ రమణ) :**

ఈ కథలో పల్లెటూళ్ళలోని ఫ్యాక్షనిజం పడగనీడల వెనుక బలైపోయే జీవితాలు చిత్రించబడినాయి.

గురవయ్య అనే మోతుబరి రైతుకు ఎనిమిది ఆడపిల్లలు, ఒకే కొడుకు లక్ష్మయ్య. ఆడపిల్లలకు పెళ్ళి చేసే సరికి గురవయ్య ఆస్తి కరిగిపోయింది. దాంతో కొడుకు లక్ష్మయ్యను వెంకట్రామయ్య అనే రైతు ఇంట్లో జీతగాడిగా ఉంచాడు. వెంకట్రామయ్యకు నాటకాల పిచ్చి. నాటక

ప్రదర్శనల్లో ఒకరోజు రెండోకృష్ణుడి వేషం వేసే నారాయణ రాకపోతే, లక్ష్మయ్య చేత రెండోకృష్ణుడి వేషం వేయించి అందర్నీ మెప్పించాడు. అప్పట్నుంచి లక్ష్మయ్యకు ఊరంతా రెండోకృష్ణుడని పిలవడం మొదలుపెట్టారు.

రెండో కృష్ణుడు (లక్ష్మయ్య), ఊర్లోని బక్కోడి కూతురైన స్వరాజ్యం అనే అమ్మాయి పరస్పరం ఇష్టపడ్డారు. వారి పెళ్ళికి వెంకట్రామయ్యను సాయమడిగాడు లక్ష్మయ్య. వెంకట్రామయ్య పెద్దగా పట్టించుకోలేదు. అంతలో పంచాయితీ ఎన్నికలొచ్చాయి. ఊరంతా రెండు గుంపులుగా విడిపోయింది. అందరూ ఓటేయడానికి పెద్దబడికి వెళ్ళారు. రెండో కృష్ణుడి (లక్ష్మయ్య)కి అదే మొదటిసారి ఓటెయ్యడం, తన స్వరాజ్యం ఏ గుర్తుకు చెప్పిందో దానికే వేయాలనుకున్నాడు. సరిగ్గా లక్ష్మయ్య దగ్గరకొచ్చేసరికి ఎలక్షన్ ఏజెంటు 'లక్ష్మయ్య' అని అతని పేరు చదివాడు. ప్రత్యర్థి పార్టీ ఏజెంటు 'వీడి పేరు రెండో కృష్ణుడు' అన్నాడు. ఏజెంటుకు, వెంకట్రామయ్యకు ఉన్న గొడవలవల్ల వాదన పెరిగి బాంబులు పడ్డాయి. ఆ గొడవల్లో లక్ష్మయ్య రెండుకాళ్ళు పోయాయి. స్వరాజ్యం వచ్చి లక్ష్మయ్యను ఆసుపత్రికి తీసుకెళ్ళింది. తండ్రి వద్దంటున్నా, స్వరాజ్యం లక్ష్మయ్యనే పెళ్ళి చేసుకుంది. లక్ష్మయ్య బ్రతుకు మీద బలవంతులు వేసిన 'మచ్చ' మాత్రం శాశ్వతంగా మిగిలిపోయింది.

## ముగింపు :

ఇలా ఈ కథా సంకలనంలోని ముఠాకక్షలకు సంబంధించిన కథలు సీమ గ్రామీణ జీవితాల్లోని వాస్తవికతను, అమాయకుల దీనస్థితిని, కరువును, ఫ్యాక్షన్ గొడవలను, దానివల్ల బలౌతున్న రైతు కుటుంబాల్లోని స్త్రీలను, కూలీలను, వెట్టిచాకిరీని కళ్ళకు కట్టాయి. ఫ్యాక్షన్ కుటుంబాల్లోని స్త్రీలు కూడా ఈ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్న విధానాన్ని మనకు చూపించాయి.

## ఆధార గ్రంథాలు :

1. 'కడప కథ' - సం. తవ్వా ఓబులరెడ్డి, ప్ర.అబ్బిగారి రాజేంద్రప్రసాద్.
2. తెలుగు కథకులు-కథనరీతులు (రెండవ సంపుటం) - సం. మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ.

★★★

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

# రాయలసీమ గ్రామీణ సంస్కృతి – విశ్వాసాలు

– **డా॥. సి.హిమాచలం,** తెలుగు ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, రొంపిచెర్ల, చిత్తూరు జిల్లా.

మనిషి పుట్టింది మొదలు గిట్టేవరకు చేసే అన్ని కర్మలు సంస్కృతి కిందకే వస్తాయి. జాతకం ప్రకారం నామకరణం చేయడం, ఊయలలో వేయడం, మొలతాడుకట్టడం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, ఉపనయనం చేయడం, వివాహాది కార్యక్రమాలు చేయడం, షష్ఠిపూర్తి చేయడం, ఇంకా గతించినపుడు చేసే వివిధ కర్మకాండలు లాంటి మానవజీవితంలోని అంశాలన్నీ ప్రజలచేత విస్తృతంగా ఆచార వ్యవహారాలుగా ఆచరించబడుతూ కాలక్రమంలో అవి సంస్కృతిగా పరిగణించ బడ్డాయి.

ఒక్కోజాతి సంస్కృతి ఒక్కో విధంగా ఉంటుంది. అయితే ఆ జాతిలో ఉన్న ఉపతెగల్లోని వారి సంస్కృతి ఇంకొంచెం విభిన్నంగా ఉంటుంది. భిన్న సంస్కృతుల ఐక్యతను జాతీయ సంస్కృతిగా పేర్కొంటారు. ఈ దృక్కోణంలో చూసినపుడు ప్రపంచంలో ఎన్నో సంస్కృతు లున్నట్లు తెలుస్తున్నది. ఒక దేశ, జాతి సంస్కృతికి మరో దేశ జాతి సంస్కృతికి ఎంతో వైవిధ్యం ఉంటుంది.

ఏ సంస్కృతి అయినా స్థిరంగా ఉండదు. కాలాను గుణంగా మార్పులు చెందుతూ ఉంటుంది. అందులో కొన్ని అంశాలు మాత్రం స్థిరంగా ఉంటాయి. మనం తినే తిండి, కట్టేబట్ట, నివసించే ఇళ్ళు, కట్టు, బొట్టు, పూజలు, వేడుకలు, పండుగలు అన్నీ మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఈ అంశాలన్నీ సాహిత్యం ద్వారా నిర్ధారించవచ్చు. ఇదొక చారిత్రక సత్యం. ఇది అన్నీ కాలాలు దేశాలకు వర్తిస్తుంది.

ప్రజలకు ఎన్నో విశ్వాసాలుంటాయి. వాటికి శాస్త్రీయత ఉందా లేదా అన్నది అప్రస్తుతము. వారు వాటిని నమ్ముతూ జీవిస్తుంటారు. రాయలసీమ నవలా రచయితలు ప్రజల విశ్వాసాలను తమ నవలల్లో చిత్రించారు. వాటిని ఇక్కడ పేర్కొని విశ్లేషించటం జరిగింది.

### కొల్సు పెట్టడం :

జానపదుల్లో కొల్సుపెట్టడం అనే ఆచారం తరతరాల నుంచి కొనసాగుతూ వస్తున్నది. ఆ ఊరిలోని ఒక వ్యక్తి వారి గ్రామదేవతకో లేదా ఇలువేల్పుకో పరమభక్తుడుగా ఉంటాడు. అతడు ఆ రోజు నియమనిష్ఠలతో గుడివద్ద కూర్చొని ఆ దేవతను ప్రార్థిస్తాడు. అతన్ని ఆ దేవత ఆవహిస్తుంది. ఆ ఊరికి ఏమి కావాలో, ఎలా చేయాలో అన్ని చెబుతుంది. ఈ విషయాన్ని డా॥ వి.ఆర్. రాసాని ఇలా తెలిపారు.

"ఆ పల్లెలో ఉన్ని తెగకు చెందిన నాగప్పకు విరూపాక్షమ్మ ఆవహిస్తుంటుంది. ఉత్సవాలలో, జాతర్లలో మరే వేడుకలలోనైనా సరే, పాల్గొన్నపుడు... ఆ ఆనందంతో నాగప్పకు సహజంగానే పూనకం వస్తుంటుంది.అపుడపుడూ ఆ ఊరి వారి కోరికపైన కూడా వస్తూ ఉంటుంది.

ఆ సమయంలో పెద్దలంతా కలిసి ఆమె వచ్చిన కారణం తెలుసుకొని ఆమె చెప్పినట్లు నడుచుకొంటారు. అలా నడుచుకోకపోతే ఆమెకు ఆగ్రహం వచ్చి ఆ పల్లెను నాశనం చేస్తుందని వాళ్ళ నమ్మకం. ఏ గొర్రో గొడ్డో తప్పి పోయినా, లేదా ఏ దొంగతనం జరిగినా వాటి ఆచూకి తెలుసుకోవడానికి ఆ నాగప్పను ఆ గంగమ్మ ముందర కూర్చోబెట్టి విరూపాక్షమ్మను అతని శరీరంలోకి ఆవాహన చేయించి కొలిస్తే ఆ దేవత పోయిన వాటి జాడను తెలియపరుస్తుందని వారి విశ్వాసం.

ఇలా నాగప్ప శరీరంపైకి బలవంతంగా దేవతను రప్పించడాన్నే 'కొల్సు పెట్టడం' అంటారు." ఈ పూనకం అన్నది పురుషులకే కాదు స్త్రీలకు కూడా పడుతుంది. జానపదుల్లోని అగ్రకులాలతో సహా దళిత బహుజనులకు కూడా పూనకం వస్తుంది. అయితే 'సైన్సు'కు అందదు. సైన్సు దీన్ని అంగీకరించదు. అయినా జానపదులు

మాత్రం గాఢంగా నమ్ముతున్నారు. ఒకప్పుడు ఈ పూనకం పట్టడం అన్నది సర్వే సర్వత్ర ఉండేది. కానీ నేడు చాలా తగ్గిందనే చెప్పాలి.

జానపదులు అధిక విద్యావంతులు కావడం, శాస్త్రీయ దృక్పథం పెరగడం, పల్లెల నుంచి పట్నాలకు వలసలు వెళ్ళడం, గ్లోబలైజేషన్ వంటివి కొల్సు పట్టడం అనే ఆచారానికి మంగళం పాడుతున్నాయని చెప్పవచ్చు.

ప్రజలు విజ్ఞానవంతులయ్యే కొద్దీ మూఢవిశ్వాసాలు తెరమరుగవుతున్నాయి.

## కడవ సాంగెం, చిప్పకట్టె సాంగెం :

జానపదుల్లో నాటుకుపోయి ఉన్న ఆచారాల్లో ఈ చిప్పకట్టె సాంగెం, కడవ సాగెం ముఖ్యమైనవి. ఈ సాంగెం ద్వారా వర్షం రాకను, దొంగలను కనిపెట్టడం వంటివి చేస్తారు. ఈ రెండు సాంగెలు జరిపే తీరును నవలా రచయిత డా॥ వి.ఆర్. రాసాని ఇలా తెలిపారు.

రాయలసీమ కురవల్లో అనేక విచిత్రమైన నమ్మకాలు, ఆచారాలు ఉన్నాయి. వర్షం రాకపోతే ఒక కొత్తకుండను తెచ్చి, దానినిండుగా నీళ్ళుపోసి దాని కంఠానికి వేపమండ చుట్టి పూజ చేస్తారు. గంగమ్మ ముందర పేడతో అలికి, దానిపైన రాగులు పోసి, వాటి నెత్తిన ఆ కుండను ఉంచి ముగ్గురు బ్రహ్మచారులు రెండు చేతుల వేళ్ళు, దాని కంఠానికి ఆనించి నిలబడతారు. అప్పుడు ఆ కుండ వర్షం రాకను సూచిస్తూ గబగబా తిరుగుతుందని వారు నమ్ముతారు. ఇది కడవ సాగెం. ఇలాంటివే కప్పదేవ రోత్సవం, గోవు సాంగెం.అలాంటి నమ్మకాలకు సంబం ధించిన సాంగేలలో చిప్పకట్టె సాంగెం కూడా ఒకటి.

ఏ వస్తువైనా పోయినప్పుడు లేదా, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు ఆ పరిసర ప్రాంతాల వారిపైన అనుమానం ఉంటే ఈ చిప్పకట్టె సాంగెం ద్వారా తెలుసుకొంటారు. ఒక కొత్త చిప్పకట్టెను తెచ్చి, దానికి పూజలు చేసి, దాని తలదగ్గర ఒక సన్న దారం కట్టి ఒక బాలుడికి ఆ దారం ఇస్తారు. చిప్పకట్టెతో నేలకు ఆనేటట్లు గాను, తలభాగం పైకి ఉండేటట్లు దాన్ని పట్టుకోనిస్తారు. పిల్లనగ్రోవులు ఊదుతూ, తాళాలు వేస్తూ, నర్తిస్తూ వేడుక చేస్తారు. ఆ వేడుకలో గంగమ్మ ఆ చిప్పకట్టెలో ఆవహించి దాన్ని నడిపిస్తుందని, దొంగతనం చేసినవారిని కనిపెడుతుందని వారి నమ్మకం.

ఒక కొబ్బరి కాయను చెట్టునుండి కోసి దానిని బొచ్చె తీసి రెండు చిప్పలుగా చేస్తారు. కళ్ళు ఉన్న చిప్పను పసుపు కుంకుమతో పూజిస్తారు. దానికి పొడవాటి కట్టెను అమర్చి గరిటే ఆకారంలో చేస్తారు. దానికి కొత్త దారం కట్టి కల్లా కపటం తెలియని పిల్లవాని చేతికిస్తారు.

దేవుని గుడి ముందు ఆవు పేడతో బాగా అలికి పసుపు కుంకుమ పూసి బాగా అలంకరిస్తారు. నలుగురు చేరి ఆ పిల్లవాని చేతికిస్తారు. ఆ పిల్లవాడు దారం పట్టుకొని నిలబడతాడు. అది అటు ఇటు ఊగి ఊగి కొంత సేపటికి కదులుతుంది. అది పోయిన చోటికి అందరూ వెళతారు. అది ఎక్కడ ఆగుతుందో అక్కడున్నవారు ఆ వస్తువును దొంగతనం చేసినట్లుగా నిర్ధారిస్తారు.

ఈ ఆచారం ఒకప్పుడు కొనసాగేది. నేడు దాదాపుగా తెరమరుగయిందనే చెప్పాలి. ఈ ఆచారం మంచిదా చెడ్డదా అని విచారించే ముందు మనం గమనించవలసిన విషయం ఒకటుంది. అదే జానపదుల సృష్టి. పోయిన వస్తువును గుర్తించడానికి వీరు ఎంతో ఆలోచించి, మేధో మథనం జరిగిన తరువాత దాన్ని కనిపెట్టారు. వారి సృజనశక్తిని మనం అభినందించి తీరవలసిందే.

## గిరిగెత్తడం :

జానపదుల్లో ఉన్న ఆచారాల్లో మరొక ముఖ్యమైనది 'గిరిగెత్తడం'. ఈ 'గిరిగెత్తడం'తో గంగమ్మ శాంతించి, తమకు రోగాలు రాకుండా చేస్తుందని జానపదులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ వేడుకను గ్రామస్థులందరూ కలిసికట్టుగా చేస్తారు. ఇందులో కులమతాల ప్రసక్తి లేదు. ఈ ఆచారం నిర్వహించే తీరును గూర్చి రచయిత డా॥. వి.ఆర్. రాసాని ఇలా తెలిపారు.

"సర్వ జాడ్యాలకు మూలం గంగమ్మ తల్లేనని, ఆమె వల్లే సకల వ్యాధులు కలుగుతాయని వాళ్ళ నమ్మకం. అందుకే గిరిగెత్తిస్తే సరిపోతుందనుకున్నారు.

గంగమ్మకు పూజలు జరిపి బలులిచ్చి, ఒక కొత్త కుండలో దీపం పెడతారు. ఒక బ్రహ్మచారికి గంగమ్మ వేషం వేయించి, ఆ దీపాన్ని తలపైన పెట్టి, డప్పులతో, పిల్లన గ్రోవి నర్తనలతో, అడుగడుగునా నిమ్మకాయలు కోసి, బారబారకు కోళ్ళు కోసి బలులిస్తూ, ఎంతో వేడుగ్గా కిళారిస్తూ... ఆ గ్రామ పొలిమేరలు దాటి ఒక చెరువులోనో, లేదా బావిలోనో ఆ కుండను వదిలేసి, నోరుకొట్టుకుంటూ తిరిగి చూడకుండా వచ్చేస్తారు. ఇదే గిరగెత్తడం.

అలా చేస్తే గంగమ్మ పొలిమేరలు దాటిపోయి తమ జంతువులను ఒదిలి వెళుతుందని వారి నమ్మకం."

ఇది జంతు హింసతో కూడుకున్నది. ముఖ్యంగా కోళ్ళను బలి ఇస్తారు. అక్కడక్కడ అపుడపుడు గొర్రె, మేక వంటి జంతువులను కూడా బలి ఇస్తారు. ఈ క్రీడ చూడడానికి బీభత్సంగా ఉంటుంది. అయినా జాన పదులు ఈ పనిని చాలా నిష్ఠగా చేస్తారు.

జానపదులు ఏ వేడుక చేసిన జంతుబలులకు అందులో ప్రధాన భాగస్వామ్యం ఉంటుంది. గంగమ్మ జాతరలు దీనికి ప్రబల నిదర్శనం. ఈ జాతరలో దున్నపోతులు, మేకలు, గొర్రెలు, కోళ్ళు వంటి జంతు పక్షులను విచక్షణారహితంగా బలి ఇస్తారు. వాటిని నరికి చంపడానికి ప్రత్యేకంగా కొందరు వ్యక్తులను ఆయా గ్రామాల్లో నియమిస్తారు. వారు తప్ప ఇతరులు వాటిని నరకరాదనే కట్టుబాటు కూడా పెట్టుకున్నారు. ఇలా జంతుబలులు చేయడానికి ప్రత్యేక ఆయుధాలను వారు రూపొందించుకున్నారు. అవి చాలా వాడిగా ఉంటాయి. పరిమాణంలో కూడా చాలా పెద్దవిగా ఉంటాయి. వాటిని గుళ్ళలోనే ఎక్కువగా భద్రపరుస్తుంటారు. మరికొందరు పిల్లలకు అందకుండా తెలియకుండా దాచి పెడుతుం టారు. ఆ ఆయుధాన్ని వేట కొడవలి అంటారు.

దేశ వ్యాప్తంగా ఈ శక్తిదేవతల గుడుల వద్ద ఈ జీవహింస జరుగుతున్నది. జీవకారుణ్య సంస్థల ఒత్తిడి మూలంగా ప్రభుత్వం జంతుబలిని నిషేధించింది. అయినా ప్రజలు ఖాతరు చేయలేదు. ఇది చాలా సున్నిత మైన అంశం కావడంతో ప్రభుత్వాలు అంతకు మించి ముందుకు వెళ్ళలేకుండా పోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గ కేంద్రం కుప్పంలో ప్రతి ఏటా వేసవిలో జరిగే గంగజాతరలో జంతుబలి యదేచ్ఛగా సాగుతుంది. రక్తం ఏరులై ప్రవహిస్తుంది. ఇలాంటి జాతర జరిగే ప్రదేశాలు రాష్ట్రంలో ఇంకా చాలా ఉన్నాయి.

## అంజనం వేయడం :

పోగొట్టుకున్న వస్తువు జాడ తెలుసుకోవడానికి జాన పదులు అజనం వేస్తారు. ఈ అంజనం వేయడానికి ప్రత్యేకంగా కొందరు ఉంటారు. వారు తప్ప ఇతరులు వేయరు. అది కూడా వారు రాత్రి వేళలనే వేస్తారు. అలాంటి అజంనం వేసే తీరును గూర్చి డా॥ కేశవరెడ్డి ఇలా తెలిపాడు.

"తలకోనలో ఒక గుహలో ఒక సిద్ధుడున్నాడని, అతడు గోటికి అంజనం వేసుకొని చూసి, లోకంలో ఎక్కడ ఏమి జరిగేది చెప్పగలడని కొందరు సూచించారు. బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు చేయిస్తే, అమ్మవారు పూజారిపై పూని వాస్తవం చెప్పిస్తుందని కొందరు అభిప్రాయపడ్డారు.

కల్లూరు అడవిలో ఒక ఎరుకలసాని ఉన్నదని, ఆమె తన మంత్రదండం ద్వారా ఎంతటి సందేహాలనైనా నివృత్తి చేస్తుందని కొందరు జ్ఞాపకం చేశారు." అంటాడు కేశవరెడ్డి.

అంజనం వేసేవిధానం చాలా విచిత్రంగా ఉంటుంది. వివిధ ఆకులు, బొగ్గులు కాల్చి నల్లని పొడి చేస్తారు. ఆ పొడి కొద్దిగా నీళ్ళు పోసి కలుపుతారు. ఆ మిశ్రమాన్ని ఒక గాజుపై పూసి ఏవో మంత్రాలు చదువుతారు. అంజనం వేసే వ్యక్తి గాజుపలకపై చూస్తాడు. అపుడు

పోగొట్టుకున్న వస్తువు ఎలా పోయిందో, ఎవరు తస్కరించారో స్పష్టంగా కనిపిస్తుందట. అంటే నేడు మనం సిసి (క్లోజ్డ్ సర్క్యూట్) కెమెరాలో చూసినట్లన్న మాట. ఈ అంజనం వేసే శక్తి సామర్థ్యాలు సామాన్యులకు చెందగా, మునులు, ఋషులకు దివ్యదృష్టి ఉండేది. అయితే నేడు ఈ అంజనం వేసేవారు దాదాపు లేరనే చెప్పవచ్చు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెరగడంతో అది మరుగునపడిపోయింది. దీనిని నేటి తరం వాళ్ళు నమ్మడం లేదు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా మన పూర్వులు ఎంతో కష్టపడి ఈ కళను కనిపెట్టారు. అందుకు వారికి ధన్యవాదాలు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ విషయాన్ని డా॥ వి.ఆర్. రాసాని కూడా తెలిపాడు. కనిపించకుండా వెళ్ళిపోయిన వ్యక్తుల జాడ తెలుసుకోవడానికి జానపదులు అంజనం వేస్తారు.

“మంగరాజు మాయమైపోయిన తన కొడుకు కోసం ఎక్కడెక్కడో వెతికించాడు. కానీ అతని ఆచూకీ తెలియలేదు.బావుల్లో ఏమైనా పడిపోయాడేమోనని చుట్టుపక్కలున్న బావులు వెతికించాడు. చెరువులు, కుంటలు వెతికించాడు. ఎన్నో జ్యోతిష్యాలు చూపించాడు.

చివరికి గంటావారి పల్లె నుంచి గొప్ప మాంత్రికుడిగా పేరుపొందిన గొల్ల తిమ్మయ్యను పిలిపించి అంజనం కూడా వేయించాడు. కానీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అతని ఆచూకీ చెప్పే వాళ్ళే లేకపోయారు” అంటాడు.

ఈ అంజనం వేసే ప్రక్రియ సైన్సుకు అందదు. దీనికి ప్రామాణికత కూడా లేదు. ఇది కేవలం నమ్మకంపైన్నే ఆధారపడి చాలాకాలం నడిచింది. నేడది దాదాపుగా తెరమరుగైందని చెప్పవచ్చు.

వీటితో పాటు రాయలసీమ ప్రాంతంలో బండారు పట్టడం, వర్షాల కోసం చేసే కప్పదేవర, పెదబోయసాని, మాతమ్మని చేయడం మొదలగు ఆచారాలు ఉన్నాయి. వీటిలో కొన్ని దురాచారాలు కూడా ఉన్నాయి. మనం దురాచారాలను రూపు మాపి మంచిని మాత్రమే గ్రహించాలి.

**<u>ఆధార గ్రంథాలు</u>**

1. మూగవాని పిల్లనగ్రోవి - డా॥ పి.కేశవ రెడ్డి
2. చీకటి ముడులు - డా॥ వి.ఆర్.రాసాని
3. చీకటి రాజ్యం - డా॥ వి.ఆర్.రాసాని
4. సంస్కృతి విన్యాసం - తెలుగు అకాడమి, హైదరాబాదు

★★★

# బైరపురెడ్డి నారాయణరెడ్డి రాయలసీమ రైతు కావ్యం - వ్యవసాయ జీవితం

- డా॥. జి. రవికుమార్, సహాయ ఆచార్యులు (సి), తెలుగు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు.

శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ప్రాంతమే రాయల సీమ. వజ్ర వైడూర్య రత్నరాశులకు నిలయం రాయల సీమ. ఇది భిన్న సంస్కృతులకు నిలయం. అందమైన గ్రామీణ సంస్కృతికి చిహ్నం. ప్రకృతి సోయగాలు ఈ ప్రాంతం సొంతం. అనాది నుండీ ఎన్ని కరవుకాటకాలను ఎదుర్కొన్నా, రాజకీయ అలజడులకు లోనైనా, ఆర్థిక దుస్థితులకు బలైనా, ప్రకృతి పక్షపాతం చూపినా ఆంధ్ర దేశంలోనే కాక, యావద్భారతావనిలోనే తన ఉనికిని చాటుకొన్న ఒక విలక్షణమైన ప్రాంతం రాయలసీమ. గ్రామీణ సంస్కృతిలో రైతు ఓ భాగం కాదు ప్రధానపాత్ర పోషిస్తాడు. రైతు రాజ్యానికి వెన్నెముక. రైతు లేకపోతే రాజ్యం లేదు. దేశం సుభిక్షంగా ఉండాలంటే రైతుకు సరైన కాలంలో వర్షాలు పడాలి. పంటలు పండాలి. అప్పుడే ఆ రైతు ముఖంలో ఆనందం అంబరాన్నంటుతుంది. యావత్ప్రపంచం రైతు క్షేమమే దేశక్షేమంగా భావించే సంస్కృతి మనది. అయితే రాయలసీమలో రైతుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. ఈ ప్రాంతం ఎప్పుడూ కరువుకాటకాలతో, ఆకలికేకలతో అలమటిస్తూ ఆక్రం దనలు చేస్తూ ఉంటుంది.

రాయలసీమ రైతుల రక్కసి కరువు. రాయలసీమ రైతులు వాన రాకకోసం ఆకాశంవైపు ఎదురుచూస్తూం టారు. ఆ వర్షం పడక కరువు బారినపడి బాగా బ్రతికన రైతులు కూడా రైతుకూలీలుగా మారిన సంఘటనల్ని రాయలసీమ కవులు వారి కావ్యాల్లో రైతు జీవితాల్ని సంపూర్ణంగా చిత్రించారు. రాయలసీమ రైతు జీవితాన్ని వివరించిన కావ్యాల్లో విద్వాన్ విశ్వం గారి పెన్నేటిపాట, బైరపురెడ్డి నారాయణరెడ్డి రాయలసీమరైతు, పాలా వెంకటసుబ్బయ్య అనిల సందేశం, హెచ్. దేవదానము ఆకటి చిచ్చు, వై.సి.వి. రెడ్డి రైతు కావ్యం, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి జాముకోడి మొదలైన కావ్యాలు ప్రముఖమైనవి. ప్రస్తుత పత్రసమర్పణలో బైరపురెడ్డి నారాయణరెడ్డి రచించిన రాయలసీమ రైతు కావ్యంలో వ్యవసాయ జీవనంతో పాటు, కరువు వల్ల రైతుల పంటలు, మానవ సంబంధాలు ఏవిధంగా దెబ్బతిన్నాయో వివరించడమే ప్రధాన ఉద్దేశం.

## రాయలసీమ రైతు - బైరపురెడ్డి నారాయణరెడ్డి :

బైరపురెడ్డి నారాయణరెడ్డి పొలం, హలం, తోట, గడ్డీ, గాదం మొదలైన వాటితో పాటు కరువు కాటకాల్ని కూడా అనుభవించిన రైతు. ఈయన రాసిన కావ్యం రాయలసీమ రైతు. కరువులబారిన పడి రైతు పడే బాధల్ని సంపూర్ణంగా చిత్రించాడు. ఈ కావ్యాన్ని 1955లో రచించినా 1976లో ప్రచురించాడు. కడప జిల్లా రాయచోటి తాలుకా బాహుదా నదీ తీరాన ఐదుపల్లెలున్నాయి. ఆపల్లెల్ని 'పంచరత్నాలు' అని పిలుస్తారని, ఆ పంచరత్నాలలో భాగమైన ఒక పల్లెలో కథంతా జరిగిందని కావ్యం ద్వారా తెలుస్తోంది. కవి 1923 ఫిబ్రవరి 2న రెడ్డివారిపల్లె, మడితాడు గ్రామం, రాయచోటి తాలుకా, కడప జిల్లాలో జన్మించాడు. బహుశా తన గ్రామాన్నే కథావస్తువుగా ఎంచుకున్నాడని చెప్పవచ్చు.

వ్యవసాయం చేసే రైతు జీవితాన్ని సంప్రదాయ పద్యాల్లో, ప్రౌఢశైలిలో రచించిన కావ్యం రాయలసీమ రైతు. రైతుకు వ్యవసాయం చేయాలంటే ప్రధాన ఆధార వనరు నీరు. ఈ నీటి ద్వారా రైతులు అనేక పంటలు పండించగలరు. మన ఆంధ్రప్రదేశ్‌లో ఒక కోస్తా ప్రాంత

రైతులకు పుష్కలంగా నీరు లభిస్తుంది. నీరులేని ప్రాంతం, సజీవనదులు లేని ఎడారి ప్రాంతం రాయల సీమ. ఈ విషయాన్ని కవి - భారతదేశంలో చాలా నదులు న్నాయి. జలధార లేని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అట్టి ప్రాంతాలలో రాయలసీమ పేరు చెప్పి మరొకదానిని పేర్కొనవచ్చు. ఈ సీమలోని వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంపై సాగాలి. రాయలసీమ రతనాల సీమయని ప్రస్తుతించడమే కాదు, ఈ ప్రాంతం కరువుకాటకాలకు ఆటపట్టు. ''నా ఏబదేళ్ళ అనుభవంలో సమృద్ధిగా పంటలు పండిన కాలాన్ని నేను చూడలేదు'' అంటాడు కవి కావ్య పీఠికలో. కరువులతో అల్లాడింది సీమ. 1952 సంవత్సరంలో సంభవించిన కరువు కవి హృదయాన్ని తాకింది. అందుకే ఆ సంవత్సర కరువు భీభత్సదృశ్యము లింకనూ నామదిలో మెదలుతూన్నే ఉన్నవి. ఆనాటి విషాదానుభవాలే నేటి నాకావ్యానికి ప్రేరణ నిచ్చినవి. ఈ కావ్యానికి ముందుమాట రాసిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ''ఇంత చక్కని రచన చేయు కవులీ ప్రాంతమునందు రెడ్లలో నుండగా అల్ప ప్రతిభా వంతులు, అల్పసాహిత్యపరులు పైకి వచ్చుట నాకు బాగుగా కనిపించలేదు'' అని కవిని ప్రశంసించాడు. నిజమే విశ్వనాథ వారు చెప్పినట్లే రాయలసీమ కవులకు రావాల్సిన పేరు ప్రతిష్ఠలు రాలేదు. వీరు తెరవెనుకే మిగిలిపోయారు. కానీ గొప్ప కవిత్వాన్ని సృష్టించారు.

కవి ఈ కావ్యాన్ని ఐదుభాగాలుగా విభజించాడు. కృషీవల ఖండంలో 52 పద్యాలు, మిత్ర సమాలోచన ఖండంలో 100 పద్యాలు, మేఘాత్కలిత ఖండంలో 53 పద్యాలు, వర్షారంభఖండంలో 46 పద్యాలు, ఫలప్రాప్తి ఖండంలో 72 పద్యాలు మొత్తంగా 323 పద్యాలతో రచించాడు. సంప్రదాయ మార్గానికి చెందిన బైరపురెడ్డి నారాయణరెడ్డి అన్నీ ప్రౌఢమైన పద్యాలే రాశారు. ఈ కావ్యంలో కవికి భాష మీద పట్టు, ఛందస్సు మీద అధికారం, అలంకారాల మీద అవగాహన గొప్పగా ఉన్నాయి.

1952లో రాయలసీమలో పెద్ద కరువు ఏర్పడింది. పాడికీ పంటలకూ, నీటికి కూటికీ నికృష్టమైన కరువు రైతు పొట్ట కూటికి ఇల్లాలి పుస్తెను కూడా తెగనమ్మిన కరువు. కవి ఆకరువు బరువును తానూ అనుభవించాడు. మరచిపోయిన కొన్ని సంఘటనలను మిత్రుల ద్వారా విని ఆ కరువును గురించి ఏకరువు పెట్టాడు. ఆయన ఘోష ఆయన గుండల్లో నుండి వచ్చింది.

ఈ కరువు కారణాన్ని కవి చమత్కృతితో తెలిపాడు. రాయలసీమ వాసులు అందరి దేవుళ్లనూ కొలిచి భోగాధి పతి ఇంద్రుణ్ణి మరచిపోయారు. వాళ్ళకు తన ఉనికిని గుర్తు చెయ్యడానికి వాళ్ళను అన్నార్తులను చేస్తే తప్ప వారి గర్వమణగదని కరువును సృష్టించాడు దేవేంద్రుడు. మిత్ర సమాలోచనం చేసి కరువును సృష్టించమంటే చెవిటి మేఘుడు పొరపాటున విని, విజృంభించి గాలి వాన తెచ్చి పెట్టాడు. అట్లా వచ్చాయి ఆ కరువూ, ఆ గాలివాన.

రాయలసీమ రైతు కావ్యంలో ప్రధాన వస్తువు రాయల సీమలోని వాన. ఈ కావ్యంలో మేఘుడు నాయకుడు, రాయలసీమ క్షేత్రం నాయిక. వీరి సంయోగ వియోగాలతో ముడిపడని ప్రజాజీవితమే లేదు సంపన్నుడైన రైతు తన సీమలో వానలేక క్షామదేవత విలయ తాండవం చేయడం గురించి వ్యథ చెందడం, దానికి మరొక గ్రామంలోని మిత్రునితో కలిసి పరిష్కార మార్గాలను, విధివిలాసాలు, దైవప్రతికూలత, జీవితం గురించి ఆలోచించడం మొదలైన ప్రధానాంశాలు. కాని వాన కురియని మేఘము ప్రేమజూపని ప్రియుడు. వాన పొందని సీమ ప్రియుని ప్రేమకు నోచని సతి.

సీ॥ "భోజన మానక పొంకంబుదప్పిన/ స్త్రీముఖ
భంగిని చెర్వులుండ
క్షయరుజన్ గృశించి కన్నీరునింకి స / నాతుల
కనులట్లు నూతులుండ
కాంతునిదయలేక కన్నీరు గార్చెడి / కాంత రీతిని
ఏటికాల్వలుండచీరలు సొమ్ములు చోరాపహృతమైన

**/ పొలతి మాడ్కిని పంట పొలములుండ**
**సరస సౌభాగ్యగరిమ కాస్పదమయైన / పతి సమాగమ**
**మందని ప్రమదమాడ్కి**
**సదమదంబయ్యె సస్యదోహదములేక / ప్రియుడయిన**
**మేఘుడెడబాయ పృథ్వియిపుడు**

ఈ విధమైన ఉపమానాలతో రాయలసీమ ప్రాంత స్థితిని ఒక వైపు, నాయికా నాయకుల కథను మరోవైపు. ప్రజల జీవితాల గురించిన వేదన మరొక చెంత నిరూపించాడు. ఈ కావ్యమంతా మానవుని జీవితంపై ప్రకృతి ప్రభావాన్ని రసవంతంగా గొప్ప పద్యాలతో, చమత్కృతులతో రచించారు.

కరువు పంటల్ని ఎలా నశనం చేసిందో కళ్ళారా కన్నీళ్ళు పెట్టుకొనే బాధాతప్త హృదయంతో వివరించిన తీరు చూడండి.

**సీ॥ గుబురు జొంపంబుల గొనమైన వన్నెల, వర్ధిల్లు**
**సస్యముల్ వాడు దోచె**
**వాడుదోచిన వెంట వరుసగా జిగిరించి,**
**ఎసగినపత్రమ్ము లెండి పోయె**
**ఎండిపోయిన ఆకులించుకించుక చచ్చి, సాగి**
**మొదళ్ళకు సమసిపోయె**
**సమయుచుంబోవు నచ్చపుకాండవితానముల్,**
**మొట్టమొదటకాగి మ్రోడుపడియె**
**తే॥ దిన దినమ్మును వృద్ధియై ననలకొనల /**
**పసిమిచాయల విలసిల్లుపైరులకట!**
**దిన దినమ్మును కృశియించి తీవ్రభంగి /**
**నామమాత్రావశిష్టమై నష్టమైన (పద్యం-42)**

పైరు పంట క్రమంగా ఎండిపోతుందో ఈ పద్యంలో చెప్పారు. మొదట మొక్కల కాండలు కాగిపోయి, మ్రోడుగా మారాయి. ఆ ప్రభావంతో చిగురించిన పత్రాలు ఎండిపోయాయి. ఇంచుకించుగా ఆకులు ఎండిపోతూ చివరకు మొదళ్ళ వరకు ఎండి, రాలిపోయాయి. తర్వాత కాండం మోడుగా ఎండి మిగిలిపోయింది. ప్రతిరోజూ యింతింతగా బంగారు ఛాయలతో వృద్ధి చెందిన ఆ పంటలు ఇప్పుడు రోజురోజుకూ కృశించి పూర్తిగా నాశనమై రైతు నష్టాలపాలయ్యాడని కవి తెలిపారు. అంతేకాదు రాయలసీమ రైతు జీవనం "కరువులోన బుట్టి కరువుతోడ పెరిగి / కరువులందె బ్రతుకు గాంచు జనుల...

కరువు సీమ వాసులపట్ల కర్కశంగా మారిన విధం ఆలోచనాత్మకం.

**తే॥ కసవు పొసగదు నీరైన నొసగలేక/మేప నడవికి**
**తోలిన గోపవరుల**
**కనుగొలంకుల జొచ్చిన కరుణజలము/గ్రోల**
**గనజూచినట్లుండె గోచయంబు**

**(పద్యం-48)**

వర్షాలులేవు. ఎండలు మంటలై మండుతున్నాయి. నీటి ఎద్దడి చెప్పవలసిన అవసరం లేదు. పశువులకు మేతలేదు, కనీసం నీరు లేదు. ఆమూగ జీవుల ఆవేదనను హృదయ విదారంగా చిత్రించాడు.

కరువులో సంసారుల బాధలను వివరించే ఘట్టంలో కరుణ రసాన్ని దృశ్యాత్మకంగా వివరించాడు.

**సీ॥ కొప్పునముడువంగ కుసుమముల్ కొనలేక /**
**కులకాంత కుందిన గుండెనొకడు**
**కేశ సంస్కారతైలాశ కశక్తయై / ఇల్లాలు నేడ్చిన**
**నేడ్పెనొకడు**
**పసుపుకుంకుమ కొన పైకమ్ము లేమికై / వల్లభ**
**వగచిన వగచెనొకడు**
**గాజులతోడుగ గాకాసునులేనిదై / తెఱవ చింతింప**
**చింతించె నొకడు**
**తే॥ మంగళ ప్రదమైన సుమంగళీవి / కానవిభవ**
**సంపత్ప్రభా భాసములగు**
**మహిత వస్తువుల్ గవలేక మగువలేడ్వ /**
**వారిభరియింప చాలమిపతులు నేడ్వ (ప.66)**

కరువు సంభవించిన కాలంలో పసుపు-కుంకుమ, గాజులు మొదలైన భార్యలకు కొనలేకపోతిమి అని

నిస్సహాయులైన భర్తలు కూడా ఏడ్చేశారని కవి కరువును చూపించాడు.

కరువుకాలంలో మానవ ప్రవర్తననూ, మానవ సంబంధాలు తలకిందులు కావటాన్ని కవి చక్కగా తెలిపాడు.

**సీ॥ పదిమందిరా సహం**
**సహపంక్తి భోజనమిడి**
**యలరించు యుజమానియాణగియుండె**
**వేళకభ్యాగతు లేతేర నన్నోద / కము గూర్చు సంసారి**
**కలతబొందె**
**అవసరం బని వచ్చు నాపన్న జనులకా / కలిదీర్చు**
**గేస్తుండు తొలగిపోయె**
**అన్ని దానములందు నన్నదానము గొప్ప / దని**
**పొల్చు గృహమేధి వెనుకబడియె**

**తే॥ మమత నిరతాన్న దానంబు నెమకి చేయు /**
**పుణ్యపురుషుల కత్తరి పూటగడువ**
**కష్టతరమయ్యెదైవ సంకల్పమేమొ / విశదపరుపంగ**
**శక్యమే! విధికృత్తినైన (ప.58)**

పదిమంది అతిథులొస్తే తనతోపాటు భోజనం పెట్టే గృహస్థు తప్పించుకున్నాడు. భోజన సమయానికి అభ్యాగతులొస్తే వారికి అన్నం పెట్టలేని సంసారి కలత చెందాడు. తనతో పని ఉండిచ్చేవారికి ఆకలి తీర్చే అలవాటున్న మర్యాదస్తుడు తొలగిపోయాడు. ఇలా నిరతాన్నదానం చేస్తూ ఉన్న పుణ్యపురుషులకు కూడా పూట గడవటం కష్టమైపోయింది.

## ముగింపు :

రైతు జీవితం, కరువు, వాటి కారణాల్ని, ఫలితాలను గురించి ఇద్దరి మిత్రుల మధ్య జరిగిన సంభాషణ రూపంలో ఇతివృత్తం ఉంటుంది. కావ్యం చివర ఫలప్రాప్తి ఖండంలో రైతు జీవితంలోని ఆనందాన్ని వర్ణిస్తారు. కరువు తొలగి వర్షాలు పడ్డాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తాడు. రైతుకు మళ్ళీ బ్రతుకు మీద ఆశ కల్గిస్తాడు. ఈ వర్షంలో ప్రకృతి పులకించింది, కర్షకుల ఆర్తి తీరిపోయింది. ఈ కావ్యం గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు - "ఈ ప్రౌఢ కావ్యాన్ని గురించి చెప్పవలసిన మాట ఒకటే. దీనికి అర్హత ఉన్నంత, తగినంత గుర్తింపు రాలేదు. రాయలసీమలాగా "రాలయసీమ రైతు" కూడా లోపలా, బయట కూడా నిరాదరణకు గురైందని" తెలిపాడు. ఇదీ రాయలసీమ కవులకు ఉన్న గుర్తింపు.

## ఆధార గ్రంథాలు :

1. రాయలసీమ రైతు - భైరపురెడ్డి నారాయణరెడ్డి
2. రాయలసీమలో ఆధునిక సాహిత్యం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య సామాజిక - సాంస్కృతిక విశ్లేషణ
3. రాయలసీమ రచయిత్రుల చరిత్ర - కల్లూరు అహోబలరావు
4. అర్ధశతాబ్ది రాయలసీమ పద్యకవిత్వం - డా॥ జి. రవికుమార్ ఒక అధ్యయనం (సిద్ధాంత గ్రంథం)

★★★

# రాయలసీమ కన్నీటి మాట – విద్వాన్ విశ్వం పెన్నేటి పాట

– డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

సీమలో కరవు కరాళనృత్యం చేస్తూనే వుంది. నెర్రె లిచ్చిన నేల ఏడుపు బయటికి రావడం లేదు... ప్రపంచమే వినలేనంత శబ్దం. ఆకలిపేగుల అరుపు కడుపుదాటడం లేదు. లోకం చూడలేనంత కరవు. ఎండిపోతున్న పంటల ఆకుల్లో మంట కన్పించడం లేదు. జనజీవనం కాలి పోయేంత సెగ. మండిపోతున్న కర్షకుల గుండెల్లో వేడి ఎవరికీ తగలడం లేదు. జీవరాసి మొత్తం నిండిపోయేంత పొగ... కరువు చేసిన గాయాల నొప్పి తెలియడం లేదు. వలస వెళ్లిన గుండె బరువు తూచాలేమో... ఊరు విడిచిన మనసు బాధ బయటపడటం లేదు. కరవు చేసిన బీద బతుకులు లెక్కించాలేమో... ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో సీమలో కర్షకులు, కూలీలను కరువు పొమ్మం టోంది. వలస రమ్మంటోంది. సీమలో పల్లె ప్రాంతాల్లో వర్షాభావం చుట్టుముట్టి నీరు అందక పంటలు ఎక్కడి కక్కడ ఎండిపోతే, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతుంటే, ఆకలితో ఇళ్ళవద్ద ఉండలేక, కన్నీళ్లతో ఊరు విడిచిపోతున్న తరుణంలో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్న పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ఆనాటి పరిస్థితులకీ నేటి పరిస్థితులకి క్షేమానికి క్షామానికి మధ్య ఉన్నంత వ్యత్యాసం కన్పిస్తుంది.

ఒకనాడు రాయలసీమ అంటే రతనాలసీమ, కానీ ఈనాడు రాళ్లసీమగా, కరవుసీమగా ఏకరవు పెడుతున్నారు. ఆరు దశాబ్దాల క్రితమే విద్వాన్ విశ్వం రాయలసీమ కన్నీటి మాటను 'పెన్నేటిపాట'గా మలచడంలో ఆనాడే కరవు ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది. ఆనాటి నుండి నేటివరకు ఇంకా పల్లె కన్నీరు పెడుతూనే ఉంది. వాన జాడ తెలియక చినుకైన రాలక ఎడారిలా మారుతున్న వైనాన్ని అక్షరీకరించి కన్నీళ్లు తెప్పించిన వైనం కళ్ళకు కట్టినట్లు చూపించాడు విద్వాన్ విశ్వం. పరిస్థితుల నేపథ్యాన్ని విద్వాన్‌విశ్వం వర్ణించిన తీరును పరిశీలిస్తే గుండె జలదరిస్తుంది. రైతులు రైతుకూలీలుగా మారిన వైనాన్ని, ఆ పరిస్థితులను గమనిస్తే కన్నీళ్ళకే కన్నీళ్లొస్తాయి.

**"రాయల పచ్చల బజారు, అచట ఒకనాడు పండె ముత్యాలు చాలు,**
**అచటనొకప్పుడు నిండె కావ్యాల జాలు,**
**అచ్చట నొకప్పుడు కురిసె భాష్యాల జల్లు"**

అనడంలో నాటికీ నేటికీ ఉన్న వ్యతాసం అంతా ఇంతా కాదు. రాయలసీమలో పెన్నేటిగట్టున ఉన్న పల్లెల బ్రతుకు నీడ 'పెన్నేటిపాట'లో ప్రతిధ్వనిస్తుంది. ఆ ప్రాంత పలుకుబడులూ, ఊరు, పేరుకి సంబంధించిన విశేషాలు దర్శనమిస్తాయి. పెన్నేటిపాట అన్నది 'కావ్యం' మాత్రమే చరిత్రగానీ, కథగానీ కాదని ఒక పల్లెనో, ఒక వ్యక్తి జీవితాన్నో ఉద్దేశించి రాసింది కాదని విద్వాన్ విశ్వం భావన.

''కోటిగొంతుల కిన్నెర మీటుకొనుచు, కోటిగుండెల కంజరి కొట్టుకొనుచు'' రాయలసీమ కన్నీటిపాటను వినిపించాడు విద్వాన్ విశ్వం.

**అదే పెన్న! అదే పెన్న!**
**నిదానించి నడు**
**విదారించునెదన్, వట్టి**
**ఎడారి తమ్ముడు!**
**ఏదీ పెన్న? ఏదీ పెన్న?**
**ఏదీ పినాకినీ?**
**ఇదే పెన్న! ఇదే పెన్న!**
**ఇదే పినాకిని!**
**ఏదీనీరు? ఏదీ హోరు?**
**ఏదీ నీటిజాలు?**
**ఇదేనీరు! ఇదే హోరు!**
**ఇదే ఇసుకవాలు!**

**అదే పెన్న! అదే పెన్న!**
**నిదానించి నడు?**

అని పెన్నానదిని గూర్చి విచారించి, వట్టి ఎడారి అన్న భావనను వ్యక్తం చేస్తాడు. పెన్నానదిలో నీరేది, ఆ హోరేది, నీటిజాలుజాడ కూడా లేనితనాన్ని గూర్చి బాధపడి ఆవేదన వ్యక్తం చేశాడు.

**ఇంత మంచి పెన్న తల్లి**
**ఎందుకెండి పోయెనో?**
**ఇంత మంచి కన్నతల్లి**
**ఎందుకిట్లు మారెనో?**
**వంతలతో, చింతలతో**
**కంతలువడి పోయెనో!**
**సంతుకోస మేడ్చి ఏడ్చి,**
**గొంతుకారి పోయెనో!**
**ఇంతమంచి పెన్నతల్లి**
**ఎందుకిట్లు మారెనో?**
**ఇంతమంది కన్నతల్లి**
**ఎందుకెండిపోయెనో?**

పెన్నేటి కాల్వలోతులలో పాయలుగా పారే నీటి ప్రతిబొట్టులో రైతుల నెత్తుటి ఛాయలు సమ్మిళితమయ్యా యని విచారం అభివ్యక్తం చేసాడు. నాగకన్యలు ఇక్కడ కన్పడరు గాని, నాగుబాములు ఇక్కడ చకచక సాగుతాయి. గరుడ గంధర్వ కామినుల్ ఇక్కడ కనబడరు గాని, బొంతగద్దలు ఇక్కడ గుంపులు గడతాయి అంటాడు విద్వాన్ విశ్వం. ఇట గులాబీలు / తలసూప వెపుడు, వట్టి / తంగెడుల్ బోదగడ్డి గాదములె పెరుగు / సరస సుకుమార తృణ సమాచ్ఛదము లేదు / పాడుపల్లెరు గాయల బీడెగాని! అంటూ పంటపొలాలు బీడుపడిన వైనాన్ని పేర్కొన్నాడు. ఈనాడు శుక పిక శారి కారవ రుచుల్ వినిపింపవు ఈ ప్రాంతంలో, గుడ్లగూబల మూల్గులు మాత్రమే వినిపిస్తాయి అన్న పల్కులలో దారిద్ర్యం, కరవుల స్థితిగతుల్ని వ్యక్తం చేశాడు.

పారచేబట్టుకొని వంగి చీరుదనుక / ఇట్టి చెమ్మట కాలువ గట్టుదనుక / ఇసుక పాతర లోతుల కేగు దనుక / నీకు కన్పించదీయేటి నీటిచుక్క / కుండపోతల వానలు గుఱియనేమి / పట్టుమని పదినాళ్ళలో పారబోసి / ఇసుక బొక్కసమున మిగులెల్లదాచి / పెన్న పడుకొను నీనేల దిన్నె మీద! అని పెన్ననదిలో నీటిచుక్క కరవైన వైనాన్ని ఏకరువు పెట్టాడు.

**కాని, ఈఏటి నీటిలో**
**కమ్మదనము లూరుచుండును;**
**దోసిట నొక్కమారు**
**పుక్కిలించిన జాలు**
**నీ పుట్టువునకు**
**సార్థకత్వము**
**నిష్కల్మషత్వ మబ్బు!**

అని పెన్నానది నీటిలో కమ్మదనం ఊరుతుంటుంది. ఒక్కసారి పుక్కిలించినా నీ జన్మకు సార్థకత్వం, నిష్కల్మ షత్వం అబ్బునని స్పష్టం చేశాడు.

**“గుండె జలదరింప జేయు**
**రండతనముడుల్చి వేయు**
**ఖండితవాదినిఁ జేయును**
**దండి తల్లి సుమ్మీ నది!”**
**“కండలేక ఎండిపోయి**
**బెండువారినా సరే!**
**తిండిలేక, తుండు లేక**
**పండవారినా సరే!”**
**“నిండు మనసు, నిజాయితీ**
**పండువయసు, పట్టుదలా,**
**దండిచేయి, ధర్మదీక్ష**
**పండించుచు గుండెలలో”**

అనే నమ్మకం, రాయలవాసుల నిజాయితీ, కరవు పరిస్థితులను ఆత్మాభిమానం, ధర్మదీక్షను, పెన్నానది పవిత్రతను, కరవు పరిస్థితులను ప్రతి పల్కులో ప్రతి ధ్వనింపజేశాడు విద్వాన్ విశ్వం. ప్రతి పలుకు రాయలసీమ గ్రామీణ జీవనానికి నిలువుటద్దంగా కనిపిస్తుంది. అల నాటి రతనాలసీమ ఇలనాటి కరవుసీమగా మారిన వైనాన్ని

స్పష్టం చేశారు. ఆనాడు ముత్యాలు రాశులుగా పోసిన రోజులున్నాయి. సీమసిరులు కురిపించింది. పంటపొలాల్లో స్త్రీలు పనిచేసుకుంటూ పాడిన జానపద గేయాలు సితార నాదంలా ధ్వనించేవట. అనేక కావ్యాలు, వాటికి భాష్యాలు వచ్చాయి. మరి ఈనాడు 'కన్నీటిపాట' పాడుకోవాల్సిన పరిస్థితులు తటస్థించాయి. పెన్నానదిని చూస్తే గుండెల విసిపోయే పరిస్థితి నెలకొని ఉంది. కుండపోత వర్షం కురిసినా, పదిరోజులైనా నీళ్ళుండని స్థితి; నీరు ఇసుకలో ఇంకిపోవడం. ఇసుకవాలే మిగలడం, వానఉధృతమై జీవరాసుల్ని మింగివేసిన వైన్నాన్ని కూడా అక్షరబద్ధం చేశాడు

అల్లంత దూరంలో కనిపించే చింతచెట్టుకొమ్మ చిన్నిగాని ఊపిరి తీసింది. అక్కడ కన్పించే తుమ్మచెట్టు దిమ్మె దగ్గరే సీతిగాడిని చెరసాలకు తీసుకువెళ్ళారు. అక్కడ ఈతచెట్టున్నచోటే ఎంకి కడియాలు ఎవరో ఊడదీశారు. ఆ ఇసుక దిబ్బల దగ్గరే చలమన్న బండి బోల్తాపడింది అని ఇలా ఆ ప్రదేశాలలో అడుగుతీసి అడుగువేస్తేనే గుండెలు బద్ధలయ్యే తీరును వర్ణించాడు.

పెన్నానదికి ఇరువైపులా స్మశానమే ఉందని అక్కడ పుఱ్ఱెలే మెండుగా కన్పడతాయని, అక్కడ బల్లులు, తొండలు, ఎలుకలు, పిల్లలు, కుక్కలు, కుందేళ్ళు, తేళ్లూ, జెర్రులు, పాములు ఎక్కువగా ఉంటాయని, పుట్టలు కూడా ఎక్కువేనని, నిట్రాళ్ళు, బేట్రాళ్ళు, చెట్రాళ్ళు అధికమని చెప్పడంలో అచటి పరిసరాలు ఎంత దుర్భ రంగా ఉన్నాయో కళ్లకు కట్టినట్లు కవిత్వీకరించాడు. రాయలసీమ దుర్భర దారిద్ర్యబాధను వాస్తవికరీతిలో కలకాలం చరిత్రలో నిలిచిపోయే గాథగా మలిచాడు విద్వాన్ విశ్వం.

కోటికొక్కరిది ఇచ్చోటి రాయలసీమ / పేట కొక్కెడలేని పెద్ద రాయలసీమ / వేటాడి వేటాడి వెదికినా ఇందులో / నేటి పేదలసీమ నిజరూపు కనబడదు అంటాడు. ఇది ఎడారిలోని ఒయాసిస్సే కానివ్వు / వడగొట్టిన పేదకేమొ వట్టి ఎండమావుంటాడు.

**"ప్రొద్దు పోకకే చదువు**
**ప్రొద్దు పోకకే నులివు**
**ప్రొద్దుపోకకె మెదుకు**
**ప్రొద్దుపోకకె బ్రతుకు**
**మొద్దువాతెను మనసు**
**మొద్దువాతెను తనువు**
**మొద్దువాతెను బ్రదుకు**
**సుద్దియే యిచట" అంటాడు.**

ఎక్కడ చూచినా ప్రక్కలెండి ఉన్నారు. ఎటుచూసినా విలపిస్తూనే ఉన్నారు. ఎటు చూడలేక తమ కిటికీలు మూసుకొని, కటు జీవిత యదార్థ కథ చూడలేకున్న వైనాన్ని ఆవిష్కరించాడు. ఒక పెద్ద రైతుకు ఒకడే కుమారుడు రంగడు. రంగడికి ఇల్లాలు గంగమ్మ. వారిద్దరికీ వారే తప్ప వెనకాముందు ఎవరూలేరు. ఆస్తిపాస్తులు కూడా లేవు. అడవిలో దొరికే కట్టెలో, గడ్డో మోపుకట్టుకొని వచ్చి అమ్ముకొనే కూలీ రంగన్నయితే, తమ ఇరుగు పొరుగు వాళ్లిళ్ళల్లో అటుకులో, వడ్లో దంచగా వచ్చే నూకలో, తవుడో తెచ్చుకొని జీవించే జీవితం గంగమ్మది. రంగన్న, గంగమ్మల అన్యోన్యం, పరోపకారం, వారి కాయ కష్టం, అంతులేని దారిద్ర్యం, ఇరుగు పొరుగువారి నిస్సహాయత, తరువాత రంగమ్మ గర్భం దాల్చడం ఇన్ని కష్టాలను చూసి చేసేదేమీ లేక 'సమాధి గతుండగు యోగిబోలె 'స్తబ్ధుడై ఉండటం' వారి భవితవ్యాన్ని ప్రశ్నించేదే ప్రధానమైన వస్తువుగా కన్పిస్తుంది.

**దైవమా; ఉంటివా? చచినావనీవు?**
**ధర్మమా; గెంటిరా? నిన్ను ధరణి నుంచి?**
**సంఘమా; తలకెక్కెనా? సన్ని నీకు?**
**హృదయమా; మానవుడు నిన్ బహిష్కరించె !**

ఈ లోకంలో నాత్మసాక్షి చచ్చిపోయిందని భరతవాక్యం పల్కుతాడు విద్వాన్ విశ్వం. ఇలా సీమ ఎడారిగా మారిన వైనాన్ని కన్నీటి మాటను పెన్నేటిపాటను మలచి చిరస్మరణీయుడిగా నిలిచాడు విద్వాన్ విశ్వం. ★

BHAVAVEENA SPECIAL EDITION
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

# రామకృష్ణారెడ్డి కథల్లో మాండలికాల ప్రయోగం

- కొక్కు నరేష్, పరిశోధకులు, యోగివేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప జిల్లా.

తెలుగు ప్రాంతం భౌగోళికంగా నైసర్గికంగా మూడు ప్రాంతాలుగా ఉంది. అవే రాయల సీమ, కోస్తాంధ్ర తెలంగాణలు. ఈ మూడు ప్రాంతాల్లో మాట్లాడే భాష తెలుగే అయినా అందులోని యాస ప్రత్యేకత కలిగి ఉంది. ఒక ప్రాంతంలోని యాస స్వాభావికత మరో ప్రాంతంలో కనిపించదు. అయినా మూడు ప్రాంతాల ప్రజల మాతృ భాష మాత్రం తెలుగే. ఈ విషయాన్ని చరిత్ర, వాఙ్మయం నిర్ధారిస్తున్నాయి. వీటిలో రాయలసీమ ప్రాంత భాషకు ఒక వినూత్నత ఉంది. దీనికి ఒక స్థానికత (నేటివిటి) ఉంది. దీనిని ఆధునిక రచయితలు వివిధ ప్రక్రియల్లో ప్రతిబింబించారు. అలాంటి వాటిలో ముఖ్యంగా చెప్పదగిన సాహిత్య ప్రక్రియ కథ. ఈ కథల్లో ప్రధానమైనవి పి. రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కతలు'.

ఈ 'పెన్నేటి కతలు' శీర్షిక కింద రామకృష్ణారెడ్డి ఇరవై రెండు కథలు రాయగా వాటిని ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 2-5-1989 నుంచి 29-09-89 వరకూ వారం వారం ప్రచురించింది. ఈ కథల నిండా మట్టి వాసనా, వాన చినుకుల వాసన, బరిగొడ్ల వాసన, పంటచేల వాసన, ఏటి వాసన ఈ అక్షరాలలో జీవితం దాని అనేకానేక కోణాల్లో కనబడుతుంది, వినబడుతుంది, స్పృశిస్తుంది, రుచికందుతుంది. ఇక పెన్నేటి కతల్లో వున్న విశిష్టత అవి మాండలికంలో ఉండటం. రచయిత మాండలికంలో చెప్పకపోయి వుంటే, వాటి ప్రయోజనం తప్పకుండా పరిమితమై పోయేదేననవచ్చు.

ఒక వ్యక్తి పని తనాన్ని గూర్చి పి. రామకృష్ణారెడ్డి గారు 'ఏటుకాడు' కథలో చెబుతూ ఆ క్రమంలో ప్రయోగించే మాండలికాలను పేర్కొన్నాడు..

"ఏసోబుకు రోంత జంబం వుందిగానీ వామి ఏసి నాడంటే వానమ్మ నా కొడుకు వాడే ఎయ్యాల అంటా రంతా. పాత వాముల్ని జూసినా యిది ఏసోబు ఏసిందేనని కనిపెట్టొచ్చు నంటారు. కల్లంలో వాడుంటే ఎక్కల్లేని వుశారు. మేత మోసే కూలోళ్ళను ఆడ మొగా అని సూడకుండా తిడ్తాడు. అందరూ నగుతారేగానీ కొట్లాడరు. తిట్టకుంటే ఏసోబు ఎట్టయితాడులే అన్నట్టుంటారు. అంటే కూలోళ్ళలో వాళ్ళ వాళ్ళు ఎక్కువగా వుండడం ఒకటే. ఉత్తప్పుడు పాణంబోయే వాని మాదిరిగా వుండే ఏసోబుకు ఏటుగాడై పన్లోకి దిగుతానే అంత వొడుపూ శకితీ యాన్నించి వొస్తాయో తెల్దు. రొండు సేతుల్తో వామ్మిందనుంచి జవురుకొని అందుకుంటా, సేతుల్తో కాళ్ళతో యాడి మేత ఆడ తొక్కతా, సరిచేసుకొంటానే వుంటాడు. ఇంగో పక్క మేత రాలేదని ఎచ్చరిస్తావుంటాడు. అర్జునుడు గదా యుద్దెం జేసినట్టే అనుకో", అంటాడు కథకుడు.

పై కథలో జంబం అనే మాండలిక శబ్దం ప్రయోగించబడింది. జంబం అంటే గర్వం అనీ, అహం కారం అని అర్థాలున్నాయి. ఈ పదాన్ని కడప జిల్లాలో విరివిగా ప్రయోగిస్తారు. అదేవిధంగా తెలియదు అన్న పదాన్ని 'తెల్దు' అని ప్రయోగిస్తారు.

వర్షాగమనాన్ని దాని ద్వారా రైతులకు కలిగిన ఆనందాన్ని పి. రామకృష్ణారెడ్డి గారు 'ఈ పక్క పారే ఏరు ఆపక్క ఎండే పైరు' అనే కథలో చెబుతూ ఆ సందర్భంగా ప్రయోగించే మాండలికాలను పేర్కొన్నాడు.

"ఊళ్ళో అందరికీ ఏందో సక్కిలిగిలి బెట్టినట్టుగా సంబరమే సంబరం, నగలేనగులు! యాడసూసినా ఎవురికెవురు ఎదురు పన్నా, అతగాని సేను అట్టుందంటే, ఇతగాని సేను ఇట్టుందని సెప్పుకోడాలు! సేలలో సెయ్యాల్సిన పనేమీ ల్యాకపోయినా ఊరికెనే అట్ల ఏదో

పనున్నట్టు పోయి వచ్చేవాళ్ళు. మొగోళ్ళే కాదు ఆడోళ్ళు కూడా ఏ గడ్డికోపోయి సూసొచ్చి సెప్పుకోవాల్సిందే.

అట్టావున్నెప్పుడు అట్టాత్తుగా ఆయం పాట్న దెబ్బ తాకితే, అంతవరకూ నగుతూ నగుతూ వుండిన మొకంలో నొప్పి కనపడినట్టు అయిపాయె. రోజురోజుకూ తీగెలు సాగుతా పెరుగుతా వచ్చిన సెనిక్కాయ పైరు, ఆగిపోయి ఆ మొయిన వాడిపోబట్టె, పైరు ఎట్ట వాడిపోబట్టెనో అట్టనే వాళ్ళ మొకాలు కూడా వాడిపోబట్టే. అందుకే, సేలల్లో పైరెట్టుందో తెల్సుకోవాలంటే ఊళ్ళో మనుసుల మొకాలు సూడాలనేది.

వాడిపోయే పైరును సూల్లేక సేలకు పోవడమే మానుకొన్రి. ఇరాట పరవం సదివిచ్చిరి. పోతురాజుకూ, కప్పాలమ్మకూ నీళ్ళు పోసిరి. సీతారాముల పెండ్లి చేసిరి. ఎన్ని జేసినా సినుకు నేల్న రాలకపాయె. వస్తాదని యెవురూ అనుకోనప్పుడు వచ్చిన వాన, వస్తాది వస్తాదని ఎగ జూసినప్పుడు ఎగ్గొట్టె. ఎగ్గొట్టింది ఎగ్గొట్టినట్టుండక, ఏరు పారిచ్చి ఏడిపిచ్చె, ఏటి మీద ఎల్తర పర్సినట్టు ఎక్కడ జూసినా పరవళ్ళు తొక్కే నీళ్ళు'' అంటాడు కథకుడు.

పై కథల్లో 'అట్టాత్తుగా' అనే శబ్దం ప్రయోగించబడింది. దీని మూల రూపం హఠాత్తు అనే సంస్కృతరూపం. అదేవిధంగా నవ్వులు అనే శబ్దం నగులుగా ప్రయోగించ బడింది. ఏడిపించే అనే శబ్దం 'ఏడిపిచ్చె'గా ఉచ్చరించడం జరిగింది.

పిల్లల సంభాషణలో కూడా మాండలికం ఎంత అద్భు తంగా ప్రయోగించబడిందో కథకుడు పి. రామకృష్ణారెడ్డి తన 'జీరంగి' కథలో తెలిపాడు.

"మునెయ్య వాళ్ళ కంటే పెద్దోడు. జీరంగిని ముందు సూపిచ్చినప్పుడు మొగదనీ, మాంచి పాయంలో వుండాదని సెప్పినాడు. అట్ట సెప్పినోడే అది ఆడ్డని మల్ల సెప్పాల్సి వచ్చింది. ఒక్కసారి సూపిచ్చు అంటగడతా, నల్గురూ మునెయ్యకు తినేటియి పెట్టడం మొదలు పెట్నారు. సెనిక్కాయ పప్పులూ, బెల్లం జొన్న రొట్టె యిట్ట వాళ్ళేంది తెచ్చుకుంటే అది యియ్యబట్టారు. యీ పక్కోడు ఆపక్కోడు ఇచ్చేది రొండు సేతుల్తో తీసుకోని తింటా మునెయ్య ఒకసారి జేబులో నుంచి అట్ట అగ్గి పెట్టెను బైటికి తీసి సూపిస్తా, యింగోసారి జేబులో వుండగనే తట్టడిసి సూపతా వొచ్చినాడు. ఎంత కాదన్నా వాళ్ళ నోటికాడియి తను తినిందాన జీరంగి గుడ్లు పెట్నాక ఆగుడ్లు పెట్నాక ఆ గుడ్లు యిస్తానని మాటిచ్చినాడు వాళ్ళకు. ముందు మొగదని సెప్పిన జీరంగిని, మల్ల ఆడ్డని సెప్పడమే అన్ని రకాలా వాటంగా కనబడింది మునెయ్యకు'' అని తెలిపాడు.

పై కథలో రచయిత 'చెప్పాలి' అని ప్రయోగించాల్సిన చోట సెప్పాలి అని ప్రయోగించాడు. మగది అని ప్రయోగించాల్సిన చోట మొగది అని ప్రయోగించాడు. అదే విధంగా ఆడది అని చెప్పడానికి 'ఆడ్డి' అని ప్రయోగించాడు. అదేవిధంగా ఇక్కడ తట్టడిసి అనే పదం ప్రయోగించబడింది. ఈ శబ్దానికి చేయి ముడిసి అని అర్థం ఉంది.

ఒక వ్యక్తి నిరాడంబరతను చెప్పే సందర్భంలో ఎలాంటి మాండలికం ప్రయోగించబడుతుందో 'కరె నాగయ్య' కథలో పి. రామకృష్ణారెడ్డి ఇలా తెలిపాడు.

"సొక్కా కుట్టిచ్చినాంగదా తొడుక్కో అని యింట్లో వాళ్ళు అంటే ... ఇప్పుడెవురి పెండ్లి అయితాండాదని సొక్కా తొడుక్కోని మాసిపోకుండా మంచమెక్కి కూకొనేది అనడిగె కరె నాగయ్య. ఆ యెవురి పెండ్లో అయితాండే తప్పుడు తొడుక్కోమంటే ఎవురి రెండ్లికో నేను సొక్కా తొడుక్కోక పోతే యేం? అనీ అనె. కరె నాగయ్య సొక్కాకత యింతటితో అయిపోలా, యింగావుంది. ఏంది నాగయ్యా! యాభై అర్రై ఎకరాల ఆసామివి, రొండు మూడు లచ్చల వొడ్డీలకు తిప్పుతాండావు! సొక్కా గూడా లేకుండా ఊరంతా తిరగతాంటే సీద్రం గాదా? అని ఎవురన్నా అడిగినప్పుడు నాగయ్య సెప్పేది తెల్సునా?

ఆమనిసి వొరుసైనోడయితే, ఒరే నాయలా! అనో, ల్యాకపోతే ఒరే అబ్బీ! అనో పిల్చి మొదలు పెడతాడు. నేనీ వూరికి కొత్తోనిగాను సొక్కా తొడుక్కోక పోయినా వొల్లే కట్టుకోకపోయినా నాకెంత భూమి వుండేదీ, ఎంత లెక్క వుండేదీ అందరికీ తెల్సు. నేను సొక్కా తొడుక్కోలేదని అయి యాడికీ పోవు. తొడుక్కుంటే అంత కంతకూ ఉచికేదీ లేదు. ఇగెందుకురా లేనిపోని యేసికాలు? అని తేల్చుతాడు'' అని తెలిపాడు కథకుడు.

పై కథలో 'చొక్కా' అనే శబ్దం స్థానంలో సొక్కా అని ప్రయోగించాడు. అంటే చకారం స్థానంలో 'సకారం' ప్రయోగించబడింది. 'రెండు' అనే శబ్దం రొండుగా ప్రయోగించబడింది. వడ్డీలకు అనే శబ్దం వొడ్డీలకు అని ప్రయోగించబడింది. 'ఒళ్ళు' అనే శబ్దం వొల్లుగా ఉచ్చరించబడింది.

కులవృత్తుల వారి సంభాషణల్లో కూడా మరొక రకమైన మాండలికం కనిపిస్తుంది. దీనికి 'సిన్న సిన్న ఆశలు' కథను తీసి కోవచ్చు. ఈ కథలో కథకుడు పి. రామకృష్ణారెడ్డి ఇలా అంటాడు.

"కొలిమి జమాల్ అంటే బారీ మనిసి అనుకుంటారేమో! అదేంగాదు. పిట్టంతమనిసి, సింపిరి జుట్టుతో, పుల్ల మీసాల్తో సోలాడ్తా వుంటాడు. జమాల్ పెండ్లాం మటుకు జమాల్జమాల్ మంటూ ఇంతెత్తునా ఇంతలావునా దర్జాగా వుంటాది. ఆమె పొలం పనులకు పోతావుంటాది గానీ, జమాల్ కొలింపని తప్ప ఇంగే పనీ సెయ్యడు. కొలింపని ఏడాది పొడుగునా వుండదు. వూళ్ళల్లో యాడాది పొడుగునా యాపని వుంటాదిలే. వానలు గుర్సి సేజ్యాలు మొదలైతాయే అనాల్రోజులూ కొలింపని కసాలాగా వుంటాది'' అని అంటాడు.

పై కథలో 'సేద్యం' అనే శబ్దం సేజ్యంగా ఉచ్చరించబడింది. అదేవిధంగా 'కసాలా' అనే మాండలిక శబ్దం ప్రయోగించబడింది. కసాలా అంటే గిరాకీ అని అర్థం. దీనిని ఆంగ్లంలో డిమాండ్ అంటారు.

ఈ విధంగా కడప జిల్లాలో ముఖ్యంగా ప్రొద్దుటూరు ప్రాంతంలో మాండలిక పదాలు ప్రయోగించబడుతున్నాయి. వీటిని అక్కడ అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అలవోకగా ప్రయోగిస్తారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు భాషాచరిత్ర - ఆచార్య నాయని కృష్ణకుమారి
2. తెలుగు భాషా చరిత్ర - సం॥ భద్రిరాజు కృష్ణమూర్తి
3. కడప జిల్లా మాండలికాలు - తెలుగు అకాడెమి ప్రచురణ
4. ఆంధ్రుల జానపద విజ్ఞానము - ఆర్వీయస్ సుందరం
5. తెలుగు మౌలిక అంశాలు - డా॥ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణ

★★★

# మెకంజి కైఫియత్తులు - విశేషాంశాలు

- డా॥. పి. రమాదేవి, సహ ఆచార్యులు, తెలుగుశాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప జిల్లా.

## శ్రీహరి కోటలో ఉండే యానాదుల జాతి విలాజు కైఫీయత్తు :

పూర్వం రాఘవరెడ్డి అనే వ్యక్తి పాకనాటి సీమనుండి శ్రీహరికోటకు వచ్చి అక్కడ ఉండే యానాదులు అరవై ఐదు ఇండ్లవాళ్లను పిల్చుకొని శ్రీహరికోట అడవి ప్రాంతమంతా శుభ్రపరచి రాఘవపురం అనే ఊరు నిర్మించాడు. ఈ రాఘవపురానికి ఆగ్నేయంలో అనేకమంది యానాదులకు ఇల్లు కట్టించాడు. ఆ యానాదులు ఆ ప్రాంతమంతా తిరుగుతూవుండేవారు. ఆ ప్రాంతానికి కాశీనుంచి ఒక మహర్షి అక్కడ ఉన్న సరస్సులో స్నానమాచరించి శివపూజ చేసుకునేవారు. ఆ యానాదులు ఆ మహర్షి పట్ల భక్తిభావంతో అతనికి ఆ అడవిలో దొరికే పండ్లు, ఫలాలు సమర్పించేవారు. ఇలా కొద్దిరోజులు గడిచిన తర్వాత ఆ మహర్షి ఆ యానాదులతో మీరు చాలారోజుల నుండి నాకు పండ్లు, ఫలాలు తెచ్చిఇస్తున్నారు. మీరు నానుంచి ఏమి ఆశిస్తున్నారు? అని ప్రశ్నించారు.అప్పుడు ఆ యానాదులు మేము ఈ ప్రాంతంలోనే నివశించేటట్లు, మాకు ఇక్కడ సర్పభయాదులు ఏమి లేకుండా జీవించేటట్లు మాకు మంత్రతంత్ర సిద్ధి కలిగించమని ప్రార్థించారు. వారికోరిక ప్రకారం మునీశ్వరుడు వారికి వరాన్ని అనుగ్రహించి అక్కడనుంచి అంతర్థానమయినాడు. తర్వాత ఆ యానాదులు ఆ అరణ్యప్రాంతంలో నిశ్చింతగా జీవించసాగారు. (పుట 619-623).

## నల్లమల యందలి చెంచువారి కైఫియత్తు :

యానాది చెంచులనే వారు శ్రీఅహోబిలానికి సమీపంలోని నల్లమలలో మల్లిమళ్ల చెరువు భార్గవ నారసింహ స్తళం, పావన నారసింహ స్తళం మొదలైన మహారణ్య ప్రదేశాలలో పొదరిండ్లపైన బోద, గడ్డి కప్పి నివాసం ఏర్పరచుకొని, ఆ పొదరిండ్లలో భార్యాబిడ్డలతో కలిసి నివసించేవారు. వారు ఎప్పుడూ ఒకే ప్రదేశలో నివసించేవారు కాదు. నెలరోజులు ఒక ప్రాంతంలో నివసిస్తే, ఆ తర్వాత మరొక ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకొనేవారు. వీరు సమీప గ్రామాలకు వచ్చి వారికి కావలసిన మట్టి పాత్రలను కొనుక్కొని వెళ్లేవారు. అంతేకాక జొన్నలు, సజ్జలు, రాగులు, బియ్యం, ఉప్పు, మిరపకాయలు, చింతపండు మొదలైనవి తీసుకుని వెళ్లేవారు.రోళ్లు మొదలైనవి లేకపోవడం వల్ల జొన్నలు బండమీద వేసి మరొక రాయితో నూరి అవి పగిలిన తర్వాత మట్టి పాత్రలలో వాటితో ఆహారం చేసుకునేవారు. చెంచుగడ్డలు అనే దంపలు తవ్వితెచ్చి వాటిని నిప్పుల్లో వేసి కాల్చి తేనెతో కలిపి ఆరగించేవారు. స్త్రీలు, పురుషులు, దుప్పులు, జింకలు, కణుదులు, కొండగొఱ్ఱెలు, గోనంగులు, ఉడుములు, అడవి పందులు, ఎలుగుబంటులు, యేదులు, చెవుల పిల్లులు, కారుకోళ్లు, నెమళ్ల, కంజులు, పాలలు, వువ్వలు, పూరేళ్లు, పావరాలు, నీరురోజల్లు మొదలైన వాటిని వేటాడి వాటి మాంసాన్ని నిప్పులపై కాల్చుకుని తినేవారు.

దాహంవేస్తే నీరుదొరికే ప్రాంతానికి వెళ్లి చేతులలోనే నీళ్లు తాగేవారు. రాగిపాత్రలు వంటి గృహోపకరణాలు లేవు. చెంచుస్త్రీలు నడుముకు కింది భాగంలో మాత్రమే వస్త్రాన్ని ధరించేవారు. వక్షస్థలంపై ఎలాంటి ఆచ్ఛాదన ఉండేది కావు. స్త్రీలు అడవిలో దొరికే గురివింద గింజలు, కొండ పూసలు ఆభరణాలుగా ఉపయోగించేవారు. పురుషులు కేవలం గోచీ మాత్రం ధరించేవారు. పురుషులు కూడా స్త్రీల వలె శిరోజాలు పెంచుకునేవారు. స్త్రీలు ప్రసవించిన తర్వాత వెంటనే బిడ్డకు బొడ్డుకోసి, చన్నీళ్లతో స్నానం చేయిస్తారు. చలికాలమైతే వేనీళ్లతో స్నానం చేయిస్తారు. బిడ్డను ఒక గట్టి బట్టలో పడుకోబెట్టి

ఊయలలాగా తయారు చేసి నాలుగువైపుల దూసర తీగెలు తాళ్ళుగా కట్టి ముడివేసి వెదురు గడెకు తగిలించి భార్యాభర్తలిద్దరూ వేటకు పోతారు. తిరిగి వచ్చిన తర్వాత బిడ్డకు తల్లి పాలిస్తుంది. శిశువుకు నామకరణం చేసే సాంప్రదాయం వీరిలో ఉంది.

కన్య రజస్వల అయిన తర్వాతే వివాహం చేస్తారు. వివాహానికి ముహూర్తాలు చూడరు. ఒకవేళ భర్త చనిపోతే భర్త తమ్ముడైన మరిదిని వివాహం చేసుకునే సాంప్ర దాయాన్ని పాటిస్తారు. దీనినే 'మారుమనువు' అంటారు.

కొండపేట్లకు తేన పెట్టెలుంటాయి. అవి చాలా ఎత్తుగా ఉంటాయి. తేనె సేకరణ అతి పెద్ద సాహసం. గిరిజనులు తమ విజ్ఞానాన్ని ఉపయోగించి చాలా జాగ్రత్తగా ఈ తేనెను సేకరిస్తారు. ఈ తేనె సేకరణలో వింత ఆచారం ఉంది. తేనె సేకరణ సమయంలో ఎత్తైన పేటుకు తాడుతో లంగరులాగా వేస్తారు. చివరకొనను ఒకరు పట్టుకొంటారు. ఒకరు పాత్రను గాని, సొరకాయ బుర్రగాని తీసుకుని తాడును ఒడుపుగా పట్టుకొంటారు. ఇంకొకరు తాడును లాగుతారు. అలా లాగగానే తాడుకు వేలాడే వ్యక్తి తేనెపెట్టె దగ్గరికి చేరకుని తేనె సేకరిస్తాడు. కిందతాడు పట్టుకొనే వ్యక్తి పొరబాటున వదిలేస్తే పైనున్న వ్యక్తి నేలకు పడిపోయి మరణించే ప్రమాదముంది.

అన్నదమ్ములిద్దరూ తేనె సేకరణకు వెళ్లరు. ఎందు కంటే కింద ఉండే సోదరుడు దురుద్దేశంతో తాడును వదిలేస్తే ఒకవేళ అన్న మరణిస్తే వారి సాంప్రదాయం ప్రకారం అన్నభార్యను తమ్ముడు వివాహం చేసుకోవచ్చు. దీనివల్ల అన్న తమ్ముడితో కలసి తేనె సేకరణకు వెళ్లడు. బావమరదులు గాని, తండ్రీ కొడుకులు గాని కలిసి వెళ్తారు.

చెంచులు తాము సంపాదించిన దానిలో తమశక్తి కొలది అహోబిల నారనసింహుని దీపారాధనకు కానుకగా ఇచ్చేవారు. అహోబల స్వామి కల్యాణోత్స వానికి స్వామివారికి పట్టుబట్టలు, పసుపు కుంకుమలు, దూపదీప నైవేధ్యాలుసమర్పించేవారు.

## దాసరి చెంచుల కైఫీయత్తు :

గ్రామాలలో ఉండే బలిజవారు, తెనుగుల గొల్లవారు, బోయవారు, తెనుగువారు మొదలైన కులాలలో పుట్టినవారు శ్రీ నరసింహస్వామికి దాస్యం చేయాలని నిశ్చయించుకున్నవారు శ్రీ అహోబిల జియ్యంగారి సన్నిధానికి పోయి నమస్కరించి మేము స్వామి దాసులమై జీవించాలనుకుంటున్నాం కాబట్టి మామ ఈద దయతో చక్రాంకితం మొదలైన దాస చిహ్నాలు ప్రసాదించమని ప్రార్థిస్తారు. అందుకు అంగీకరించిన జియ్యంగారు వారికి ఆయా వైష్ణవ మత సంబంధమైన చిహ్నాలతో వారికి అలంకరిస్తారు. అప్పటి నుండి వారు నృసింహ దాసులని పిలవబడతారు. ఇలా దాసవృత్తి స్వీకరించినవారు తమ శక్త్యనుసారం అహోబిల నరసింహ స్వామి దీపారాధనకు డబ్బు సమర్పిస్తారు. నెమలి ఈకల కిరీటం, తిరుమణి చూర్ణం, పిల్లనగ్రోవి మొదలైన అలంకారాలతో వేషధారణ చేసిన వారిని చెంచుదాసరులు అని పిలుస్తారు.

ఈ చెంచుదాసరులు కొంతమంది కలిసి గుంపుగా ఏర్పడి వివిధ ప్రాంతాలకు బిక్షాటనకు వెళ్తారు. బిక్షాటనకు వెళ్ళినప్పుడు గృహస్థులు ఇచ్చిన ధాన్యం మాత్రం బిక్షగా తీసుకుంటారు. అంగళ్ల దగ్గర డబ్బు బిక్షగా స్వీకరిస్తారు. చెంచుదాసర్లు జియ్యంగారి ఆజ్ఞను శిరసావహిస్తుంటారు. ఎవరైన ఆజ్ఞని ధిక్కరిస్తే తిరుమణి ధరించడానికి వీలులేదు. అపరాధరుసుం చెల్లించాలి(పుట 101-103)

## సాలెకులం వారి కైఫీయత్తు :

పూర్వం శంబరాసుర వంశంలో కాళసైనికుడనే రాక్షసుడు జన్మించాడు. అధిక బల సంపన్నుడై బ్రహ్మ దేవుని గురించి ఇంద్రాద్రిపై ఎన్నో సంవత్సరాలు తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై నీ కోరిక ఏమిటో చెప్పు అని అడిగాడు. ఆ రాక్షసుడు బ్రహ్మదేవుని అనేక విధాలా కీర్తించి లోకంలో తనకు ఎదురు వచ్చే వీరుడు ఉండకుండా వరం కోరాడు.

బ్రహ్మ అతడు కోరుకుంటున్నట్లే వరం అనుగ్రహించాడు. తర్వాత రాక్షసుడు తన రాజధాని అయిన విశాల నగరానికి చేరుకుని వరగర్వంతో దేవతలను బాధించసాగాడు. దేవతలు బ్రహ్మతో తమ బాధలు చెప్పుకున్నారు.బ్రహ్మకు ఏ ఉపాయం తోచక దేవతలతో కలసి శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లి తమ బాధలు చెప్పుకున్నారు. ఆ రాక్షసుని జయించడానికి మార్కండేయ యుగ కాలం నుండి అయోని సంభవుడైన ఒక పురుషుడు ఉద్భవిస్తాడని చెప్పి అంతర్ధానమైపోయాడు. అప్పుడు బ్రహ్మ శివుని వద్దకువెళ్లి కాళ సైనికుడి వల్ల దేవతలు పడుతున్న కష్టాలు చెప్పి విష్ణువు చెప్పిన మాటలు చెప్పాడు. అప్పుడు పరమేశ్వరుడు విష్ణువు చెప్పినట్లు మీ బాధ తొలగిపోతుందని చెప్పాడు. అంతేగాక బ్రహ్మ సృష్టి అయిన ఈ జగత్తు చాలా అందంగా వున్నా వస్త్రవిహీనంగా ఉన్నందు వల్ల అలంకార రహితంగా ఉంది. వస్త్రం ముఖ్య అలంకారం విశిష్టమైన ఆభరణాలున్నా వస్త్రవిహీనంగా ఉంటే అందంగా ఉండదు. కాబట్టి ఆ విధంగా పట నిర్మాణం చేయమని చెప్పాడు అప్పుడు బ్రహ్మ మార్కండేయ మహర్షితో ఆ మహాదేవుని ఆజ్ఞప్రకారం తీవ్ర యాగం చేస్తే ఆ యాగకుండం నుండి పట నిర్మాణకర్త అయిన పురుషుడు పుడతాడని చెప్పాడు. అనంతరం మార్కండేయ మహర్షి యాగం చేసి హరిద్భాగాలు ఇప్పించేటప్పుడు యాగకుండం నుండి ఒక పరుషుడు ఉద్భవించాడు. అతని తేజస్సు చూసి త్రిమూర్తులు అతనికి పంచపుటి అనే పేరుపెట్టారు. నువ్వు ఈ బ్రహ్మ సృష్టికి పటసృష్టి చేయమని ఆజ్ఞాపించాడు. ఈ సమయంలో అగ్నికుండం నుండి మరొక పురుషుడు ఉత్పన్నమయ్యాడు. ఆ పురుషుడికి భావనాఋషి అని పేరుపెట్టి వీరిద్దరు కలిసి పటసృట్టిచేయమని ఆజ్ఞాపించారు. పంచవుటి, భావనాఋషి శ్రీమహావిష్ణువును ప్రార్థించగా ఆయన ప్రసన్నుడై తన నాభి మధ్యలో ఉన్న కమల తంతువులు, బీజములు ఇచ్చి కృతయుగంలో మనుసును స్మరించడం వల్ల, త్రేతాయుగంలో క్షేత్రాలను దర్శించడం వల్ల, ద్వాపరయుగంలో వాక్యముల వల్ల, కలియుగంలో కాయకష్టం వల్ల వస్త్రసృట్టి చేయగలరని ఆనతి ఇచ్చాడు.

శ్రీమహావిష్ణువు ఆజ్ఞ అయిన తర్వాత వారు కమలతంతువులు, బీజములతో కైలాసానికి వచ్చి మహాదేవునికి చూపించి ఆయన ఆశీర్వాదం తీసుకొని వారు తమ పట్టణానికి వచ్చి అనేక రకాలైన వస్త్రాలను తయారు చేశాడు. ఆ వస్త్రాలు తీసుకుని విష్ణువు దగ్గరకు వెళ్లి మీ కృపవల్ల ఇవి ఈ వస్త్రాలను తయారు చేయగలిగాం. ఇందులో మీకు తగినవి తీసుకుని మమ్మల్ని ధన్యులను చేయండని ప్రార్థించారు. వారి కోరిక మన్నించిన విష్ణువు తాను పీతాంబరాలు తీసుకుని, శ్రీమహాలక్ష్మికి చిత్రాంబరాలు, భాగవత శ్రేష్ఠులకు యుక్తమైన వస్త్రాలు ఇప్పించాడు. అంత అందమైన వస్త్రాలు తయారు చేసిన పంచపుటి, భావనాఋషిని సన్మానించాడు. అలాగే పరమేశ్వరునికి, బ్రహ్మకు, పార్వతీదేవికి, సరస్వతీదేవికి వస్త్రాలను అందజేశారు. పరమశివుడు ఆ వస్త్రాలను ధరించకపోవడం చూసి చింతాక్రాంతుడైవున్న భావనాఋషితో శివుడు నువ్వు బాధపడవలసిన పనిలేదు. ఆ బ్రహ్మసృష్టికే నీ వస్త్రసృష్టి చేత అలంకారం తెచ్చావు. నువ్వు కూడా బ్రహ్మతో సమానమైన వాడవే. నీ వంశం చాలా వృద్ధి పొందుతుంది అని వరం అనుగ్రహించాడు. అంతే కాక భావనాఋషితో పరమేశ్వరుడు నాకు పులి చర్మం ప్రియమైనది.అది నువ్వు తెచ్చినట్లైతే ధరిస్తాను అని చెప్పడంతో భావనాఋషి పులి చర్మం కోసం అడవులలో వెదుకుతూ తిరుగుతుంటాడు. సూర్యపుత్రికయైన భద్రావతి భావనాఋషి గురించివిని అతనిని భర్తగా పొందాలని కోరుకుంటూవుంటుంది. భావనాఋషి పులిచర్మం కోసం వెతుకుతున్నాడని తెలిసి తన యోగ మాయ వల్ల అడవులలో ఉండే పులులన్నింటిని ఉదయ గిరి పర్వత గహలో దాచిపెడుతుంది. ఎక్కడా ఒక పులి కూడా కనిపించపోవడంతో భావనాఋషి చింతిస్తుంటాడు. అప్పుడు భద్రావతి తన పరిచారికలను భావనాఋషి దగ్గరకు పంపి తనను వివాహమాడితే పులులను

ఇస్తానని చెపిపంపుతుంది. అందుకు భావనాఋషి ముందుగా పులులను ఇస్తే శివునికి ఇచ్చిన మాట నేరవేర్చుకుని వచ్చి ఆమెను వివాహామాడతానని మాట ఇస్తాడు.

అప్పుడు భద్రావతి భావనాఋషికి ఆ పులులన్నింటిని ఇస్తుంది. భావనాఋషి ఆ పులులను వెంట పెట్టుకుని కైలాసానికి వెళ్తాడు. అది చూసి పరమశివుడు ఆశ్చర్యపోయి వాటిలో శివమయిన పులిచర్మాన్ని ధరించి మిగిలిన పులులను సంరక్షించడానికి పాకరాసనుడు అనే వాడిని నియమించి, ఆ పులులన్నీ భావనాఋషి ఆజ్ఞకు లోబడి ఉండేటట్లు అనుగ్రహిస్తారు.

తర్వాత భావనాఋషి తాను భద్రావతికి మాట ఇచ్చిన ప్రకారం పెళ్లాడడానికి సందేహించి ఆగిపోవడంలో భద్రావతి దు:ఖిస్తుంది. భద్రావతి ఆజ్ఞమేరకు ఆమె పరిచారికలు కైలాసం వెళ్లి పరమేశ్వరునికి జరిగిన వృత్తాంతం చెప్పారు. పరమశివుడు సూర్యుని రప్పించి మీ కుమార్తెను భావనాఋషికి ఇచ్చి వివాహం చేయమని చెప్పాడు. అందుకు సంతోషించిన సూర్యుడు తన కుమార్తె భద్రావతిని భావనాఋషికిచ్చి ఉదయగిరి పర్వతం పై వివాహం చేశాడు. ఆ దంపతులకు 101 మంది పుత్రులు కలిగారు. ఈ పుత్రులందరు వస్త్ర నిర్మాణం చేయసాగారు.

శంబరాసుర వంశీకుడైన కాళువ సైనికుని కొడుకులు భావనాఋషి పుత్రులు చేస్తున్న పనిగురించి తెలుసుకుని వారు వస్త్రనిర్మాణం చేయాలని భావించి కాళువ సైనికునితో తాము వెళ్లి వారి దగ్గరనుంచి వస్త్రనిర్మాణ పద్ధతులను తెలుసుకుంటాం అని చెప్పారు. అందుకు కాళువ సైనికుడుయుద్ధం చేసి వారిని జయించకూడదు. మాయావేషంలో నేర్చుకుని రండి అని చెప్పాడు. తాను కూడా కపటవేషంలో వెళ్లి ఆ విద్య నేర్చుకుని మరికొన్ని రోజులు విష్ణువు చేత ప్రసాదించిన కమలతంతువులు, బీజములు దొంగలించి తన పట్టణానికి వచ్చాడు. వాటిలో అందమైన వస్త్రాలు నిర్మించి రాక్షసులకు ఇవ్వసాగారు.

భావనాఋషి కుమారులు జరిగిన మోసం తమ తండ్రికి తెలియజేశాడు.అప్పుడు భావనాఋషి ఆ కాళువ సైనికుడిని సంహరించడానికి తన కుమారులతో కలసి విశాల నగరానికి వెళ్లి కాళువ సైనికుడిని సంహరించి తన కమలతంతువులను, బీజములను తీసుకుని తన స్వస్థలానికి వచ్చాడు. జరిగిన వృత్తాంతమంతా భావనాఋషి పరమేశ్వరుడికి, ఇతరదేవతలకు తెలియజేశాడు. భావనాఋషి వీరత్వానికి పరమశివుడు, దేవతలు సంతోషించారు. భావనాఋషి తమ పుత్రులకు వివాహం చేసివారిని విద్యా ప్రవీణులుగా తీర్చిదిద్ది తాను కైలాసం వెళ్లి తపస్సు చేసుకొంటున్నాడు. వీరు వంశీయులు పద్మశాలీయులగా ప్రసిద్ధులయ్యారు.

భావనాఋషి చేత సంహరింపబడిన కాళువ సైనికుని శవం నుండి వరప్రభావం చేత కొందరు రాక్షసులు పుట్టి దినదిన ప్రవర్ధమానులైనారు. వారు జరిగిన విషయం తెలుసుకుని భావనాఋషి కుమారులలో కలహించ సాగారు. ఇది తెలుసుకున్న భావనాఋషి ఆ విషయాన్ని పరమశివుడికి తెలియజేశాడు. అప్పుడు శివుడు బ్రహ్మను పిలిపించి నువ్వు ఈ భావనాఋషితో కలిసివెళ్లి ఇతని విరోధులు,శత్రువులు వివేక శూన్యులైతే సంహరించు, వివేకవంతులైతే వారికి గుణవిద్యను ప్రసాదించుమని చెప్పాడు.

శివుని ఆజ్ఞప్రకారం భావనాఋషితో కలిసి బ్రహ్మ వచ్చిన విచారింపగా అప్పటికే కలహించుకుంటున్న వారిలో కొంతమంది చనిపోగా మిగిలినవారు వివేకవంతులై బ్రహ్మ ను, భావనాఋషిని ప్రార్థించాడు. బ్రహ్మ వారిని అనుగ్రహించి వారికి గుణ విద్య ప్రసాదించి సుఖంగా జీవించమని చెప్పి భావనాఋషితో కలిసి కైలాసానికి వెళ్లాడు. ఆ ఉభయులు పద్మశాలీయులు, సాలీలు మార్కండే గోత్రీకులుగా తమ పూర్వీకుడైన భావనాఋషికి ఇప్పటికే ఉత్సవాలు జరుపుతూ ఇష్టదైవంగా భావిస్తున్నారు.

**బుక్కరాయసముద్రం – అనంతసాగరం :**

ఈ రెండు పేర్లు వినగానే గుర్తుకొచ్చే కావ్యం కట్టమంచి రామలింగారెడ్డి గారి 'ముసలమ్మమరణం' బుక్కరాయ సముద్రం, అనంతసాగరాలకు చెందిన రెండు కైఫీయత్తు లున్నాయి. ముసలమ్మ మరణంలోని ఇతివృత్తం ఈ కైఫీయత్తులలోని ఇతివృత్తాన్ని తులనాత్మకంగా పరిశీలిస్తే చాలా తేడా కనిపిస్తుంది. మొత్తం మీద ఆ చెరువు ఆ చెరువు గురించిన విషయం ఒక స్త్రీ బలి అయిన విషయం ప్రజలలో బాగా ప్రచారంలో ఉండేది.

బుక్కరాయసముద్రంలో ఉన్న బసిరెడ్డి కోడలు ముసలమ్మ మరణం విషయాన్ని పోలిన విషయం కడప కైఫీయత్తులో కనిపిస్తుంది. దువ్వూరు తాలుకా టంగుటూరు గ్రామంలో ఈశ్వరుని దేవాలయం వద్ద అహవమల్లరాజు శాసనం వేయించాడు. నెల్లూరిని నల్లశిద్ధి చోళరాజు పరిపాలిస్తున్న సమయంలో వేలూరి బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి కడపకు పశ్చిమంగా నాలుగు పరువుల దూరంలో ఒక పల్లె కట్టించి వాలూరు అని పేరు పెట్టాడు. బ్రహ్మారెడ్డి అక్కడ కోట కట్టించి కడప వేంకటేశ్వరస్వామి ఆలయానికి పడమర ఒక చెరువు, తూర్పు ఒక చెరువు పాడైపోయి ఉండటం చూసి వాటిని బాగు చేయించాడు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి దక్షిణవైపునున్న భూమిలో నీళ్లు బుగ్గగా ఉబికి ఉత్తరం వైపు ప్రవహిస్తుండగా దానికి బుగ్గవంగ అని పెట్టారు. ఆ వంక నీళ్లలో కొంతనీరు ఈ రెండు చెరువులకు వచ్చేవిధంగా ఏర్పాటు చేశాడు. అప్పుడు ఆ చెరువులు నిండి తెగిపోయే పరిస్థితి వచ్చింది. బ్రహ్మారెడ్డికి కలలో అమ్మవారు కన్పించి చెరువులు తెగిపోకుండా ఉండాలంటే నరబలి ఇవ్వాలని చెప్పిందట. నరబలి ఎలా ఇవ్వాలి, ఎవరిని ఇవ్వాలని బ్రహ్మారెడ్డి ఆలోచిస్తూ దిగులు పడుతూవుండగా అతని కూతుర్లు పెద్ద అంకమ్మ, చిన్న అంకమ్మ తమ తండ్రి దిగులుగా ఉండడం గమనించి అందుకు కారణాన్ని తెలుసు కున్నారు. తండ్రి దగ్గరకి వెళ్లి ఈ విషయానికి నువ్వు ఇంతగా దిగులు పడాల్సిన పనిలేదు. మా ఇద్దరిలో ఎవరినైనా నరబలి ఇవ్వు లేదా ఇద్దరిని ఇవ్వమని చెప్పారు. అక్కాచెల్లెల్లు ఇద్దరు ఏడువారాల నగలు ధరించి చెరువులోని నీటిలోకి దిగగా వారిపై మన్ను వేసి మూసివేశారు. దాంతో చెరువు తెగకుండా నిలబడింది. ఆ చెరువులను బ్రహ్మారెడ్డి కట్టించడం, కూతర్లను బలి ఇవ్వడం ప్రజలలో బాగా ప్రాచుర్యంలో ఉన్నా అది ఏ సంవత్సరంలో జరిగింది ఖచ్చితంగా తెలియడం లేదు. (పుట 52-54).

**బుక్కరాయసముద్రం అనంతసాగరం అనే రెండు గ్రామాల, రెండు చెరువుల యొక్క కైఫీయత్తు :**

దేవరకొండకు పడమర భాగం కొద్దిదూరంలో వొవూరు అనే గ్రామం వుంది. నందవరీక బ్రహ్మణుడు దాకరాజు కొడుకు చిక్కప్ప ఈ రెండు గ్రామాలు, రెండు చెరువులు నిర్మించినట్లు ఉంది. ఈ చిక్కప్పకు బుక్కరాయలే చిక్కప్ప వడయరు అనే బిరుదు ఇచ్చినట్లు తెలుస్తుంది. (పుట.4)

చిక్కప్ప వడయరు దక్షిణ ప్రాంతానికి వచ్చి చెరువు నిర్మించడం కోసం సరైన స్థలం కోసం వెతుకున్నాడు. పెనుగొండ దక్షిణం నుండి ఉత్తరానికి ప్రవహిస్తున్న వంకను చూచాడు. ఆ వంక దగ్గర రెండు గుట్టలు ఉండడం చూసి అక్కడ చెరువు నిర్మిస్తే బాగుంటుదను కున్నాడు. వెంటనే ఆ నిర్మాణ పనులు ప్రారంభించి తాను అంతకు ముందు పాముల నాగజోగికి ఇచ్చిన మాట ప్రకారం ఆ చెరువుకు నాగసముద్రం అని పేరు పెట్టారు.

నాగసముద్రానికి కొంచెం దూరంలో ఉన్న అగస్త్యా శ్రమానికి దగ్గర ఉన్న స్థలం చెరువు నిర్మాణానికి అను కూలంగా ఉందని భావించి చెరువును త్రవ్వించసాగాడు. ఒకరోజు రాత్రి కలలో పినాకినీ నది స్త్రీరూపంలో కన్పించి ఇక్కడ చెరువు నిర్మాణం చేయవద్దు. నేను ఇక్కడ నిలబడను అని చెప్పి ఇక్కడికి దక్షిణ దిక్కున నా చెల్లెలు చిత్రావతి అనే నది వస్తున్నది. అక్కడ కట్టిస్తేబాగా నిలుస్తుందని చెప్పిందట.

అక్కడికి సమీపంలోని గార్గేయాపురములో దేవర కొండకు కిందవుండే వొరూరు అనే గ్రామం వద్ద చెరువును నిర్మించి తూర్పున నిర్మించిన గ్రామానికి తన ప్రభువైన బుక్కరాయల పేరున బుక్కరాయసముద్రం అని పేరు పెట్టి, పడమటి నిర్మించిన గ్రామానికి బుక్కరాయల భార్య పేరుమీదుగా అనంతసాగరం అనే పేరు పెట్టాడు. చెరువు కట్ట మీదలింగ ప్రతిష్టచేసి శివాలయం కట్టించాడు. (పుట-4,5)

ఆ విధంగా బుక్కరాయసముద్రం, అనంతసాగరం అనే గ్రామాలు నిర్మించడంతో పాటు చౌడేశ్వరి ఆలయాన్ని నిర్మించి కొద్ది రోజులకు చిక్కప్ప వడయరు ఆ ప్రదేశంలోనే అదృశ్యమైపోయాడు.

## చెరువుల నిర్మాణం :

కాకతి ప్రతాపరుద్రుడి కాలం నుంచి అనేక ప్రాంతాలలో త్రాగునీటికి, సాగునీటికి అవసరమైన చెరువుల నిర్మాణం విరివిగా జరిగింది. ఆనాటి పాలకులందరు చెరువులు త్రవ్వించారు. ప్రజలలో కూడా కొంతమంది చెరువుల నిర్మాణపు పనికి పూనుకునేవారు. చెరువుల ప్రాధాన్యత ఎక్కువగా ఉండేది. చెరువులు త్రవ్వించిన వారికి కొంతభూమిని వారి పేరు మీద ఈనాంగా ఇవ్వడం జరిగేదని దండమూడి కైఫియత్తు ద్వారా తెలుస్తుంది. అన్నపర్రు కైఫీయత్తులో కూడా ఈ విషయం స్పష్టమవుతోంది. ఈ చెరువులను గుంటలని కూడా పిలిచేవారు. బహుశా చిన్న చెరువు లోతు తక్కువగా ఉంటే గుంట అని విశాలంగా ఉంటే చెరువు అని పిలిచే అలవాటు ఉండవచ్చు.

చాలా మంది తమ పంట పొలాలకు ఉపయోగపడే విధంగాను కాకుండా ప్రజలకు కూడా ఉపయోగ పడే విధంగా చెరువులను త్రవ్వించారు. త్రవ్వించిన వాళ్లు ఒక ప్రాధాన్యాంశం అయితే త్రవ్వకపు పనిచేసి ఉప్పర్లు, వడ్డెర్లు అమిత ప్రాధాన్యాంశం.

ఈ కాలంలో కూడా త్రవ్వకపు పనిలో ఉప్పరులకు వారే సాటి. ఆ నైపుణ్యం, కష్టం ఇతరులకు సాధ్యంకాదు. ఆ విషయమే నుదురుమాడు కైఫీయత్తులో ఈవిషయం చెప్పబడింది. పెద్ద పెద్ద చెరువులు త్రవ్విన చరిత్ర ఉప్పర్లదే. అలాగే పెద్దపెద్ద చెరువులు త్రవ్వించిన చరిత్ర ముస్లిం ప్రభువులదే. వెంబాక కైఫీయత్తులో వడ్డెర్లు అనే పదం కూడా ఉపయోగించబడింది. ఉప్పర్లు, వడ్డెర్లు ఒకటే కావచ్చు.

కైఫియత్తులలో గిరిజన విజ్ఞానానికి సంబంధించిన అనేక విశేషాలున్నాయి. నల్లమల కొండలలోని అహోబళం కైఫియత్తు, శ్రీహరికోటలోని యానాదుల కైఫియత్తు, దాసరి చెంచుల కైఫియత్తులో అనేక అసక్తి కరమైన విషయాలు చరిత్ర పరిశోధనకు ఉపకరిస్తాయి.

ముఖ్యంగా అహోబిలం కైఫియత్తులలో చెంచులు, యానాదుల జీవన విధానం గురించి స్పష్టంగా ఉంది. వీరు అడవుల నుంచి అనేక పదార్థాలను సేకరిస్తారు. వాటిని అమ్మగా వచ్చిన సొమ్మును పంచుకొంటారు. అలాగే ఆ సొమ్మును ఖర్చు చేసుకునే విధానం నేటి ఆధునిక సమాజానికి ఎంతో ఆదర్శవంతమైంది.

## పుట్టుపాపలు (లిల్లీపుట్స్) :

ఈ పుట్టుపాపల గురించి అహోబళ కైఫియత్తులో ఉంది. చాలా ఆసక్తికరమైన విషయాలు ఇందులో కనిపిస్తాయి. ఈ నలమల పర్వతాల్లో 'పుట్టుపాపలు' అనే పొట్టి మనుషులు ఉండేవాళ్లు.వీరు కేవలం 1.5 గజం పొడవు మాత్రమే ఉంటారు. పసిపాపల లాగా పుట్టినప్పటి నుండి ఏమాత్రం పొడవు పెరగకుండా ఉంటారు కాబట్టి వీరిని గిరిజనులు'పుట్టుపాపలు' అనే పేరుతో పిలిచేవారు. వీరు పర్వతాల్లోనే నివాసం ఏర్పరచుకొని జీవిస్తారు. మైదానం ప్రాంతాలకు వెళ్లరు. వస్త్రాలను ధరించరు. ఆహారం స్వల్పంగా తీసుకుంటారు. జంతువుల మాంసం, పండ్లు, తేనె, ఇంజేటి గడ్డలు వీరి ఆహారం. కేవలం పచ్చివి మాత్రమే తింటారు. వీరికి వండుకొని తినటం రాదు. వీరు ఎవరికంట పడినా వెంటనే పారిపోతారు.

మాములు మనుషులు తిరిగే ప్రదేశాలకు వీరు వెళ్లరు. మాత్తాలపాటి పాళెగాడైన రంగప్పనాయుడు చెంచుల ద్వారా ఇద్దరు పుట్టుపాపలను పట్టుకొంటాడు. ఇందులో ఒకడు 24 గంటల్లోనే భయంతో చనిపోతాడు. రెండో వాడిని మళ్ళీ అరణ్యాల్లో వదిలివేస్తారు. ఈ పుట్టుపాపలకు ఆయుధాలు లేవు. ఏవైన అడవి మృగాలు వీరికి చిక్కితే రాతితో నరకి చీల్చుకుని పచ్చిమాంసం భక్షిస్తారు. దట్టమైన అడవిలో జనసంచారం లేని ప్రాంతాల్లోనే వీరు జీవిస్తారు. ( అహోబళం కైఫియత్తు పుట 24-26)

## నల్లమల్ల చెంచులు - జీవన విధానం :

వీరినే యానాది చెంచులు అని పిలిచేవారు. అహోబిళం సమీపంలోని నల్లమల దగ్గర మల్లిమళ్ళ చెరువు దగ్గర భార్గవ నారసింహులు నివాస ప్రదేశంలోని ఈ మహారణ్యంలో పొదరిండ్లపైన బోదగడ్డి కప్పి నివాసం ఏర్పరచుకొని జీవిస్తారు. వీరి సంతానం అంతా ఉమ్మడిగా జీవిస్తారు. వీరు సంచారజీవులు. ఏ ప్రాంతంలో కూడా స్థిరనివాసముండరు. రెండు మూడు నెలలకొకసారి స్థలాలు మారుతుంటారు. (అహోబలం కైఫియత్తు పుట 89-90)

వీరు మైదానం ప్రాంతాలలోకి వచ్చి అటవీ ఉత్త పత్తులను అమ్మి ఆ సొమ్ముతో మట్టి పాత్రలను కొంటారు. ( పుట 90)

## ఆహారం - వంట :

వీరు జొన్నలు,సజ్జలు, రాగులు, బియ్యం, పప్పు దినుసులు, మిరపకాయలు, చింతపండు మొదలైనవి కొంటారు. (పుట 90). వీరి దగ్గర దంచుకోడానికి రోళ్ళు ఉండవు. కాబట్టి ధాన్యాలను బండమీద వేసిరాతితో నూరి పిండి తయారు చేసుకుంటారు. మట్టి పాత్రలలో వండుకొని తింటారు.

చెంచుగడ్డలు అనే దుంపను భూమినుంచి త్రొవ్వు కొని, వాటిని కాల్చి చాలా ఇష్టంగా భుజిస్తారు. (పుట 90-91).

## జంతువుల వేట :

స్త్రీ పురుషుల్దిదరు ధనుర్బాణాలు ధరించి వేటాడు తారు. అడవి మృగాలైన దుప్పులు, జింకలు, కణుతులు, కొండగొర్రెలు, గొనంగులు, కోతులు, ఉడుములు, అడవి పందులు, యేదులు, చెవుల పిల్లులు మొదలైన వాటిని వేటాడుతారు.

## పక్షుల వేట :

కారుకోళ్లు, నెమళ్లు, కంజులు, పాలపిట్టలు, కొక్కిరలు, కాకులు, గువ్వలు, పూరేళ్లు, పిచుకలు, పావురాలు, ఉమ్మగువ్వలు, తెల్లకంకణాలు, నల్లకంకణాలు, చిలువలు, వంగపండ్లు, నేలమళ్లు, టిట్టిభములు, నీరు కోళ్లు, నీరుకాకులు, కొంగలు, బగ్గొర్రెలు, గోరువంకలు, నెలవంచికాండ్లు, పికిలిపిట్టలు, గద్దలు, బందుగెద్దెలు మొదలైన పక్షులను వేటాడి అగ్గిలో కాల్చితింటారు. వీటిని పాత్రలో వండుకొని తినరు.

వీరికి దాహం వేసినపుడు నీరు లభించే నదులు, కొలనుల దగ్గరికి వెళ్లి చేతులతో నీళ్లను తాగుతారు. వీరు గృహాలలో రాగి పాత్రలను వాడరు. మలమూత్ర విసర్జన అయిన తర్వాత వెంటనే నీళ్లతో శుభ్రం చేసుకోరు. ఎప్పుడైతే నీల్లు లభిస్తాయో అప్పుడే శుభ్రం చేసుకొంటారే గాని అంతముందు దాని గురించి పట్టించుకోరు.(పుట 91)

## ఆభరణాలు - కేశాలంకరణ :

ఈ చెంచుస్త్రీలు 14 మూరలుగల ముతక చీరెలను మైదానం ప్రాంతంలోకి వెళ్లి కొంటారు. వీటిని చీరె లాగే ధరిస్తారు. రవికలను ధరించరు. పురుషులు గోచి మాత్రమే పెట్టుకొంటారు. స్త్రీలు అడవుల్లో లభించే గురువింద గింజలను సేకరించుకొని వాటికి కొయ్య పూసలు కలిపి దండలాగా అల్లుకొని కంఠహారాలుగా ధరిస్తారు. అలాగే స్త్రీలు గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడ నుంచి రాగివైరును తెచ్చుకుని ఉంగరాలు తయారు చేసుకొంటారు. స్త్రీ పురుషులిద్దరూ జడలు వేసుకొంటారు. జట్టు కత్తిరించు

కోరు. స్త్రీలు చారపప్పు, కానుగపప్పును దంచి తైలం తీసి తమ శిరోజాలకు పట్టించుకొంటారు. పురుషులు తలకు నూనెను వాడరు.

స్త్రీ పురుషులిద్దరూ బాణాలు ధరిస్తారు. వింటిబద్దతో పాటు ఒక్కొక్కరి దగ్గర కనీసం 5 బాణాలుంటాయి. వెదురుతో తయారు చేసిన కర్రకు చివర ఇనుప ముక్క లను పదునుగా చేసి అతికిస్తారు. వీటిని బాణాలుగా వాడుతారు.

## ప్రసవం – నామకరణం :

స్త్రీలు ప్రసవించిన తర్వాత వెంటనే బిడ్డకు బొడ్డుకోసి, చన్నీళ్లతో స్నానం చేయిస్తారు. చలికాలమైతే వేనీళ్లతో స్నానం చేయిస్తారు. బిడ్డను ఒక గట్టి బట్టలో పడుకోబెట్టి ఊయలలాగా తయారు చేసి నాలుగువైపుల దూసర తీగెలు తాళ్ళుగా కట్టి ముడివేసి వెదురు గడెకు తగిలించి భార్యాభర్తలిద్దరూ వేటకు పోతారు. తిరిగి వచ్చిన తర్వాత బిడ్డకు తల్లి పాలిస్తుంది. శిశువుకు నామకరణం చేసే సాంప్రదాయం వీరిలో ఉంది.

## వివాహం :

కన్య రజస్వల అయిన తర్వాతే వివాహం చేస్తారు. వివాహానికి ముహూర్తాలు చూడరు. ఒకవేళ భర్త చనిపోతే భర్త తమ్ముడైన మరిదిని వివాహం చేసుకునే సాంప్రదాయాన్ని పాటిస్తారు. దీనినే 'మారుమనువు' అంటారు.

## తేనే సేకరణ – వింత ఆచారం :

కొండపేట్లకు తేన పెట్టెలుంటాయి. అవి చాలా ఎత్తుగా ఉంటాయి. తేనె సేకరణ అతి పెద్ద సాహసం. గిరిజనులు తమ విజ్ఞానాన్ని ఉపయోగించి చాలా జాగ్రత్తగా ఈ తేనెను సేకరిస్తారు. ఈ తేనె సేకరణలో వింత ఆచారం ఉంది. తేనె సేకరణ సమయంలో ఎత్తైన పేటుకు తాడుతో లంగరులాగా వేస్తారు. చివరకొనను ఒకరు పట్టుకొంటారు. ఒకరు పాత్రను గాని, సొరకాయ బుర్రగాని తీసుకుని తాడును ఒడుపుగా పట్టుకొంటారు. ఇంకొకరు తాడును లాగుతారు. అలా లాగగానే తాడుకు వేళాడే వ్యక్తి తేనెపెట్టె దగ్గరికి చేరకుని తేనె సేకరిస్తాడు. తాడు పట్టుకొనే వ్యక్తి పొరబాటున వదిలేస్తే పైనున్న వ్యక్తి నేలకు పడిపోయి మరణించే ప్రమాదముంది.

అన్నదమ్ములిద్దరూ తేనె సేకరణకు వెళ్లరు. ఎందు కంటే కింద ఉండే సోదరుడు దురుద్దేశంతో తాడును వదిలేస్తే ఒకవేళ అన్న మరణిస్తే వారి సాంప్రదాయం ప్రకారం అన్నభార్యను తమ్ముడు వివాహం చేసుకోవచ్చు. దీనివల్ల అన్న తమ్ముడితో కలసి తేనె సేకరణకు వెళ్లడు. బావమరదులుగాని, తండ్రీ కొడుకులు గాని కలిసి వెళ్తారు. (పుట 95-96).

అలా సేకరించిన తేనెలో సగం గ్రామస్తులకు సగం సేకరించినవారు పంచుకొనే ఆచారముంది. దీనినే 'కోరు' అంటారు. మత్స్య, మగధ దేశాల్లో దీనినే 'సంగోరు' అంటారు.

చెంచుస్త్రీలు ఈ తేనెను సమీప గ్రామాల్లో విక్ర యిస్తారు. ఈ ఆదాయంలో సగభాగం చెంచుగ్రామాభి వృద్ధికి కేటాయిస్తారు.

## దేవుడికి నైవేద్య సమర్పణ :

అహోబిళం నారసింహునికి ఈ చెంచులు తమశక్తి మేరకు కానుకలు సమర్పిస్తారు. అహోబిళస్వామి కళ్యాణోత్సవం రోజు అమ్మవారికి, స్వామికి తేనె, పసుపు కుంకుమ, ఫలహారాలు, ధూపదీప నైవేద్యాలు సమ ర్పించుకొని ఉత్సవం ముగిసినంత వరకు స్వామివారి సన్నిధిలోనే ఉండీ ఆ తర్వాత స్వస్థలాలకు వెళ్ళిపోతారు.

## ధనసంపాదన :

శ్రీశైల పర్వతంపై నివాసం ఉండే చెంచులు, ఆ పర్వతానికి సమీపంలో ఉన్న చెంచులు యాత్రికులను ఎద్దుబండ్లలో, గుర్రపు బండ్లలో కొండపైకి చేర్చు తుంటారు. అందుకు భక్తులు వారికి కొంత డబ్బులు ఇచ్చేవారు. దానిని అందరూ సమానంగా పంచుకొంటారు.

ఒకవేళ యుద్ధంలో సహాయం చేయమని రాజు దగ్గరి నుంచి పిలుపు వస్తే వారు ధనుర్బాణాలు ధరించి యుద్ధంలో పాల్గొంటారు. అందుకు రాజులు వారికి తగిన బహుమానాలిస్తారు. ఇందులో భాగంగా వారు కొంత భూమిమాన్యాలుగా పొందారు. ఈ భూమిని వారు సాగుచేయరు. రైతులకు కౌలుకిస్తారు. కొందరు చెంచులు దొంగతనాల ద్వారా సంపాదిస్తుంటారు. ఒకవేళ రాజుకు ఈ విషయం తెలిస్తే మరణశిక్ష తప్పదు.ఒకవేళ ఈభయం లేకపోతే దారినపోయే బాటసారులు చాలాఇబ్బందులు ఎదుర్కొనేవారు.(పుట 98).

## సంచార జాతులు - జీవనవిధానం :

**దొమ్మరాట :**

దొమ్మర్లు సంచారజీవనం సాగించేవారు. వీరు గాడిదలను మేపేవారు. కొన్ని గ్రామాలను ఎంపిక చేసు కుని పొలిమేర్లలో తాత్కాలికమైన గుడిసెలు నిర్మించుకొని ఒక నెలరోజుల పాటు ఉంటారు. చుట్టుప్రక్కల గ్రామాల్లో 'గెడాటలు' ప్రదర్శించేవారు. రెండు ఎత్తైన గెడెకర్రల మధ్యలో ఒక బలమైన తాడును కట్టి ఆ తాడు మీద నడవడం, పల్టీ కొట్టడం మొదలైన విన్యాసాలు ప్రదర్శి స్తారు. ప్రాచీన కాలం నుంచి వీరు ఈ విద్యలో ప్రావీణులు.

పెమ్మసాని తిమ్మానాయుడు గండికోటను పరిసా లించే కాలం గొప్ప విద్యాంతులైన దొమ్మరివారు ఆయనను కలుసుకొంటారు. వారి విద్య గురించి తెలియ జేస్తారు. నాయుని అనుమతితో గండికోటలో ఉండే మాధవస్వామి గోపురం మీద గెడెవేసి రెండు బాటలు కట్టుకొంటారు. ఎంతదూరం గెడెల మీద నడిచి ఆగి పోతారో ఆగ్రామాన్ని జాగీరుగా ఇవ్వమని కోరుతారు. ఆయన అందుకు సమ్మతిస్తారు. వారు నంద్యాల గ్రామం వరకు గెడెల మీద నడుస్తారు. ఆ గ్రామ సరిహద్దులో పడిపోతారు. అప్పటినుండి ఆ గ్రామానికి 'దొమ్మర నంద్యాల' అనే పేరుపెట్టి వారికి, వారి వంశస్థులకు తిమ్మనాయుడు ఆ గ్రామాన్ని జాగీరుగా ఇస్తాడు. కొన్ని సంవత్సరాల పాటు వీళ్ళు ఈ జాగీరును అనుభవించి దేశ సంచారంకోసం వెళ్లిపోతారు. వారు తిరిగి రాక పోవడంతో గోల్కొండ నవాబులు ఈ ప్రాంతాన్ని ఆక్ర మించినపుడు వారి సామంతరాజైన మీర్‌జామ్లా గండి కోటను పరిపాలించే సమయంలో ఈ దొమ్మర నంద్యాలను తనరాజ్యంలో కలుపుకుంటాడు. (ప్రపంచ పాళ్యం కైఫియత్తు పుట154-155).

## కైఫీయతులు - బలవంతపు విషయసేకరణ :

ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం గ్రామ విషయాలను సేక రించండానికి అధికారులకు ఆజ్ఞ జారీ చేసింది. ఈ ఆజ్ఞ నిజమే అన్నదానికి వ్రాతపూర్వక ఆధారాలున్నాయి. ఈ విషయ సేకరణ అంతా బలవంతంగా జరిగిందని గుర్తించడానికి వీలుంది.

ఆంగ్లేయులు కైఫీయతుల రూపంలో విషయ సేకరణలో ఆజ్ఞాపత్రాన్నో లేదా వారి అధికారుల చేత మౌఖికరూపమైన హెచ్చరికనో జారీ చేయించారు. అందులో అన్ని విషయాలు తెలియాలని ఏదీ దాచ కూడదని అనేక హెచ్చరిక కనిపిస్తుంది.

ఆంగ్లేయులు కైఫీయతుల పేరుతో విషయసేకరణకై చేసిన ఆజ్ఞాపూర్వక హెచ్చరికలో ఏయే అంశాలు వివరించాలో కూడా తెలిపారు. ప్రజలు, ప్రజలలో శాఖలు, పంటలు, దేవాలయాలు, మాన్యాలు,గ్రామాల సరిహద్దులు, వృక్షజాతులు, పంటల వివరాలు, అవి ఏయే కాలాల్లో పండుతాయో వాటి వివరాలు, చెరువులు-వాటి విస్తీర్ణత, భౌగోళికంగా అభించే ఖనిజాలు తదితర అంశాలు కనిపిస్తాయి.

## అనంతపురం పామిడి కులాల ప్రస్థావన :

పామిడి గ్రామానికి చెందిన కైఫీయతు ప్రకారం పామిడిగ్రామంలో 32 శాఖల వారు ఉన్నట్లు తెలుస్తుంది. కుల్లు ఖానేషు మారి ప్రకారం బ్రాహ్మణులు, భట్టురాజులు, పెనుగొండకోమట్లు, కొణిదెకాపులు, యర్రయలందెలు, కమ్మవారు, లింగబలిజెలు, తెనుగు బలిజెలు, పట్ర

వాండ్రు, జంగమువాండ్లు, ముచ్చలవాండ్లు, వాలవాండ్లు, కమ్మరవాండ్లు, మరహాటీలు, సైవాండ్లు, బొందలివాండ్లు, రాజమహేంద్రంవాండ్లు, జనగరివాండ్లు, గాజులవాండ్లు, పాంచాల బాముువారు, గోసాయిలు, పద్మసాలెలు, పింజారివాండ్లు, బోయవాండ్లు, తోగటనేశేవాండ్లు, జోగులు, బోగంవాండ్లు, ఉప్పరవాండ్లు, కాసాయివాండ్లు, రంగారీలు, మనల్మానులు, అణాతురకలు, మోమీనులు, చాకలవాండ్లు, మాదిగవాండ్లు, మేదర వాండ్లు, మంగలవాండ్లు వారు ఉన్నారు.

**వడ్లు రకాలు :**

కార్తీకమాసంలో పండే కేసరివడ్లు యర్రగా ఉండేవి. బియ్యము కూడా ఎర్రగానే ఉండేవి. చిన్నంవడ్లు తెల్లగా ఉండేవి. బియ్యము తెల్లగానే ఉండేవి. చిన్నంగి వడ్లలోనే గుర్రపు జవుల అనే వడ్లు కూడా ఉండేవి. అయితే బియ్యం మాత్రం తెల్లగా ఉండేవి. వైశాఖ మాసంలో పండే చిన్నంగివడ్లు నల్లగా, తెల్లగా కూడా ఉండేవి బియ్యము కూడా అలాగే ఉండేవి.

**రాళ్ళ రకాలు :**

లింగంపర్తి పరగణ చెన్నూరి కైఫీయతును బట్టి బయ్యనపలి, కనుపర్తి, గుర్రంపాడు, చినమాచాపల్లి అను ఈ నాలుగు గ్రామాలలో కనిరాయి, పలుగురాయి, బొంతకెంపుల యిసుక, కులిందాల, కప్పగుద్దరాయి.

★★★

# రాయలసీమ కథ – గ్రామీణ శ్రామిక స్త్రీల స్థితి

– **తమ్మిశెట్టి వెంకటనారాయణ,** పరిశోధక విద్యార్థి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

నేటి రాయలసీమను ఒకప్పుడు దత్తమండలాలుగా పిలిచేవారు. దత్తమండలాలుగా ఉన్న ప్రాంతానికి సరి హద్దుల్లో మార్పు చేసి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో కలిపి రాయలసీమ అని నామకరణం చేయడం జరిగింది. ఈ నేపథ్యానికి చిలుకూరి నారాయణ రావుతోపాటు మరికొంతమంది మేధావుల కృషి కూడా ఉంది. ఈ రాయలసీమగా పిలవబడుతున్న ప్రాంతం నాలుగు వందల సంవత్సరాల క్రితం వర్తకవ్యాపారాలలో కీలకప్రాంతంగా చరిత్రలో గుర్తించబడి, అమోఘ కీర్తి ప్రతిష్టలు సంపాదించుకుంది.

అంతేకాకుండా రాయలసీమకు ఒక ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక, సాహిత్యచరిత్ర (క్రీ.శ. 575 రేనాటి చోళల శాసనం - కలమల్ల శాసనం) ఉంది. భాషలో ప్రత్యేకమైన మాండలికం ఉంది. రాయలసీమ వాసుల భాష, యాస, మాటతీరు, స్వభావ, వ్యవహారాల్లో, ఆర్థిక అంశాలలో ఇతర ప్రాంతాలకన్న భిన్నంగా ఉండటానికి కారణం చారిత్రక భౌగోళిక సాంస్కృతిక పరిస్థితులు కావచ్చు. వీటిని ఆ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ఆర్థి కాంశాలు నిర్ధారిస్తాయి. ఇవి ప్రాంత ప్రాంతానికి భిన్నంగా ఉంటాయి.

రాయలసీమ ప్రాంత ప్రజల జీవన శైలిలో వ్యవహార సరళిలో మొరటుతనం అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. ఇక్కడ వ్యవసాయం కూడా వర్షాధారితమైనది. ఒక ప్రాంతపు ప్రజల జీవితం బండబారి మొరటుదేలినపుడు వాళ్ళ భాష, యాస, కరుకుదనం మొదలైనవన్నీ అట్లానే ఉంటాయి.

అయితే రాయలసీమ వాసులు మంచితనానికి మారు పేరు. నమ్మిన వ్యక్తుల కోసం ఎంతటి తెగింపుకైనా వెనుకాడరు. ఈ తెగింపు వీరి కుటుంబాలకోసం కంటే నమ్మిన వ్యక్తుల కోసమే ఎక్కువ చేస్తారు. ఈ తెగింపు ముఖ్యంగ అట్టడుగు కులాలుగా పేర్కొంటున్న (ముద్ర బడిన) వారిలో మెండుగా ఉంటాయి. ఉన్నతవర్గం వారు వీరిని రాజకీయక్రీడల్లో పావులుగా వాడుకుంటున్నారు. ఈ విషయాన్ని వీరు గ్రహించలేకపోతున్నారు. అందుకు గల కారణం, ఆర్థికంగా, సామాజికంగా, కులపరంగా, ఆధిపత్యపరంగా అన్నింటిలో వెనుకబడి ఉండటం మరియు అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశాలు, పలుకుబడి లేకపోవడమే.

వీరు చేసే తెగింపు, పట్టుదల వీరి కోసమో, వీరి కుటుంబాల కోసమో, వీరి కులవర్గం కోసమో, వీరి ఆత్మగౌరవం కోసం, సమసమాజం కోసం చేయడం లేదు. చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. వీరు నమ్మిన వ్యక్తుల కోసం ప్రాణాలకు సైతం తెగిస్తారు. నిజంగా వీరి హితాన్ని కోరేది ఎవరూ ఉండరు. అందరూ నటించే వాళ్ళే. సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం కావున వీరి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక మొదలగు స్థితి గతుల్ని కథ, నవల, నాటకం మొదలైన సాహిత్య ప్రక్రియల ద్వారా సమకాలిన సమాజం ముందుంచి దిశానిర్దేశాలు చేస్తూ సమాజాన్ని మేల్కొలిపి, చైతన్య వంతుల్ని చేస్తూంది. సాహిత్య ప్రక్రియలన్నింటిలోకెల్ల కథకు ఒక ప్రముఖమైన స్థానం ఉంది. కథ మనిషిని ఆలోచింపచేస్తుంది. తెలుగు సాహిత్యంలోని కథలు వివిధ అంశాలను వివిధ కోణాల్లో ప్రతిబింబింప చేసింది, చేస్తూ ఉన్నది. కథల్లో ఆ ప్రాంతప్రజల జీవన స్థితిగతుల్ని కూడా తెలియజేస్తుంది.

ముఖ్యంగా రాయలసీమ కథా సాహిత్యంలో శ్రామిక స్త్రీ కుటుంబాల స్థితి గురించి ప్రత్యేకంగా చెప్పవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే చెప్పక తప్పదు. ఎందుకంటే

జనాభలో సగం మంది స్త్రీలు అయితే ఆ స్త్రీలల్లో తొంభైశాతం మంది శ్రామికస్త్రీలే ఉన్నారు. వీరి స్థితి గతులే దుర్భరంగా ఉండాయనటంలో సందేహం లేదు. అందులో దళిత, సంచార, మైనార్టీ స్త్రీల స్థితి గురించి ఆలోచిస్తే మనస్సు కలిచివేస్తుంది. ఆ స్థితిని భరించే ఆ స్త్రీల సంగతి ఎంత వేదనాపూరితంగా ఉంటుందో? ఆ స్త్రీల సంగతి ఏంటి? జీవచ్ఛావాల జీవితం అనక తప్పదని నా అభిప్రాయం.

రాయలసీమ సాహిత్యం రావడం కొద్దిగా ఆలస్యంగా వచ్చి ఉండవచ్చు కాని చాలా మంది కథా రచయితలు, రచయిత్రులు రాయలసీమలో గలరు. వారి ప్రస్థానం కంటే ముఖ్యంగా వారి రచనలు గురించి, అందులోని ఆర్ద్రత, చైతన్యం, అట్టడుగు ప్రజలపట్ల, ఈ ప్రాంతపు స్త్రీల స్థితిగతుల పట్ల వారి దృక్పథం ముఖ్యం. వారి దృష్టికోణం ఎలా ఉందో చెప్పవల్సిన ఆవశ్యకత ముఖ్యం.

రాయలసీమ కథల్ని కొన్నిటిని పరిశీలించినట్లయితే శ్రామికస్త్రీల స్థితి గురించి స్పందించి రాసినవి కొద్దిమంది మాత్రమే అనక తప్పదు. రాయలసీమలో కరువు, కక్షలు, హత్యలు, ఆత్మహత్యలు తరచూ చూస్తూ ఉంటూ ఉంటాం. వాటి దుష్ఫలితాలను అనుభవించేది, ఒడు దుడుకులను ఎదుర్కొనేది ఆ కుటుంబంలోని స్త్రీలే. ఇబ్బంది పడేది, అభం, శుభం తెలియని పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు.

ఒకవైపు రాయలసీమ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకున్నపుడు రైతు ఆత్మహత్యలు, మరొకవైపు కక్షలకు పునాదివేసే అగ్రకుల రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో గానీ, ఫ్యాక్షన్ కోరల్లో ఇరుక్కుని హత్య చేయడం, హత్యకాబడడమో వీటి మధ్య పురుషుని/భర్త జీవితం ముగిస్తే, బాధలు, అవమానాలు, నిందలు, పురుషాధిక్య సమాజ విషపుదృష్టితో మాడిపోయేది స్త్రీలే.

"గాజుకళ్ళు" కథ సంకలనంలోని 'కాటేసిన కరువు' కథలో వరుస కరువులు రావడంతో వ్యవసాయిక సంక్షోభాన్ని దాని పర్యవసానం తత్ఫలితంగా గ్రామీణ స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన మార్పులూ స్త్రీలే కాదు పురుషులపై కూడా ప్రభావం అధికంగానే ఉంటుంది. కుటుంబ భారాన్ని మోయడానికి పనులకోసం పట్నం వలస పోయిన నాగప్ప, అక్కడ ఆకలి తీర్చుకునేందుకు దొంగతనం చేయడంవల్ల జైలు శిక్ష పడుతుంది. అనంతరం సొంత వూరికి వచ్చినపుడు అతనికి వూళ్ళో పిల్లల్లు, ముసలివారు తప్ప ఎవ్వరూ కనిపించరు. ఊల్లో కుటుంబాలు కరువు వల్ల వలసపోయిన దృశ్యాలను, దాని పర్యవసానాన్ని కళ్ళకు కట్టినట్లు రచయిత్రి జి. నిర్మాలారాణి చిత్రిస్తుంది. "రచయిత్రి ఒకానొక సందర్భంలో కన్నబిడ్డల దగ్గర కాపలాగా కన్నతల్లిదండ్రుల్ని పెట్టి వలసపోయారంటారు.

"ఒకప్పుడు పల్లెల్లో ఎంతో ప్రేమగా కన్నతల్లిదండ్రులు తన బిడ్డలకు, బతిమలాడి బతిమలాడి ఆప్యాయంగా కొసరి కొసరి గోరుముద్దలు తినిపించే స్థానం తల్లిది. కరువు వల్ల ఆకలి ఆకలి, తిండి తిండి అని ఏడిచే బిడ్డలతో, నన్ను చంపకు తినండిరా" (పుట 34, గాజు కళ్ళు) అంటూ పిల్లల్ని కొట్టి తాను ఏడ్చే నిస్సాయక స్థితిలో ఉన్న తల్లి కూడా కనిపిస్తుంది. దుడ్లు కాదు వంటినిండా రోగాలు కూడా వచ్చాయి. ఆ రోగాలాకు, రొచ్చులకే వచ్చి దుడ్లన్ని అయిపోయినాయి చూడు అనే తల్లి కూడా కనిపిస్తుంది.

వాళ్ళ కోరిక తీర్చలేదని ఎట్లా వాతలు పెట్టినారో చూడమ్మా! వాళ్ళు మనషులు కాదమ్మా! రాక్షసులు. మనుషులను పీక్కుతినే దెయ్యాలు. గిరాకితో సరిగ్గా నడుచుకోలేదని యజమానురాలు చావగొడుతోంది, యాడికైనా పారిపోతా, ఇంత విషంతాగి సచ్చిపోదాం అనే వేదానభరితమైన ఓ చెల్లి వినిస్తాయి (మాటలు ఇంట్లోకి పోతున్న నాగప్ప చెవిలో పడ్డాయి). కన్న కూతుర్ని కడుపు నింపుకోవడం కోసం వ్యభిచార గృహానికి తరలించడం ఒక ఎత్తైతే, ఇచ్చిన 500 దుడ్లు కూటికి సరిపోయా, కూతురు పోనంటుంది అని కూతురు స్థానంలో తల్లి

వెళ్ళడానికి సిద్ధమయ్యే సన్నివేశాలు కనిపిస్తాయి. కరువు తీవ్రతను చెప్పడానికి ఇంతకన్నా మించిన ప్రమాణం ఉంటుందా? ఆకలి మనుష్యులచేత ఎంతటి పనినైనా చేయిస్తుందనే కఠిన వాస్తవం. ఆర్థిక దుస్థితి, నైతిక విలువల విధ్వంసం, మనుష్యుల మధ్య సహజంగా ఉండే మానవీయ స్పర్శ సెంటిమెంట్లపై కూడా కరువు ప్రభావం ఎలా ఉంటుందో నిర్మలా రాణి ఈ కథలో ప్రతిబింబింపచేసింది. ఈ కథలో స్త్రీయొక్క శారీరక మానసిక వేదనకు కారణం, పక్షవాతంతో మంచంపట్టిన తండ్రి పోషణ, మరొక పక్క కుటుంబ బారాన్ని మోయ డానికి పడే తపన కనిపిస్తుంది.

ఆర్. శశికళ రాసిన ''డ్రాపవుట్'' కథ కూడా ఇంచుమించుగా ఈ కథనే పోలివుంది. ఈ కథలో పాఠశాల చదువు నుండే డ్రాపవుట్ కావడమే కాదు చక్కని జీవితం నుండే ఆడపిల్లలు డ్రాపవుట్ అవుతున్నట్లు కనిపిస్తుంది. ఈమె రాసిన మరొక కథ "అనంతగాయం" కథలో కూడా ఎయిడ్స్ వ్యాధివలన కుప్పకూలి పోతున్న స్త్రీ జీవితాలను గురించీ, స్త్రీల యొక్క సమస్యాత్మక, సంక్షోభిత జీవితాలనూ, మానవీయ విలువల విధ్వంసాన్ని తెలియ జేస్తున్నది. వీటికి కరువు మూలకారణంగా కనిపిస్తున్నది.

బత్తుల ప్రసాద్ గారు రాసిన "నెత్తురు మరకలు" కథ రాయలసీమ దళితుల స్థితిగతుల్ని తెలియజేస్తుంది. దళిత కుటుంబాలలోని దారిద్ర్యం కొట్టుమిట్టాడుతూ ఉన్నట్లు, ఆపైన కరువు వల్ల ఇంకా హీనంగా కనిపిస్తారు. ఒకవైపు శ్రమ దోపిడికి గురవుతున్నట్లూ, చిన్నపిల్లల కాళ్ళకు చెప్పులు కొనివ్వడానికి కూడా స్తోమతలేని తల్లులు, చినిగిపోయిన కుట్టు వేయడానికి కూడా పనికి రాని జాకెట్టుతో జీవనం సాగిస్తున్న దళితస్త్రీలు, వారి పిల్లలు ఎంత దయనీయ స్థితిలో ఉన్నారో రచయిత సూచించాడు. అంతేకాకుండా వయస్సు మళ్ళినప్పుడు కూడా కూలిపనులు చేసి కుటుంబానికి స్త్రీలు సాయ పడతారని చెప్పడం వంటి విషయాల్ని గమనిస్తే ఇక్కడి గ్రామీణ దళిత శ్రామికస్త్రీ స్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం అవుతున్నది.

కరువు నేపథ్యంలో చిలుకూరు దీవిన రాసిన 'విషమ సంధ్య' కథలో గీత చదువులో ఎంతో ముందున్ననూ, కరువు వల్ల పంటచేతికి రాక అప్పులు తీర్చలేక గీత తండ్రి ఆత్మహత్య చేసుకుంటే ఒక మోస్తరుగా జీవిస్తున్న గీత కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. చివరకు గీత వ్యవ సాయ కూలీగా జీవితాన్ని వెళ్లబుచ్చాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఈ కథను బట్టి కుటుంబంలో ఆర్థికంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా వాటి దుష్ఫలితాలను అనుభవించే వారిలో ఆడపిల్లలు, స్త్రీలే అనుటకు ఈ కథే నిదర్శనం.

మైనం బొమ్మలు, ఆయమ్మిలేదు అనే కథల ద్వారా సీమలో బతుకుతెరువులేక, ఉన్న భూమికి కావల్సిన నీటిసౌకర్యం లేక దుర్భరమైన జీవితం గడుపుతున్న తాండా కుటుంబ స్థితిగతుల్ని వ్యక్తీకరించారు. అందులో ముఖ్యంగా సుగాలి తండాల్లోని, 16 సంవత్సరాల వయస్సు కూడా నిండని బాలికల్ని బొంబాయి, పూనా పట్టణ వ్యభిచార గృహాలకు అమ్ముకునే తల్లిదండ్రులు కనిపిస్తారు. భర్త తాగుడుకు బానిస కావడం, పొట్టకూటి కోసం అమ్ముకుంటున్న సందర్భంలో తొమ్మిది నెలలు మోసి పెంచిన తల్లి వేదనకు కొలమానం ఉండదు. కూతురు రోగం రొప్పులతో ఇల్లు చేరినపుడు గుండెలు బాదుకునేది కూడా (స్త్రీ) తల్లియే. ఈ విధంగా వేదనా భరితమైన గిరిజన మహిళ జీవన చిత్రణను ఈ కథల్లో సాక్షాత్కరింపచేశాడు రచయిత వేంపల్లి గంగాధర్.

పాలగిరి విశ్వప్రసాద్ గారు రాసిన 'చెప్పుకింద పూలు' కథలో ఉన్నతవర్గంలో ఉన్న ఒక పెద్దమనిషి ఇంట్లో జీత గాళ్ళుగా రంగి, అంకమ్మ, మొదలగు కుటుంబ సభ్యు లందరూ చాకిరి చేస్తూ జీవనం సాగిస్తారు. ఒకానొక రోజు ఆ ఇంటిలో జీతగాని చెల్లి, యుక్తవస్సులో ఉన్న, పెళ్ళీడు ఉన్న రంగిపై కన్ను వేస్తాడు యజమాని. అందుకు ఆమె

(రంగి) తిరష్కరించడంతో జీతగాని ఇంట్లో వారిలో వారే కుటుంబ తగాదాలు పెట్టి చివరకు రంగిని చిక్కుల్లో పడేస్తాడు. ఈ విధంగా అగ్రవర్ణాలవాళ్ళు దళిత శ్రామిక మహిళలపై మానసిక శారీరక దాడులు చేస్తున్నారు. అయిననూ వాటిని అనుభవిస్తూ జీవనం సాగిస్తున్నారనే విషయాన్ని వ్యక్తీరిస్తున్నాడు రచయిత. అంటే ఆత్మాభి మానం చంపుకొని, ముందునుయ్యి, వెనుక గొయ్యి లా జీవనం సాగిస్తున్నారు శ్రామిక దళితస్త్రీలు.

'పొగబండి నేస్తం' కథ సంకలనంలోని "ఇది కథకాదు అనే పేరుతో రాయలసీమ కరువు నేపథ్యంగా వచ్చిన కథ. ఇందులో మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీకి జరిగిన అవమానాలు కనిపిస్తాయి. కరువు కాటకాల వల్ల పంట చేతికి రాక రైతు అప్పుతీర్చలేకపోవడం వల్ల అప్పులిచ్చిన భూస్వామి

అప్పు తీసుకునేది కాదు రా బాకీ తీర్చేకి రోసముండాల మాట అనిపిచ్చుకోకూడదంటే పెండ్లాన్ని యాడన్న పండపెట్టి బాకీ కట్టల్లారా నాకొడకా!

(పొగబండి నేస్తం, పుట 126)

అన్న మాటలకు రైతు నిస్సహాయ స్థితిలో ఆత్మమత్య చేసుకుంటాడు. అనంతరం భార్య, కూతురు భూస్వామి దౌర్జన్యానికి లొంగిపోయి అతని పడగనీడలోకి చేరుతారు. ఇలా ఇష్టా యిఅష్టాలతో సంబంధంలేకుండా, కరువు కాటకాలవల్ల, కుటుంబ ఆదరనను కోల్పోయి కుటుంబ భారాన్ని మోయడానికి, తన మాన ప్రాణాల్ని తాకట్టు పెట్టేదీ, ఆ బాధల్ని అనుభవించేదీ స్త్రీలే అనే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కరువుకాటుకు స్త్రీల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నట్లు, మనిషిలోని విలువలు పతనం అవుతున్నట్లు తెలుస్తున్నది. ఇక నిరుపేదస్త్రీల పౌరుషం, ఆత్మగౌరవం అన్ని కూడా ఆకలి, కరువు ముందు దిగ దులుపే అన్నది కఠోర సత్యం.

ఆచార్య పి. నరసింహారెడ్డి గారు రాసిన "అబల" కథలో తాగుబోతు భర్త గంగడు పెట్టే కష్టాల్ని భరించలేక భార్య ఎంకి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధబడుతుంది. చివరకు బిడ్డలు దిక్కులేనివారవుతారని తనకు తానుగా మనోధైర్యం తెచ్చికుని తన పని చేసుకుంటూ వ్యవసాయ పనులకు కలుపు పనులకు వెళ్ళి తన కిష్టమైన బట్టలు కొనుక్కోవడంతో పాటు, ఇంటిల్లిపాదికి కూడా అంటే ఇక్కడ స్వయం కృషితో తన భర్త బాధ్యతరాహిత్యంగా ఉన్నప్పటికీ తన కుటుంబ గౌరవం కోసం పట్టుదలగా పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నది స్త్రీ అనే విషయం నొక్కి వక్కానిస్తున్నాడు రచయిత.

పై విధంగా కరువు వచ్చిన, కర్మ వచ్చిన, భర్త బాధ్యతా రాహిత్యంగా ఉండిన, ప్రవర్తించిన బలైపోతున్నది స్త్రీ జీవితమే. భర్తను కోల్పోయిన స్త్రీలపట్ల సమాజం, సొంతబంధులు రాబంధులై ప్రవర్తించే తీరును చక్రవేణు రాసిన "కువైట్ సావిత్రమ్మ" కథ తెలియజేస్తుంది.

ముస్లింస్త్రీలు మామూలుగా స్త్రీలందరూ ఎదుర్కుం టున్న పురుషాధిపత్యంతో పాటుగా అధనంగా మతాచారా లను, మూఢవిశ్వాసాల బారాన్ని కూడా మోస్తున్నారు. ముస్లిం స్త్రీలు జీవితాలు హిందూ ఇతర మత స్త్రీ జీవితాల స్త్రీల కంటే దుర్భరంగా ఉంటాయనడానికి సత్యాగ్ని రాసిన పాచికలు కథ, సంపుటి, వేంపల్లి షరీఫ్ రాసిన ఫర్దా, తురకోని సేద్యం, ఇబ్రహీం, ఖలందర్ వంటి రచయితల కథా రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఇందులో రజాక్ మియా సేద్యం (తురకోని సేద్యం) కథలో ముస్లిం శ్రామిక స్త్రీ జీవితం కనిపిస్తుంది.

రాయలసీమ కథా సాహిత్యంలోని శ్రామిక స్త్రీలు కనీసం ఆత్మగౌరవం, కనీస వసతి సౌకర్యాల్ని పొందే స్థాయిలో కూడా ఎనభైశాతం స్త్రీలు లేరనే చెప్పవచ్చు. వీళ్ళకు కూడా వారి వారి సామర్థ్యాలకు తగిన పని కల్పించి, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఇచ్చి, తగు విద్యా అవకాశాలు అందించినట్లయితే ఇల్లాలు చదువు ఇంటికి వెలుగులా అవుతారు. తద్వారా తమ గురించి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

తాము తెలుసుకొని, కుటుంబంపట్ల, సమాజంపట్ల, ప్రస్తుత పరిస్థితులపట్ల అవగాహణ కల్గి తమకు అందవల్సిన, అవసరమగు సదుపాయాల్ని, హక్కుల్ని అడగగల్గే స్థాయికీ చేరతారు. తిరుగుబాటు ధోరణితో తమకు తామే ఒక శక్తిగా ఎదుగుతారు. చీకటిలో కూర్చొని చీకటిని నిందంచడం కంటే చిరుదీపం వెలిగిచాలనే ఆలోచన వచ్చేందుకు అవకాశం ఉంటుంది. తమ హక్కులు సాధించుకొనే స్థాయికి వచ్చి, మోసపూరితమైన కుట్రల, కుతంత్రాల నుండి బయటపడతారు. అప్పుడే సామాన్య శ్రామికస్త్రీకి మేలు కల్గుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. సీమకథ అస్తిత్వం - శ్రీదేవి కిన్నెర
2. రాయలసీమ సాహిత్యం - శశిశ్రీ
3. డ్రాపవుట్ (కథ) - ఆర్. శశికళ
4. పాచికలు (కథాసంపుటి) - సత్యాగ్ని షేక్
5. వల్లంపాటి కథలు - వెంకటసుబ్బయ్య వల్లంపాటి
6. చెప్పు క్రింద పూలు (కథాసంపుటి) - విశ్వప్రసాద్ పాలగిరి
7. గాజుకళ్ళు (కథాసంపుటి) - జి. నిర్మలారాణి
8. దుమ్మా (కథల సంపుటి) - షరీఫ్ వేంపల్లి

★★★

# రాచపాళెం కవిత్వం – రైతు – రాజకీయం

– డా॥. సింగర వాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్.జె.యు.కె.టి.

"విశాలమైన భారతదేశం అనంతమైన వైవిధ్యం కలిగి ఉంటుంది. సమతల భూములు, ఎక్కడక్కడ కొండలు, నదులు, పర్వతాలు భౌగోళికంగా హద్దులు ఏర్పరుస్తూ ఉంటాయి. కులాలు, మతాల వల్లనే కాకుండా భౌగోళిక పరిస్థితులు కూడా ఈ వైవిధ్యానికి దోహదం చేస్తాయి.

భారతదేశం రెండు భాగాలుగా ఉంటుంది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం. ఉత్తర భారతదేశంలో గోధుమలు, దక్షిణ భారతదేశంలో వడ్లు, రాగులు, జొన్నలు అధికంగా ఉపయోగిస్తారు. ప్రజల వేషంలో, భాషలో అభిరుచులలో కూడా బేధాలు కన్పిస్తాయి. సమాజం స్థలకాల బద్ధమై ఉంటుంది. స్థాలికమైన వైవిధ్యం జీవన వైవిధ్యానికి దారితీస్తుంది.

భారతదేశంలోని అనేక ప్రాంతాలలో రాయలసీమ ఒక ప్రాంతం. విజయనగర రాజుల పాలనలో ఉన్నందు వల్ల దీనికి రాయలసీమ అనే పేరు వచ్చింది. నిజాం నవాబు ఈస్టిండియా కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ ప్రాంతం దత్తమండలమైంది. నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో చిలుకూరి నారాయణరావు ప్రతిపాదనతో రాయలసీమ అయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 67,299 చ.కి.మీ. వైశాల్యంతో 1,51,91,114 మంది జనాభా గల రాయలసీమలో చిత్రావతీ, స్వర్ణముఖి, పెన్న, తుంగభద్ర, హంద్రి, పాపగ్ని మొదలైన నదులున్నాయి.

ప్రపంచ ప్రసిద్ధి చెందిన తరుపతి తిరుమల, శ్రీకాళ హస్తి, శ్రీశైలం, పుట్టపర్తి వంటి క్షేత్రాలు, తిమ్మమ్మ మర్రి మాను వంటి హరితవనం రాయలసీమలో ఉన్నాయి. అపారమైన భూగర్భ వనరులు ఉన్నాయి. వజ్రాలు దొరికే వజ్రకరూరు, రామగిరి బంగారు గనులు ఉన్నాయి. అయినప్పటికీ రాయలసీమ కరువు సీమగా పేరు పొందింది. ఈ కరువు ప్రాంతమైన రాయలసీమలోని వ్యవసాయరంగాన్ని, రైతు జీవన విధానంపై అనేకమంది కవులు తమ రచనల ద్వారా అభివ్యక్తీకరించారు. వారిలో తెలుగు సాహిత్య జగత్తులో పెరెన్నికలగల విమర్శకులు, కవి, అభ్యుదయవాది, దళిత, స్త్రీ పక్షపాతి అయిన రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు తన రచనల ద్వారా, కవితల ద్వారా రాయలసీమ వ్యవసాయాన్ని, రైతు జీవితాన్ని ఆవిష్కరించారు. ఈయన ముఖ్యంగా విమర్శకులుగా ప్రఖ్యాతులు. అయినప్పటికీ కవిత్వం కూడా రాశారు. అది ఎప్పుడంటే ఏదైన ఒక సంఘటన జరిగినప్పుడో, చూసినప్పుడో, విన్నప్పుడో మనస్సుకి భరించలేని వ్యథ కలిగినప్పుడు. ఆవేదనను కవిత్వరూపంలో వెల్లడించారు. ఈయన రాసిన కవితలన్నీ నిర్దుష్టమైనవే.

రాచపాళెం గారు రాయలసీమ ప్రాంతవాసి. చిత్తూరు జిల్లాలోని కుంట్రపాకం గ్రామంలో రామిరెడ్డి, మంగమ్మ దంపతులకు జన్మించారు. చిత్తూరు జిల్లాలో పుట్టి అనంతపురం జిల్లాలో నివసిస్తున్న ఆయన జీవన గమనంలో రైతుకు తగిలే ప్రతి దెబ్బను చూశారు. ఆయన స్వయంగా రైతుబిడ్డ. వ్యవసాయం తెలిసిన, చేసిన వ్యక్తి కాబట్టే, ఆయన రచనల్లో రైతుపట్ల తడి ఆర్ద్ర ఆత్మీయత, గౌరవం, ఆవేదన కలగలిపి కనిపిస్తుంది.

రాచపాళెం చిన్ననాటి నుండి వ్యవసాయంలో మునిగి తేలాడు. తండ్రి శిక్షణలో వ్యవసాయంలోని మెలకువలు తెలుసుకున్నాడు. మోటతోలాడు. ఆయిల్ మిషన్ వెయ్యడం తెలుసుకున్నాడు. దున్నపోతులతో మడక దున్నాడు. ఎద్దులబండి తోలాడు. పాడి పశువులను మేపాడు. వ్యవసాయంలోని విభిన్న అంశాలు రాచపాళెంకు కరతలామలకలే. తండ్రి శిక్షణలో చిన్నపటి నుంచి ఆర్తిక నియతిలో పెరిగారు. పరాయి స్త్రీల పట్ల

గౌరవంగా ప్రవర్తించాలని వ్యసనాలకు దూరంగా ఉండాలని తండ్రి చేసిన బోధనలు రాచపాళెంకు చిన్న వయస్సులో వంటబట్టాయి. ఈ నేపథ్యంలో రాచపాళెంకు తండ్రి అంటే అనిర్వచనీయమైన గౌరవం ఏర్పడింది. తండ్రి అడుగుజాల్లోనే నడచి శ్రమించి ఉన్నతస్థాయికి చేరుకున్నాడు.

రాచపాళెం తన తండ్రి వ్యవసాయ జీవితాన్ని స్వయంగా దగ్గరగా ఉంచి చూశారు. అందుకే "మా నాయనే" అనే ఆర్ద్రమైన కవిత రాశారు. రాచపాళెంగారిది వ్యవసాయ కుటుంబం కనుక కవి తన తండ్రిని ఒక శ్రామిక వీరునిగానే చిత్రించారు. ఈ కవితలో రైతు వ్యవసాయానికే పరిమితమై మరో రంగంతో సంబంధం లేని రైతు. పైగా రాజకీయాల పట్ల, విధేయత కలిగిన రైతు. ఆ రైతు శ్రమకు తగిన ఫలితం దక్కక ఆర్థికంగా చితికిపోయి, శారీరకంగా కృశించిపోయిన రైతు. ఈ దృష్టితోనే "మా నాయన" కవిత వచ్చింది. తండ్రి పట్ల వ్యక్తిగత ఆరాధనతో కాకుండా ఆయన శ్రమపట్ల గౌరవంతో ఈ కవిత రాశారు రాచపాళెం.

రైతుకు భూమికి గల విడదీయరాని బంధాన్ని రాచపాళెం ఇలా చిత్రించారు. సూర్యోదయం కాకముందే రామిరెడ్డి గారు పంట పొలంలోకి వెళ్ళి గెనాల మీద తిరిగేవారు. రాత్రి కట్టిన నీళ్ళు ఎక్కడైనా జల్లిస్తున్నాయో, గెనాలు తెగాయో, వంచీలు తెగాయో, దళ తెగిందా చూసి సర్ది వచ్చేవారు. గెనాల మీద తుంగ మొలకలుంటాయి. వాటి మీద మంచు బిందువులు మెరుస్తూ ఉండేవి. గెనాలన్నీ తిరిగే లోపల మంచుతో మెకాళ్ళ దాకా తడిసిపోతుంది. ఈ దృశ్యాన్ని...

**సూర్యకిరణాలతో పులకించే ముందు**
**మానాయన పాదస్పర్శతో**
**పంట పొలం పరవశించిపోతుంది**
**మానాయన పొలంలోకి అడుగుపెట్టగానే**
**గెనాల మీద పచ్చిక**
**మంచు బిందువులతో**
**ఆయన పాదాల్ని కడిగేది**

రామిరెడ్డి గారి వ్యవసాయ నైపుణ్యాన్ని...

ఆయన వేసిన కొండ్ర ఇంజనీర్లకు గీత గీయడం నేర్పేది అని శ్లాఘించారు. వరి నాటడం, వరిపడడం, వడ్లు రాలడం వాటిని అమ్ముకోవడం అనే ప్రక్రియ తన తండ్రి జీవితం ఆధారంగా చిత్రించిన కవి ఆ వడ్లకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతు దిగులు పడటాన్ని ప్రస్తావించారు.

**"కోత కోసి పన గొడుతుంటే**
**ఆయన ముఖం**
**పున్నమీ చందమామ అయ్యేది**
**తిరుపతి నుంచి ముసలయ్య గోతాలతో వచ్చి**
**వడ్ల ధర చెబుతుంటే**
**ఆయన ముఖం**
**సంపూర్ణ సూర్యగ్రహణం పట్టినట్లయ్యేది"**

2004కు ముందట రాష్ట్ర పాలకులు రైతాంగాన్ని వ్యవసాయాన్ని ఎంత నిరాశపరిచారో, హింసించారో చరిత్ర గ్రంథస్థం చేసింది. 2004 ఎన్నికలలో ప్రజలు అందుకు ప్రతిఫలం చూపించారు. వ్యవసాయం దూడగ అన్నారు వరి చేస్తే దక్కేది ఉరేనన్నారు. రైతులను రైతులుగా నిలవ నీయకుండా ఇసుక కాంట్రాక్టర్లుగా, బ్రాంది అమ్మకం దార్లుగా మార్చేశారు. రైతును భూమి నుంచి వేరు చేసి వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేశారు. ఆదుర్మార్గాన్నంతటికీ ప్రజలు ఎన్నికల రూపంలో బదులు చెప్పారు. వెంటనే మళ్ళీ బుజాన వేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మారుస్తామని మాట్లాడడం ప్రారంభించారు. 'ఆత్మానుభవం అయితేగాని తత్వం బోధపడదు' అన్న గురజాడ మాట నిజమైంది. ఆ సందర్భంగా రాచపాళెం "అంతా అర్థమౌతూనే" ఉంది అనే కవి తరాశారు. వ్యవసాయరంగం నుంచి కవిగా, విమర్శకునిగా ఎదిగొచ్చిన రాచపాళెం గారు.......... మార్పును అధిక్షేపిస్తూనే ఈ కవిత రాశారు.

**"కొండ్ర వేస్తే**
**నేల చీలినంత స్పష్టంగా**
**అంత అవగాహన కొస్తూనే ఉంది**
**రైతు మళ్ళీ ఫిలాసఫీ అవుతాడనీ**
**వాడు చచ్చి**
**వంకశాలకు ప్రాణం పోస్తాడని**
**అంతా తెలుస్తూనే ఉంది.**
**కొమ్ము ఊడితే**
**కోటి చెవులు గింగురుమన్నంతగా**
**రైతు పాడె మీద నుండే**
**అధికారం మార్పిడి జరిగి పోతుందని**
**అప్పట్నుంచి మళ్ళీ ఇంకొకడి కోసం**
**రైతు మరణిస్తూనే ఉంటాడని**
**అంతా అర్థమౌతూనే ఉంది"**

అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నపూర్ణగా పేరు పొందిన రాష్ట్రంలో ప్రజలకు తిండి గింజలు పండించి వడ్డించే రైతు బలవన్మరణానికి పూనుకునే స్థితి కల్పించడం పట్ల రైతు వర్గం నుంచి పుట్టుకొచ్చిన కవిత సహజంగానే ఆగ్రహం ఉంటుంది. అది రచనలో అభివ్యక్తం కావడం చాలా సహజం. రైతును పాలకవర్గాలు తమ ప్రయోజనాలకు పావుగా వాడు కోవడం మీద ఆగ్రహమే ఈ కవిత.

అనంతపురం జిల్లా రైతులు వేరుశనగ పంటను పండించటంలో మొదటిస్థానంలో ఉంటారు. అత్యధిక పంటను పండిస్తారు. ఆ పంటకు వచ్చే తెగులు "మొవ్వకుళ్ళు" రోగం. దానికి "మోనోక్రోటుఫాసు" అన్నద మందు. 2002లో ప్రభుత్వమే ఆ మందును రైతులకు సప్లయి చేసింది. అయితే అది కల్తీమందు. వేరుశనగ పైరుకు చల్లితే పురుగు చావలేదు. పురుగుల్ని చంపని ఆ మందు మనిషిని చంపింది. ఈ దారుణం మీద రాసిన కవితే "అనంతరైతు". ఈ కవితలో ఇంతకుముందు చర్చించిన కవితల కన్న మించిన రాజకీయ స్వభావం ఉంది. ప్రపంచ బ్యాంకు అప్పు, కఠిన నిర్ణయాలు, రోడ్ల వెడల్పు, రింగురోడ్లు ప్రైవేటు బ్యాంకులు వంటి అంశాలన్నింటినీ రైతు ఆత్మహత్య చుట్టూ పెట్టి ఈ కవిత రచించారు కవి. రైతుల జీవితాలను అప్పులు ముంచేస్తున్న వాస్తవాన్ని మొదట కవి ఇలా పేర్కొన్నాడు.

**"అనంత జీవన సాగరంలో**
**అన్నదాతల అప్పుపడవల్ని**
**ఆత్మహత్యల తెడ్లు ఒడ్డుకు చేరుస్తున్నాయి**
**నూరేళ్ళ జీవితం కోసం**
**అందరూ కలిసి నిర్మించుకున్న ఆశాసౌధాన్ని**
**అప్పుల బుల్డోజర్లు కూల్చేస్తే**
**ఆత్మహత్యల పొక్లెయినర్లు గుంత తవ్వి పూడ్చేస్తున్నాయి"**

ఒకవైపు సాంకేతిక విప్లవం వస్తున్నా మరోవైపు అది రైతును రక్షించలేని నిజాన్ని ఈ ఖండిక అలంకారికంగా అధిక్షేపించింది.

రాచపాళెంగారు రాసిన ప్రముఖ దీర్ఘకవిత 'పాలి'. ఈ కావ్యం 21వ శతాబ్ది మొదటి దశాబ్దంలో ప్రపంచీకరణ దాడిలో నశించిపోయిన వ్యవసాయరంగమే ఈ కావ్యం లోని వస్తువు. ఈ కావ్యంలో చిత్తూరు జిల్లా వరి వ్యవ సాయంలోని ప్రతి అంశాన్ని వివరిస్తుంది. 1913లో నాటి దువ్వూరి రామిరెడ్డి గారి కృషీవలుడు మొదలుకొని నేటి దాకా అనేక కావ్యాలు వ్యవసాయం వస్తువుగా వచ్చాయి. వీటిలో పాలి విశిష్టమైంది. 1991 తర్వాత భారతదేశం గాట్ ఒప్పందం మీద సంతకం చేసి ఎల్.పి.జి. అనే అమెరికా సిద్ధాంతాలకు తలవంచి సంస్కరణలను తీసుకొచ్చింది. సాధారణంగా సంస్కరణ అంటే ఇప్పుడున్న జీవితం కంటే మెరుగ్గా ఉండటం. కాని అమెరికా నమూనా సంస్కరణలు భారతీయ రైతులను పెనం మీద నుంచి పొయ్యిలోకి పడేశాయి. మరీ ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రైతుల వ్యవసాయం జూదం అయిపోయింది. ఆ జూదంలో రైతు ఓడిపోయి ఆత్మహత్యల పాలయ్యాడు.

రైతుల మరణాలే సంస్కరణ ఫలితాలయ్యాయి. ప్రపంచబ్యాంకు ఆదేశాల ప్రకారం సబ్సిడీలు తొలగించి కరెంటు ఛార్జీలు పెంచారు. అన్ని విధాల రైతు కోలుకోలేని విధంగా పాలకులు ప్రవర్తించారు. ప్రభుత్వ అండ ఉన్నప్పుడే రైతు జీవితం అంతంత మాత్రమే. ప్రభుత్వం రైతుకు అండగా లేకపోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయి దిక్కుతోచక ఆత్మమత్యలకు పాల్పడ్డారు. రైతుల ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోకుండా వారినే దూషించారు. తిన్నది అరక్క అని, ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియాలకు ఆశపడి అని వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో 'పొలి' కావ్యం రాశారు.

వ్యవసాయ దేశంగా పేరు పొందిన భారతదేశంలో అన్నపూర్ణగా పేరు పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బావుల సేద్యం మీద ఆధారపడే రైతు శ్రమకు తగిన ఫలితం దక్కకుండా పెట్టుబడికి తగ్గ ఫలితం లేక ధర క్షీణించిపోతుంటే, ఎన్నికల కోలాహలమే రాజకీయంగా చలామణి అవుతున్న రాజకీయ వ్యవస్థ మీద కవి తీవ్రంగా విమర్శ పెట్టాడు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే భారతదేశం వెలిగి పోతుందని రాజకీయ నాయకులు ప్రచారం కవికి ఆవేదన కలిగించింది.

**భారతావనిలో**
**మా నాయన**
**చెమట నదులు పారించాడు**
**నేలను దున్ని దున్ని**
**మట్టి మనిషయ్యాడు**
**జనానికి తిండి గింజలిచ్చాడు**
**రాజకీయ రాముళ్ళకు**
**అయిదేళ్ళ కొకసారి**
**ఓట్ల పూలదండవేసి**
**రాజభక్త హనుమానుయ్యాడు**

ఎన్నికల రంగంలో రైతుల్ని పావులుగా చేసి వాడుకున్న రాజకీయం రైతును పీల్చి పిప్పి చేసి నిర్వీర్యంగా చేసిందని కవి ఆగ్రహం వ్యక్తం చేశాడు.

పొలి కావ్యంలో చిత్రించినది తన తండ్రి జీవితమే అయినా అది ఆయన ఒక్కరి జీవితమే కాదు. వ్యవసాయ జూదంలో ఓడిపోయిన తెలుగు రైతులందరి జీవితం అవుతుంది.

తిండిగింజలను ఉత్పత్తి చేసే రైతుకు ఆ ఉత్పత్తి ధర నిర్ణయించే అధికారం లేకపోవడాన్ని కవి ఇలా అధిక్షేపించాడు.

**ఉత్పత్తి మా నాయనది**
**ధర నిర్ణయం ఇంకొకడిది**
**ఎంత దుర్మార్గం?**
**సొమ్మొకడిది సోకొకడిది**
**సొమ్ము సోకు**
**రైతులదే అయితేనే అందం**
**వెన్నెముకలు నిటారుగా**
**నిలవందే**
**అదిసాధ్యం కాదు.**

స్వతంత్ర భారతదేశం రైతులను దగా చేసిందని, దేశానికి అన్నం పెట్టే రైతు కడుపు నిండని పరిస్థితి దాపురించటం, పాలకుల నిర్లక్ష్యం వెరసి రైతుల జీవితం అతలాకుతలం అయ్యింది. ఇది ఇలాగే కొనసాగితే దేశం పరిస్థితి అగమ్యగోచరం అవుతుంది. భారతదేశం గ్రామీణ సంస్కృతికి పునాది రైతు. వ్యవసాయం లాభసాటిగా మారకపోతే పాలకులు ఎన్ని కర్మాగారాలు నిర్మించిన పూడ్చలేని అగాథం ఏర్పడుతుంది. ఆ అగాథం ఎప్పటికి పూరించలేము. ఒకనాడు రాజుగా విరాజిల్లిన రైతు నేడు దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. కాబట్టి దేశానికి వెన్నుముక లాంటి రైతును నిర్లక్ష్యం చేయరాదని పాలకులను కవి కోరుకుంటున్నాడు. కవులు, మేధావులు, రైతు జీవితం బాగుపడాలని, రైతు సమస్యలు తీరాలని సెమినార్లు, గోష్టులు నిర్వహించి సమస్యలను పాలకులకు వినిపిస్తున్నారు. ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశ్యం కూడా అదే. ఆ ఉద్దేశ్యం నెరవేరాలని రైతు జీవిం బాగుండాలని మనమందరం కోరుకుందాం.

**ఆధార గ్రంథాలు :**

1. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వం
2. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - ఉద్యమాలు - సందర్భాలు
3. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - కొన్ని కావ్యాలు - కొందరు కవులు
4. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - ఆంధ్రుల సాంఘిక చరిత్ర
5. శ్రీశ్రీ వ్యాసాలు - చలసాని ప్రసాదు
6. సాపు కూడు - బండి నారాయణస్వామి

★★★

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1 Journal
Sl. No 34 under Arts and Humanities Category

# సీమ కథా సాహిత్యంలో రైతు జీవితం

– **జి. యమునరాణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్, అనంతపురం.

ఆధునిక తెలుగు సాహిత్యం పరిణామక్రమంలో అనేక ప్రక్రియలను తనలో ఇముడ్చుకున్నది. అందులో భాగంగానే కథా సాహిత్యం కూడా రూపుదిద్దుకుంది. ఇప్పటికీ కథా సాహిత్యం పురుడుపోసుకొని ఇంచు మించుగా 100 సంవత్సరాలు కావస్తున్నది. ఇప్పటికి కథా సాహిత్యం ప్రాంతీయ సాహిత్యానికి చోటుదక్కింది. ఇతర ప్రాంతాల కథల కన్నా రాయలసీమ కథ సుమారు 30-40 ఏళ్లు వెనుక తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అందుకు కారణాలు లేకపోలేదు. ఇక్కడి తొలితరం రచయితలు ఎక్కువగా సంస్కృత పండితులు కావడం, వాడుక భాషపై పెద్దగా సదాభిప్రాయం లేకపోవడం, ఈ ప్రాంతం వాడుక భాషకు ప్రామాణిక భాషకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండడం, ఈ ప్రాంతపు భాషను పత్రికలు కూడా ఆదరించి ప్రోత్సహించకపోవడం, ఆధునికత అభివృద్ధికి ఆధారమైతే ఆధునికతకు ఆధారం నీళ్లు. నీళ్ల కరువైన చోట ఆధునికతా కరువే. అందుకే ఆధునిక సాహిత్యంలోకి సీమ రచయితలు ఆలస్యంగా ప్రవేశించి ఉండవచ్చు.

కథాసాహిత్యంలో అనేక సామాజికాంశాలు వస్తువులుగా చోటుచేసుకున్నాయి. అందులో స్త్రీల సమస్యలు, విద్య, మధ్యతరగతి జీవనం, వ్యాపారం, సంఘ సమస్యలైన అవినీతి, రాజకీయం, నిరుద్యోగం, పేదరికం, మూఢనమ్మకాలు వంటి కథా వస్తువులతో కూడిన కథలు బాగా ప్రాచుర్యం పొందాయి. అయితే కథా సాహిత్యంలోకి అత్యంత ఆలస్యంగా ప్రవేశించిన కథా వస్తువు రైతు. కారణమేమంటే సర్కారు ప్రాంతం రైతుకు రాయలసీమ ప్రాంత రైతుకు తేడా స్పష్టంగా కనిపిస్తుంది. సర్కారు ప్రాంత రైతులకు నీటికి కొదువలేదు. ఇక్కడ రైతులకు కన్నీటికి కొదవలేదు. కానీ ప్రతియేడు నీటికి కొరతే. అక్కడి రైతు భూములన్నీ నదీ ఆధారిత భూములు. ఇక్కడ రైతు భూములన్నీ వర్షాధారిత భూములు. రాయలసీమ రైతులకు కొన్ని ప్రత్యేకతలు లేకపోలేదు. వాటిలో ముఖ్యంగా మూడు అంశాలు 1) వలస, 2) ఋణాలు, 3) ఆత్మహత్యలు వీటికి తోడు సరళీకృత ఆర్థిక విధానాలు పుణ్యమా అని ఛిద్రమైన వ్యవసాయం.

రైతును మొట్టమొదటిగా రాయలసీమ కథా సాహిత్యంలోకి ప్రవేశపెట్టింది మాత్రం కె. సభా అనే చెప్పుకోవాలి. సభా గారు రైతు కుటుంబం నుంచి రావడం, గ్రామీణ వాతావరణంలో జీవించడం, కరువు రైతును ఏ విధంగా పీల్చిపిప్పిచేస్తున్నది తాను అనుభవించాడు కనుకనే పాఠకుడి హృదయాన్ని ద్రవింపచేసే విధంగా రచించారు. సభా గారి మొదటి కథ అంభను. తరువాతి రచన పాతాళగంగను చదివిన ఎవరికైన గుండె చెరువవుతుంది. ఇందులో రాయలసీమ రైతు నిత్యం కడ గండ్లతో, కరువు కాటకాలతో సహజీవనం చేసే విధానం, నీటి చుక్కకోసం పరితపించే విధానం పాఠకుడి మనస్సును ద్రవింపచేస్తుంది. పాతాళగంగలో వేటప్ప కుటుంబమంతా నీటి చుక్క పంట చూడటం కోసం తొమ్మిది మట్లు తవ్విన బావిలో నీటికోసం పడే తాపత్రయం కనిపిస్తుంది. బావి త్రవ్వే క్రమంలో బంగారం, భూమి, పశువులు పోగొట్టుకోవడం, ఆ దిగులుతో భార్య మంచం పట్టి చనిపోవడం, మిలటరీ నుండి డబ్బు పంపే కొడుకు కూడా యుద్ధంలో చనిపోవడం జరుగుతుంది. బేటప్ప కూడా బావిలో నీళ్ల పడతాయనే ఆత్మవిశ్వాసంతో 9వ మట్టు గడారు దించి సరిగ్గా నీళ్లు పడిన సమయంలో ఆ బావిలోని గుండు గునపం వేటుకు బేటప్ప పైకి దొర్లింది. కొడుకు మరణవార్త విన్న కోడలు కూడా అదే బావిలో దూకింది. చివరకు బేటప్ప కోడలు నిండిన బావిలో రెండు శవాలై తేలడం గంగ కోసం తపన పని

చివరకు కుటుంబమంతా గంగపాలవడం చదివిన ఎవరికైనా కంట కన్నీటి గంగా ప్రవాహమే. సభా గారు కథ రాసిన సమయానికి రైతు వ్యవసాయమంతా రెక్కల కష్టంపై ఆధారపడి ఉండేది. ఈనాటి వ్యవసాయాన్ని, రైతును గ్రామీణ జీవితాన్ని డబ్బే శాసిస్తోంది. ఆ రోజు నీటికోసం బావిని త్రవ్వి నాశనమైన రైతులు ఈ నాటికీ అదే నీటికోసం బోర్లు వేస్తూ ఆస్థులు అమ్ముకొని బావిని త్రవ్వి నాశనమైన రైతులు ఈ నాటికీ అదే నీటికోసం బోర్లు వేస్తూ ఆస్థులు అమ్ముకొని అప్పులపాలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనాన్ని చూస్తున్నాం. కాలం మారినా కథలు మాత్రమే పునరావృతమౌతూనే ఉన్నాయి. అందుకే ఈనాటికి కె. సభా గారి కథాంశాలు పాఠకుల్ని చదివించేలా చేస్తున్నాయి.

రాయలసీమ ప్రాంతంలో ఈనాటికి వాన రాకడ, ప్రాణం పోకడం ఎవరికీ తెలియదనే సామెత సార్ధకమయ్యింది. వానచుక్క కోసం రైతులు అవే ఎదురు చూపులు దేశమంతా నీటితో మునిగిపోయినా సీమను మాత్రం కరువును ముంచెత్తుతూనే ఉంది. కె. విశ్వనాథ రెడ్డి గారు నమ్ముకున్న నేల అనే కథలో ఒక మధ్య తరగతి రైతు వీరన్న వ్యవసాయాన్ని నమ్ముకొని అప్పులపాలై చివరకు రైతు కుటుంబంలోని ఏ వ్యక్తి చేయలేని పని తాను చేశానని "విధిలేక బోగం కంపెనీలో నీళ్లుమోసి బోగమోళ్లకు అన్నం పొట్లాలు మోసినానని, వారి దగ్గరకు వచ్చే వారికి బ్రాందీ, సారా తెచ్చినానని, పోలీసులకు బోగమోళ్లను పంపినానని, దొంగరైడింగుల్లో దెబ్బలు కూడా తిన్నానని, చివరకు సొంత కంపెనీ పెడదామనుకుని అక్కడా పనికిరానని తేలిపోయి ప్రొద్దుటూరులో ఉండలేక, బ్రతకలేక సొంతూరు చేరినానని భూమి లేకపోయినా చేతుల కష్టం ఉంది అంటూ తన 20 ఏండ్లు భూమినమ్ముకున్నా ఏమిగిలిందని ఇంకానా!" ఈ నేలను నమ్ముకోలేనని భూమి పత్రాలను బాకీలోకి జమకట్టమని చెప్పడం సీమలో రైతు నేలను నమ్ముకొని వానను నమ్ముకొని ఎంతటి దగా పడుతున్నది తెలియజేస్తుంది. బతకడం కోసం నమ్ముకున్న నేలను వదలి రైతులంతా కూలీలుగా మారి ఫ్యాక్టరీలకు వెళ్లే వైనం ఈనాటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతూనే ఉంది.

'జప్తు' కథలో కూడా రైతును మింగేస్తూ చిన్నచిన్న వ్యాపారులు కూడా షావుకారులై మంత్రమేసినట్లు అతి తక్కువ కాలంలో మాడీలు కట్టడం, రైతు మాత్రం ఎన్ని దశాబ్దాలు గడిచినా బ్యాంకులోను కట్టలేక బయట వడ్డీలు కట్టలేక ఆస్థులు జప్తు చేస్తారనే భయం, దాన్ని ఆసరగా చేసుకుని వ్యాపారులు పంటలు చౌకగా సొంతం చేసుకోవడం, రైతు మనసు చంపుకొని ధాన్యం అమ్ముకోవడమనేది పాఠకుడి మనస్సుకు హత్తుకునే విధంగా చిత్రించారు. 'అగాధం' కథలో వేరుశనగ రైతు నిస్సహాయతను తెలియజేస్తారు. పంట పెట్టింది మొదలు సేద్యం, గింజలు, మందులు, కూలీలు, ఖర్చులు పోగా చివరకు రైతుకు మిగిలే అప్పులు కళ్లముందు కదలాడుతుంటే పెట్టిన పంటకు నీటికొరతకు తోడు పురుగుకూడా తోడై పంటను నాశనం చేస్తుంటే ప్రభుత్వం పంపిణీ చేసిన పురుగుల మందే తాగి చనిపోవడం ఇందులో కథాంశం ఇది చదివిన ఎవరికైనా కంట కన్నీరు ఆగవు.

రాయలసీమ రైతు జీవితాలను అత్యంత ప్రభావంతంగా చిత్రించిన వారిలో పురికంటి కృష్ణారెడ్డి గారు ఒకరు. ఈయన చిత్తూరు మాండలికంలో ఆ ప్రాంత రైతుల జీవితాలను, గ్రామీణ స్థితిగతులను సంపూర్ణంగా చిత్రించిన కథ "మోసులెండిపోతున్నాయి". ఇందులో ఆనాటి స్వర్ణముకి, స్వర్ణపంటలు పండిస్తే ఆ తరువాతఅదే నది ఎడారిగా మారి రైతులు నీటిబొట్టు లేక రిగ్గుపెట్టి పంటల్ని కాపాడుకోవడం కోసం బావులను లోతు చేసుకోవడం ఫలితం లేక వేసిన చెరువు తోటలు ఎండిపోయి, కనీసం పశువులకు కూడా మేతకు కూడా పనికిరాకపోవడం పాఠకుడిపై బలీయమైన ముద్రను వేస్తుంది. కృష్ణారెడ్డి గారి "బంగారు సంకెళ్ళు" కథలో రైతు వ్యవసాయం

భారమైన భూమిని వదులుకోవడానికి మనసు అంగీకరించక నమ్ముకొన్న నేలనే బంగారు సంకెళ్ళుగా మారిన విధానం సభా గారి పాతాళగంగను గుర్తుకు తెస్తుంది. ఆధునిక ప్రపంచంలో ప్రతిదీ ప్రయోజన దృష్టితో చూడడం, వ్యాపార ధోరణిలో ఆలోచించే వైనం "బోడెద్దు" కథలో కనిపిస్తుంది. బోడెద్దు ఒంట్లో శక్తి ఉన్నన్ని నాళ్లు రైతు కుటుంబం ఎదగడానికి తన శక్తినంతా ధారపోస్తుంది. చివరి దశలో బోడెద్దును పట్టించుకోవడం రైతు మానేస్తాడు. అదేవిధంగానే ఆ ఇంటి పెద్ద తన కుటుంబం కోసం జీవితమంతా రెక్కలు ముక్కలు చేసుకొంటే చివరిదశలో ఇంటిపెద్ద నిరాదరణకు గురౌవడం మనిషిలోని వ్యాపార ధోరణిని ప్రతిబింబిస్తుంది.

రాయలసీమ కథా రచయితల్లో ప్రముఖుల్లో ఒకరైన విశ్వనాథరెడ్డి కరువువాతన పడిన జనం కథల్నే చిత్రించారు. విశ్వనాథరెడ్డి గారి తెలుగు కథల్లో ఒక బలమైన పాయ "సీమకథ" అంటారు. నిత్యం కరువు కాటకాలు ఒకవైపు. మరోవైపు ముఠాకక్షలు రైతులను, రైతు కూలీల జీవితాన్ని ఎలా బలికొంటున్నాయో, ఎంత అతలాకుతలం చేస్తున్నాయో ప్రతిబింబించే కథలను రూపొందించారు. రాయలసీమలోని రైతుల వాస్తవ జీవితాన్ని కథలుగా రాయలనే చేసిన ప్రయత్నం వాన కురిస్తే, జప్తు, నమ్ముకున్న నేల కథలు. వాన కురిస్తే అనే మాటే ఇక్కడి జీవితంలో ఒక జపం లాంటిది. వానకోసం ఎదురు చూసి చూసి నిరాశ నిస్పృహలతో గుండెపట్టి ప్రాణాలు వదలని రైతు కథను 'వాన కురిస్తే'లో చిత్రించారు.

అనంతపురంలోని 1940 ప్రాంతంలో గుత్తి రామకృష్ణ, చిలుకూరి నారాయణరావు కథలు రాశారు.

ఆధునిక కథకు రాయలసీమలో తొలి కథకు ఆద్యుడు కే. సభా అయితే అనంతపురం జిల్లాలో ఆధునిక కథకు శ్రీకారం చుట్టిన వారు మాత్రం సింగమనేని నారాయణే. సింగమనేని తొలికథ 'జూదం' ఇందులో రాయలసీమ రైతు అనునిత్యం అప్పుల లెక్కలతోనే బ్రతుకీడ్చడం కనిపిస్తుంది. మధ్యతరగతి రైతు నారప్ప తండ్రి బతుకంతా అప్పులతోనే గడచిపోగా చనిపోయిన తరువాత కూడా ముగ్గురు కొడుకులకు భూములతో పాటు తలా మూడు వేలు అప్పులను కూడా పంచిపెట్టారు. కల్లాల దగ్గర తినుబండారాలు అమ్మి గింజలు పోగుచేసి అమ్ముకునే చిన్న వ్యాపారి రామశేషయ్య లాంటి వారు రైతులకే అప్పులిచ్చే స్థాయికి ఎదుగుతారు. శివయ్య లాంటి వ్యాపారుల చేతుల్లో పడి రైతు ఎంత చౌకగా గింజలమ్ముకొని వచ్చిన డబ్బు అప్పులకు కూడా సరిపోక ఋణ భారంలోనే మిగిలిపోవడం జూదంలో కనిపిస్తుంది. ఇది ఈ రోజుకు పునరావృత్తం అవుతూనే ఉంది. ఇందులో రాయలసీమ రైతు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పులోనే చనిపోవడమనేది అనాదిగా జరుగుతోంది. అయినా పంట పెట్టకుండా ఉండలేడు. వ్యవసాయం తప్ప రైతుకు మరో దిక్కు లేదు. అందుకే సీమరైతుకు వ్యవసాయం జూదం అయ్యింది అంటాడు రచయిత.

'అడుసు' కథలో నారాయణప్ప ద్వారా రైతు తాను పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం కావాలని ప్రభుత్వాలు ఆ దిశగా ప్రయత్నాలు చేయరని నిలదీస్తాడు. వ్యవసాయంపై విరక్తి పుట్టి చీనాచెట్లన్నీ తన చేత్తేన్నే నరుక్కోవడం అడుసు కథలో చూస్తాం. ఇందులో నారప్ప పండించిన చీన పంటకు 40 వేల వరకు వస్తుందని ఆశగా మద్రాసు మార్కెట్‌కు తీసుకుపోగా బండి బాడుగ, చేతిఖర్చులు పోను మార్కెట్ యజమాని 12 వేలు నారాయణప్ప చేతిలో పెడతాడు. కనీసం బిడ్డ అడిగిన లంగా గుడ్డ కూడా తీసుకురాలేక ఉత్త చేత్తో ఇంటికి వస్తాడు నారాయణప్ప. బిడ్డకన్నా ఎక్కువగా పెంచుకున్న చెట్లను నరికేయాలన్నంత కసి నారాయణప్పలో పుట్టడం, కొడుకు రామునితో ఈ చెట్లు మనల్ని బతకనీయవురా రాముడు" అంటూ తన ఆవేదన వ్యక్తం చేయడం, ఇందులో రైతును దళారీలు ఇంత దారుణంగా దోచుకుంటున్నారో, దళారీల మూలంగా

రైతుకు అసలు ఫలితం అందకుండా పోతున్న వైనం కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు సింగమనేని గారు.

'ఉచ్చు' కథలో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులైన వెనుకబడిన కులాలకు చెందిన వారికి ప్రభుత్వాలు పంచి యిచ్చిన భూమిని పెద్ద రైతులు ఉచ్చుపన్ని ఏ విధంగా దోచుకొనే ప్రయత్నం చేస్తారో ఉచ్చులో ప్రతిబింబిస్తుంది. ఇందులో జీతగాళ్ళ పేరుతో జరిగే శ్రమదోపిడీని కూడా చాలా సహజంగా సింగమనేని గారు చిత్రించారు.

చిత్తూరు ప్రాంతానికి చెందిన కథకుడు వి.ఆర్. రాసాని గారు కూడా రాయలసీమ ప్రాంతపు రైతు జీవన స్థితిగతులను తమ కథలలో చిత్రించారు. టమోట పంటను నమ్ముకొని రైతు జీవితాలు ఏవిధంగా కుళ్ళి పోతున్నాయో చిత్రించిన కథ అన్నెకారిజల. ఈ కథలో మట్టిని నమ్ముకొని పంటను ప్రేమిచే సీమ రైతు చివరకు మాయదారి సేద్యం అనుకొని వైరాగ్య దశకు చేరుకున్న తీరును ఈ కథలో ప్రతిఫలిస్తుంది.

దాదాహయత్ సీమ కథా సాహిత్యంలో రైతు జీవనాన్ని సంఘర్షణల్ని తన కథల్లో చిత్రించారు. ఈ ప్రాంతంలో గుక్కెడు నీళ్ళు లేక ప్రాణాలు పోయే హృదయ విదారక గాథలను గుక్కెడు నీళ్ళు కథలో ఆవిష్కరిస్తాడు. సీమలో రైతులు బంగారానైన్నా వదులుకుంటారు నీళ్ల వదలు కోలేని దారుణస్థితి ఇప్పటికీ అనేక గ్రామాల్లో నెలకొని ఉంది. నీళ్ల కరువు తీవ్రత అలా ఉంటే పెన్నానదికి వచ్చే వరదతలు, అకాల వర్షం ఎన్నో కుటుంబాలు జీవితాన్ని శాపగ్రస్తం చేస్తున్న తీరు ఎడారి సేద్యం కథలో చిత్రిత మయ్యింది.

సీమలో కరువు కరాళనృత్యం చేసి తినడానికి తిండి కరువై, చేయడానికి పనులు దొరక్క వలస పోయిన కుటుంబాలు గాటిగాడ గడ్డిలేక అలమటిస్తున్న పశువులను చూడలేక కన్నబిడ్డలతో సమానంగా చూసుకున్న గొడ్లను రైతు కంట తడి పెట్టుకుంటూ కసాయవాళ్లకు అమ్మడం రైతు మానసిక వేదనను అద్భుతంగా హృదయాన్ని తడి చేసేవిధంగా "కసాయి కరువు"లో చిత్రించాడు చక్రవేణు. ఇందులో రైతులకు పశువులకు మధ్య ఏర్పడిన దృఢమైన బంధానిన తెలియజేస్తుంది.

రాయలసీమ గత శతాబ్ద కాలాన్ని తీసుకుంటే అందులో 60 శాతం కరువే రాజ్యమేలింది. దశాబ్ద కాలంగా రైతుల్ని పట్టిపీడిస్తున్న సమస్యలో ప్రధానమైనది సాగునీరు. రాయలసీమ రైతు జీవనం ఛిన్నమైనది. నిత్యం కరువు కాటకాలతో పాలకుల నిర్లక్ష్యానికి గురై సీమప్రాంత రైతు జీవిత వ్యథలకు చాలా సహజంగా హృదయానికి హత్తుకునేలా వాస్తవికతతో చిత్రించారు ఇక్కడి రచయితలు. అనంతపురం కథకుల్లో ప్రథమునిగా చెప్పుకోగా వారిలో ఒకరైన బండి నారాయణస్వామి గారు కూడా ఈ ప్రాంత కరువు దాష్టీకాన్ని హృదయ విదారకంగా చిత్రించిన కథ "సావుకూడు". సీమలో జనం కరువుబారిన పడి తిండికి అలమటిస్తున్న వైనం ఆఖరి కోరికగా మాసం తినాలనే కోర్కెను వెలబుచ్చిన కొడుకులు ఆ కోరికను భారం కావడంతో తండ్రి కోరిక తీర్చలేని నిస్సహాయత, కోరిక తీరకుండానే చనిపోయిన తండ్రి సంస్కారాలకు అయ్యే ఖర్చును మోయలేక తప్పుకొని తిరిగే వైనం గమనించవచ్చు.

సీమలో నీటికోసం జరిగే యుద్ధాలు (గొడవలు) తాగు నీటి కోసం పడే అగచాట్లను నీళ్లు కథ ద్వారా అత్యంత సహజంగా ఆవిష్కరిస్తారు స్వామి గారు.

సీమ రైతు జీవిత వ్యథలను తన రచనల్లో అత్యంత సహజంగా వ్యక్తపరచినారు చిలుకూరు దేవపుత్ర గారు. సీమ రైతు తన జీవితకాలంలో భూమిని ప్రేమించినంతగా ఇంకేమిటి ప్రేమించదు. కరువొచ్చినా, కాటకమొచ్చినా, పస్తులున్నా భూమిని మాత్రం అమ్ముకోవడానికి ఒప్పుకోదు. నేలను నమ్ముకొని జూదమైన వ్యవసాయంపై ఆధారపడతాడు, అప్పులపాలౌతాడు. చివరకు పొలం అమ్మాల్సి

వస్తే అదే పొలంలో ప్రాణం వదిలేసే రైతు కథ "మన్ను దిన్న మనిషి"లో చిత్రించాడు దేవపుత్ర గారు. ఇందులో భూమికి రైతుకు ఉన్న గాఢమైన బంధాన్ని ఇక్కడ అత్యంత సహజంగా ఆవిష్కృతమైంది.

అనంత రైతు జీవనశైలిని, ఆలోచనల్ని ప్రకృతిలో వచ్చే మార్పులను, అవి వ్యవసాయంపై చూపే ప్రభావాన్ని వ్యవసాయరంగంలో దళారీలు, పట్టణ వ్యాపారులు రైతును మోసం చేయడాన్ని "దళారి" కథ ద్వారా సహజంగా చిత్రించారు శాంతి నారాయణ గారు. కష్టపడే రైతు ఋతువుల మోసానికి గురై పంట చేతికొచ్చాక అమ్మితే వచ్చిన ఆదాయం ఏ మూలకు చాలక తెల్ల ముఖం వేసుకొని అనివార్యంగా రైతు భూమిని అమ్ముకొని పట్నాలకు కూలీలుగా వలసపోతున్న తీరు ప్రతిఫలించే కథ "కల్లమయిపాయ" శాంతినారాయణ గారు "పల్లేరు ముల్లు" కథ కూడా రైతును పరాజితుణ్ణి చేస్తున్న ప్రభుత్వ విధానాలను వాస్తవికంగా చిత్రించారు. అకాలంలో పడిన వర్షాలకు రైతు జీవితం ఏ విధంగా కుల్లబడిపోతుందో "ఎండమావి" కథో చిత్రించారు. రాయలసీమకు పడీపడని వర్షాలకు పాలు పట్టీపట్టని గింజలాగా రైతు కూడా తాలుగింజ లాంటి వాడని తాలు గింజలు కథలో చిత్రించారు. ఈ కథ సీమకథల్లో గట్టిగింజగానే చెప్పుకోవచ్చు. సీమలో గ్రామీణ స్థితిగతులను ఎడారి తలపించేలా వర్ణించిన విధానం నీటికరువైన ప్రాంతంలో ఆత్మీయతలకు, అనురాగాలను కరువు లేదంటూ కల్మషం లేని మనుషులను, గ్రామీణ వాతావరణానికి చిత్రండంలో మధురాంతకం రాజారాం దిట్ట. సీమ కథ సాహిత్యం ఆలస్యంగా ప్రారంభమైనా అందులోకి రైతు మరింత ఆలస్యంగా ప్రవేశించినప్పటికి ఇక్కడి రచయితలు తమ కథల్లో జీవన స్థితిగతులను అత్యంత సహజంగా చిత్రించడంలో గొప్ప ప్రతిభనే కనపరచారు. అటువంటి వారిలో వర్ధమాన కథకులుగా వస్తున్న వారిలో యం. హరికిషన్‌గారు, పచ్చికరువు కథలోను వెంకటకృష్ణ గారు, సుభాషిణి చెప్పుకోదగ్గవారు. అనంతపురంలో ఎస్.టి. ప్రసాద్ గారు వ్యసనం కథలో సీమరైతు సర్వనాశనం కావడానికి ప్రధాన కారణం వ్యసాయం వ్యసనం కావడే అంటారు వ్యసనం కథలో. సీమకథా సాహిత్యానికి రైతు వ్యథలను తీర్చే శక్తి లేక పోయినా ఇక్కడ రైతు ఆలోచనల్ని మార్చగలిగేలా శక్తి మాత్రం ఈ కథలకు ఉంది. సీమ రైతు కష్టాలు తీరాలంటే ఇందుకు ఒకే ఒక మార్గం సాగునీరు. యేడాదికేదాడి తగ్గిపోతున్న సాగుభూమి బీడుగా మారిపోతున్న వైనం వీటిని పరిష్కరించాలంటే ఏకైక మార్గం అన్ని ప్రాజెక్టుల నుండి రాయలసీమ జిల్లాలకు కోస్తా జిల్లాల మాదిరిగానే తమకు రావాల్సిన వాటాను అందేదిశగా పాలకులు కృషి చేయాలి. ఒక దశాబ్దంలో 740 మంది రైతులు ఆత్మ హత్యలు జరిగాయంటే ఈ ప్రాంతంపై పాలకులకున్న నిర్లక్ష్య ధోరణికి ఇది అద్దం పడుతోంది. ప్రజల ఆలో చనలు రైతు పక్షాన ఆలోచించే దిశగా అందుకు అను కూలమైన పాలక వర్గాలను ఎన్నుకునే దిశగా రచనలు చేయాల్సిన అవసరం ఈనాటికీ ఎంతో ఉంది.

## ఆధార గ్రంథాలు :

1. సీమకథల సంపుటి
2. తెలుగు కథకులు - కథన రీతులు - 4 సంపుటాలు
3. సింగమలేని కథలు

★★★

జనవరి 2020

## జాతీయ సదస్సు

**రాయలసీమ ఆధునిక తెలుగు సాహిత్యం - గ్రామీణ సంస్కృతి**

**భావవీణ ప్రత్యేక సంచిక**




# యోగి వేమన విశ్వవిద్యాలయం

కడప, ఆంధ్రప్రదేశ్ - 516 005.